
వాసిరెడ్డి సీతాదేవి

# తొణికిన స్వప్నం

చీకటి! కటిక చీకటి! చుట్టూ చీకటి!

తనకేదో భయంగా వుంది. ఎవరు వాళ్ళు? ఎంత నల్లగా చీకటి నీడల్లా వున్నారు? వాళ్ళు తనను ఎక్కడకు తీసుకుపోతున్నారు? కాదు బలవంతంగా ఈడ్చుకు పోతున్నారు. తను వాళ్ళకేం అపకారం చేసింది? అబ్బ ఎంత భయంకరంగా వున్నారు వాళ్ళు?

తనను ఎవరు రక్షిస్తారు? "నన్నెందుకు తీసుకెళ్తున్నారు? ఎక్కడికి.... ఎక్కడికి.... .... ఎందుకు?" తను అరుస్తుందా? మరి ఎవరూ రారేం తనను రక్షించడానికి? అసలు తను ఎక్కడ వుంది? ఈ చీకటి గుహలోకి ఎలా, ఎప్పుడు ప్రవేశించింది?

అరే! తమాషాగా వుందే? ఇంతలోనే చీకటి తెరలు ఎలా జారిపోయాయి? ఈ వెలుగేమిటి? ఎంత వెలుగు! ఇలాంటి వెలుగును తను ముందెన్నడూ చూళ్ళేదే?

తన శరీరం ఏమిటిలా తేలిగ్గా అయిపోతుంది? ఎంత హాయిగా ఆకాశంలో ఎగిరిపోతున్న పక్షిలా తను పైకి తేలిగ్గా తేలిపోతుందేం? తను పక్షిలా మారిపోతుందా? అంతే అయి ఉండాలి. లేకపోతే తను ఎలా ఇంత తేలిగ్గా, ఏ ఆధారం లేకుండా ఎగర గలుగుతోంది? తనకు రెక్కలు లేవుగా?

ఇదేమిటీ మళ్ళీ తన శరీరం బరువెక్కిపోతుందేం? తను కిందకు పడిపోతుంది. రెక్కలు తెగిన పక్షిలా గిరగిరా తిరుగుతూ పడిపోతూంది. తనను ఎవరో బలవంతంగా కిందకు తోసేస్తున్నారు. ఎవరు వాళ్లు? ఆ చీకటి మనుషులే! మళ్ళీ చీకటి కమ్మేస్తుంది. ఆ వెలుగేమయింది?

తను పడిపోతుంది. పడిపోయింది. భయంతో అరవాలనుకుంటూంది. కాని గొంతు పెగల్టం లేదు.

పడిపోయింది. అంతులేని అగాధంలోకి పడిపోయింది. కాని దెబ్బలు తగల్లేదు. ఆశ్చర్యంగా వుంది.

ఎవరో గుసగుస లాడుతున్నారు. కాదు నూతిలో మాట్లాడుతున్నారు. ఆ నూతిలో గొంతుకలు ఎవరివి? ఆచీకటి మనుషులివి కాదు కదా?

మాటలు దగ్గరగా విన్పిస్తున్నాయి. తన దగ్గిరగా నిల్చునే ఎవరో మాట్లాడుతున్నారు. అస్పష్టంగా వున్నాయి ఆ మాటలు!

వాళ్లెవరో తను చూడాలి. కళ్లు తెరిపిడి పడటం లేదేం? ఎలాగయినా కళ్లు తెరవాలి. తను ఎక్కడ వుందో తెలుసుకోవాలి.

"ఆమె కదులుతుంది డాక్టర్. స్పృహ వస్తుంది. వారం రోజులనుంచి కోమాలో పడివుంది పాపం!" అన్నది నర్సు రాధకేసి జాలిగా చూస్తూ.

"అవును! ఐదు నిముషాల్లో పూర్తిగా స్పృహ రావచ్చు" అన్నాడు డాక్టర్, రాధ ముఖంలోకి దీక్షగా చూస్తూ.



"ఆమె బ్రతుకుతుందా డాక్టర్?" నర్సు కంఠంలో బాధ పలికింది.

"చెప్పలేను. ఈ రాత్రి గడవటం కష్టమే!"

"ఎలాగయినా ఆమెను బ్రతికించండి డాక్టర్!"

"నా ప్రయత్న లోపం లేకుండా చేస్తున్నాను."

"ఆమె బ్రతకాలి డాక్టర్! పాపం! పెద్ద వయసులో లేదు. ఎన్ని ఆశల్ని ఆ కళ్ళలో నింపుకుందో? ఎన్ని స్వప్నాలను ఆ బుర్రలో సృష్టించుకుందో? ఎన్ని ఆశల్నీ, ఆకాంక్షల్నీ ఆ హృదయంలో దాచుకుందో? ఆమె బ్రతకాలి. ఆమె చచ్చిపోకూడదు–" నర్సు తనకు తనే చెప్పుకుంటున్నట్టు అన్నది.

డాక్టరు మౌనంగా రాధ చెయ్యి పట్టుకొని నాడి చూస్తున్నాడు.

"డాక్టర్ .... తెలివి తప్పిపోతున్న ప్రతిసారీ మీ చెయ్యి గట్టిగా పట్టుకొని "డాక్టర్ ....డాక్టర్ .... నన్ను పెళ్లి చేసుకోరా? అని అడగడం చిత్రంగా వుందిగదూ? ఆమె అలా అడుగుతుంటే నా గుండెలు పిండుతున్నట్టు బాధ కలుగుతూంది"–నర్సు ఆర్ద్రంగా అన్నది.

"అవును సిస్టర్! ఆమె మనసు ఏదో బలవత్తరమైన సంఘర్షణకు లోనై వుండాలి. ముందు టైఫాయిడ్ అనుకున్నాం. కాని ఇది టైఫాయిడ్ కాదు. ఏం జ్వరమో ఇంత వరకు డయాగ్నైజ్ చెయ్యలేకపోయాను"–అన్నాడు డాక్టర్.

"చూడండి డాక్టర్ ఆమె కళ్లు తెరిచింది. ఎలా పిచ్చిగా వున్నాయో ఆ చూపులు!" అన్నది నర్సు.

రాధ కళ్లు తెరిచి వెర్రిగా చూసింది, చూడలేదు కళ్లు

తెరిచింది. ఆ చూపులు దేన్నీ చూడటం లేదు. అంతలోనే మళ్ళీ కళ్ళు మూతలు పడ్డాయి.

నర్సు ఆత్రంగా డాక్టరు ముఖంలోకి చూసింది.

"ఇంకా ఆమెకు పూర్తిగా తెలివిరాలేదు. కొద్ది నిముషాల్లోనే పూర్తిగా తెలివిలోకి రావచ్చు!" అన్నాడు డాక్టర్.

రాధ మళ్ళీ కళ్ళు తెరిచింది. ఈసారి ఆమె చూపులు పిచ్చిగా లేవు. చూపులు ఎదురుగా నిల్చునివున్న నర్సుమీద నిల్చాయి. తెల్లని దుస్తుల్లో నర్సు తెల్లపావురంలా కన్పించింది.

డాక్టర్ రావు నాడి పరీక్షిస్తున్నాడు.

"సిస్టర్!" నీరసంగా పిలిచింది రాధ.

"ఏమ్మా! ఎలా వుంది?" నుదురుమీద అరచేతినివుంచి ప్రశ్నించింది నర్సు.

"బాగానే వుంది సిస్టర్! చాలా హాయిగా వుంది. శరీరంలో, మనసులోకూడా ఎటువంటి బాధా లేదు. చాలా తేలిగ్గా వుంది. హాయిగా వుంది సిస్టర్.... చాలా హాయిగా వుంది"-పదేపదే అవేమాటల్ని వర్ణించింది రాధ క్షీణంగా.

నర్సుకు రాధ మాటలు ఆనందానికి బదులుగా భయాన్నే కలిగించాయి. అర్థయుక్తంగా డాక్టరు ముఖంలోకి చూసింది.

"డాక్టర్!"

డాక్టర్, "హడావిడి చెయ్యకు" అన్నట్టు కళ్ళతోనే వారించాడు.

"సిస్టర్ ఇవ్వాళ తారీఖు ఎంత?"



ఓ క్షణం రాధ ముఖంలోకి చూసి "తొమ్మిది" అన్నది సిస్టర్.

"అంటే నేను ఆసుపత్రికి వచ్చి ఐదురోజులు ఐందన్న మాట! ఎన్నో రోజులు ఐనట్టు అనిపిస్తోంది. డాక్టర్! నాకు మళ్ళీ తెలివి తప్పకుండా మందివ్వండి డాక్టర్! ఆ చీకటిని.... ఆ చీకటి మనుష్యుల్ని తల్చుకుంటే భయం వేస్తుంది"- రాధ కంఠం వణికింది.

"అలాగేనమ్మా....!" డాక్టరు జాలిగా అన్నాడు.

నర్సు కళ్ళు చెమ్మగిల్లాయి.

డాక్టరు ఇరవై నంబరు బెడ్ మీద పేషెంటును చూట్టానికి వెళ్లాడు.

"సిస్టర్ నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు."

"ఏమిటమ్మా?" తెలిసినా, బెడ్ మీద దుప్పటి సర్దుతూ తెలియనట్టే అడిగింది నర్సు.

"అదే! నేను ఇక్కడకు వచ్చి ఐదురోజులేనా ఐంది?"

నర్సు మౌనంగా దుప్పటి చివర్లు పరుపుకిందకు సర్దుతూ వుంది.

"సిస్టర్ ఇదే నెలా?"

"అక్టోబర్!" అనేసి నాలుక కరుచుకుంది నర్సు.

"అంటే నేను ఇక్కడకువచ్చి, ఇరవైనాలుగు రోజులు అయిందన్నమాట!"

నర్సు చివ్వున తలెత్తి రాధ కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళలో ఎలాంటి భావంలేదు. నిర్లిప్తత నిండివుంది.

ఎండిపోయిన గులాబిరేకుల్లా వున్న రాధ పెదవులు

కొంచెంగా విచ్చుకున్నాయి. ఆమె పెదవులమీద లీలగా కన్పించిన హాసరేఖ నర్సుకు భయాన్ని కలిగించింది. ఆ నవ్వులో విషాదమే వుందో, సంతోషమే వుందో నర్సుకు అర్థంకాలేదు. మ్యూజియంలో చూసిన 'మోనాలిసా' ఫొటో కళ్ళకు కట్టింది.

"సిస్టర్! నేను చాలా మొండిదాన్ని. నా మొండితనాన్ని ఆసుపత్రిలోకూడా చూపించాను. మృత్యువుతో పెనుగులాడుతున్నాను గదూ! ఇక పోరాడలేను. అలసిపోయాను. నాకు విశ్రాంతి కావాలి. కాలప్రవాహానికి ఎదురు ఈదడానికి ప్రయత్నించి ఒడ్డు చేరలేకపోయాను. ఓడిపోయాను. అలసిపోయాను.... అలసిపోయాను."

నర్స్ రాధ చేతిని తనచేతిలోకి తీసుకుంది. మృదువుగా రాధ చేతిని నిమరసాగింది. అంతకంటే సానుభూతిని ఎలా తెలియపర్చాలో అర్థంకాలేదు నర్సుకు.

రాధ నర్సుకేసి చూసింది. ఈమెకు ఎందుకు తనంటే అంత జాలి! ఆ స్పర్శలో ఎంత సానుభూతి? ఎంత ఆదరణ? ఇది ఏనాటి అనుబంధమో!

ఈ అనుబంధాలకు అర్థంలేదు. మానవుడు ఎందుకు ఇలాంటి అనుబంధాలకొరకు పాకులాడతాడు?

వేరువేరు అడవుల్లోని రెండు వృక్షాలు, జలప్రవాహపు వేగానికి పడిపోయి, ఆ ప్రవాహంలోపడి కొట్టుకుపోతూ కొంతదూరం విడివిడిగా ప్రయాణం చేస్తాయి. మధ్యలో ఎక్కడో కలుసుకుంటాయి. కలిసి కొంతదూరం ప్రయాణం చేస్తాయి. మళ్ళీ ప్రవాహవేగం రెంటినీ విడదీస్తుంది. దేని



దారి దానిదే! ఆ తర్వాత? ఈ అనుబంధానికి అర్థం ఏమైనా వుందా? కాని మానవుడు ఇలాంటి అనుబంధాలకు ఎన్నో అర్థాల్ని కల్పించుకుంటాడు. ఆ అర్థాల్లో ఎన్నో అందాల్నీ, ఆనందాల్నీ వెతుక్కుంటాడు. మానవుడు ఈ లోకంలోకి తన ప్రమేయం లేకుండా, తన కోరుకోకుండానే వస్తాడు. కాని వచ్చాక అనుబంధాల్ని పెంచుకొని, ఈ లోకంనుంచి వెళ్ళిపోవడానికి భయపడ్తాడు. బాధపడ్తాడు. తను వుండడు. తన వాళ్ళంతా వుంటారు. తను ప్రేమించిన ప్రతి వస్తువూ వుంటుంది. తనులేని ఈ లోకాన్ని ఊహించుకొని నిలువెల్లా కంపించిపోతాడు. "జాతస్య మరణం ధృవం" అనుకొని ఎందుకు నిశ్చింతగా వుండడు? మనిషి ఎప్పుడూ ఒంటరివాడే. ఒంటరిగా వస్తాడు. ఒంటరిగా వెళ్ళిపోతాడు. ఈ అనుబంధాలన్నీ మధ్యలో కల్పించుకున్నవే.

తను రేపు సూర్యోదయం చూస్తుందా! తనకు తెల్లవారుతుందా?

సూర్యుణ్ణి ప్రాణదాత అంటారు. అది నిజమే. కాని ఆ సూర్యుడే హంతకుడు కూడా. ఆ మాట ఎవరూ అనరేం? సూర్యుడు ప్రతిరోజూ వెళ్ళిపోతూ ప్రతి ప్రాణి జీవితంలో ఒక రోజును తీసుకెళ్ళిపోతున్నాడుగా? అయినా మనిషి భవిష్యత్తు గురించి ఎన్ని కలలు కంటాడో!

కాలం.... దానికి మూడు ముఖాలు.... నిన్న. నేడు. రేపు. 'నిన్న' మారదు. గతం గతమే! కాని 'నేడు' నిన్నగా, 'రేపు' నేడుగా మారుతుంది. గతానుగతికం.... ఇందులోపడి ప్రాణి కొట్టుకుపోతూ వుంటాడు.

"ఏమ్మా! ఎలా వుంది?" నర్సు అడిగింది.

రాధ బద్ధకంగా కళ్ళు తెరిచింది.

"ఎందుకు సిస్టర్ నాకోసం అంత బాధపడ్తావు? నా కోసం నేనే బాధపడటంలేదు," అన్నది రాధ నిర్లిప్తంగా.

డాక్టరు వచ్చారు.

"డాక్టరుగారూ! డెలీరియంలో ఏమైనా పిచ్చిగా వాగితే పట్టించుకోకండి! జీవితంలో అవసరం అయిన దానికంటే ఎక్కువ సంయమనం సాధించడానికి ప్రయత్నించాను. అందువల్లనే బహుశా తెలివి తప్పినప్పుడు ఏదేదో మాట్లాడి వుంటాను," నీరసంగా వున్న ఆ కంఠంలో సంకోచం స్పష్టంగానే ద్యోతకమైంది.

ఓ క్షణం డాక్టరూ, నర్సూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఆమెకు స్పృహ వస్తున్నప్పుడు వారు మాట్లాడుకున్న మాటలు ఆమె విని వుంటుందనే ఆలోచన రాగా ఇద్దరూ గతుక్కుమన్నారు.

"అదేం లేదమ్మా! నువ్వేం మాట్లాడలేదు. ఇంజెక్షన్ ఇస్తాను. నిద్ర వస్తుంది. నీకు విశ్రాంతి అవసరం," అన్నాడు డాక్టర్.

"ఇకమీదట పూర్తి విశ్రాంతేగా డాక్టర్!" పేలవంగా నవ్వింది.

డాక్టర్ ఉలిక్కిపడి ఆమె కళ్ళల్లోకి చూశాడు. నర్సు రాధ చేతిని గట్టిగా పట్టుకుంది.

డాక్టర్ సిరంజిలోకి మందు ఎక్కిస్తున్నాడు.

"ఇంకా నాకు మందులెందుకు డాక్టర్? నా కెంతో



హాయిగావుంది. ఈ రాత్రంతా మాట్లాడుతూనే వుండాలని వుంది. మీ ఇంజెక్షన్ వల్ల నాకు మళ్ళీ మైకం రావచ్చు. తెల్లవారేదాకా మెలుకువ రాకపోవచ్చు. కాదు ఆ తర్వాత అసలు మెలుకువే రాకపోవచ్చు."

"లేదమ్మా! భయపడకు. నీకు నయం అవుతుంది." అంతకంటే ఏమనాలో తోచక అనేశాడు డాక్టర్.

"చావు అంటే నాకు భయంలేదు డాక్టర్. నిజం చెప్పండి నేను రేపు ఉదయాన్ని చూడను గదూ?"

"లేదు. లేదు. నీకు తప్పక జబ్బు నయం అవుతుంది. నువ్వే చెప్పావుగా ఇవ్వాళ నీకెంతో హాయిగా, తేలిగ్గా వుందని? పైగా ఎంత తెలివిగా మాట్లాడుతున్నావో."

రాధకు నవ్వొచ్చింది నర్సు మాటలకు. కాని నవ్వలేకపోయింది.

"తెలివిగా మాట్లాడుతున్నాను గదూ? నా బుర్ర చాలా చురుగ్గా పనిచేస్తోంది. డాక్టర్ దీన్నేగదూ చావు తెలివి అంటారు?"

డాక్టర్ జవాబు చెప్పలేకపోయాడు. మౌనంగా ఇంజెక్షన్ ఇచ్చి వెళ్ళిపోయాడు. నర్సు రాధ వంటిమీది దుప్పటి సర్ది, తలనిమిరి వెళ్ళిపోవడానికి సిద్ధం అయింది.

"సిస్టర్!"

"ఏమ్మా!"

"మీ పేరు?"

"గ్రేస్."

"ఎంత చక్కని పేరు ? ఇలా వాగుతుంటేం అనుకో కండీ ? ఇవ్వాళ నాకు చాలా చాలా మాట్లాడాలని వుంది సిస్టర్. ఇంత హాయిగా మాట్లాడి చాలాకాలం అయింది. నన్ను మాట్లాడనివ్వండి సిస్టర్. నా పేరు మీకు తెలుసు. అయినా నా నోటిమీదుగా మీకు చెప్పాలనివుంది. నా పేరు రాధ !"

"బహుశా ఆనాటి రాధకూడా నీలాగే వుండేదేమో!" అంది గ్రేస్ చిరునవ్వుతో రాధ ముఖంలోకి చూస్తూ.

"బలేచెప్పారు సిస్టర్ ! చాలా బాగా ఊహించారు. ఆనాటి రాధకూడా వంటరిదే. ఆమె ప్రేమించింది. ఆమె ప్రేమ మాధవుణ్ణి వ్రజభూమి వదలి ద్వారకకు వెళ్ళకుండా ఆపలేకపోయింది. బహుశా ఆమె ప్రేమలో ఏదో లోపం వుండివుండాలి.... బహుశా ఆమెకూడా నాలాంటి మొండిదే అయివుండాలి. తపించడం మాత్రమే ఆమెకు తెలుసు. మురిపించి మరిపించడం ఆమెకు తెలియదు. కేవలం ఆరాధించడం మాత్రమే ఆమెకు తెలుసు. ఆకర్షించడం ఆమెకు తెలియదు. సత్యభామలా అలిగి బ్రతిమాలించుకోవడం తెలియదు. సంపూర్ణ సమర్పణ మాత్రమే తెలుసు. ఇవ్వడం మాత్రమే తెలిసిన ఆమెకు పొందడం ఎలాగో తెలియదు. అదేనేమో ఆమె ప్రేమలో వున్నలోపం. మాధవుడు రాధనువదిలి వెళ్ళి పోయాడు. రాధ రాత్రింబవళ్లు జ్ఞాపకాల ఊరేగింపు మధ్య తనను తాను కోల్పోయి పిచ్చిగా తిరిగింది వ్రజభూమిలో. యమునాతీరంలో, క్షణమొక యుగంగా వెయ్యికన్నులతో



ఎదురుచూస్తూ వుండిపోయింది. ఐనా మాధవుడు తిరిగి రాలేదు...." రాధ తనకు తనే చెప్పుకుంటూ వుంది.

"రాధప్రేమ అంత పవిత్రమైంది కాబట్టే ఈనాటికీ మనం రాధా- మాధవులను ఆరాధిస్తున్నాం" అన్నది గ్రేస్.

రాధ అదోలా నవ్వింది. "హు ! పవిత్ర ప్రేమ ! దాని వల్ల రాధకు లభించింది ఏమిటి ? తపన....తీవ్ర వేదన....సిస్టర్ మీరు ఎవర్నైనా ప్రేమిస్తున్నారా ?"

గ్రేస్ తెల్లటి బుగ్గల్లో ఎర్రటి వేడిరక్తం పారాడింది.

"మీ బుగ్గలు ఎంత ఎరుపెక్కాయి సిస్టర్ ! నాకు సమాధానం దొరికింది మీరు చెప్పకుండానే. మీరు ప్రేమిస్తున్న వ్యక్తి మిమ్మల్ని ప్రేమిస్తున్నాడా ?"

సిస్టర్ చివ్వున తలెత్తి చూసింది.

"చెప్పండి సిస్టర్ !"

"అవును !" సిగ్గుతో గ్రేస్ ముఖం ముద్దమందారంలా మారిపోయింది.

"అదృష్టవంతులు...." గొణిగింది రాధ.

"అతన్నే పెళ్ళి చేసుకుంటారా ?" రాధ అడిగింది.

"అవును ! వచ్చేనెలలోనే మాపెళ్ళి. రాధా! నువ్వు కూడా ఎవర్నైనా ప్రేమించావా ?" అడిగింది గ్రేస్.

రాధ విషాదంగా నవ్వింది.

"సిస్టర్ ! ఈ రాత్రంతా నాదగ్గిర కూర్చుంటారా ? నాకథ చెబుతాను. నేను ఎప్పుడూ మనసువిప్పి ఏదీ ఎవరికీ చెప్పలేదు. చెప్పే శక్తి నాకు లేదనుకుంటాను. కాని ఆఖరు క్షణాల్లో నా మనసును మీ ముందు విప్పాలని వుంది.

మనసులోని గుబులును దించుకోవాలని వుంది సిస్టర్. నేను లేకపోయినా కొంతకాలం నా జ్ఞాపకం మీ మనసులో వుంటుంది. మీరు సంతోషంగా ఉన్నప్పుడో, దిగులుగా ఉన్నప్పుడో, ఎప్పుడో ఒకసారి ఒక్క క్షణం నా స్మృతి మీ మనసులో మెదిలితే చాలు."

గ్రేస్‌కు మనసు కెలికినట్టయింది.

"అలాగే రాధా! ఈ రాత్రంతా నీ దగ్గరే కూర్చుంటాను. ఒక్కసారి రౌండ్స్‌కు వెళ్ళి, డాక్టరు గారికి చెప్పి త్వరగా వచ్చేస్తాను. అంతవరకు విశ్రాంతి తీసుకో" అంటూ గ్రేస్ బయటికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే ఓ క్షణం చూసి, బద్ధకంగా కళ్ళు మూసుకుంది రాధ.

## 2

దూరంగా గడియారం గంటలు వినిపిస్తున్నాయి. కళ్ళు మూసుకునే రాధ గంటలు లెక్కపెట్టసాగింది. పదకొండు గంటలు కొట్టింది గడియారం.

ఈరాత్రి గడవడానికి ఇంకెన్ని గంటలు కొట్టాలి! మరో ఆరేడు గంటలు మాత్రమేవుంది తెల్లవారడానికి. కాదు తన జీవితంలోని ఆఖరుపుట రాసుకోవడానికి!

ఈరాత్రి తను నిద్రతో, మత్తుతో పోరాడాలి! జీవితంతోనే పోరాడిన తను, ఈ మాత్రం నిద్రతో పోరాడలేదా?



ఈ పాతిక సంవత్సరాల జీవితం తనకు ఏమిచ్చింది? తను జీవితంలో ఏం పొందింది?

ఎందుకివ్వలేదు? జీవితం, తనకు ఆఖరు క్షణంలో మననం చేసుకోవడానికి చాలా చాలా అనుభూతుల్ని ఇచ్చింది. అవి తియ్యటి అనుభూతులు కావు. చేదు అనుభూతులు. ఐతేనేం? వాటిని గుర్తు చేసుకోవడంలో వున్న తియ్యటి బాధ, విషాద గీతంలాంటి తపన... ఇవి చాలవా ఆఖరు సారిగా ప్రాణి మననం చేసుకోవడానికి?

మనిషి ఆనందం కోసం అర్రులు చాస్తాడు. కోరిక తీరితే ఆనందం లభిస్తుంది. కాని ఆ ఆనందం తాలూకు అనుభూతి ఎంతోకాలం నిలవదు. అందుకే.... మరో కోరిక .... మరో కోరిక .... పెంచుకుంటూ పోతాడు మానవుడు. కాని కోరిక తీరనప్పుడు దారుణబాధ కలుగుతుంది. ఒకోసారి మనిషి పిచ్చివాడై పోతాడు. ఆ బాధలో తీవ్రత క్రమంగా తగ్గుతుంది. కాని ఆ బాధ తాలూకు జ్ఞాపకం మనసులో మిగిలిపోతుంది. ఆ అనుభూతిని మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటూ బాధపడతాడు. కాని ఆ బాధలో ఓ తియ్యదనం....తమాషా అనుభూతి కలుగుతుంది.

ఆఖరు గడియల్లో మననం చేసుకోడానికి తన గుండెల్లో చాలా చేదు అనుభూతులు మిగిలిపోయాయి. అన్నీ అనుభవించేసి, తీరా ఆఖరు క్షణంలో తల్చుకోవడానికి, తపించడానికీ, ఏమీ మిగలని వ్యక్తులకంటే తనెంతో అదృష్టవంతురాలు.

తను బతుకుతో రాజీపడి, వున్నదానితో సంతృప్తిపడి

మామూలు మనిషిలా జీవించలేకపోయింది. కాల ప్రవాహానికి, సృష్టినియమానికిఅనుకూలంగా ప్రయాణం చెయ్యలేకపోయింది తనశక్తినంతా కూడదీసుకొని ప్రవాహానికి ఎదురు ఈదడానికే ప్రయత్నించింది. శక్తిలేదని తెలుసుకొనీ, అలసిపోయి కూడ వెనక్కు తిరగలేదు. చివరకు సుడిగుండంలో చిక్కుకుంది. అందులోపడి .. గిరగిరా.... గిరగిరా.... తిరిగిపోయింది. అప్పుడుకూడా తను ప్రాణభిక్షపెట్టమని నోరుతెరచి ఎవర్నీ అర్థించలేదు. మౌనంగా ఆ బాధను భరించింది. ఆ సుడిగుండం తనను ముంచేస్తుందని తెలుసు. దాదాపు మునిగిపోయింది. ఆఖరు మునక.... కొద్ది గంటల్లోనే రావచ్చు.

అయినా తన జీవితానికి ఓ ప్రత్యేకత వుంది. చివరి ఘడియల్లో మనిషికి, ఆలోచించగల మనిషికి, తపించగల మనిషికి, ఆర్తితో దహించుకుపోయే మనిషికి, అంతకంటే కోరుకోతగింది మరోటి వుండదేమో!

కాని.... కాని నిజంగా తను సాధించాననుకున్నది ఒక ప్రత్యేకతేనా ? దానివల్ల తనకు లభించింది ఏమిటి ? తన ప్రత్యేకతకు తనే గర్వపడింది. కాని లోకం....? లోకం తననుచూసి జాలిపడుతుంది.

నిజంగా తను సాధించానని గర్వించిన ఆ ప్రత్యేకత తనకు సంతృప్తిని ఇచ్చిందా ! ప్రేమించడానికీ, హృదయం ఇచ్చి పుచ్చుకోవడానికీ ఒక సమయం.... ఒక ఋతువు వుంటాయి. ఆ సమయంలో, తొందరపడి మోసపోయి, నానా బాధలకు గురి అయేవాళ్ళూ, అతి జాగ్రత్తగా, సంయమనంలో, సంకోచంగా ముందుకు అడుగు వెయ్యలేక వున్న



చోటే వుండిపోయి, ఆ సమయం కాస్తా జారిపోయాక, కళ్లు తెరిచినవాళ్లూ ఇద్దరూకూడా తెలివైన వారిదృష్టిలో, లోకం దృష్టిలో, తెలివితక్కువ వారిగానే గుర్తించబడతారు. ఈ రెండురకాల వాళ్ళనూ చూసి లోకం జాలిపడుతుంది.

తను జరిగిపోయిన దానికి బాధపడుతుందా ? తను సాధించాననుకున్న ప్రత్యేకత కేవలం ఒక భ్రమేనా ?

అవును ! అంతా భ్రమే ! ఆ విషయాన్ని తను చాలా ఆలస్యంగా గుర్తించింది. నేల విడిచిన సాములా జీవితాన్ని సాగించింది. ప్రవాహానికి ఎదురు ఈదడానికి ప్రయత్నించింది. ఒడ్డు చేరకుండానే భంగపడిపోయింది. వాస్తవానికి భయపడి కలల్లోనే బ్రతికి అది తన ప్రత్యేకతగా గర్వించింది.

కలలు కనడంతప్పా ? కల్పనా లోకంలో విహరించడం అపరాధమా ? వాస్తవం కంటే కల్పన అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. నిజంకంటే కల అద్భుతంగా ఉంటుంది.

కలలు కనడం తప్పుకాదు. కాని కలల్లోనే బ్రతుకుతూ అదే వాస్తవం అనుకుంటూ భ్రమపడటమే తనుచేసిన తప్పు. కళ్ళు మూసుకుంటేగాని కలలు రావు. కళ్ళు తెరిస్తేగాని వాస్తవం కన్పించదు. అంటే తను - జీవితం అంతా కళ్ళు మూసుకునే బ్రతికిందా ?

నదీతీరాలు సమానాంతరంగా ఉంటాయని యదార్థం చెబుతుంది. కాని అవి రెండూ ఎప్పటికైనా కలుస్తాయని ఆదర్శం కలలు కంటుంది. ఆ కలలలో ఎంత ఆనందం ఉంటుందో కలలు కనేవారికి తెలుస్తుంది. స్థూలంగా ఆలోచిస్తే యథార్థమే సత్యం అనిపిస్తుంది. సూక్ష్మంగా ఆలో

చిస్తే ఆదర్శమే సత్యం అనే భావన కలుగుతుంది. ఆదర్శం ఆకాశమంత విశాలమైంది. కాని అది ఎక్కడో ఒకచోట క్షితిజంతో (అదికూడా కాల్పనికమే కావచ్చు) కలవక మానదు. యదార్థంతో పొట్ట నిండుతుంది. ఆదర్శంతో ఆత్మ నిండుతుంది. యదార్థంలో పుష్టి లభిస్తుంది. ఆదర్శంలో తుష్టి కలుగుతుంది. తను - జీవితంలో పుష్టికంటే తుష్టికే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. కాని తనకు జీవితంలో చివరకు మిగిలిందేమిటి ? అశాంతి! అలజడి! ఏదో తపన!

ఎందుకు? ఇలా కలల్లోనే బ్రతికేవారిని ఏదో తపన సాగర గర్భంలోని ఘోషలా నిరంతరం వెన్నాడుతూనే ఉంటుంది. కాని ఆ తపననుంచి పారిపోవడానికి తనెప్పుడూ ప్రయత్నించలేదు. తన దృష్టిలో ఇలాంటి అశాంతి సంబంధ మధుర అనుభూతే కళాసృష్టికి మూలాధారం. ఈ అశాంతే మానవుణ్ణి తక్కిన ప్రాణులనుంచి విడదీసింది. మధురగానం విన్నప్పుడూ, సౌందర్యాన్ని చూసినప్పుడూ తన మనసులో ఏదో అజ్ఞేయమైన తపన బయలుదేరేది. ఆ తపనలోనే ఏదో మధురానుభూతి కలిగేది. తను తనకు అతిప్రియమైన వస్తువు దేనినుంచో విడిపోయినట్టు అల్లాడిపోయేది. ఆ వస్తువు కోసం అన్వేషిస్తూ జీవితం అంతా గడిపింది.

ఆ అన్వేషణకు ముగింపు తను కోరుకోలేదు. కాని ఒక నాడు వాస్తవం కళ్ళ ముందుకువచ్చి నిల్చింది. అదే తన జీవితంలోని విషాదం....

మానవజీవితం అసంపూర్ణమైనది. అందువల్లనే నిరం



తరం సంపూర్ణత్వం వైపుకు పయనిస్తూ ఉంటుంది, నది సాగరంవైపుకు పరిగెత్తినట్టు.

అబ్బ ! ఏమిటి ఈ ఆలోచనలు ? ఎక్కువ తిని తక్కువ ఆలోచించగలవారే అదృష్టవంతులు.

"కల కానిదీ, నిజమైనదీ, బ్రతుకు కన్నీటిధారలలో..." దూరంనుంచి సన్నగా పాట వినిపించింది రాధకు.

ఆ కవి ఎవరోకాని తనలాంటి వాళ్ళను దృష్టిలో ఉంచుకొనే ఆపాట వ్రాసి ఉంటాడు.

తన జీవితం వ్యర్థమైందా ? కాదు. వ్యర్థంకాలేదు. అది ఒక కమనీయమైన కల. విలక్షణమైన చరిత్ర. ఒక విషాద గీతం. విన్నప్పుడు మనసుకు ఆనందంతోపాటు ఏదో తపన కలుగుతుంది. అందుకే ఆపాట ప్రభావం మనసు మీద ఎక్కువసేపు ఉంటుంది. శుద్ధ ఆనందాన్ని మాత్రమే కలిగించ గల పాట ప్రభావం పాటతోపాటే తుడుచుకుపోతుంది.

## 3

గ్రేస్ పలవరిస్తున్న రాధ నుదుటిమీద అరచేతిని ఆనించింది. రాధ బరువుగా కళ్లు తెరిచింది. "వచ్చావా ?" అన్నట్టు పేలవంగా నవ్వింది.

"సిస్టర్ దాహం వేస్తుంది!"

గ్రేస్ స్పూన్‌తో గ్లూకోజ్ వాటర్ తాగించింది.

"సిస్టర్ నన్ను చూస్తుంటే మీకేమనిపిస్తుంది ?" అడిగింది రాధ.

గ్రేస్‌కు ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా వుండిపోయింది.

"చెప్పండి సిస్టర్ !"

"రాధా ! నిన్ను ఎవరైనా మోసం చేశారా ?"

"ప్రశ్నకు సమాధానం ప్రశ్నతోనే చెప్పారు సిస్టర్. మీరు చాలా తెలివైనవారు. నన్నెవరూ మోసం చెయ్యలేదు, నన్ను నేనే మోసం చేసుకున్నాను. నాకు కావల్సిన వాళ్ళను వెదుక్కోవడానికి బదులు, నేను కావాలనుకొనే వాళ్ళ సంఖ్యను పెంచుకోవడానికి ప్రయత్నించాను."

గ్రేస్‌కు రాధ మాటలు అర్థం కాలేదు. కళ్ళు పెద్దవి చేసుకొని చూసింది.

"అర్థం కాలేదుగదూ సిస్టర్ ? నా కథ చెప్పేముందు మరో చిన్న పిట్టకథ చెప్పనా ?"

గ్రేస్ చెప్పమన్నట్టు తల ఆడించింది.

"రోడ్డు మధ్యన ఒక రాయివుంది. దానిని సరిగా గమనించక ఎదురుదెబ్బలు కొట్టుకొని ఎందరో గాయపడ్డారు. కొందరు బొక్కబోర్లా పడ్డారు. రాతికి వారిమీద జాలి కలగలేదు. ఒక విధంగా తెలిసీ తెలియని ఆనందమే కలిగింది. అయినా ఒకోసారి తను చేస్తున్నది తప్పేమోనని భావం దానికి కలిగేది. మళ్ళీ అంతలోకే "వెధవల్ని చూడకుండా ఎవరు నడవమన్నారు ? తను వాళ్ళను ఏమైనా ఆహ్వానించిందా ? అలాంటి వాళ్ళకు ఆపాటి శాస్తి జరగాల్సిందే లే! ఇందులో తన తప్పేముంది ?" అని తనను తానే సమాధానపర్చుకొనేది, దాన్ని లక్ష్యపెట్టకుండా తప్పుకుపోతున్న వాళ్ళను



చూసి ఒక రకంగా బాధపడేది కూడా. ఆ రోజు....పాషాణం కరిగి అది నవనీతంగా మారిన రోజు....తను ఎదురు చూడని రోజు....తను కావాలని కోరని రోజు.... రానేవచ్చింది. రెండు పాదాలు తనకేసి నడవడం చూసింది. ఆ పాదాలు దగ్గిర అవుతుంటే అది వణికిపోయింది అవి గాయపడతాయేమోనని. అది కరిగిపోయింది. ఆ కరిగిపోవడంలో ఒకవింత బాధను అనుభవించింది. ఆ పాదాలకేసి ఆశగా చూసింది. ఆ పాదాలు తనను తాకాలనీ, తను ఎంత మారిపోయిందో తెలుసుకోవాలనీ ఆరాటపడింది. కాని తనలోని మార్పును తనకు తానుగా చెప్పుకోలేకపోయింది. ఆపాదాలుదగ్గిరగావచ్చిఆగిపోయాయి. ముందుకు కదలలేదు. గాయపర్చటం మాత్రమే తెలిసిన ఆ రాయి, మొదటిసారిగా తగిలిన తన గాయాల్ని చూపడానికి అభిమానపడింది. తనలో ఎలాంటి మార్పూ లేనట్టే కన్పించడానికి ప్రయత్నించింది. కొంతసేపు నిరీక్షించి ఆ పాదాలు తొలిగి వెళ్ళిపోయాయి. ఆ తర్వాత.... ఆ తర్వాత సిస్టర్ దాహం!"

గ్రేస్ రెండు చెంచాల నీరు రాధ గొంతులో పోసింది.

"సిస్టర్ .... నా మాటలు మీకు పిచ్చిదాని ప్రేలాపనలా అనిపిస్తున్నాయి గదూ?" రాధ గ్రేస్ ముఖంలోకి చూసింది.

గ్రేస్ రాధ కళ్ళలోకి లోతుగా చూసింది. ఆ కళ్ళలో వ్యధ లేదు.... భయం లేదు.... వివేదన లేదు.... సజీవం.... సశబ్ధం....విశుద్ధం....అయిన ఏదో భావం.... మనిషి నేర్చిన భాషకు అందని భావం.... గ్రేస్‌కు కన్పించింది.

"ఆ రాధ కథ మీకు తెలుసు, ఇక ఈ రాధ కథ వినండి సిస్టర్!"

సిస్టర్ మౌనంగా రాధ చేతిని నిమరసాగింది.

గతం మేలిముసుగును తొలగించుకొని రాధ కళ్ళ ముందు నిల్చింది. సన్నని హాసరేఖ.... అరుణ రేఖ లేకుండా, కేవలం లేత వెలుగుమాత్రమే వున్న ఉదయ కిరణంలాంటి చిరునవ్వు.... రాధ పాలిపోయిన పెదవులమీద లీలగా కదిలింది.

.... .... .... .... ....

రాధ జన్మించిన రోజు ఏ అపూర్వ సంఘటనా జరగలేదు. ఆకాశంలో నక్షత్రాలు మెరవలేదు. ఆ ఇంట్లో ఎవరి హృదయాలూ సంతోషంతో వెల్లివిరియలేదు.

మంత్రసాని పసిగుడ్డును చేతుల్లోకి తీసుకొని తల్లికి చూపించింది. తల్లి ముఖం తిప్పుకొని కళ్ళనీళ్ళు పెట్టుకుంది, ఆడపిల్ల పుట్టినందుకు.

రాధ కడుపులో పడిన మూడు నెలలకే తండ్రి పొలంలో పాముకరిచి చచ్చిపోయాడు. రాధ తల్లికి భర్త ద్వారా సంక్రమించిన ఆస్తి వైధవ్యం మాత్రమే. తల్లి దండ్రులులేని రాధ తల్లి అన్న పంచనచేరింది.

ఎటువంటి అచ్చట్లూ, ముచ్చట్లూ, ముద్దూ మురిపెం లేకుండా మేనమామ ఇంట్లో, అతని పిల్లలమధ్య పెరుగుతున్న రాధకు ఆ ఇంట్లో వారిమీద గౌరవంలేదు. మేనమామ పిల్లలకు సరిపోక తీసివేసిన దుస్తులు వేసుకుంటూ కొత్తబట్టలు లేనందుకు బాధపడేది. తనకూ నాన్నవుంటే, తనకూ అమ్మ



కొత్తబట్టలు కుట్టించేది అని మనసులోనే అనేకసార్లు అనుకుంది. కాని పైకిమాత్రం ఏమీ అనేదికాదు. లోలోపల కసి, మొండితనం పెంచుకుంది. ఇంట్లో వాళ్ళకు ఇష్టంలేని పని చేసేది. దెబ్బలు తినేది. కాని ఏడ్చేది కాదు.

మేనమామకు ఇద్దరు కూతుళ్ళు. ఇద్దరూ రాధ కంటే పెద్దవాళ్ళే, వాళ్ళు అమ్మలాటలూ, బొమ్మలాటలూ ఆడుకొనేవారు తోటి ఆడపిల్లలతో కలిసి. రాధకు వాళ్ళ ఆట లంటే అయిష్టం! వాళ్ళు పిల్చినా వెళ్ళేదికాదు. బజార్లోకి వెళ్ళి మగపిల్లలతో గోలీలు, బచ్చాలూ, పులిజూదం, బిళ్ళంగోడూ ఆడేది. గాలిపటాలూ ఎగరేసేది.

మేనమామా, మేనమామ భార్యా ఎన్నోసార్లు మగపిల్లలతో ఆడవద్దని హెచ్చరించారు. ఆ హెచ్చరికలు ఆమెను మరీ రెచ్చగొట్టసాగాయి.

ఒకరోజు రాధ మగపిల్లలతో చెరువుకు వెళ్ళి ఈత కొట్టివచ్చింది. తల్లి చేత దెబ్బలు తిన్నది.

రాధకు పదేళ్ళు వచ్చాయి. రాధ మగపిల్లలతో ఆడుతూవుంటే అదే వయసువాడైన మేనమామ కొడుకు రామానికి తల కొట్టేసినట్టు అనిపించేది.

"చూడు నాన్నా! రాధ ఇవ్వాళ బజారులో మేము ఆడుకుంటూవుంటే వచ్చి గోలీలు ఆడింది. ఆడపిల్లలు ఎక్కడైనా మగపిల్లలతో ఆడ్తారా?" రోషంగా చెప్పాడు తండ్రితో ఒకరోజు రాత్రి రామం.

మేనమామ అడిగితే "నా ఇష్టం! ఏం ఎందుకు ఆడ

కూడదు? రామం ఆడటంలేదూ గోలీలు?" అని ఎదిరించింది రాధ.

"ఎంత పొగరు? వాడితో పోలికా? వాడు మగబిడ్డ! ఆడముండవూ.... అదుపూ అజ్ఞా లేకుండా మరీ...."

"ముండా గిండా అనకు...." అత్త మాటల్ని మధ్యలోనే అందుకొని అరిచింది రాధ.

తల్లి వారిస్తున్నా లక్ష్యపెట్టకుండా మొండిగా మేనమామను ఎదిరించి దెబ్బలు తిన్నది.

"మగవాడు తిరక్క చెడ్డాడు. ఆడది తిరిగి చెడింది అనే సామెత పెద్దలు పిచ్చివాళ్ళయి అన్నారా? కాస్త కూతుర్ని అదుపులో పెట్టుకో. ఇప్పట్నుంచే దాని ధ్యాస ఎప్పుడూ మగపిల్లలమీదే!" ఆడబిడ్డతో వదిన అన్నది.

రాధ తల్లి ఏమీ అనలేక కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఆ రాత్రి రాధ అన్నం తినలేదు. పడుకొంది, నిద్ర రావడంలేదు! తను మగపిల్లలతో ఎందుకు ఆడకూడదో ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు.

తను మగపిల్లలతో ఎందుకు ఆడుకోకూడదు? మాటకు ముందు "ఆడముండ!" అంటారేం? రామం తనకంటే రెండు నెల్లే పెద్ద. వాడిని ఎందుకు అదుపులో పెట్టరు? "ఏమిటా నడక? ఏమిటా పరుగులు? ఏమిటా ఆటలు? ఏమిటా మాటలు? ఆడముండవు గదూ?" అంటూ ప్రతి నిముషం తనను ఎందుకు బాధ పెడుతున్నారు? ఆడపిల్లలు ఒకలా మగపిల్లలు మరోలా ఎందుకు ఉండాలి? తను గాలిపటాలు



ఎగరేస్తే ఏమైంది? గోలీలు ఆడితే ఏమైంది? ఏదో ఉంది? మామయ్యలా అత్తయ్య పొలం వెళ్ళదు. బజారుకు వెళ్లదు. అసలు బయటికే వెళ్ళదు. మామయ్య వచ్చేటప్పటికి అత్తయ్య వీధివాకిట్లో నిలబడివుంటే కేకలువేస్తాడు. ఎందుకు? మగవాళ్ళెవరైనా వస్తే అమ్మా, అత్తయ్య గబుక్కున లేచి లోపలికి ఎందుకు వెళ్ళిపోతారు? మామయ్య లేనప్పుడు మగవాళ్ళెవరైనా వస్తే అత్తయ్య తలుపుచాటుగా నిల్చుని జవాబు చెబుతుందేం? అప్పుడు అత్తయ్య గొంతు ఎంత మెత్తగా ఉంటుందో? రచ్చబండమీద మగవాళ్ళు కూర్చుని ఉంటే ఆడవాళ్లు అదిదాటి వెళ్ళరేం? ఎవరింట్లోనో జొరబడి తలుపు చాటునుంచి నక్కి నక్కి చూస్తూ ఉంటారు. ఒకరోజు తను రచ్చబండ దగ్గర ఆడుకుంటూ ఉంది. పేరంటానికి బయలుదేరిన అత్తయ్య, కాంతమ్మా, గౌరీ, వీళ్ళంతా రచ్చబండమీద మగవాళ్ళను చూచి భద్రాచారి ఇంట్లో జొరబడి, తలుపు చాటునుంచి తొంగి తొంగి చూడసాగారు. అది గమనించిన వెంకయ్య "లేవండి! ఆడంగులు వస్తున్నారు!" అంటూ లేచి నిల్చున్నాడు. పైపంచలు దులుపుకొంటూ అందరూ లేచి వెళ్ళిపోయారు. అప్పుడు ఆడవాళ్ళంతా పట్టుచీరల్లో ముడుచుకుపోయి, రోడ్డు పక్కగా అడుగుల్లో అడుగులు వేసుకొంటూ పేరంటానికి వెళ్లారు. వాళ్లతోపాటు మామయ్య పెద్దకూతురుకూడా ఉంది. అది పచ్చితాటాకులమీద కూర్చున్న రోజునుంచి బయటికి రావడమే మానేసింది. పేరక్కలా పెద్దవాళ్ళ మధ్యనే తిరుగుతూంది. తను చస్తే అలా కూర్చోదు. అలా మగవాళ్ళను చూసి

చాటుకుపోదు. సిగ్గుపడుతూ గోడలమీద పడుతూ నడవదు.
ఎందుకు అలా ఉండాలి ! దర్జాగా మగవాడిలాగే నడుస్తుంది!
తన ఇష్టం! వీళ్ళెవరు తనను అదుపులో పెట్టడానికి ?

రాధ ఊహ తెలిసినప్పటినుంచి ఈ మగ .... ఆడ ....
తేడాలను గురించి ఆలోచించసాగింది. రాధ చేతులకు గాజులు
తొడిగి స్తే, తెలిసీ తెలియని వయసులోనే ఏడ్చేది. సాయం
త్రానికి పగలగొట్టుకొని ఇంటికి మొండిచేతులతో వచ్చి
తన్నులు తినేది. బొట్టు పెడితే చెరిపేసేది. పూలు పెట్టబోతే
పారిపోయేది. పేరంటాలకు వెళ్ళేదికాదు. అక్కడ కాళ్ళకు
పసుపు పూస్తారనీ, ముఖానికి బొట్టు పెడ్తారనీ భయపడేది.
రాధ మనసులో మగపిల్లకు లేని ఈ ప్రత్యేక అలంకరణల
మీద అసహ్యం ఏర్పడింది. ఈ అలంకరణలవల్లనే ఆడపిల్లలు
మగపిల్లల్లా స్వేచ్ఛగా ఉండలేకపోతున్నారనే భావం
తెలిసీ తెలియని వయసులో రాధ మనసులో నాటుకు
పోయింది.

అప్పుడు రాధకు తొమ్మిదో ఏడు నడుస్తోంది. తెలుగు
మాస్టారు ఎప్పుడూ తమలపాకులు నములుతూ ఉంటారు.
నోరు అసహ్యంగా లక్కపిడతలా ఉంటుంది. అతను ఎప్పుడూ
ఆడపిల్లల్ని ఒళ్లో కూర్చోబెట్టుకొంటాడు. ముద్దు లాడుతూం
టాడు. ఒకరోజు రాధ త్వరగా స్కూలుకు వచ్చింది. అప్ప
టికే అక్కడ వున్న తెలుగు మాస్టరు రాధను బలవంతంగా
ఎత్తి వళ్లో కూర్చోబెట్టుకున్నాడు. రాధ గిలగిలా లాడి వది
లించుకోవటానికి ప్రయత్నిస్తూంటే గట్టిగా ముద్దుపెట్టు
కున్నాడు. రాధకు ఊపిరాడలేదు. మాస్టరు ముక్కుమీద



బలంగా కొట్టింది. "అబ్బా !" అంటూ వదిలేశాడు. రాధకు
మాస్టరు చేసింది తప్పు అనే భావం కలక్కపోయినా ఏదో
రోత, ఏవగింపు కలిగాయి. ఢోకు వస్తోంది. తెలుగు
మాస్టరి నోటికంపు ఇంకా తన పెదవులకు అంటిపెట్టుకున్నట్లే
అనిపించింది. ఏడుపు వచ్చింది. మాస్టరు ముఖం గోళ్ళతో
గీరాలనీ, ఆయన కళ్ళు పీకాలనీ అనిపించింది. ఆ రోజునుంచి
తెలుగు మాస్టరంటే రాధకు అసహ్యం, మగవాళ్ళంటే
భయం. ఎవరైనా ఆప్యాయంగా మీద చెయ్యివేస్తే కసిగా
కొరికి పారిపోయేది.

రాధకు పదకొండో ఏడు వచ్చింది. ఎనిమిదో క్లాసు
చదువుతుంది. రాధకు ఓ రోజు ఓణీలు ఇచ్చారు. ఆ రోజే
ఆమె మనసులో మరో ప్రపంచం వెలసింది. సంఘర్షణ
ప్రారంభం అయింది.

ఓణీలు వేసుకోనని మారాం చేసింది. తప్పదని తెలుసు
కుంది. రెండు రోజులు స్కూలుకు కూడా వెళ్ళలేదు. ఏదో
బాధ, సిగ్గు, కసి ....కోపం.... ఎవరిమీద.... ఎందుకు అర్థం
కావడం లేదు. మూడో రోజు స్కూలుకు వెళ్ళింది. ఆడ
పిల్లలు పెద్దగా పట్టించుకోలేదు. మగపిల్లలు మాత్రం రాధను
వింతగా చూశారు. రోజూ రాధతో స్నేహంగా మాట్లాడే
మగపిల్లలు ఆ రోజు రాధను పలకరించలేదు. అదోలా అని
పించింది రాధకు. ఇంటికి పరిగెత్తుకొచ్చింది. ఓణీ తీసి కసిగా
చుట్టి ఓ మూలకు విసిరికొట్టింది. ఓణీ తీసేసి బయటికి పరి
గెత్తుతున్న రాధను తల్లి కేకలు పెడుతూ పిల్చింది. కాని

రాధ వెనక్కి చూడకుండా వెళ్ళిపోయింది. ఊరి బయట మగపిల్లలు గోలీలు ఆడే చోటుకు వెళ్ళింది. అక్కడ రోజూ తనతో ఆడే రామం, గోపీ, శరత్ గోలీలు ఆడుతున్నారు. ఆ రోజు వాళ్ళు స్కూల్లో రాధను పలకరించలేదు. వింతగా చూశారు. ఓణీ తీసేసి వచ్చిన రాధను మరీ వింతగా కళ్ళు పెద్దవి చేసుకొని చూశారు. ఆమె ఛాతీకేసి చూడసాగారు. రాధను పలకరించలేదు. రాధకు వాళ్ళ ప్రవర్తన అర్థం కాలేదు. తనలో వచ్చిన మార్పేమిటో, వాళ్ళు తనను ఎందుకు అలా వింతగా చూస్తున్నారో బోధపడలేదు. రాధ కళ్ళు దించుకుని తన ఛాతీకేసి చూసుకుంది. అంతవరకూ తను గమనించని మార్పేదో ఆమెకు లీలగా కన్పించింది. సిగ్గుతో కుంచించుకుపోయింది. గిరుక్కున వెనక్కి పరుగుతీసింది. గది తలుపులు మూసి లోని మంచానికి అడ్డంపడి వెక్కి వెక్కి ఏడ్చింది.

*　　*　　*

"సిస్టర్ దాహం!" రాధ నాలుక పిడచకట్టుకు పోయింది.

గ్రేస్ గ్లూకోస్ నీళ్ళు రాధ గొంతులో చిన్నగా స్పూన్‌తో పోసింది దుప్పటి సర్దింది.

## 4

"సిస్టర్!"

"ఏం రాధా?"



"సిస్టర్ తెల్లవారడానికి ఇంకెంత సమయం వుంది?"

"ఎందుకమ్మా?" గ్రేస్ కంఠం వణికింది.

"పక్షి గూడు వదిలి వెళ్ళిపోవడానికి ఇంకెంత టైం వుందో తెలుసుకుందామని!"

సిస్టర్ రాధను రెండు చేతులతో పొదివి పట్టుకుంది.

రాధ కళ్ళు సంతృప్తితో మెరిశాయి.

సిస్టర్ నువ్వు నన్ను అలా రెండు చేతులతో పొదివి పట్టుకుంటే నాకెంతో సంతోషంగా వుంది. ప్రాణం వదలలేక, వదలలేక, శరీరాన్ని వదిలి వెళ్ళిపోతున్నప్పుడు, ఆ శరీరాన్ని రెండు చేతులు ఆప్యాయంగా పొదివి పట్టుకోవాలని ప్రతిప్రాణీ కోరుతుంది. అటువంటి అదృష్టం నాకు లేదనుకొనేదాన్ని. కాని సిస్టర్.... నీ చేతుల్లో.... ఇలాగే నిశ్చింతగా...."

"రాధా! ఇప్పుడు నీకేమయిందమ్మా? నువ్వు తప్పక బ్రతుకుతావు. డాక్టరుగారు చెప్పారు" గ్రేస్ కంఠంలో జీర పలికింది.

రాధ పాలిపోయిన పెదవులమీద హాసరేఖ లీలగా ఓ క్షణం కదిలింది.

"సిస్టర్ ఫోన్ మ్రోగుతుంది. ఎవరూ ఎత్తడంలేదు."

"డ్యూటీ నర్స్ నిద్రపోతుందేమో!"

ఫోన్ ఆగిపోయింది.

"సిస్టర్ ఫోన్ మ్రోగినప్పుడల్లా నాకు ఎక్కడో చదివిన ఒక భావం మనస్సులో తళుక్కుమంటుంది. నా జీవితాన్ని టెలిఫోన్‌తో పోల్చుకుంటూ వుంటాను."

గ్రేస్ మౌనంగా కూర్చుంది.

"టెలిఫోన్‌కూ మన హృదయానికీ ఏదో సామ్యం వున్నట్టు అనిపిస్తుంది. నీకూ అనిపిస్తుందా సిస్టర్."

"లేదు" అన్నట్టు తల ఊపింది సిస్టర్.

"సిస్టర్ మనం గదిలో కూర్చుని మన టెలిఫోన్ నంబరే మనం కలిపితే ఎలాంటి శబ్దం వస్తుంది ?

"తెలీదమ్మా! నేను ఎప్పుడూ ఆ పని చెయ్యలేదు."

"మీరు అదృష్టవంతులు సిస్టర్. ఫోన్ వుండేది వేరే నంబర్ను కలపడానికే. దాని నంబరు దానికే కలపడానికికాదు. నాలాంటి పిచ్చివాళ్ళు చేసేపని అది."

"కాసేపు కళ్ళుమూసుకొని పడుకో రాధా!"

"జీవితమంతా కళ్ళు మూసుకొని వున్నాను సిస్టర్. మరి కాసేపటికి చెయ్యబోయే పనికూడా అదే. ఈ కాసే పయినా నన్ను కళ్ళు తెరిచి వాస్తవాన్ని చూడనివ్వండి !"

గ్రేస్ మాట్లాడలేదు. రాధ చేతిని తన చేతిలోకి తీసుకొని నిమరసాగింది.

"వినాలని లేదా సిస్టర్ !"

"ఏమిటి ?"

"అదే టెలిఫోన్‌కూ మన జీవితానికి ఉన్న సామ్యం గురించి."

"చెప్పు !"

"మన నంబరే మనం కలిపినప్పుడు ఎంగేజ్‌డ్ సౌండ్ వస్తుంది. అర్థరహితమైన శబ్దం- మూలుగులాంటి శబ్దం.... అది ఎవరి కంఠంనుంచీ వచ్చే శబ్దం కాదు. ఎవరి కంఠమైనా వినాలంటే మనం వేరే నంబరు డయిల్ చెయ్యాలి. అలాగే



హృదయం కూడా. మరో హృదయం తెలుసుకోవాలన్నా, ఆ హృదయాన్ని పొందాలన్నా, మనం వేరే హృదయంతో మన హృదయాన్ని కలపాలి. కాని.... నేను.... నేను ఏం చేశానో తెలుసా ? ఒంటరితనపు గుహలో కూర్చుని నా హృదయంతో నా హృదయాన్ని కలపడానికి ప్రయత్నించాను. నా హృదయంనుంచి ఏమీ పలకలేదు. కేవలం ఒక మూలుగు మూగబాధ .... మాత్రమే వినిపించింది" రాధ ఓ క్షణం కళ్లుమూసుకుంది.

"మనమే మరో నంబర్తో కలపక్కర్లేదు. అటునుంచి కూడా కాల్స్ వస్తాయిగదా ?" గ్రేస్ అర్థయుక్తంగా ప్రశ్నించింది.

"అవును వస్తాయి. ఫోన్ మ్రోగుతుంది. దాన్నిఎత్తి రెస్పాన్స్ ఇవ్వాలిగా ? అప్పుడే అవతలి కంఠం చెప్పేదేదో తెలుస్తుంది. అసలు ఫోన్ ఎత్తకపోతే ? తమాషాగా మ్రోగుతున్న ఫోన్ చూస్తూ కూర్చుంటే ? ఏమౌతుంది ? కొంతసేపు మ్రోగి ఆగిపోతుంది. అప్పుడు ఏదో సంతృప్తి. అంతలోనే లీలగా ఏదో బాధ, అయ్యో ఎవరు చేశారో ? ఆ కంఠం ఎలాంటిదో ! ఒక్కసారి వింటే బాగుండేది ! ఇలాంటి ఆలోచనలు కూడా వస్తాయి."

"ఎప్పుడూ ఫోన్ ఎత్తనేలేదా ? నీ గుండెలో అంత కాఠిన్యం వుందా రాధా !"

రాధ పేలవంగా నవ్వింది.

"ఎత్తాను. కుతూహలంకొద్దీ ఒకటి రెండుసార్లు ఎత్తాను

పెదవులు అదురుతున్నాయి. మనసు అవమానంతో దహించుకుపోసాగింది. సూర్యం కళ్ళు పీకాలనిపించింది. ముఖం రక్కాలనిపించింది. పళ్లు రాలగొట్టాలనిపించింది.

గోపీ, రామం భయంతో బిగుసుకుపోయి నిల్చున్నారు.

సూర్యం వంగి పుస్తకాలు తీసి నవ్వుతూ రాధకు అందించాడు. రాధ విసురుగా పుస్తకాలు లాక్కుని ఇంటికి వచ్చింది. మనసు తుమ్మముల్లు గుచ్చుకున్నట్లు సలుపుతుంది.

ఎందుకు సూర్యం అలా అన్నాడు? ఎన్ని గుండెలు వాడికి ? అమ్మతో చెబితే? ఛీ! ఆమాట నోటిమీదకు తెచ్చుకోవాలంటేనే అసహ్యంగా వుంది. చిన్నప్పుడు ఒళ్లో కూర్చోబెట్టుకొని బలవంతంగా ముద్దుపెట్టుకున్న తెలుగు మాస్టారు గుర్తొచ్చాడు. రాధకు కడుపులో కెలికినట్టయింది.

ఆ రోజునుంచి రాధ మగపిల్లలు కన్పిస్తే దూరంగా వెళ్ళిపోయేది. ఆడపిల్లలతో కూడా పెద్దగా మాట్లాడేదికాదు. వాళ్లాటలన్నా, మాటలన్నా ఎప్పుడూ వళ్లుమంటే.

ఆ రోజు ఆదివారం రాధకు ఏమీ తోచడం లేదు. మనసులో ఏదో దిగులు.... ఎందుకో తెలియదు.

దొడ్లో బాదంచెట్టు కింద, రాధ మేనమామ కూతురు కాంతం, స్నేహితురాలు సరళతో ఆడుకుంటూ వుంది. రాధ అప్రయత్నంగానే వాళ్ళ దగ్గిరకెళ్ళి నిలబడింది.

"నువ్వుకూడా ఆడతావా"? సరళ రాధను అడిగింది.

"ఏమాడుతున్నారూ ?" రాధ ప్రశ్నించింది.

"మొగుడూ పెళ్లాం ఆట!" కాంతం కళ్లు తిప్పుతూ చెప్పింది.



"ఏడవలేకపోయారూ?" అనాలనిపించినా "మీరు ఆగండి నేను చూస్తాను" అంది.

"నేను పెళ్ళాంగా వుంటాను" అన్నది కాంతం.

"ఊఁహూ ! నేనే పెళ్ళాంగా వుంటాను" అన్నది సరళ.

"కాదు నేనే పెళ్లాం !"

"ఊహూ! నేనే !"

నీ కంటే నేను చిన్నదాన్ని. చిన్న వాళ్లెక్కడన్నా మొగుళ్లుగా వుంటారా ఏం ?"

"ఎందుకుండకూడదూ ! ఒట్టొట్టి మొగుడుగా నేగా ! నేనే పెళ్లాంగా వుంటాను."

"రాధా ! నువ్వే చెప్పు ! నేను చిన్నదాన్ని. నేనే పెళ్లాంగా వుండాలి కదూ ?" రాధను సరళ అడిగింది.

"మీరిద్దరూ పెళ్లాలుగానే ఏడవండి. నేను మొగుడుగా వుంటాను."

"ఇద్దరు పెళ్లాలా ? ఎట్లా?" ఇద్దరూ ఒకేసారి ఆలోచనలోపడి అడిగారు.

"ఏం ఎందుకు కాకూడదూ ? మనూళ్లో రామయ్య గారికి ఇద్దరు పెళ్ళాలేగా ?"

"వాళ్లెప్పుడూ పోట్లాడుకుంటూ వుంటారు" అన్నది కాంతం సాలోచనగా.

"అయితే సరే! మే మిద్దరం నీకు పెళ్ళాలం అంట !

మ రేమో మేమిద్దరం ఎప్పుడూ పోట్లాడుకుంటూ వుంటామంట !"

"నేనేమో ఎంచక్కా మీ ఇద్దరి మక్కెలు విరగదంతానంట! వెధవ ఆటలూ మీరూ.... నేను ఆడను...." అంటూ రాధ గిరున వెనక్కు తిరిగింది.

"ఆటల్లోకూడా వీళ్లు పెళ్ళాంగా వుండాలనే తన్నుకు చస్తున్నారు..........."

* * *

"సిస్టర్ దాహం !"

గ్రేస్ గ్లూకోజ్ వాటర్ తాగించి మూతి తుడిచింది.

## 5

"సిస్టర్ !"

"ఏమ్మా !"

"ఏదైనా కావాలనుకున్నప్పుడు, అది లభిస్తే ఎట్లా వుంటుంది ?"

"కావాలనుకున్నది సాధించినప్పుడు సంతోషం కలుగుతుంది ?"

రాధ ఓ క్షణం ఆలోచనలో పడింది.

"అవును సిస్టర్ ! సాధారణంగా జరిగేది అదే. కాని అందరి విషయంలో కాదేమో ? లేక నా భ్రమో !"

సిస్టర్ మాట్లాడలేదు.



"సాధించిన విజయం నిన్నటి జ్ఞాపకం అయిపోతుంది సిస్టర్. విజయం సాధించాక పక్షి ఎగిరిపోయిన గూడులా, అవుతుంది హృదయం. రేపటి కోర్కెలో వున్న బలం వుత్సాహం నిన్న సాధించిన విజయంలో వుండదు. పొందాలనే కోర్కె పొందిన సంతృప్తికంటే ఎక్కువ ఆకర్షణనూ, జీవితంలో ప్రోత్సాహాన్నే ఇస్తుంది. అందుకే నేను విజయం అందుబాటులోకి వచ్చినప్పుడు దానినుంచి ప్రతిసారి పారిపోయాను."

ఓ క్షణం ఆగి గ్రేస్ ముఖంలోకి చూసింది.

"ఏం సిస్టర్ విసుగ్గా వుందా ? ఏదేదో వాగుతున్నాను కదూ ?"

"లేదమ్మా ! నీ కథ చెప్పు !"

"చెబుతాను సిస్టర్ ! నా మనసును పుస్తకంలా మీ ముందు తెరుస్తాను."....

* * *

మధ్యాహ్నం భోజనంచేసి రాధ స్కూలుకు బయలుదేరింది.

"రాధా !" వెనకనుంచి తల్లి కేకపెట్టింది. ఆ పిలుపు కొత్తగా వినిపించింది రాధకు. ఆగిపోయి, వెనక్కు తిరిగి చూసింది.

"ఇట్లారా !"

రాధకు చిర్రెత్తుకొచ్చింది. "ఎందుకూ ? స్కూలుకు టైం అయిపోయింది." అన్నది విసుగ్గా.

"ఇట్లా రమ్మంటుంటే ? నీక్కాదూ చెప్పేది !"

"అబ్బబ్బ! ఏమిటే అమ్మా! స్కూలుకు వెళ్ళేటప్పుడు కొంప మునిగిపోయినట్టు...." అంటూ రాధ తల్లి దగ్గరకువచ్చి నిలబడింది.

"దొడ్లోకిరా!" అంటూ తల్లి దొడ్డివైపుకు దారి తీసింది.

రాధకు ఆశ్చర్యం వేసింది. అమ్మ తనతో రహస్యం మాట్లాడబోతుందా? ఏం చెప్పబోతుంది? అత్తయ్య ఏమైనా అన్నదా?

ఆలోచిస్తూ రాధ తల్లి వెనకే దొడ్లోకి వెళ్ళింది.

"వెనక్కు తిరుగు!"

"ఏమిటే నీ గొడవ!"

"తిరగమంటుంటే తిరగవేమే!"

రాధ తల్లి చెప్పినట్టుచేసి, మళ్ళీ తల్లివైపుకు తిరిగింది విసుగ్గా.

"వదినా! వదినా!" అంటూ తల్లి అత్తయ్యను పిలుస్తూవుంటే రాధ అయోమయంగా తల్లి ముఖంలోకి చూసింది.

"ఏం కొంప మునిగిపోయిందమ్మా! అంతగా అరుస్తున్నావ్?" అంటూ సూరమ్మ విసురుగా వచ్చింది.

"కొంపే ముంచింది వదినా. ఇంకా పన్నెండేళ్లుకూడా నిండలేదు. రెండేళ్ళపాటు దిగులు లేదనుకున్నాను." భూమిలోకి కృంగిపోతున్నట్టు అన్నది రాధ తల్లి.

సూరమ్మ రాధను ఎగాదిగా చూసింది. ఎప్పుడు, ఎట్లా



ఏ కొంప ముంచిందో తను, అర్థంకాని రాధ విస్తుబోయి చూసింది తల్లినీ, అత్తనూ మార్చి మార్చి.

"నేను అంటూనే వున్నాగా? పిల్ల ఏపుగా తోటకూర కాడలా పెరిగిపోతుందని? కరువులో అధికమాసంలా ఇప్పుడు ఇదో ఖర్చు!" అన్నది సూరమ్మ మూతి తిప్పుతూ.

రాధ తల్లి ముఖం ముడుచుకుంది.

"పొలం కబురుపెట్టాలి ఆయనకు, తాటాకులు కొట్టించుకురమ్మని" అన్నది సూరమ్మ.

"ఆ పుస్తకాలు ఇక్కడపెట్టి ఆ మూల కూర్చోవే!" అన్నది సూరమ్మ రాధతో.

రాధకు లీలగా అర్థం అయింది. గుండె దడ దడలాడింది. కాళ్ళలో వణుకు ప్రారంభం అయింది. ఏదో దిగులు మనసును చుట్టేసింది. దుఃఖం పొర్లుకొచ్చింది.

ఏమైంది? తనకేమైంది? ఇక ఇల్లు కదలకూడదు. స్కూలుకు కూడా పంపించరేమో? వాకిట్లో కూడా నిల్చోకూడదు. మామయ్య పెద్ద కూతురిలా మగవాళ్లు కనిపిస్తే ఇంట్లోకి పారిపోవాలి.

రాధ ఒక్కసారిగా భోరుమంది.

తల్లి పైటకొంగుతో కళ్లు వత్తుకుంది. "ఆయనేవుంటే ఎంత వైభవంగా జరిపించేవారో!" అనుకుంది.

"ఏం చోద్యమమ్మా! ఎందుకా ఏడుపులు? ఆడపుటక పుట్టాక.... సరే పద! పద! కూతురి కెదురుగా కళ్ళొత్తుకుంటూ నిల్చుంటే పనులెలా జరుగుతాయ్!" అంటూ సూరమ్మ ఆదరాబాదరా బయటికి వెళ్ళింది.

దొడ్లో ఓ మూల, మోకాళ్ళమధ్య తల ఇరికించుకొని ఏడుస్తూ కూర్చున్న రాధను ఇరుగు పొరుగు అమ్మలక్కలు వచ్చి చూసి పోతున్నారు.

"రాధ వదినా! ఏడుస్తున్నావెందుకూ! ఎంచక్కా చీర కట్టుకొని...."

మామయ్య రెండో కూతురు కాంతం మాటలకు రాధ చివ్వున తలెత్తి చూసింది.

"ఛీ! ఫో ఇక్కడనుంచి." కసురుకుంది.

"చూడవే అమ్మా!" అంటూ కాంతం అక్కడినుంచి పరుగుతీసింది.

మరో గంటకు రాధచేత కొత్త చీరకట్టించి తాటాకుల మీద కూర్చోబెట్టారు. ముందు కొత్తచీర కట్టుకోననీ, తాటాకులమీద కూర్చోననీ మొరాయించింది.

అందరూ తిట్టారు. తల్లి కొట్టడానికికూడా సిద్ధపడింది. పక్కింటి రాజమ్మ రాధ తల్లి చేతిలో కర్ర లాక్కుంది.

"ఏమిటమ్మా! నీకు మతిపోయిందా? ఏదో చిన్న పిల్ల! సర్ది చెప్పుకోవాలి. కాని ఇట్లాంటప్పుడు కొట్టుకుంటారా?" మందలించింది రాజమ్మ.

"ఏమిటోనమ్మా! ఇదంతా నా దురదృష్టం! ఇది అందరి ఆడపిల్లల్లా వుండకూడదూ?" తల్లి భోరున ఏడ్చింది.

చివరికి రాధకు కొత్త చీర కట్టుకుని, పచ్చి తాటాకుల మీద కూర్చోకుండా తప్పలేదు. అవమానం, సిగ్గూ క్రుంగదీస్తున్నాయి. తల వంచుకొని కన్నీరు కారుస్తూ కూర్చుంది. ప్రతివాళ్ళూ ఏడవకూడదంటూ మందలిస్తున్నారు.



ఒక్కొక్కరే పేరంటాళ్లు వస్తున్నారు. పట్టు చీరెలు బరబర లాడుతున్నాయి. వాళ్లలో వాళ్లు మొరటు సరసాలు ఆడుకుంటున్నారు.

ముత్తైదువులు పాటలు పాడుతూ చిమ్మిడి తొక్కుతున్నారు. మధ్య మధ్య వాకిలిముందు సన్నాయి మేళం వినిపిస్తూ వుంది.

రాధకు ఆ రోకళ్ళు లాక్కుని తిరగేసి ఒక్కొక్కళ్ళనూ బాదాలనిపిస్తోంది. సన్నాయి గొట్టాలు విరిచి పొయిలో పెట్టాలనిపిస్తోంది.

రాధను అనుకోకుండా ఉబ్బి బరువుగా వున్న కను రెప్పల్ని ఎత్తి చూసింది. ఎదురుగా మామయ్య కొడుకు రాధను చూస్తూ నిల్చున్నాడు. రాధకు భూదేవి ఒడిలో తల దాచుకోవాలనిపించింది.

వాడు తనకంటే రెండేళ్ళు పెద్దవాడు. వాడు పెద్దవాడవుతున్నట్టు ఎలాంటి ఆర్భాటం చెయ్యడంలేదు. మూతి మీద సారల్లా మీసాలుకూడా కన్పిస్తున్నాయి. అయినా వాడిలో వస్తున్న మార్పును ఎవరూ ప్రత్యేకంగా ఎత్తి చూపడం లేదు.

కాని ఆడపిల్ల విషయంలో అంత ఆర్భాటం ఎందుకు చేస్తారు? ఇందులో ఇంత అల్లరి చెయ్యాల్సింది, మేళాలు వాయించి పది మందికి చెప్పాల్సింది ఏముందని? ఈ రోజు నుంచి ఆడదాన్ని హద్దుల్లో వుంచాలని చెప్పడానికి పెట్టిన ఆచారమా? మరి ఆడవాళ్ళు బాధపడరేం? పైగా పాటలు

పాడుతున్నారు. పాటలు! ఎంత ఉత్సాహంగా వున్నారో! వాళ్ళందరికెందుకో ఇంత సరదా?

ఆ క్షణంలో రాధ మనసులో మరో ప్రపంచపు తెరలు లేచాయి. ఆ ప్రపంచంలో - సంఘర్షణ, పోరాటం ప్రారంభం అయాయి. రాధ మనసులోని కసి పెరిగి.... పెరిగి మనసంతా ఆక్రమించుకుంది.

కసి.... కసి ఎవరిమీద? ప్రపంచంమీద, సృష్టిమీద. సృష్టికర్తమీద, ప్రతి నిముషం ఆడదాని ప్రత్యేకతను ఎత్తి చూపే సాంఘిక ఆచారాలమీద; తనమీద, ఆ చిన్న హృదయంలో ఒక మహాసాగరం ఘోష పెడ్తోంది.

పోరాడటం, ముఖ్యంగా తనతో తనే పోరాడటం సామాన్య విషయం కాదు. సాహసం, ఆత్మబలం, క్రియాశీలమైన కల్పనాశక్తి వున్న వ్యక్తే పోరాడగలడు. బాహ్య ప్రపంచంతో పోరాడలేనప్పుడు తనతో తనే పోరాటం సాగిస్తాడు. తన సంకల్ప సిద్ధికోసం ముందుకు పయనిస్తాడు. అంతఃకరణ అంగీకరించకపోయినా, అతని బుద్ధికి ఓ చిత్రమైన సంతృప్తి లభిస్తుంది. భూమిమీద బతకడం మానేసి గగన విహారిగా మారిపోతాడు. జీవితంలోని వాస్తవాన్ని అంగీకరించడు. భ్రమల్ని వాస్తవాలుగా చూడటానికి ప్రయత్నిస్తూ, తనదే అయిన మరో ప్రపంచాన్ని కల్పనా బలంతో సృష్టించుకుంటాడు. అలాంటి వ్యక్తి సాధారణ వ్యక్తుల దృష్టిలో ఓ వింత జీవిగా భావించ బడతాడు.

రాధను స్కూలు మాన్పించడానికి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయినై. ఏమైనాసరే చదివితీరతానని పట్టు



పట్టింది. అన్నం తినడం మానేసింది. చివరకు మేనమామ చదివించడానికి నిశ్చయించుకున్నాడు.

ఇప్పుడు రాధ స్కూల్ ఫైనల్ చదువుతోంది. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేదికాదు. ముభావంగా, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కూర్చునేది. రాధ తత్వం చూస్తూంటే తల్లికి భయం పట్టుకుంది.

రాధకు సంబంధాలు వస్తున్నాయి. పెళ్ళి చేసుకోననీ, అలా చేస్తే బావిలో పడి చస్తాననీ బెదిరించేది.

"పెళ్ళి చేసుకోక ఏం చేస్తావే" ఒకరోజు రాధ మేనమామ అడిగాడు.

తల్లి దిగులుగా గోడకు చేరబడి కూర్చుంది.

"ఉద్యోగం చేస్తాను" ఠక్కున జవాబిచ్చింది రాధ.

"ఇంకేం వదినా! దిగులెందుకూ? నీ కూతురు ఊళ్లేలబోతుంటేనూ!" వ్యంగ్యంగా అన్నది సూరమ్మ.

"చూస్తూ వుండు ఊళ్లు ఏల్తానో లేదో!"

"ఆ తర్వాతైనా చేసుకోవాలిగా!" మేనమామ అడిగాడు.

"ఆ తర్వాత సంగతి నేను చూసుకుంటాను. చదువు పూర్తికాగానే ఉద్యోగంలో చేర్తాను" అన్నది రాధ.

"పోనియ్ లే అన్నయ్యా! దాని ఇష్టప్రకారమే కానియ్!" అంది రాధ తల్లి.

ఆ రోజు మొదటిసారిగా రాధ మనసులో తల్లి అంటే ఎనలేని గౌరవం ఏర్పడింది.

రాధ ఒంటరిగా కూర్చుని గంటలకొద్దీ ఆలోచించేది.

జీవితం అంటే ఏమిటి? ఈ జీవితానికి పరమార్థం ఏమిటి? పెళ్ళి చేసుకొని పిల్లల్ని కనడం, వాళ్ళను పెంచడం, భర్తకు సేవలుచేసి నలుగురిచేతా పతివ్రతగా సర్టిఫికెట్ పుచ్చుకోవడమేనా? పెళ్ళిచేసుకోవడం....పిల్లల్ని కనడం.... ఆ పిల్లలకు పిల్లలు - వాళ్ళను పెంచడం.... మళ్ళీ వాళ్ళకు పెళ్ళిళ్ళు....పిల్లలు ఇదేనా జీవితం?

మొగవాడు.... అదే భర్త.... పెత్తనం చేస్తాడు. ఆడది- భార్య- మొగుడిచేత దెబ్బలుతింటూ "ఆడబ్రతుకే మధురం" అంటూ పాటలు పాడుకుంటూ బ్రతుకుతుంది.

తను అలా బ్రతకలేదు. తను అమ్మా, అమ్మమ్మల జీవితం గడపలేదు. పొద్దస్తమానం ఇంటిచాకిరి చేస్తూ అత్త ఆరళ్ళూ, ఆడబిడ్డ దెప్పిళ్లూ, భర్త సతాయింపు భరించలేదు.

ఇంతకంటే స్త్రీకి సమాజంలో వేరే స్థానంలేదా? ఇంకేమీ చెయ్యలేదా? ఈ పనులన్నీ తన అమ్మమ్మా, అమ్మా నూటికి తొంభయ్ తొమ్మిదిమంది ఆడవాళ్ళు చేస్తూనే వున్నారు.

తను ఏదో చెయ్యాలి. ఏదో కావాలి. ఏదో ప్రత్యేకతను పొందాలి.

తన మనసు ఎప్పుడూ ఎందుకు దిగులుగా వుంటుంది! ఈ దిగులూ, బాధా, తనలో ఎప్పుడు ప్రవేశించాయి? తనకు ఊహ తెలిసినప్పటి నుంచీ.... కాదు.... తన జన్మనుంచీ.... కాదు.... తన తల్లి జన్మనుంచీ.... కాదు....కాదు.... ఆడది జన్మించినప్పటినుంచీ....



ఇలాంటి ఆలోచనలతో సతమతమైపోతూ మనసు మరీ భారంగా వున్నప్పుడు రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చేది రాధ.

.... .... .... .... .... .... .... ....

"సిస్టర్!"

"ఏం రాధా!"

"నా ఆలోచనలూ, ప్రవర్తనా మీకు చిత్రంగా తోస్తున్నాయ్ కదూ!"

"లేదమ్మా!"

"చలేస్తుంది సిస్టర్."

గ్రేస్ లేచివెళ్ళి ఫాన్ తగ్గించింది. రాధపైన దుప్పటి సర్దింది.

## 6

"రాధా!" గ్రేస్ రాధచేతి నాడిచూస్తూ పిల్చింది.

రాధ అతి బలవంతంగా కళ్లు తెరిచింది.

"ఎలా వుందమ్మా!"

"బాగానే వుంది సిస్టర్. నిద్ర వస్తోంది. ఇంతవరకూ నిద్రతో పెనుగులాడాను. కాని ఇక శక్తి లేదేమో అని పిస్తుంది."

"నిద్రపో రాధా! కాస్త విశ్రాంతి తీసుకుంటే మళ్ళీ కొంచెం శక్తి వస్తుంది."

గడియారంలో గంటలు వినిపిస్తున్నాయి. రాధ లెక్క పెట్టింది.

"మూడు అయింది. ఇక నిద్రపోను. సమయంలేదు. నాకథ పూర్తిగా నీకు వినిపిస్తేగాని హాయిగా పక్షి గూడు వదల్లేదు."

గ్రేస్ రాధ నుదురుమీద తన అరచెయ్యి ఆనించింది.

"ఎంత చల్లగా వుంది సిస్టర్ మీచెయ్యి మీ మనసు లాగే!" అన్నది రాధ.

"ఒకరోజు ఏం జరిగిందో తెలుసా........"

.... .... .... .... .... .... ....

రాధ స్కూలునుంచి వస్తోంది. సుబ్బారాయుడి ఇంటి ముందు జనం మూగివున్నారు. ఒక స్త్రీ గుండెలు అలిసిపోయేలా ఏడుస్తోంది.

రాధ ముందుకు అడుగు వెయ్యలేకపోయింది.

స్థాణువులా నిలబడిపోయింది.

"ఛా పాడుముండా! నీముఖం నాకు చూపించకు! మళ్లీ ఈ దరిదాపుల్లో కన్పించావా తన్ని పాతేస్తాను.... ఛో లంజా....!" సుబ్బారాయుడు భార్య జుట్టు పట్టుకొని బరబరా నడిరోడ్డుమీద ఈడుస్తూ తిడుతున్నాడు.

"యేమండీ! నామాట నమ్మండీ! నా బిడ్డలమీద ప్రమాణంచేసి చెబుతున్నానండీ!" సుబ్బారాయుడి భార్య భర్త కాళ్ళకు చుట్టుకుంది.

కాళ్ళు వదిలించి ఎడంకాలితో డొక్కలో తన్నాడు సుబ్బారాయుడు.

ఈ ఆడవాళ్ళకు బుద్ధిలేదు. తంతున్నా మగవాడి కాళ్ళకు చుట్టుకుంటారు. అందుకే వాళ్ళు తంతారు! నీలాంటి



మగవాడితో.... భార్యను అనుమానించేవాడితో .... ఆడదాన్ని గౌరవించడం చేతగానివాడితో నేను కాపురం చెయ్యనని ఆవిడే వెళ్ళిపోతే ఎంత బాగుంటుంది! ఆడవాళ్లు తిరగబడిన రోజు మగవాడి ఆటలు కట్టవూ!

కాని....ఎక్కడకు వెళ్తుంది? వెళ్ళి ఎలా బ్రతుకుతుంది? ఈ సమాజం ఆడదానికోసం ఏం రక్షణాలు కల్పించింది? ఆలోచిస్తూ నిలబడిపోయింది రాధ.

జనంలో ఎక్కువమంది వింతచూస్తూ ఆనందిస్తున్నారు. కొందరు గుసగుస లాడుతున్నారు. కాని ఒక్కరూ ఆ నిస్సహాయురాలిమీద సానుభూతి చూపటంలేదు.

సుబ్బారాయుడు జారిపోతున్న పంచను పట్టుకుంటూ లోపలకు వెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

సుబ్బారాయుడి భార్య "యేమండీ! యేమండీ!" అంటూ తలుపుకు తల బాదుకుంటూ ఏడుస్తూంది.

కొందరు వెళ్ళిపోయారు. కొందరు ఆ వింత చూస్తూ ఇంకా నిలబడే వున్నారు.

రాధ ముందుకు కదిలింది దిగులుగా. ఆ ఊళ్ళో అలాంటి దృశ్యాలు చిన్నప్పటినుంచీ ఎన్నో చూసింది.

ఎప్పుడూ మగవాడు ఆడదాన్ని కొట్టి బయటికి నెట్టి తలుపులు మూసుకోవడమే చూసింది తను. కాని ఆడది మగవాణ్ణి బయటికి నెట్టి తలుపులు వేసుకోవడం ఎప్పుడూ చూళ్ళేదు. ఎందువల్ల? కారణం ఏమిటి? కారణం ఇల్లు మగవాడిది కావడమే. ఆడదానికి తనదంటూ ఇల్లు లేకపోవ

డమే ? ఆడదానికికూడా ఇల్లు వుండాలనీ, ఆ ఇంటిమీద హక్కు వుండాలనీ ఎప్పుడూ ఎవరూ ఆలోచించకపోవడమే. చిన్నతనంలో తండ్రి ఇంటిని తన ఇల్లు అనుకుంటుంది. కాని అది వట్టి భ్రమేనని కొంతకాలం తర్వాత తెలుసుకుంటుంది. తల్లి దండ్రులు పెళ్ళిచేసి తమ ఇంటినుంచి మరో ఇంటికి పంపించి రిలీఫ్‌గా నిట్టూర్పు విడుస్తారు. తనది కాని ఆ పరాయి ఇంటిని, కాలుపెట్టిన మరుక్షణం నుంచి తన ఇల్లేనని భ్రమ పడుతుంది. ఎన్నో మమతల్నీ, మమకారాల్నీ పెంచుకుంటుంది. ఆ ఇంటి యజమానికి ఆమె నచ్చకపోతే ఆమెను బయటికి పంపించి మరో ఆడదాన్ని తెచ్చుకుంటాడు - భార్య ప్రవర్తనమీద అనుమానం కలిగితే బయటికినెట్టి తలుపులు మూసుకుంటాడు. భర్త ప్రవర్తన బాగాలేదని రూఢిగా తెలిసినా భార్య ఏమీ చెయ్యలేదు. బయటికి నెట్టలేదు, ఏడుస్తుంది. తనకు అన్యాయం చెయ్యవద్దని కాళ్లు పట్టుకుంటుంది. చివరకు "కర్మ !" అనుకొని నోరుమూసుకొని పడివుంటుంది.

రాధ కళ్ళలో ఎన్నో జన్మల కన్నీరు వుబికింది.

.... .... .... .... ....

"సిస్టర్ నాలుక పిడచకట్టుకుపోతుంది. ఎందుకో ఇంత దాహం !"

గ్రేస్ గ్లూకోజ్‌వాటర్ స్పూన్‌తో పోసింది. ఈసారి రాధ సరిగా మింగలేకపోయింది. అతి కష్టంమీద ఒకస్పూన్ నీళ్ళు గొంతులోకి పోయాయి.



# 7

"విసుగ్గా వుందా సిస్టర్ ?"

"లేదమ్మా !"

"మీ నిద్రకూడా చెడగొడుతున్నాను కదూ ?"

"లేదు.... లేదు.... నీ కిలావుంటే నాకు నిద్ర ఎలా వస్తుంది. అయినా మాకు అలవాటే గదా ?"

"అయితే వినండి సిస్టర్ ...."

.... .... .... .... .... ....

రాధ తనలో నిరంతరం చెలరేగుతున్న అశాంతిని భరించలేక పిచ్చిగా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంది.

ఎదురింట్లో వుండే నాయుళ్ల అబ్బాయి రంగారావు లైబ్రరీనుండి పుస్తకాలు తెచ్చి రాధకు ఇస్తూ వుండేవాడు. చిన్నప్పటినుంచి రంగారావు ఆ ఇంట్లో అరమరికలు లేకుండా తిరుగుతూ వుండేవాడు. రాధ అతన్ని ఇంట్లో వ్యక్తిగానే చూసేది. అతనితో మాట్లాడుతూవుంటే ఎవరూ అడ్డు చెప్పలేదు.

ఆ రోజు రంగారావు శరత్ బడదీదీతోపాటు ఒక ఎక్సర్ సైజు పుస్తకంకూడా ఇచ్చాడు. ఆ పుస్తకాలు అందిస్తున్నప్పుడు రంగారావు చేతులు వణకడం రాధ గమనించింది.

రాధ ఆశ్చర్యంగా రంగారావు ముఖంలోకి చూసింది. ముఖంలో గాబరా, కళ్ళలో బెదురు కన్పించాయి.

"ఇదేమిటి ?" అడిగింది ఎక్సర్‌సైజు పుస్తకం చూపిస్తూ.

"చదువు!" అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

రంగారావు ప్రవర్తన వింతగా తోచింది రాధకు. అతను వెళ్ళినవైపే ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుంది.

రాధ పుస్తకం తెరిచింది. అక్షరాలు ముత్యాల్లా గుండ్రంగా అందంగా వున్నాయి. పద్యాలు వ్రాసివున్నాయి. రంగారావు కవిత్వం రాస్తాడని తెలియని రాధ ఓ క్షణం ఆశ్చర్యంగా పద్యాలకేసి చూస్తూ వుండిపోయింది.

పాపం! అందుకే కాబోలు అంత గాభరా పడిపోయాడు. పిచ్చివాడు చెప్పొచ్చుగా పద్యాలు రాశాను చదివి అభిప్రాయం చెప్పమని?

రాధ కుతూహలంగా పద్యాలు చదవసాగింది. కొన్ని పద్యాలలో ఒక అమ్మాయి అందచందాల వర్ణన. ఆ తర్వాత ఆత్మనివేదన ....కౌగిలింతలు.... ముద్దులు.... ఏమేమో.... రాధకు ఏదో అనుమానం కలిగింది. పుస్తకం పూర్తి చేసేప్పటికి అనుమానం ధృఢపడింది.

ఆ పద్యాలు తనను గురించే వ్రాశాడు. తనను ప్రేమిస్తున్నాడట. తన కళ్ళనూ పెదవుల్నీ, ఇంకా ఏమేమో వర్ణించాడు.

రాధ మనసంతా జుగుప్సతో నిండిపోయింది. శరీరం కోపంతో వణికిపోయింది. మరోవైపు దుఃఖం వస్తోంది. తనను అతను అవమానించినట్టు బాధపడుతోంది.

ఛీ! ఎంత అపహ్యం? ఎంత ధైర్యం? బండ వెధవ. ఆ రూపం.... వాడూ.... తనను ప్రేమిస్తున్నాడట. తను ప్రేమ స్వీకరించకపోతే ఆత్మహత్యే శరణ్యమట. బెదిరిస్తున్నాడు.



కవిత్వంలో పడ్డాడు. వయసులో వున్న ఆడపిల్ల కొంచెం చనువుగా వుంటే చాలు ప్రేమించెయ్యడమే? పైగా అతడి ప్రేమను తను తిరస్కరించదనే ఆశిస్తున్నాడట! ఎందుకనో! ఆ మాత్రం మొగవాడు తనకు మరొకడు దొరకడనా? తను అటువంటి భావం ఎప్పుడైనా వ్యక్తం చేసిందా?

చేతిలోని పుస్తకం అడ్డంగా, నిలువుగా కసిగా చింపింది.

తల్లి వంట చేస్తూవుంటే ఆ కాగితాలు తీసుకెళ్ళి పొయిలో వేసింది.

రాధ తల్లి అనుమానంగా కూతురి ముఖంలోకి చూసింది. రాధ మనస్సు చివుక్కుమంది.

"ఏమిటే ఆ కాగితాలూ? ఎందుకు పొయిలో వేశావ్?" తల్లి కంఠంలో ఏదో అనుమానం పలికింది.

రాధ మనస్సు కలుక్కుమంది. వయసువచ్చిన ఆడపిల్ల ఏ పని చేసినా అనుమానంగానే చూస్తారు. చివరకు కన్నతల్లి కూడా. అదే మగపిల్లవాడైతే పట్టించుకోరు.

తల్లి ప్రశ్నకు జవాబివ్వకుండా రాధ గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. ఆ రాత్రంతా రాధ కలత నిద్రతోనే గడిపింది. తన ఆడతనాన్ని....తనే ఏవగించుకో సాగింది. తనే మగవాడై పుట్టివుంటే ఇంత వ్యధకు గురి కావాల్సి వచ్చేదా?

రెండో రోజు రాధ వసారాలో అరుగుమీద కూర్చొని

పుస్తకం చదువుకుంటూవుంది. రంగారావు వచ్చినట్లు గమనించలేదు.

"రాధా!" ఎన్నడూలేని చనువు ఆ కంఠంలో మ్రోగింది.

రాధ చివ్వున తలెత్తిచూసింది. రంగారావును చూడగానే తోకతొక్కిన నాగినిలా చివ్వున లేచి నిల్చుంది.

"ఏం? ఎందుకొచ్చావ్?" దాదాపు అరచినట్లే అడిగింది.

రంగారావు రాధ రూపంచూసి తడబడ్డాడు. "ఆ.... అదే....నా కవిత్వం.... చదివావా?"

"ఆ చదివాను. నీ ముఖంలాగే వుంది. పొయ్యిలో పడేశాను. మళ్ళీ అటువంటి పిచ్చిరాతలు రాశావంటే చూడు ఏం చేస్తానో! మళ్ళీ నాతో మాట్లాడకు" అని విసురుగా రాధ లోపలకు వెళ్ళిపోయింది.

ఆనాటి నుంచీ రాధ రంగారావు నీడను కూడా భరించలేక పోయేది. అతని రూపాన్ని గురించి ఏనాడూ ఆలోచించని రాధకు, ఒకసారి గున్న ఏనుగులా, మరోసారి ముళ్ళ పందిలా, ఇంకా ఎలాగో ఎలాగో కన్పించేవాడు. అతనంటే అసహ్యం తనమీద తనకే అసహ్యం.

రాధ స్కూలు నుంచి ఆలోచిస్తూ వస్తోంది. సుబ్బారాయుడు అరక తోలుకొని పొలం నుంచి వస్తూ ఎదురైనాడు.

"ఏమే రాధీ! మాటాడ్డం మానేశావ్! పెద్దదాని

K85



వయావ్! నన్ను పెళ్ళి చేసుకుంటావా?" సరదాగా అడిగాడు సుబ్బారాయుడు.

రాధ కోపంగా ముందుకు నడిచింది. ఒక ఎద్దును వదిలి, దానికి బదులుగా సుబ్బారాయుణ్ణి ఆ అరకకు కట్టి చెర్నాకోలతో కొట్టాలనీ, ముళ్ళ కర్రతో పొడవాలనీ అనిపించింది.

ఈ పల్లెటూరి వాళ్ళకు ఇదో జబ్బు! వయసులో వున్న ఆడపిల్లలు కన్పిస్తే చాలు మొరటు సరసాలు ప్రారంభిస్తారు. ఆ సరసాలుకు ఆడపిల్లలు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూంటే చూసి సరదా పడ్తారు. అటువంటి మాటలు వింటూంటే తనకు సిగ్గువెయ్యదు. అసహ్యం వేస్తుంది. ఎంతసేపూ ఆడా, మగా, పెళ్ళీ, పిల్లలూ పేరే. ఆలోచనలే రావు వీళ్ళకు.

"ఏమే పిల్లా పప్పన్నం ఎప్పుడు పెడ్తావ్?"

"ఒసేయ్ రాధీ ఎక్కడికైనా లేచిపోదామా? నా పెళ్ళాం ముసల్ది అయిపోయింది."

"ఎందుకే అంత కోపం! నాకంటే మంచి మొగుడు ఎవడొస్తాడో చూస్తాగా!"

రకరకాల మాటలు. రోజూ ఎవరో ఒకరు అంటూనే వుంటారు. పెద్దవాళ్ళ ముందు కూడా అంటారు. వాళ్ళు ప్రత్యేకంగా ఏదో ఉద్దేశ్యంతో అనరు. అదో సరదా!

"నీకంటే మంచి మొగుడు ఎక్కడ దొరుకుతాడు! నీకు పెళ్ళయి పోయింది. లేకపోతే నీకే ఇచ్చేదాన్ని," అంటుంది అమ్మ ఆ సరసాలకు సరదా పడుతూ,

రాధకు ఆ మనుష్యుల మధ్య ఊపిరి సలపడం లేదు. ఎక్కడికైనా, ఇలాంటి మనుష్యులు లేని చోటుకు, ఆడదాని ఆడతనాన్ని ప్రతినిత్యం ఎత్తి చూపించని మనుష్యుల మధ్యకు పారిపోవాలనిపించేది. అలా చెయ్యలేదు కనకా.... అటువంటి మనుష్యులు ఎక్కడ వుంటారో తెలియకా.... అసలు వుంటారో లేదో ననే సందేహంతో....రాధ తనకు కావాల్సిన ప్రపంచాన్ని తనలోనే నిర్మించుకుంది.

ఆ ప్రపంచంలో మనుష్యులు ఇంత మొరటుగా వుండరు. ప్రతి నిముషం తనను 'ఆడది' అంటూ ప్రత్యేకంగా చూడరు. అందరూ కలిసి మెలిసి వుంటారు. వాళ్లు ఎప్పుడూ పెద్దది కావడం.... పెళ్ళి.... ప్రేమా... పిల్లలుగురించిమాత్రమే ఆలోచించరు.

ఒకరోజు రాధ కమల ఇంటికి వెళ్ళి ఇంగ్లీషు నోట్స్ తీసుకొని వస్తూవుంది. రోడ్డుమీద ఊళ్ళో పెద్దలు నలుగురు వస్తున్నారు. వాళ్ళను చూసి రాధకు కొంచెం ముందుగా నడుస్తున్న రత్తమ్మ, ఏభై యేళ్ళు పడి నడుస్తున్న వింతంతవు రత్తమ్మ....మనమల్నీ, మనమరాళ్లనూ ఎత్తుకున్న రత్తమ్మ... ఒక్కసారిగా రోడ్డు దిగి గోడకు ఆనుకొని ముఖం గోడ వైపుకు తిప్పుకొని నిల్చుంది.

అది చూసిన రాధకు వళ్లు మండిపోయింది. తను మాత్రం మామూలుగా రోడ్డుమీద వాళ్లు ఎదురుపడినా తొణక్కుండా దాటిపోయింది.

మగవాళ్ళు దాటిపోగానే రత్తమ్మ సుడిగాలిలా రోడ్డుమీదకు వచ్చి రాధను పిల్చింది.



రాధ నిలబడింది. రత్తమ్మ దగ్గరకు వచ్చిన రాధను ఎగాదిగా చూసింది.

"ఏమే! వయసొచ్చిన పిల్లవు. మగవాళ్లు వస్తుంటే వాళ్ళకు ఎదురుగా బడెతలా నడిరోడ్డుమీద నడుస్తావా? బొత్తిగా భయం భక్తీ లేకుండా బరితెగించావ్. పద మీ అమ్మకు చెప్తాను. బొత్తిగా సిగ్గులేకుండానా? ఆడదానివి కాదూ?"

రాధకు వళ్లు మండిపోయింది.

"సిగ్గెందుకూ! నేనేం తప్పు చేసానని సిగ్గుపడాలి? ఆడదాన్నయితే? మగవాళ్ళను చూసి ఎందుకు గోడలమీద పడిపోవాలి! ఆడది రోడ్డుమీద తనదారిన తను పోకూడదా? మగవాడికి మాత్రమే తలెత్తుకు నడిచే అధికారం వుందా? ఆడది ఎందుకు తలవంచుకొని నడవాలి?" ఆవేశంగా అన్నది రాధ.

రత్తమ్మ నోరు తెరిచి రాధను చూస్తూ వుండిపోయింది.

రాధకు వెనకనుంచి "పిదపకాలం పిదప బుద్ధులు! బొత్తిగా బరితెగించింది!" రత్తమ్మ మాటలు విన్పించాయి.

రాధ మనసు రోషంతో భగభగా లాడిపోయింది.

.... .... .... .... .... .... .... ....

## 8

రాధ ఉలిక్కిపడింది.

గ్రేస్ ఆమె పొదివి పట్టుకుంది.

"భయపడ్డావా రాధా !" జాలిగా అడిగింది గ్రేస్.

"ఆ శబ్దం ఏమిటి సిస్టర్ ?" నీరసంగా అడిగింది రాధ.

వర్షం పడుతోంది. దూరంగా ఎక్కడో పిడుగు పడ్డట్టుంది."

అంతలో కళ్ళు జిగేల్‌మనేలా మెరుపు మెరిసింది. రాధ కళ్ళు మూసుకుంది.

"సిస్టర్ నా ప్రశ్నకు సమాధానం దొరికింది," అన్నది రాధ కళ్ళు మూసుకునే.

"ఏమిటమ్మా అది ?"

"జీవితం అంటే ఏమిటి ? అనే ప్రశ్న నాకు ఊహ తెలిసినప్పటినుంచీ నన్ను వేధించింది. ఎంతో ఆలోచించాను. కాని నాకు సరైన సమాధానం దొరకలేదు. ఇప్పుడు దొరికింది. ఆ మెరుపు నాకు సమాధానం ఇచ్చింది. ఎన్నోసార్లు మెరవడం చూశాను. కాని ఇవ్వాళే నాకు సమాధానం దొరికింది."

గ్రేస్ రాధ ముఖంలోకి చూస్తూ వుండిపోయింది.

"వినాలని లేదా సిస్టర్ ?" బరువుగావున్న రెప్పల్ని బలవంతంగా తెరుస్తూ అడిగింది రాధ.

"చెప్పు రాధా వింటాను."

"జీవితం, అనంతమూ, స్థిరమూ, జడమూ అయిన మహామృత్యువునుంచి విడివడిన క్షణికమూ, చంచలమూ అయిన ఒక మెరుపులాంటి చైతన్యం మాత్రమే. జీవితాన్ని మళ్ళీ అదే జడత్వం చుట్టివేస్తుంది."

గ్రేస్ రాధ చేతిని గట్టిగా పట్టుకుంది.



"ఏం సిస్టర్ ! ఈ భావన చాలా భయంగా వుందా ?"

గ్రేస్ సమాధానం ఇవ్వలేదు.

"అదే సత్యంనుంచి పారిపోవడానికి పయత్నించడం కేవలం మూర్ఖత్వం మాత్రమే సిస్టర్ !"

ప్లీజ్ రాధా ! అట్లా మాట్లాడకు !" గ్రేస్ కంఠం వణికింది.

"భయం వేస్తుందా సిస్టర్ ?"

"నీకు భయంలేదా రాధా ?"

"లేదు సిస్టర్ ! జీవితంలో నేను ఒకేఒక భావనకు భయపడ్డాను."

"ఏమిటది ?"

"ప్రేమ భావన !"

"ఎందుకని ?"

"ఆడదాన్ని బలహీనురాల్నిగా చేసేది ప్రేమభావన. అది ఆమెకు దుఃఖాన్నే ఇస్తుంది. అందుకే నన్ను ఆ దుఃఖం నుంచి దూరంగా వుంచుకోవడానికి ప్రయత్నించాను."

"నీ అభిప్రాయాలు చాలా చిత్రంగా వున్నాయి" అన్నది గ్రేస్.

"అవును సిస్టర్ ! చాలా చిత్రంగానే వుంటాయి. నా స్వభావమే చాలా చిత్రంగా తయారైంది. చిన్నప్పటినుంచి 'ఆడది' అనే పదాన్ని అసహ్యించుకున్నాను. కారణం 'ఆడది' అంటూ సమాజం ఆమెను ప్రత్యేకంగా చూడడమే. నేను మామూలు ఆడదాన్ని కాకూడదనుకున్నాను. ప్రేమించడం మామూలు ఆడవాళ్ళలో వుండే బలహీనత అని

భావించాను. దానికి దూరంగావుండి అంటే అలాంటి బలహీనతను నాలో చొరకుండా జాగ్రత్త పడి నేను నా ప్రత్యేకతను నిలబెట్టుకోవా లనుకున్నాను" రాధ ఓ క్షణం మౌనంగా వుండిపోయింది.

గ్రేస్ రాధ ముఖంలోకి చూస్తూ "నువ్వు ఆ బలహీనతకు గురికాలేదా జీవితంలో ?" ఆశ్చర్యంగా అడిగింది.

రాధ విషాదంగా నవ్వింది.

"ఒకప్పుడు దాన్ని బలహీనతగానే భావించాను. ఆ బలహీనతే ఆడదానికి శాపంగా పరిణమిస్తుందనుకున్నాను. కాని అది సహజమైన భావన, ఆరోగ్యకరమైన మనస్సులో ప్రవేశించే భావన అని ఆలస్యంగా అర్థం చేసుకున్నాను" అంటూ ఆగి సన్నగా నిట్టూర్చింది రాధ.

గ్రేస్ రాధ చేతిని గోముగా నిమిరింది.

"సకల మేఘమాలను చూసి మయూరం నృత్యం చేస్తుంది. వసంత గమనవేళ కోకిల కంఠం విచ్చుకుంటుంది. దినకరుని అరుణ కిరణ స్పర్శకు కమలం తన హృదయాన్ని విప్పుతుంది. వీణా మధురగానం విని తురంగం తనకు తానై మృత్యు దేవతను కౌగలించుకుంటుంది. శలభం తన హృదయావేదనను వినిపించుకోనే శక్తి లేక మౌనంగా దీనకళికకు తనకు తానై ఆహుతి అవుతుంది. ఎందుకు సిస్టర్ !" రాధ మాటలు తనకు తనే చెప్పుకుంటున్నట్టు వున్నాయి.

గ్రేస్ సమాధానం చెప్పలేదు.

"ఈ సమస్త సృష్టీ ప్రేమ సూత్రంలో బంధించిబడి వుంది. ఈ సృష్టిలో నేను ఒక మనిషిని. మనస్సున్న మనిషిని.



అందుకే ఒకనాడు నేనూ ఈ సృష్టి నియమానికి లోబడిపోయాను."

"నువ్వు కవయిత్రివా రాధా ?"

"ఏం సిస్టర్ అలా అడిగారు ?"

"నీ మాటలు వింటూంటే కవిత్వం వింటున్నట్టే వుంది. నువ్వు కళాకారిణివి అయినా అయివుండాలి. లేకపోతే ఇటువంటి భావాలు రావు" అన్నది గ్రేస్.

రాధ నీరసంగా నవ్వింది.

"నేను కవయిత్రిని కాదు. నే నెప్పుడూ కవిత్వం రాయలేదు. కాని జీవితాన్ని లోతుగా చూసి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. జీవితమే కళకు ఉద్గమ స్థానం. అది సరస్సు. జీవితమూ, కళా, ఆదినుంచీ ఒకదాన్ని ఒకటి పెనవేసుకుంటూనే వచ్చాయి. మన భావనల బాహ్య అభివ్యక్తే కళ. మన స్వప్నాల సజీవ చిత్రణమే కావ్యం. ఈ సూక్ష్మ తంతువును ఆధారం చేసుకుని మనం ఆత్మయొక్క లోతులను చూడగలిగినప్పుడే ఈ సృష్టిలోని అపార సౌందర్యాన్ని చూడ గలుగుతాం ! ఆ మధుర సింధుయొక్క రసపానం చెయ్య గలుగుతాం !"

"మరి ఈ విషాదం ఎందుకు రాధా ? ఆ వ్యక్తి నీ ప్రేమను అంగీకరించ లేదా ?"

"అంగీకరించడం, అంగీకరించక పోవడం అనేది అంతవరకూ నేను రానిస్తే గదా ?"

"అదేమిటి ?

"అవును సిస్టర్ ! నా హృదయంలో ఎవరికీ స్థానం వుండకూడ దనుకున్నాను. కాని మన హృదయం గురించి మనకే సరిగా తెలియదు. ఎందరో నా జీవితంలో ప్రవేశించారు. లోపలనుండి గడియపెట్టివున్న ఇంటి ముందుకువచ్చిన వ్యక్తి ఏం చేస్తాడు ?"

"తలుపులు తడతాడు."

"తలుపులు ఎంతకూ తెరుచుకోకపోతే ?"

"తిరిగి వెళ్ళిపోతాడు."

"అంతే జరిగింది సిస్టర్!"

"ఒక్కసారి కూడా నువ్వు తలుపు తెరవలేదా ? ఎవరి పిలుపూ నిన్ను కదిలించ లేదా !".... ఆశ్చర్యంగా అడిగింది గ్రేస్.

రాధ కొంచెం సేపు మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది. గ్రేస్ ఆమె సమాధానం కోసం, రాధ ముఖంలోకి ఆత్రంగా చూస్తూ కూర్చుంది.

"రాధా ! నిన్ను ఒంటరి తనం బాధించేది కాదా !" గ్రేస్ ప్రశ్నించింది.

"అప్పుడప్పుడు మాత్రం! శీతకాలపు చల్లగాలి శరీరాన్ని కుదిపినట్టు, ఏదో ఆ వేదన నా హృదయాన్ని కుదిపేది. అప్పుడు ఎవరిదో అస్థిత్వం లీలగా నన్ను తాకుతున్నట్టనిపించేది. అది ఒక పురుషుని అస్థిత్వం అని కొంతకాలానికి తెలుసుకున్నాను. ఆ అస్థిత్వాన్ని దూరంగా నెట్టివెయ్యడానికి ప్రయత్నించేదాన్ని. కాని ఒకరోజు అనుకోకుండా, అకస్మాత్తుగా



ఆ అస్థిత్వం, రక్తమాంసాలలో వచ్చి ఎదురుగా నిల్చింది," రాధ చెప్పడం ఆపింది.

"ఆ తర్వాత ?"

"ఇంటరెస్టింగ్‌గావుందా? సిస్టర్!" అదోలా నవ్వుతూ అడిగింది రాధ.

గ్రేస్ సమాధానం చెప్పలేకపోయింది.,

"ఒకరోజు, అకస్మాత్తుగా, అనుకోకుండా ఎవరో నా హృదయ కవాటంమీద సున్నితంగా చెయ్యివేశారు. నేను ఉలిక్కిపడ్డాను. ఆ వచ్చిన వ్యక్తి తలుపు తట్టి 'పిలవాలా' 'లేదా' అనే సందేహంతో నిల్చుండి పోయాడు. నేను ఆత్రంగా ఒక్క పరుగుతో వచ్చి గడియమీద చెయ్యి వేశాను.

"ఆగు" నా వ్యక్తిత్వం నన్ను భయపెట్టింది.

"ఆగకు. ఆలస్యం అయితే....అతను వెళ్ళిపోతాడు." హృదయం హెచ్చరించింది.

"నువ్వు మామూలు ఆడదానివే సుమా ?" నా వ్యక్తిత్వం నన్ను ఎగతాళి చేసింది.

"కాదు.... నేను మామూలు ఆడదాన్ని కాదు. నా బలహీనతను నేను చూపించాను. ఇంతవరకూ వచ్చినవాడు తలుపు తట్టకుండా ఎలా వెళ్తాడు ? పిలవకుండా ఎలా వుండగలడు! పిలవనియ్. అప్పుడే తలుపు తెరుస్తాను. అనుకున్నాను" రాధ ఓ క్షణం మౌనం వహించింది.

గ్రేస్ ఆదుర్దాగా ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చుంది.

రాధ మళ్ళీ చిన్నగా తనకు తనే చెప్పుకుంటున్నట్లు చెప్పసాగింది.

"అంతే ఆగిపోయాను. గడియమీద చెయ్యి వేసే వుంచాను. పిలుపుకోసం నిరీక్షిస్తూ నిల్చున్నాను. అలా ఎంత సేపు.... కాదు. ఎంతకాలం, ఆ పిలుపుకోసం ఆ కంఠం వినాలని చెవులు రిక్కించి నిల్చున్నానో నాకే తెలియదు. అయినా అతను పిలవలేదు. నేను తలుపు తియ్యలేదు. ఏదో నల్లటి నీడ మా ఇద్దరి మధ్య వచ్చి నిల్చింది. అతను వెళ్ళిపోతు న్నట్లు తెలిసింది. నా చెయ్యి గడియను గట్టిగా పట్టుకుంది. అతను వెళ్ళిపోయాడు. మూసిన తలుపుల వెనక నేను భూగోళ మంత వంటరితనంలో నిలబడిపోయాను."

"అసలు ఏం జరిగిందో సరిగా చెప్పమ్మా!" అడిగింది గ్రేస్ జాలిగా.

"అసలు విషయం చెప్పకుండా ఏదో పిచ్చివాగుడు వాగుతున్నాను కదూ సిస్టర్ ?"

"లేదమ్మా !"

"వినండి సిస్టర్ ....

*　*　*

ఆ రోజు స్కూలుఫైనల్ పరీక్షాఫలితాలు వచ్చాయి. రాధ పాసయింది. ఉత్సాహంగా పేపరు తీసుకొని మెల్లా ఇంట్లోకి వచ్చింది.

తల్లీ, మేనమామ సుబ్బారాయుడూ, అత్త సూరమ్మా కూర్చుని వున్నారు. రాధ తల్లి ముఖంలోకి చూసింది.



ఆమె దిగులుగా కన్పించింది. మేనమామ కేసి చూసింది. కనుబొమలు ముడిచి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అత్త వైపు చూసింది. ఆమె టైంబాంబులా కన్పించింది. అక్కడి వాతావరణం పురిపెట్టిన తాడులా వుంది.

"మామయ్యా! నేను పరీక్ష పాసయ్యాను," నీరు కారి పోతూ అన్నది రాధ.

"చదువయిపోయిందిగా! ఇప్పుడైనా పెళ్ళి చేసు కుంటావా ?" మేనత్త అడిగింది.

"చేసుకోను-" ఠక్కున జవాబిచ్చింది రాధ.

"పెళ్ళి చేసుకోక ఏం చేస్తావే? మరీ పెచ్చరిల్లి పోతు న్నావే!" సూరమ్మ వాల్యూం పెంచింది.

"ఉద్యోగం చేస్తాను."

"ఆడపిల్లవి ఉద్యోగం చెయ్యడం ఏమిటే ? మన వంశంలో ఎప్పుడైనా ఆడది గడప దాటిందా ? ఘోషా పద్ధతిని కూడా లక్ష్యపెట్టకుండా, అమ్మా కూతుళ్ళ పోరు పడ లేక బడికి పంపించాను" అన్నాడు సుబ్బారాయుడు.

"అసలు దాన్ని బడికి పంపించడమే తప్పు. ఊళ్ళేలు తుందట ! ఊళ్ళు !" సూరమ్మ ఈసడించింది.

"అవును ఊళ్ళే ఏల్తాను. ఏం రేపు నీకొడుకు ఉద్యోగం చెయ్యడూ ?"

"వాడు మగబిడ్డ ! నువ్వు.... ఆడముండవు...."

"ఆడముండా గీడముండా అనొద్దు చెప్తున్నాను. నేను ఉద్యోగం చేస్తాను. మగవాడు చేస్తే లేని తప్పు ఆడది ఉద్యోగం చేస్తే వస్తుందా? ఏమిటా తప్పు ?"

"ఏవమ్మా వదినా ! కూతురికి నచ్చచెప్పకూడదూ ! చూస్తూంటే కూతురి చేత నీకే ఊళ్లేలించాలని వున్నట్టుంది. ఆడపిల్ల ... చెడిపోతుంది .... జాగ్రత్త.... ఆ తర్వాత తలెత్తుకు బతకలేం !" అన్నది సూరమ్మ.

"ఏమిటి చెడిపోయేది ? ఉద్యోగం చేస్తే, గడప దాటితే ఆడది చెడిపోతుందా? మగవాడు చెడిపోడా ? ఏం ఆడది, కాయకూరలా లేక మిఠాయీ చెడిపోవడానికీ, బూజు పట్టటానికి?" రాధ గట్టిగా అన్నది.

"రాధా !" తల్లి రాధను కసిరింది.

"ఇది ఇప్పుడే ఇట్లా తయారైంది. ఇంకా నాలుగు రోజులు పోతే మనమాట వింటుంధా? కాళ్లు విరగ్గొట్టి మూల పడేసి, ఆ మూడుముళ్ళూ వేయిస్తేగాని అదుపులోకి రాదు." సుబ్బారాయుడు కోపంగా అన్నాడు.

"మంచి సంబంధం చూడు అన్నయ్యా ! చిన్న పిల్ల! ఏదేదో వాగుతుంది! దాని మాటలకేంలే ?" అన్నది రాధ తల్లి.

"బసవయ్య కబురుపెట్టాడు. కోట్టుకుపోయినంత ఆస్తి వుంది. పిల్ల సుఖపడుతుంది."

రాధ చివ్వున తలెత్తి అత్త ముఖంలోకి చూసింది.

రాధ తల్లి ఉలిక్కిపడింది.

"అవునమ్మా ! అతను రోజూ కబురు చేస్తున్నాడు. ఏ విషయం తేల్చి చెప్పమంటున్నాడు," చుట్ట పొగ గుప్పు గుప్పున వదులుతూ అన్నాడు సుబ్బారాయుడు చెల్లెలితో,



"అన్నయ్యా! మూడో పెళ్ళివాడికి రాధ నివ్వమంటావా ?"

రాధ కోపంతో బుసలు కొడుతుంది. కళ్ళముందు బసవయ్య రూపం కదిలింది. బట్టతలా, నల్లగా పోతపోసిన నట్టుండే విగ్రహం, మోకాళ్ళమీదకు మడిచి బొడ్డు కిందకు కట్టిన ధోవతి, పైన చొక్కా లేకుండా ఉత్తరీయం కిందగా కన్పించే పెద్ద బొజ్జ....

"ఎన్నో పెళ్ళయితేనేం ? రెండో పెళ్లాం ఏడాది తిరక్కుండానే చచ్చిపోయింది. ఏమంత వయసు మీరిపోయిందని ?"

రాధ కళ్ళకు మేనత్త పెద్ద కొండశిలువలాగ కన్పించింది.

"వయసు లేకపోవడం ఏమిటి వదినా ? నాకంటే చాలా పెద్దవాడు" అన్నది రాధ తల్లి దిగులుగా.

"నీది మరీ చోద్యమమ్మా మగవాడికి వయస్సేమిటి?" అన్నది సూరమ్మ.

"మగవాడు.... మగవాడు...." కసిగా మనసులోనే అనుకుంది రాధ.

"అదికాదు వదినా ! రెండో భార్య హైమవతి భర్త పెట్టే బాధలు పడలేక, గన్నేరుపప్పు తిని చచ్చిపోయిందని ఊరంతా అగుబ్బుగా చెప్పుకున్నారు గదా ? అటువంటి దుర్మార్గుడికి రాధను...." ఆపైన రాధ తల్లి మాట్లాడలేకపోయింది.

పిచ్చి అమ్మ ! అప్పుడే తన పెళ్ళి ఆ బసవయ్యతో

జరిగిపోయినట్టే బాధ పడుతోంది. తన సంగతి అమ్మకు ఇంకా బాగా తెలియదు. రాధకు తల్లిమీద జాలివేసింది.

"లోకులు కాకులు! దానికి అనుభవించే గీత లేక మట్టి కొట్టుకుపోయింది. దాని బుద్ధి మంచిది కాదంట. మొగుడు పసికట్టాడని తెలిసి చచ్చింది," రాగం తీసింది సూరమ్మ.

"అదేమిటొదినా ? నువ్వేగా చెప్పావ్ ? ఆపిల్ల చాలా మంచిదనీ.... మొగుడు పెట్టే బాధలు పడలేక ...."

"సరేలే.... అప్పుడు అట్టాగే విన్నాను. ఆ తర్వాత అసలుగుట్టు బయటపడింది," విసురుగా అన్నది సూరమ్మ.

"రావయ్యా భద్రయ్యా ?"

అప్పుడే లోపలకు వచ్చిన భద్రయ్యను ఆహ్వానించాడు సుబ్బారాయుడు.

"ఏమే రాధీ ! పెళ్ళెప్పుడే !" అంటూ భద్రయ్య రాధ నెత్తిమీద చిన్నగా కొట్టాడు.

రాధకు వళ్ళు మండిపోయింది. "ఇదుగో భద్రయ్యా! చెబుతున్నా జ్ఞాపకం వుంచుకో.... మళ్ళీ నన్ను ముట్టుకున్నావా.... లేక పెళ్ళీ గిళ్ళీ అన్నావా నీ మర్యాదదక్కదు," కయ్యిన లేచింది రాధ.

భద్రయ్యతోపాటు అక్కడవున్న ముగ్గురూ బిత్తరపోయారు రాధ మాటలకు.

"ఏమిటే ఆ మాటలు పెద్దంతరం చిన్నంతరం లేకుండా" తల్లి రాధ చెంపమీద ఛెళ్ళున కొట్టింది.



"కొట్టకమ్మా! ఏదో చిన్నపిల్ల ...." భద్రయ్య మనసులో బాధగా వున్నా పైకి అన్నాడు.

"కొట్టాలా చంపాలా ? మరీ బరి తెగించిపోతుంది. ఆడ ముండవు.... అంతపెద్ద మగవాణ్ణి పట్టుకొని అంతమాట అంటావులే ?" అంటూ కోపంగా లేచి నిలబడ్డాడు సుబ్బారాయుడు.

భద్రయ్య సుబ్బారాయుణ్ణి చెయ్యిపట్టుకొని కూర్చోపెట్టాడు.

"మామయ్యా ! మీరెవరూ నా పెళ్లిగురించిమాట్లాడనక్కర్లేదు. నేను పెళ్లి చేసుకోను. మాటకు ముందు 'ఆడది ఆడది' అనడం ప్రతివాడూ వెధవ సరసాలు ఆడటం.... ఏదో సాకుతో ముట్టుకోవడం నాకిష్టంలేదు. నేను ఉద్యోగం చేస్తాను. మగవాడిలాగే బతుకుతాను. టీచర్ ట్రైనింగ్‌కు అప్లై చేస్తున్నాను. సీటు రాగానే హైదరాబాద్ వెళ్లిపోతున్నాను. నా కాళ్ళమీద నేనే నిలబడతాను. అమ్మను బతికించుకుంటాను. నా గురించి మీరెవరూ ఏమీ పట్టించుకోకండి ఈ క్షణం నుంచి" అంటూ రాధ విసురుగా లోపలకు వెళ్ళిపోతుంటే అందరూ నోళ్ళు తెరుచుకుని చూస్తూ వుండిపోయారు.

* * *

"సిస్టర్ ?"

"ఏమ్మా ?"

"టైం ఎంతయింది ?"

"మూడున్నర" అన్నది గ్రేస్ చేతి గడియారం చూస్తూ.

"నిద్ర రావడం లేదా?"

"లేదమ్మా!"

"దాహం వేస్తుంది సిస్టర్."

గ్రేస్ స్పూన్‌తో నీళ్ళు తాగించి, నోటి చివర్లనుంచి కారిన నీటి తడిని తుడిచింది.

## 9

"సిస్టర్!"

"ఏమ్మా!"

"ఈ టైంలో ఎక్కడినుంచి సిస్టర్ పాట విన్పిస్తుంది?"

"ఎవరింట్లోనో పెళ్లి అయివుంటుంది. ఇదో న్యూసెన్స్ అర్ధరాత్రిదాకా రికార్డులు వేస్తారు. మళ్ళీ తెల్లవారు ఝామునే మొదలుపెడ్తారు. పైగా మైకులుపెట్టి ఊరంతా విన్పించేలా పెడ్తారు," గ్రేస్ విసుగ్గా అన్నది.

రాధ పాట ఆలకిస్తూంది. గ్రేస్ మాటలు పూర్తిగా వినిపించుకోలేదు.

"ఈ వీణకు శృతి లేదు....ఎందరికో హృదయంలేదు.. ఈ బ్రతుకెందులకో అర్థం కాదు...."

"ఎవరు రాశారోగాని.... ఆ పాట ఎంత బాగుంది సిస్టర్?"



"వీణను శృతి చెయ్యాలి. అది మన చేతిలో వున్న పనేగా?"

రాధ ఆశ్చర్యంగా గ్రేస్ ముఖంలోకి చూసింది.

"చాలా చక్కగా చెప్పారు సిస్టర్. శృతి చేస్తేగాని అపశృతులు లేకుండా రాగాలు పలకవ్. శృతి చెయ్యాలంటే వీణ తీగల్ని బిగించాలి. కాని నేను చేసిన తప్పు.... తెగిందాకా బిగించడమే...."

"రాధా....!" జాలిగా పలికింది గ్రేస్ కంఠం.

"నన్ను చూస్తుంటే జాలేస్తుందా సిస్టర్. నన్నుచూసి జాలిపడటం నా కిష్టం వుండదు సిస్టర్. ఈ జీవితాన్ని నేను కోరి వరించాను. అందువల్ల నేను బాధపడటం లేదు. కేవలం వెళ్ళిపోబోయేముందు ఒకసారి నా జీవితాన్ని మననం చేసుకుంటూన్నాను .... మీకు వినిపిస్తున్నాను .... నేను చనిపోయాక....నన్ను తల్చుకుని ఎటూ మీరు జాలిపడ్తారు. ఇప్పుడు మాత్రం జాలిపడొద్దు."

"లేదమ్మా.... ఆఁ ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పు. నీకు ట్రైనింగుకు సీటు వచ్చిందా?"

"ఆ వచ్చింది........"

.... .... .... .... ....

రాధకు టీచర్ ట్రైనింగుకు సీటు వచ్చింది. ఎంతమంది చెప్పినా వినకుండా రాధ హైదరాబాద్ బయలుదేరింది. సుబ్బారాయుడు డబ్బివ్వనన్నాడు. రాధ చేతి బంగారు గాజులు రంగారావు ద్వారా అమ్మించి బయలుదేరింది.

రాధ ప్రయాణం అవుతూవుంటే తల్లి కళ్లు ఒత్త కుంటూ నిల్చుంది.

"ఎందుకమ్మా దిగులుపడ్తావ్ ? నన్ను సంతోషంగా దీవించి పంపించు" అన్నది రాధ పెట్టె సర్దుకుంటూ.

"ఆడపిల్లవు.... ఒక్కదానివి...."

"అబ్బబ్బ.... ఈ ఆడా .... ఆడా.... అనేమాట అన కుండా వుండరుగదా ? నాకేం భయంలేదు. ఇక్కడ బస్సెక్క తాను. విజయవాడనుంచి ట్రైన్‌లో వెళ్తాను."

"ఎందుకైనా మంచిది. రంగారావును తోడు తీసుకెళ్ళ కూడదూ !" తల్లి జంకుతూనే అన్నది.

రాధ గయ్‌న లేచింది.

"నాకేం భయం అమ్మా ? నేను వెళ్తానుగా !"

"దానికేం మగరాయుడు ! ఎక్కడికైనా వెళ్ళగలదు. ఎంతకైనా తెగించింది. ఊళ్ళో అంతా మేనకోడలు ఉద్యోగం అంటూ పట్నం వెళ్తుందంట గదా అని అడుగుతుంటే చెప్ప లేక తల వంచుకుంటున్నాను," సూరమ్మ సాధింపు మొదలు పెట్టింది.

"అత్తయ్యా ? ఎప్పుడూ తలెత్తుకొనే వుండటంకంటే అప్పుడప్పుడు తలవంచడం మంచిదే. నేను మగరాయుణ్ణే అబ్బ ! ఎంతకాలానికి ఆమాట నీ నోటితో ఒక మంచిమాట విన్నాను ? నాకు చాలా సంతోషంగా వుంది-" అన్నది రాధ వ్యంగ్యంగా అత్తకేసి చూడకుండానే.

"సిగ్గు లేకపోతే సరి...." రుసరుసలాడుతూ సూరమ్మ లోపలకు వెళ్ళిపోయింది.



రాధ నవ్వుకుంటూ పెట్టె మూసి తాళం వేసింది.

"జాగ్రత్త తల్లీ! నాకు భయంగా వుంది."

"ఎందుకమ్మా భయం ? వెళ్ళగానే ఉత్తరం రాస్తాను," అంటూ రాధ బయలుదేరింది పెట్టే బెడ్డింగూ పట్టుకొని.

రాధ తల్లి వీధి గడపవరకు వచ్చి కూతుర్ని సాగ నంపింది.

రాధ ఒక చేత్తో పెట్టే, మరోచేత్తో బెడ్డింగూ పట్టు కొని, రోడ్డుమీద బస్‌స్టాప్‌కు నడుస్తూంటే అందరూ వింతగా చూస్తూ వుండిపోయారు.

"ఇలా ఇవ్వు రాధా! నేను పట్టుకొస్తాను."

రాధ చివ్వున తలెత్తి చూసింది. రంగారావు నిల్చుని వున్నాడు.

అతను దిగులుగా కన్పించాడు. రాధ ముఖంలోకి బాధగా చూశాడు.

మధ్య అతనికెందుకో అంత దిగులు ? వెధవ పోజు.... దేవదాసు పోజు పెట్టాడు !

"అక్కర్లేదు నేను మొయ్యగలను-" అంటూ ముం దుకు కదిలిన రాధకు రంగారావు దీర్ఘంగా నిట్టూర్పు విడవడం విన్పించింది.

'జబ్బు ముదిరినట్టే వుంది ! పాపం! చాలా పొడవు నిట్టూర్పులే విడుస్తున్నాడు-" కసిగా అనుకుంది రాధ.

రాధ హైదరాబాద్ స్టేషన్‌లో దిగగానే అంతవరకూ వున్న బింకం సడలిపోయింది. బితుకు బితుకుమంటూ నలు

వైపులా చూసింది. మొదటిసారి పట్నం వాతావరణంలో కాలుపెట్టిన రాధకు దిగులు దిగులుగా అనిపించింది.

"ఏమ్మా నీ కోసం ఎవరూ రాలేదా?" రాధతో పాటు ప్రయాణం చేసిన యువతి రాధను అడిగింది.

"లేదండీ! ఈ ఊళ్ళో నాకు తెలిసినవాళ్ళెవరూ లేరు–" అన్నది రాధ.

"బేగంపేట ట్రైనింగు కాలేజీకి వెళ్ళాలన్నావు గదూ? మేము అమీర్‌పేట వెళ్ళాలి. అటునుంచే వెళ్ళాలి. నిన్ను దించేసి వెళ్తాం. మాతో రా!" అన్నది ఆ యువతి.

రాధకు ప్రాణం లేచివచ్చింది.

ఆ యువతి మరచెంబూ, పిల్లవాణ్ణీ ఎత్తుకొని భర్త వెనకే నడుస్తోంది. ఆమె భర్త ముందు నడుస్తూనే మధ్య మధ్య వెనక్కి తిరిగి రాధను చూస్తున్నాడు.

టాక్సీ ఎక్కాకకూడా అతను రాధను దొంగచూపులు చూడసాగాడు.

మనుషులంతా పట్నంలో వున్నా, పల్లెల్లో వున్నా ఒకేలా వుంటారన్నమాట! పట్నంలోవాళ్లు కొంచెం పాలిష్డ్‌గా వుంటారు. పల్లెల్లోవాళ్ళు కొంచెం మొరటుగా వుంటారు. అంతే తేడా? లేకపోతే అంత అందమైన భార్య పక్కన వుండగా, ఏమిటా మనిషి తనకేసి అంత ఆకలిగా చూస్తాడు? పైగా పెళ్లాం ఎక్కడ పసి కడ్తుందోనని దొంగ చూపులు.... ఇటువంటి వెధవలకు పెళ్లాలంటే చచ్చేంత భయం.

టాక్సీ ఆగింది. రాధ ఆలోచనలనుంచి బయటపడింది.



రాధ టాక్సీ దిగి ఆ యువతికి థ్యాంక్స చెప్పింది. అతనికేసి చూడకుండా నిల్చుంది. టాక్సీకదిలి వెళ్ళిపోయింది.

రాధ బెరుకు బెరుగ్గా ముందుకు నడిచింది.

రాధ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం అయింది.

"సిస్టర్?"

"ఏం రాధా!"

"అలసటగా వుంది. ఓ పదినిముషాలు కళ్లు మూసుకొని పడుకుంటాను."

"అలాగే పడుకో రాధా!"

"మళ్ళీ మెలుకువ రాదేమోనని భయంగా వుంది. నిద్ర పట్టేసి....మళ్ళీ మెలుకుక రాకపోతే....నా కథ అసంపూర్తిగానే మిగిలిపోతుందేమో....?" ఆ పై మాట్లాడలేకపోయింది రాధ. కళ్ళు మూసుకుని పడుకుంది.

గ్రేస్ రాధ ముఖంలోకి చూస్తూ కూర్చుంది. ఆమె కళ్ళలో గిర్రున నీరు తిరిగింది.

## 10

"సిస్టర్!"

"చెప్పమ్మా!"

రాధ ఏదో అడగబోయి విరిగిన పాలలాంటి నవ్వు నవ్వింది. ఆ నవ్వు గ్రేస్ గుండెల్ని పిండింది.

"ఎందుకమ్మా అంత విరక్తిగా నవ్వుతున్నావు?"

"విరక్తి కాదు మేడం, జీవితం వచ్చి నా కళ్లముందు నిల్చొని ఏదో చెబుతోంది" అన్నది కళ్ళు మూసుకుంటూ రాధ.

రాధ డెలీరియంలో పడిపోతున్నట్టు భావించింది గ్రేస్. నిట్టూర్చింది.

రెండు క్షణాలు రాధ కళ్లు మూసుకొని మౌనంగా పడుకొంది. చిన్నగా కళ్లు తెరిచి గ్రేస్ ముఖంలోకి చూసింది. రాధ కళ్ళల్లో పిచ్చిచూపులు లేవు.

"కుతూహలంగా లేదా సిస్టర్ ?"

"ఏమిటి ?" ఆలోచనలో వుండే యాంత్రికంగా అడిగింది గ్రేస్.

"అదే జీవితం నాకేమి చెప్పిందని ?"

"చెప్పు !"

"ఇప్పుడిప్పుడే నా కళ్ళముందు కన్పించి నన్ను వెళ్ళిపొమ్మని హెచ్చరించింది. ఏమన్నదో తెలుసా ? జీవితాన్ని చూసి ఎవరు నువ్వు ? అని ప్రశ్నించాను. సి...."

"జీవితాన్ని !" అని చెప్పింది.

"ఎందుకొచ్చావు ?"

"చాలాసార్లు నీ దగ్గరకు వచ్చాను. కాని ఒక్కసారీ నువ్వు నన్ను గుర్తించలేదు. పైగా చులకనగా చూశావు."

"మళ్ళీ ఎందుకొచ్చావు ?"

"ఒక విషయం చెప్పిపోదామని వచ్చాను."

"ఏమిటది ?"

"ఇంతవరకూ నువ్వు నా వెనక పరిగెత్తడానికి బదులు



నా నీడ వెనక పరుగులు తీశావు. ఇప్పుడు నువ్వు పూర్తిగా అలసిపోయావు. నేను నీ మార్గంనుంచి పూర్తిగా తప్పుకుంటున్నాను. నీ వాకిలి ముందు ఏదో శాపం గిరులు గీచింది. ఆ గిరులను నేను దాటలేక పోయాను. అందుకే తిరిగి వెళ్ళిపోతున్నాను, ఇక నువ్వుకూడా వెళ్ళిపో !"

"ఎక్కడికి వెళ్లను ?"

"ఎక్కడనుంచి వచ్చావో అక్కడికే ! వెళ్లిపో ! వెళ్లిపో ! అంటుంది సిస్టర్ !" – అన్నది రాధ మళ్ళీ కళ్ళు మూసుకుంటూ.

గ్రేస్ కళ్ళు చెమ్మగిల్లాయి.

"దాహమేస్తుంది సిస్టర్ ! ఎందుకో ఇంత దాహం !"

గ్రేస్, స్పూన్‌తో నీళ్లు నోట్లో పోసింది. అతి కష్టం మీద గుటక వేసింది రాధ.

"ఎండలో మెరిసే ఇసుక నీరుకాదనీ, అది దాహం తీర్చలేదనీ అందరికీ తెలుసు. అయినా మనిషి – అందరూ కాదు – కలల్లో బ్రతికే మనిషి ఆ భ్రమ వెనకే కాళ్ళలోని సత్తువ హరించుకుపోయేంత వరకూ పరుగులు తీస్తాడు. అటువంటి వ్యక్తిని ఏదో తెలియని.... అర్థంకాని ఆర్తి ప్రతి నిముషం దహిస్తుంది. ఆ ఆర్తి అతన్ని ఒకచోట నిలవనివ్వదు. వాస్తవం ఎదుట నిల్చిపోవాలనికూడా అనిపించదు. అందుకే భ్రమ వెనక పరుగులు తీస్తాడు. పరుగు ఆగిపోయిన క్షణంలోనే అతని జీవితంకూడా ఆగిపోతుందని అతనికి తెలుసు. అందుకే పరుగులు తీస్తాడు. "పరిగెత్తి పాలుతాగడం కంటే,

నిలబడి నీళ్లు తాగడం మంచిది" అనే సూక్తిలో అతనికి నమ్మకం లేదు."

"రాధా!" గ్రేస్ కంఠం బాధగా పలికింది.

"ఏదేదో వాగుతున్నాను సిస్టర్! అసలు కథ వినండి"....

* * *

రాధకు ఆ స్కూలు వాతావరణం, హాస్టలు వాతావరణం కొత్తగావుంది. తనతోపాటు ట్రయినింగ్ అవుతున్న యువతులు చాలామంది లోయర్ మిడిల్ క్లాసుకు సంబంధించిన వాళ్ళే. అయినా పట్నాల్లో పెరిగిన వాళ్లు. వాళ్ళంతా చాలా ఉత్సాహంగా ప్రతి చిన్న విషయానికీ గలగల నవ్వుతూవుంటే రాధకు ఖాళీ డబ్బాలో రాళ్ళుపోసి మ్రోగిస్తున్నట్టనిపించేది. అంతమంది మధ్య, ఆ కిల కిల నవ్వుల మధ్య, ఆ కోలాహలంమధ్య, రాధ వంటరిగానే మిగిలిపోయింది. అందరితో మాట్లాడుతూనే వుంది. వాళ్ళమధ్య వుంటూకూడా రాధ వంటరిగానే మిగిలిపోయింది.

రాధ అంతమందిలో సరోజకుమాత్రం కొంత సన్నిహితంగా వుండేది. ఎప్పుడూ దిగులుగా కన్పించే సరోజను చూస్తుంటే రాధకు జాలిగా వుండేది. సరోజ దిగులుకు కారణాలు క్రమంగా రాధకు తెలిశాయి.

సరోజ తండ్రి స్కూలుమాష్టరుగా పనిచేస్తూ అకస్మాత్తుగా గుండె ఆగిపోయి చనిపోయాడు. అప్పుడు సరోజ స్కూలుఫైనల్ చదువుతూ వుంది. సరోజ తల్లి ఆ ఇంట్లో,



ఈ ఇంట్లో చాకిరీచేస్తూ, ఊళ్లో వాళ్ళకు మంచికీ చెడుకు సాయంగావుంటూ, పిల్లలకి కడుపు నిండా తిండి పెట్టలేకపోయినా, చావకుండా బతికిస్తూ వుంది. సరోజ తండ్రి ఆ స్కూలు హెడ్ మాస్టరు. తల్లో నాలికలా వుండేవాడు. ఆ హెడ్ మాస్టరుకు చాలా మంచివాడనే పేరువుంది. సరోజకు అతనే ఆర్థికంగా సహాయపడి ట్రైనింగ్‌కు పంపించాడు. సరోజ ట్రైనింగ్ పాసయి, తల్లినీ, ఇద్దరు చెల్లెళ్ళనూ, ఒక తమ్ముణ్ని పోషించాలి. వాళ్ళను చదివించాలి. సరోజకు కూడా ఆ యీడు ఆడపిల్లలకు సహజంగావుండే కోర్కెలే వున్నాయి. తనను ప్రేమించే భర్త లభించాలనీ, చిన్న కుటుంబంతో ఇంటిని స్వర్గంగా దిద్దుకోవాలనీ కోరుకునేది. కాని తన భుజాలమీద వున్న బాధ్యతల్ని తల్చుకొని రాధ దగ్గిర బాధపడేది.

చాలామంది హాస్టల్లోని యువతులు సాయంకాలం అయ్యేప్పటికి టిప్‌టాప్‌గా తయారై గ్రూపులు గ్రూపులుగా బయటికి వెళ్ళేవారు. చాలా ప్రొద్దుపోయేంతవరకూ వాళ్లు ఎక్కడెక్కడ తిరుగుతారో, రోజూ ఎక్కడికి వెళ్తారో రాధకు అర్థం అయేది.

కొందరు, బాయ్ ఫ్రెండ్స్‌తో కలిసి బయటికి వెళ్తూవుంటే, రాధ చిత్రంగా చూస్తూ వుండేది. రాధ రూంమేట్ లలితకు కూడా బాయ్ ఫ్రెండ్ వున్నాడు. సాయంకాలం అతను రావడం కొంచెం ఆలస్యం అయితే అశాంతిగా లోపలకూ బయటకూ తిరిగేది. అందరిమీదా చిరాకుపడేది. ఆ కళ్ళలోని అశాంతి చూసి రాధకు ఆశ్చర్యం వేసేది. లలిత

ఒకోరోజు చాలా ప్రొద్దుపోయివచ్చి మేట్రెన్ చేత తిట్లుతినేది. రాధ వంటరిగా కూర్చొని గంటలకొలదీ ఆలోచించేది.

ఆ రోజు సాయంత్రం రాధకు ఏమీ తోచక సరోజ గదిలోకి వెళ్లింది. సరోజ రూం మేట్సు ఇద్దరూ సాయంత్రం అయితే చాలు బయటికి వెళ్ళిపోతారు. సరోజ మాత్రం పనివుంటే కాని బయటికి వెళ్ళదు. సాధారణంగా రాధా, సరోజా కలిసే బజారుకు వెళ్తారు.

సరోజ ముస్తాబవుతూ వుంటే రాధ – "బయటి కెళ్తున్నావా ?" అని అడిగింది

"అవును! మా హెడ్ మాస్టరుగారు వచ్చారు. వాళ్ళ ఆడపిల్లలకు బట్టలు కొనాలట ! నన్ను రమ్మంటున్నారు. మాస్టరుగారు చాలా మంచివారు రాధా! ఆయనే కరుణించక పోతే మా కుటుంబం ఏమైపోయేదో? నేను కూడా చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చేది" అన్నది సరోజ.

రాధ మనసులో మాస్టరుగారంటే ఎనలేని గౌరవం ఏర్పడింది. "మీ మాస్టరుగార్ని చూపిస్తావా ?" అన్నది రాధ.

"రా! పరిచయం చేస్తాను" అంటూ సరోజ బయలుదేరింది. సరోజ వెనకే రాధ మెట్లు దిగింది.

పంచా, లాల్చీ, పై పంచలో నిండుగా, హుందాగా వున్న మాస్టరుగారికి గౌరవ పూర్వకంగా నమస్కరించింది రాధ. ఆయనకు ఏభై ఏళ్ళకు పైగానే వుంటాయి. పెద్ద మనిషి తరహాగా వున్నాడు.

రాధను సరోజ పరిచయం చేసింది. ఆయన రాధను



కుశల ప్రశ్నలు వేశాడు. ఆయన పక్కనే బొద్దుగా తెల్లగా మరొక యువకుడు కూర్చుని వున్నాడు. అతను రాధను మింగేసేలా చూడటం రాధకు కంపరంగా వుంది.

"ఏమిటల్లా చూస్తాడు! ఎప్పుడూ ఆడవాళ్ళనే చూడనట్టు!" అనుకుంది మనసులోనే రాధ.

సరోజ వాళ్ళతో వెళ్ళిపోయింది. రాధ గదిలోకివచ్చి నోట్స్ ఆఫ్ లెసెన్స్ రాసుకుంటూ కూర్చుంది.

భోజనం బెల్ వినిపించింది. కొంతసేపు సరోజ కొరకు ఎదురు చూసి రాధ భోజనానికి వెళ్లింది. భోజనం చేసి వస్తున్న రాధకు సరోజ గబగబా మెట్లెక్కి పరుగు లాంటి నడకతో గదిలోకి వెళ్లడం కన్పించింది. రాధ వెనక నుంచి పిల్చింది. కాని సరోజ వినిపించుకోలేదు. రాధ ఆశ్చర్యంగా సరోజ వెనకే గదిలోకి వెళ్ళింది. రాధ వెళ్ళేప్పటికి సరోజ దిండులో ముఖం దూర్చి వెక్కి వెక్కి ఏడుస్తూంది. రాధ వెళ్ళి పక్కన కూర్చుంది. వీపుమీద చెయ్యి వేసింది.

ఏమయి వుంటుంది? వాళ్లు ఆ అమ్మాయిని బయటికి తీసుకెళ్ళి ఏం చెప్పి వుంటారు! తల్లి ఎలా వుందో?

"ఏమయింది సరోజా ?" ఆలోచిస్తూనే అడిగింది రాధ.

సరోజ దుఃఖం పెల్లుబికింది. పెద్ద వెక్కిళ్ళు వస్తున్నాయి.

"సరోజా! ఏం జరిగింది? అమ్మా, చెల్లాయిలూ, తమ్ముడూ కులాసాగా వున్నారా ?" ఆదుర్దాగా అడిగింది రాధ.

సరోజ మాట్లాడే పరిస్థితిలో లేదు. రాధ సరోజ తల మీద చెయ్యివేసి కూర్చుంది.

ఏడ్చి ఏడ్చి సేద తీరినట్టు పడుకున్న సరోజను "ఏం జరిగింది సరోజా! లేచి కూర్చో! నాకు చెప్పవూ!" ఆర్ద్రంగా ప్రశ్నించింది రాధ.

సరోజ కళ్ళు తుడుచుకొని లేచి కూర్చుంది.

"అమ్మావాళ్లు కులాసాగా వున్నారా?"

"అందరూ బాగానే వున్నారు" బరువుగా జవాబిచ్చింది సరోజ.

"మరి ఎందుకు ఇంతగా ఏడుస్తున్నావు?" రాధ విస్మయంగా ప్రశ్నించింది.

"ఆడదాన్నిగా పుట్టినందుకు."

రాధ అదిరిపడింది. సరోజ ముఖంలోకి గుచ్చి గుచ్చి చూసింది.

"రాధా! ప్రపంచంలో ఇంతకుళ్లు వుందని మొదటిసారిగా తెలుసుకున్నాను. సమాజంలో పెద్దమనుషుల్లా మంచి మనుషుల్లా చెలామణి అయేవాళ్ళుకూడా ఆడదాని విషయంలో ఎంత నీచంగా ప్రవర్తిస్తారో తల్చుకుంటుంటే పెట్రోలుపోసి ప్రపంచాన్నే తగలపెట్టా లనిపిస్తోంది"-సరోజ కోపంగా అన్నది. ఆ మాటలు అంటున్నప్పుడు సరోజ కళ్ళలో ద్వేషం, పెదవులమీద విరక్తి కన్పించాయి.

రాధకు ఏమీ అర్థంకాలేదు. అయోమయంగా చూస్తూ "ఏమిటి సరోజా! ఏం జరిగింది? మీ మాస్టరుగారు...." ఆయన రూపం కళ్ళముందు కదులుతూ వుంటే మరేమీ అడగలేకపోయింది రాధ.



సరోజ కోపంతో వణికిపోతూంది. మాటలు గొంతులో గరగరలాడుతున్నాయి. రాధ, సరోజ ముఖంలోకి చూస్తూ కూర్చుంది.

కొద్ది క్షణాలు ఆగి, తనను సంబాళించుకొని, సరోజ చెప్పసాగింది.

"బజారుకు బయలుదేరాం గదా? మాస్టరుగారు రెండు రిక్షాలు పిల్చారు. ఒక రిక్షాలో తనెక్కి, రెండో రిక్షాలో రఘుని ఎక్కమన్నారు. నేను తెల్లబోయి చూస్తూ కూర్చున్నాను.

"ఎక్కమ్మా! ఆ రిక్షాలో ఎక్కు! అన్నారు మాస్టరుగారు. నేను ఆశ్చర్యంగా ఆయన ముఖంలోకి చూశాను. ఏమనాలో అర్థంకాలేదు. నేను అలాగే నిలబడిపోయాను. ఏమనుకున్నాడో ఏమో రఘు దిగి మాస్టరుగారి రిక్షాలో కూర్చున్నాడు. నేను రిక్షా ఎక్కాను. కాని మనసు మనసులో లేదు. మాస్టరుగారు అలా ఎందుకు ప్రవర్తించారో అర్థం కాలేదు. షాపింగ్ కూడా అన్యమనస్కంగానే చేశాను. తర్వాత రఘు ఎక్కడ కెళ్ళాడో తెలియదు. మాస్టరుగారు యాబిడ్స్‌నుంచి రిక్షా పబ్లిక్ గార్డెన్‌కు మాట్లాడుతూవుంటే నా ఆశ్చర్యానికి అంతులేదు. తనుఎక్కి, ఎక్కమ్మా! అన్నారు. పెద్దవారు. తండ్రిలాంటివారు. ఎక్కనంటే అవమానించినట్లు అవుతుందని ఆ రిక్షాలోనే ఎక్కాను."

"నీతో ఓ విషయం మాట్లాడాలమ్మా! అందుకే పబ్లిక్ గార్డెన్‌కు వెళ్తున్నాం!" అన్నారు మాస్టరుగారు.

"తండ్రిలాంటివారు! ఏం మాట్లాడతారు? రఘుతో తనను రిక్షా ఎక్కించడానికి ఎందుకు ప్రయత్నించారు! బహుశా రఘు విషయమే అయివుంటుంది అనుకున్నాను. గుండెలు దడదడ లాడాయి. ఏవేవో ఆలోచనలువచ్చి మనస్సు మధురభావనలో నిండిపోయింది. మాస్టరుగారూ, నేనూ పబ్లిక్ గార్డెన్‌లో ఒక బెంచీమీద కూర్చున్నాం!" సరోజ ఓ క్షణం మౌనం వహించింది. ఆమె పెదవులూ, ముక్కోళ్లూ అదరడం రాధ చూసింది.

"తర్వాత ఏం జరిగింది? మాస్టరుగారు ఏమైనా చెడ్డగా ప్రవర్తించారా?" ఆత్రంగా ప్రశ్నించింది రాధ.

"జరిగింది చెబుతాను. మాస్టరుగారు చెడుగా ప్రవర్తించారో, మంచిగా ప్రవర్తించారో నువ్వే తేల్చుకో!" అని ఆగింది సరోజ.

రాధకు చిన్నప్పుడు తనను ముద్దుపెట్టుకున్న మాస్టరు గుర్తొచ్చాడు. మనసంతా చీదర చీదరగా అనిపించింది.

సరోజ చెప్పసాగింది:

"మాస్టరుగారు ఆలోచిస్తూ కూర్చున్నారు. నేను ఆయన ముఖంలోకి కుతూహలంగా చూస్తూ కూర్చున్నాను. కొంతసేపు ఆలోచించి, ఒకసారి దగ్గి ఆయన ప్రారంభించారు.

"రఘును గురించి నీ అభిప్రాయం ఏమిటమ్మా?" అడిగారు మాస్టరుగారు.



నాకు ఏం చెప్పాలో వెంటనే తోచలేదు. చూస్తూ వుండిపోయాను.

"చాలా మంచి వాడమ్మా! తెలివైనవాడు. గజిటెడ్ ఆఫీసరు. ఏడువందలకు పైగా జీతం వస్తుంది. అతని భాగం ఆస్తి ఏభై వేలదాకా వుంటుంది. లక్ష రూపాయలు కట్నం ఇచ్చి పిల్లను ఇవ్వడానికి ఎంతోమంది సిద్ధంగా వున్నారు" అని ఆగి, నా ముఖంలోకి చూశారు మాస్టరుగారు.

నా గుండెలు దడ దడ లాడాయి. నాకు అంత అదృష్టమా! అనుకున్నాను. నేనూ అందరి ఆడపిల్లల్లాగే, ఆదరించే భర్త కావాలని కోరుకుంటాను. రఘులాంటి భర్త నాలాంటి బీదపిల్లకు దొరకడం ఏ జన్మలో చేసిన పుణ్యఫలమోనని భావించాను. కాని అదృష్టంమీద నాకు పూర్తిగా నమ్మకం కుదర్లేదు. మాస్టరుగారు చెబుతూంది వాస్తవమా? లేక నేను భ్రమపడుతూన్నానా? అనుకుంటూ కూర్చున్నాను.

రాధకు, సరోజ దుఃఖానికి కారణం అర్థం కావడం లేదు. పెళ్ళి చేసుకోవడం సరోజకు ఇష్టమే! రఘులాంటి వాడు భర్తగా లభించడం తన అదృష్టంగా భావిస్తుంది. తనకూ వివాహం చేసుకోవాలనే వుంది. మరి ఇంతగా ఎందుకు ఏడుస్తుంది? రాధకు కొంచెం చిరాకుకూడా కలిగింది.

సరోజ మళ్ళీ చెప్పసాగింది.

"నువ్వంటే రఘుకు చాలా ఇష్టం! నిన్ను మా ఇంట్లో చాలా కాలంగా చూస్తూన్నాడుగా?" అన్నారు మాస్టరుగారు.

"మాస్టరుగారి మాటకు నా గుండె దాదాపు లయ తప్పిందనే చెప్పాలి. శృతిచేసి పెట్టిన వీణమీద ఎవరిదో చెయ్యిపడినట్టు నా హృదయం మధుర కంపనతో నిండిపోయింది. నా బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి చిమ్మింది. మాస్టరుగారి ముఖంలోకి చూడలేక సిగ్గుతో తల వంచుకొని కూర్చున్నాను.

"నీకు అభ్యంతరం లేకపోతే ?" సందేహిస్తూ అన్నారు మాస్టరుగారు.

తనకు అభ్యంతరమా? రఘుకు ఏం తక్కువ? అందం వుంది. హోదా వుంది. డబ్బుంది. రఘు లాంటి భర్త లభించడం తను పూర్వజన్మలో చేసిన పుణ్యఫలమే! ఆలోచిస్తూ కూర్చున్నాను. కాని సమాధానం ఎలా చెప్పాలో బోధపడలేదు.

"చెప్పమ్మా!" మాస్టరుగారి కంఠంలోని ఆప్యాయతకు కదిలిపోయాను. మా నాన్నగారు వున్నా 'అచ్చం!' అలాగే అడిగివుండేవారనిపించింది.

"లక్ష రూపాయలు కట్నం వస్తుంటే ఆయన నాకోసం అంత త్యాగం చేస్తారా? వాళ్ళ నాన్నగారు అంగీకరిస్తారా?" చిన్నగా సంకోచిస్తూనే సందేహాన్ని వెలిబుచ్చాను. మాస్టరుగారినుంచి ఎంతసేపటికీ సమాధానం రాకపోవడంతో తలెత్తి చూశాను. ఆయన ఏదో సందేహంలో పడినట్టు కన్పించింది. నేను ఆయన ముఖంలోకి సమాధానం కొరకు చూస్తూ వుండిపోయాను.

"ఆహా! నేను చెప్పింది నీకు సరిగా అర్థం అయినట్టు



లేదు. నేను మాట్లాడేది పెళ్లిగురించి కాదు" అంటూ ఓ క్షణం ఆగిపోయారు.

ఆయన మాటలు నాకు అర్థం కాలేదు. అయోమయంగా ఆయన ముఖంలోకి చూస్తూ వుండిపోయాను.

"రఘు నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకోవటం లేదమ్మా! అతనికి లక్షల కట్నం ఇచ్చి, డాక్టరు చదివిన అమ్మాయిల్ని ఇవ్వడానికి ఎంతోమంది సిద్ధంగా వున్నారు. నీకు అభ్యంతరం లేకపోతే నీతో స్నేహం చేస్తాడట! నీ మంచిచెడ్డలు చూసుకొంటాడు. ఆధారంలేని మీ కుటుంబాన్ని ఆదుకుంటాడు. ఈ వ్యవహారం పదిమందికి తెలియాల్సిన అవసరంకూడా లేదు" అంటూ మాస్టరుగారు నా ముఖంలోకి చూశారు.

నా కళ్ళముందు కన్పిస్తున్న ప్రతివస్తువూ ఓ క్షణం గిర్రున తిరిగింది. నేను కూర్చున్న బెంచీ భూమిలోకి దిగబడిపోయింది. నా తలలో ఏదో సాదు - గుండెల్లో ఏదో బాధ. మాస్టరుగారికేసి చూశాను. ఆయన అప్పుడే ఊరిబయట ఊడమర్రి మీదనుంచి దిగివచ్చిన పిశాచంలా కన్పించాడు. వొళ్లు జలదరించింది. దిగ్గునలేచి నిల్చున్నాను. ఆయన పిలుస్తున్నా వినిపించుకోకుండా ఒక్క క్షణంలో గేటు దాటుకొని బయటపడ్డాను. విన్నావా రాధా! ఆ పెద్దమనిషి నన్ను కన్నబిడ్డలాగ చూస్తున్నాడనుకొన్న వ్యక్తి – భావితరం పౌరులను సభ్యతా సంస్కారాలతో తీర్చి దిద్దవలసిన బాధ్యతగల ఒక మాస్టరు; పరాయి ఆడపిల్లను తన బావమరిదికి, డబ్బుకోసం ఉంపుడుగత్తెగా వుండమని సలహా ఇచ్చాడు." నిండుకుండ బద్దలగునట్టు మళ్ళీ భోరున ఏడ్వసాగింది సరోజ.

రాధ ఈసారి సరోజను ఓదార్చలేదు. రాధ మనసు భగభగ మండిపోతూంది. హృదయం జుగుప్సతో నిండిపోయింది. మనిషిలోని మనిషి ఇంత భయంకరంగా వుంటాడా? క్రూరమృగాలకు దూరంగా వుంటాం. విష పురుగులు కన్పిస్తే చంపేస్తాం! అసహ్యం కలిగించే పురుగుల్నుంచి మనం పారిపోతాం! కాని పైకి అందంగా, సభ్యతా సంస్కారాలకు ప్రతిరూపంగా కన్పించే మనుషుల్లో క్రూరమృగాలూ, విషపురుగులూ కూడా వున్నాయ్! కాని వాటినుంచి మనం పారిపోలేం? ఏ మనిషిలో ఏ జంతువుందో, ఏ మనిషిలో ఏ పురుగుందో తెలుసుకోలేం! అలా తెలుసుకో గలిగిననాడు, మనిషిలో మనిషిని, ఎదురుగావున్న మనిషి తెలుసుకోనే యంత్రాన్ని ఎవరయినా కనిపెడితే ఈ ప్రపంచమంతా యుద్ధభూమిగా మారిపోతుంది. మనిషిని మనిషి అసహ్యించుకుంటాడు. ఈ ప్రేమలకూ, అనురాగాలకూ తావే వుండదు.

"అదే మాస్టరుగారు తన కూతుర్నిగానీ, చెల్లెల్నిగానీ ఇలా అడగ్గలడా?" అన్నది సరోజ. రాధ ఆలోచనల నుంచి బయటపడింది.

"అవును సరోజా! మగవాడి దృష్టిలో తన తల్లీ, పెళ్ళాం, కూతురూ, చెల్లెలూ వీళ్ళే శీలవతులు, వాళ్ళకేసి పరాయి మగవాడు చూడటంకూడా సహించడు. కాని అతనికి మాత్రం తన కిష్టమైన ప్రతి ఆడదీ తనకు అందుబాటులో వుండాలి. పరాయి ఆడవాళ్ల గురించి ఎంత అసహ్యంగా మాట్లాట్టానికి కూడా వెనకాడడు" రాధ కసిగా అన్నది.

"ఇంత అవమానం భరించి ఎట్లా బ్రతకడం! మళ్ళీ



ఆ మాస్టరు మొహంకూడ నేను చూడలేను" అన్నది సరోజ. కంఠంలో దుఃఖం, విరక్తి ఒకదాన్నొకటి వరుసుకుంటూ వుండగా.

"ఊర్కో సరోజా! ఇటువంటి విషయాలకు ఏడ్చి ప్రయోజనం లేదు, ఎదుర్కోవాలి ప్రపంచాన్ని. ఇటువంటి వాళ్ళకు కుక్కకాటుకు చెప్పుదెబ్బలాంటి ప్రాయశ్చిత్తం చెయ్యాలి!" అన్నది రాధ.

"ఏం చేస్తాం రాధా! ఆ మాస్టరు చిన్నప్పట్నుంచీ నన్ను తండ్రిలా ఆదరించాడు. పైగా ఆయన దయాదర్మాల మీద మా కుటుంబం ఆధారపడి వుంది. ప్రపంచం తీరే అంత అని సమాధానపర్చుకొని ఊరుకోవాల్సిందే!" అన్నది సరోజ.

"ఛ! ఆడదంటే ఎంత తేలిగ్గా చూస్తారు? ఎంతసేపూ....ఆడా....మగా....సంబంధం....ఇదేనా ప్రపంచం. ఏ ఇద్దరు ఆడవాళ్ళ లాగో, లేక మగవాళ్ళ లాగో, ఒక ఆడదీ మగవాడూ ఒకర్నొకరు గౌరవించుకుంటూ నిర్వికారంగా ఎందుకుండరో?" రాధ తనకుతనే చెప్పుకుంటూన్నట్టు గొణిగింది.

సరోజ మౌనంగా కూర్చుంది.

"ఇక పద! భోజనం చేద్దువు గాని" అన్నది రాధ.

"వద్దు రాధా! ఇవాళ నేను భోజనం చెయ్యలేను. బాగా అలసటగా వుంది. పడుకుంటాను" అన్నది సరోజ.

రాధ సరోజను బలవంత పెట్టలేదు. లేచి తన గదిలోకి వచ్చింది. పడుకుంది. కాని నిద్రపట్టలేదు. రాత్రంతా

కలత నిద్రలోనే గడిపింది. సరోజకు జరిగిన అవమానం తనకే జరిగినట్టు బాధ పడింది.

ఒకరోజు రాధను సరోజ హడావిడిగా నిద్ర లేపింది.

"రాధా! ఎంత ఘోరం జరిగిందో చూడు!" అన్నది సరోజ.

"ఏం జరిగింది?" పడుకొనే రాధ బద్ధకంగా అడిగింది.

"లలిత చచ్చిపోయింది?"

"ఆఁ!" అంటూ దిగ్గున లేచి కూర్చుంది రాధ. సరోజ ముఖంలోకి చూసింది.

"లలిత ఆత్మహత్య చేసుకుంది."

"ఎందుకు? ఎట్లా?"

"బావిలో పడి చచ్చిపోయింది. ఎందుకో తెలియదు. పద!" అన్నది సరోజ.

లలిత శవాన్ని సాయంకాలానికి తల్లిదండ్రులకు అప్పగించారు. పోస్టుమార్టంలో లలిత గర్భవతి అని తేలింది.

"ఎంత సిగ్గుచేటు ?"

"ఆడవాళ్ళు అందుకే అద్దుల్లో వుండాలంటారు."

"ఆ పిల్ల ఎప్పుడో ఇలాంటి చావే చస్తుందనుకున్నాం!"

"ఎప్పుడూ రాత్రి సమయానికి హాస్టల్‌కు వచ్చేది కాదు."

"కొన్నిసార్లు గేటు దూకి కూడా వచ్చేది."

తలొక రకంగా ఆడవాళ్ళే అనడం వింటూంటే



రాధకు బాధ కలిగింది. చచ్చిన లలిత మీద సానుభూతి ఎవరూ చూపించడం లేదు.

లలిత నెల రోజులుగా బయటికి వెళ్ళక పోవడం, ఏదో పోగొట్టుకున్నట్టు దిగులుగా వుండటం, లలిత కోసం రోజూ వచ్చే కుర్రవాడు రాక పోవడం చాలామందికి లలిత విషయంలో అనేక అనుమానాలు వచ్చాయి. కొందరు లలితను చూసి గుస గుస లాడుతూ నవ్వుకుంటూ వుండే వారు. రాధకు మాత్రం లలితను చూస్తుంటే జాలిగా వుండేది. లలిత గర్భవతి అని తెలుసుకొని ఆ కుర్రవాడు ముఖం చాటు చేశాడు. అతనికి పెళ్ళి కుదిరిందని తెలిసిన లలిత ఈ అఘాయిత్యానికి పాలు పడింది. లలిత చనిపోతూ "తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని రాసిపెట్టి చచ్చిపోయింది."

అది తెలిసిన రాధకు వళ్ళు మండింది.

ఇందువల్లనే ఆడవాళ్ళ బ్రతుకులు ఇలా తగల పడ్తున్నాయ్! ఎందుకో అంత త్యాగం! తనైతేనా చస్తూ తన చావుకు కారకుడైన వ్యక్తి పేరు రాసి మరీ చచ్చేది. అసలు తను ఎందుకు చావాలి! లలిత మాత్రం ఎందుకు చావాలి!

ఇద్దరు కలిసి చేసిన పాపానికి ఆడది చావడం, మగవాడు ఏమీ ఎరగనట్టు పెళ్ళి చేసుకొని సంఘంలో పెద్ద మనిషిలా చెలామణి కావడమా! ఎందుకు ఇలా జరుగుతోంది? లోపం ఎక్కడ వుంది? ఆడదాని జన్మలోనా? లేక సంఘాన్ని శాసించేవాడు మగవాడు కావడం వల్లనా!

కాదు దీనికంతా కారణం ఆడదాని బలహీనతే.

తనను తను మగవాడి కంటే హీనురాలిగా భావించడమే! శతాబ్దాలుగా ఆడది దగా పడుతున్నట్టు పుస్తకాల్లో చదువుతోంది. ప్రత్యక్షంగా చూస్తోంది. అయినా ఎందుకు ఎదురు తిరగదు? లలితలాంటివాళ్లు ఎందుకు చావాలి? ఆడది మాతృత్వం ధరించడం ఆమె తప్పా? సృష్టి సహజం! అటువంటప్పుడు తన బిడ్డను ధైర్యంగా ఎందుకు పెంచుకోకూడదు. ఇటువంటి ఆడవాళ్ళు సంఘం మీద తిరగబడి పిల్లల్ని పెంచుకుంటూ, తమ కాళ్ళమీద తాము నిలబడితే సంఘం చచ్చినట్లు తన పద్ధతుల్ని మార్చుకోదూ?

ఈ సాంఘిక వ్యవస్థ మారాలి. అప్పుడే మనుషులు మారతారు. ఆడదాని చుట్టూ గీచిన ఈ గిరుల్ని తుడిచి వెయ్యాలి. ఆడదాన్ని ప్రత్యేకంగా ఎత్తిచూపించే ఈ సంస్కారంలో మార్పు రావాలి.

రాధ ఎప్పుడూ ఆలోచిస్తూ వుండేది.

రాధ ట్రయినింగుకు వచ్చి ఆరు నెలలు పూర్తయింది. ఒకరోజు రాధకు రంగారావునుంచి ఉత్తరం వచ్చింది. ఆ దస్తూరి చూడగానే అది ఎక్కడ్నుంచి వచ్చిందో అర్థమయింది.

కవరు బరువుగానే వుంది. ఏం రాశాడో, మళ్ళీ కవిత్వం రాశాడేమో? లేక ప్రేమలేఖ వ్రాశాడో! రాధకు అసహ్యం వేసింది. కవరు విప్పకుండానే అడ్డంగా చింపాలనిపించింది. కాని చింపలేకపోయింది. ఏం రాశాడో ఒక్కసారి చదవాలనే కుతూహలం కలిగింది.



ఉత్తరం విప్పి చదవసాగింది. రాధ ముఖం కోపంతో కందగడ్డలా అయింది.

బుద్ధిలేని గాడిద. పెళ్ళి చేసుకున్నాడట. తను అపార్థం చేసుకోవద్దట. ఆ పెళ్లి కేవలం ప్రపంచంకోసమే చేసుకున్నాడట. కాని జీవితమంతా తననే ఆరాధిస్తాడట. ఈ సంజాయిషీ ఎందుకో! తను అడిగిందా? అతను పెళ్ళిచేసుకుంటే తనకేం చేసుకోకపోతే తనకేం? జీవితమంతా ఆరాధిస్తాడట. పెళ్లాం....పిల్లలూ....లోకధర్మం కొరకేనట. ఆరాధిస్తాడు.... ఏడ్వలేకపోయాడు?

పెళ్ళి చేసుకున్నాక పిల్లల్ని కనక ఏం చేస్తాడట? దానికికూడా సంజాయిషీయా? పెళ్ళీ....పిల్లలు....ప్రేమా.... ఆరాధనా ...ఎంతసేపూ ఇవే ఆలోచనలు. మనిషికి, ఏ జంతువుకూ లేని బుద్ధివుంది. ఎందుకు? కేవలం పెళ్ళిచేసుకోవడానికీ, పిల్లల్ని కనడానికేనా? పశువులూ కంటున్నాయి పిల్లల్ని. ఇంతకంటే మనిషి మరేం చెయ్యలేడా?

రాధ మనసు భగభగ మండిపోయింది. రంగారావు రూపం ముళ్ళపందిలా, గున్న ఏనుగులా కన్పించింది. వళ్లు జలదరించింది. ఉత్తరాన్ని పరపర చింపి పారేసింది. చేతులు కడుక్కుంది.

రాధ ట్రయినింగ్ పూర్తిచేసి తిరిగివచ్చింది.

"ఏవమ్మా వదినా పిల్లకు పెళ్ళి చెయ్యరా ఏమిటి?"

"వెన్ను ముదిరితే తర్వాత సంబంధాలు కుదరటం కష్టం!"

"నీ కూతురు పెళ్లి చేసుకోనంటుందటగా? ఈ విడ్డూరం ఎక్కడైనా వుందా?"

"పట్నంలో చదివి వచ్చిందిగా! ఎవరినైనా ప్రేమించిందేమో కనుక్కో?"

చుట్టూ కాకిగోల. రాధ తల పగిలిపోతూంది. అయినా పైకి ఏమీ మాట్లాడకుండా గంభీరంగా వుండడం నేర్చుకొంది.

రాధ వచ్చిన రెండో రోజు రంగారావు వచ్చాడు.

"బాగున్నావా రాధా!" ఆ కంఠంలోని మార్దవానికి రాధకి ఒళ్ళు మండిపోయింది. జవాబివ్వలేదు.

"నా ఉత్తరం అందిందా?" ఏదో పెద్ద తప్పుచేసిన వాడిలా తల వంచుకొని అడిగాడు.

రాధ, రంగారావు ముఖంలోకి ఏవగింపుగా చూసింది.

"నీకు బుద్ధివుందా లేదా?"

రంగారావు చివ్వున తలెత్తి చూశాడు.

"క్షమించు! అమ్మా నాన్న పోరు పడలేక ఈ పెళ్లి..."

"నువ్వు పెళ్ళి చేసుకుంటే నాకేం, పెటాకులు చేసుకుంటే నాకేం? అసలు నిన్ను సంజాయిషీ ఎవరడిగారు? మళ్ళీ నాతో మాట్లాడకు. పిచ్చి పిచ్చి ఉత్తరాలు రాస్తే మర్యాద దక్కదు" అంటూ గిర్రున తిరిగి విసురుగా లోపల కెళ్ళింది రాధ.

రంగారావు ఓ క్షణం రాధ వెళ్ళినవైపే చూస్తూ నిల్చున్నాడు. దిగాలుపడి భారంగా వెళ్ళిపోయాడు.

తల్లి వారిస్తున్నా వినకుండా ఒకరోజు రాధ స్కూలు లైబ్రరీకి పుస్తకాలకోసం వెళ్ళింది. తిరిగి వస్తుంటే రామం



కన్పించాడు. తనతో కలిసి ఆడుకున్న రామం చూడగానే రాధకు పలకరించాలనిపించింది.

"బాగున్నారా రామం?" పలకరించింది రాధ.

రామం బిత్తరపోతూ రాధ ముఖంలోకి చూశాడు. రాధ ఏదో చెయ్యరాని పనిచేసినట్టు మొఖంపెట్టాడు. జవాబివ్వడానికి ఓ క్షణం తడబాటు చెందాడు. ఏదో అనబోతూ గబగబా ముందుకు వెళ్ళిపోయాడు. ఎదురుగా రాధ మేనమామ వస్తూ కన్పించాడు.

ఇందుకా - రామం జవాబుకూడా ఇవ్వకుండా గాబరాగా వెళ్లిపోయాడు? ఈ పల్లెటూళ్ళలో ఆడపిల్ల మగవాణ్ని పలకరించడంకూడా తప్పే! కనీసం ఈ విషయంలోనన్నా పట్నాలు మెరుగు.

"ఏమిటే నడిరోడ్డుమీద మగపిల్లల్తో మాట్లాడుతూ నిలబడ్డావ్?" రాధ మేనమామ గట్టిగా అడిగాడు.

ఒక సంవత్సరంపాటు కొత్త వాతావరణంలో వుండి వచ్చిన రాధకు ఇక్కడి వాతావరణం మరీ బాధగా వుంది. మేనమామకు సమాధానం ఇవ్వకుండానే గబగబా వెళ్ళిపోయింది.

రాధకు హైదరాబాద్‌లో గవర్నమెంటు హైస్కూల్లో టీచరు ఉద్యోగం వచ్చింది. రాధ సంతోషానికి అంతులేదు.

తల్లిని తీసుకొని పట్నం బయలు దేరింది.

.... .... .... .... .... .... ....

"సిస్టర్?"

"ఏమ్మా దాహం వేస్తుందా?"

"అవును ?" అన్నట్టు తల వూపింది రాధ.

గ్రేస్, స్పూన్‌తో నీళ్ళు తాగించింది.

## 11

"సిస్టర్ "

"ఏం రాధా !"

"టైం ఎంతయింది?"

"నాలుగుం బావు!"

"మరో గంటా గంటన్నర టయిమ్ వుందా?"

"దేనికమ్మా?"

అదే నేను నీ దగ్గర సెలవు తీసుకోవడానికి."

గ్రేస్" మనసు కలుక్కుమంది. రాధ చేతిని తన చేతిలోకి తీసుకొని చిన్నగా నొక్కింది.

"వయసులో వున్న చాలామంది ఆడపిల్లలు మగవాళ్ళను చూసి ఎందుకు మెలికలు తిరిగిపోతారు సిస్టర్ ?"

"ఇదేం ప్రశ్న?" అన్నట్టు చూసింది గ్రేస్.

"చెప్పండి సిస్టర్ !" కళ్ళు మూసుకొని అలసటగా అన్నది రాధ.

"వయసులో వున్న ఆడపిల్లలు మగవాళ్ళ ముందు సిగ్గుపడటం సహజమే కదమ్మా ?" అన్నది గ్రేస్.

"అది సహజం కాదు సిస్టర్!"

గ్రేస్ రాధ ముఖంలోకి చూసింది.

"సిగ్గు అనేది స్త్రీలోని బలహీనతను ఎత్తి చూపించే



బాహ్యక్రియ మాత్రమే. ఒక స్త్రీ, తను ఇష్టపడే పురుషుడి ముందు సిగ్గుపడటం సహజం కావచ్చు. కాని ఆరోగ్యకరమైన ఆలోచనలూ, మనస్సూ గల స్త్రీ ప్రతి మగవాడి ముందూ సిగ్గుపడదు. ముడుచుకుపోదు. మెలికలు తిరిగిపోదు."

సిస్టర్ ఆలోచనలో పడింది.

"ఒక చిన్నకథ చెప్పనా సిస్టర్?"

"చెప్పమ్మా !"

"ఒకసారి మీరాబాయి తులసీదాసును చూడటానికి వెళ్ళింది. తను వచ్చినట్టు కబురుచేసింది. తులసీదాసు తను ఆడవాళ్ళను చూడనని సమాధానం పంపించాడు. అప్పుడు మీరాబాయి ఏం చేసిందో తెలుసా? ఆమె కవయిత్రి గదా!

"ఇంతకాలం శ్రీకృష్ణుడు ఒక్కడే మగవాడు అనుకున్నాను. ఇవ్వాళే ప్రపంచంలో మరో మగవాడు కూడా వున్నాడని తెలుసుకున్నాను."

అని రాసి పంపించింది. అది చదువుకొని తులసీదాసు పరుగెత్తుకుంటూవచ్చి "అమ్మా క్షమించు!" అంటూ మీరాబాయి కాళ్ళమీద పడిపోయాడట," రాధ ఆగింది.

గ్రేస్‌కు రాధ చెప్పిన కథలోని లోతు అందలేదు.

"అర్థం కాలేదా సిస్టర్?"

"లేదు."

"అంటే మీరాబాయి దృష్టిలో శ్రీకృష్ణుడొక్కడే మగవాడు. ఆమె కృష్ణుణ్ణే ప్రేమించింది. అతని ముందే ఆమె సిగ్గుపడుతుంది. అలుగుతుంది. ప్రాధేయపడుతుంది. ఆమె కలల్లో, తలపుల్లో, ఆశల్లో, కోరికల్లో, ఊపిరిలో కృష్ణరూపమే

నిండిపోయివుంది. మిగతా మగవాళ్ళంతా ఆమె దృష్టిలో తోటి మానవులు మాత్రమే. మరో పురుషుడి ముందు ఆమెకు ఎలాంటి వికారం కలగదు."

ఓ క్షణం ఆగి, మళ్ళీ రాధ ప్రారంభించింది:

"స్త్రీ పురుషుడి ముందు సిగ్గుపడటం సహజం కావచ్చు. ఎవరి ముందు ? తను ఎవరిముందు బలహీనురాలు అవుతుందో వారిముందే సిగ్గుపడుతుంది. చూచిన ప్రతిమగవాడి ముందు సిగ్గుపడటం అంటే తన బలహీనతను వ్యక్తం చేసుకోవడమే! అందుకే సిగ్గుతో మెలికలు తిరిగిపోయే ఆడపిల్లల్ని చూస్తే నాకు వళ్లు మంట. వాళ్లు తమ ఆడతనాన్ని ప్రత్యేకతను ఎత్తి చూపిస్తూ మగవాళ్ళను ఆకర్షించడానికి ప్రయత్నిస్తారు. అదో సరదా! క్రమంగా అదే అలవాటుగా మారిపోతుంది. కొందరు మగవాళ్ళు కూడా ఆడవాళ్ళ ముందు మెలికలు తిరిగిపోతారు. అటువంటి వాళ్ళను చూసి మగవాళ్ళతోపాటు ఆడవాళ్ళు కూడా అసహ్యించుకుంటారు," అన్నది రాధ.

పకపక నవ్వింది గ్రేస్.

"ఎందుకు సిస్టర్ నవ్వుతున్నారు?"

గ్రేస్ గతుక్కుమంది. అది నవ్వాల్సిన సమయం కాదు. "ఒక డాక్టరుగారు గుర్తొచ్చారు రాధా! ఆయన తమాషాగా నడుస్తారు. ఆడవాళ్లు మాట్లాడనక్కర్లేదు. కన్పిస్తేచాలు మెలికలు తిరిగిపోతారు. ఆయన భార్య అతన్ని ఎలా భరిస్తుందో పాపం అనిపిస్తుంది," అన్నది గ్రేస్.

రాధ మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది.

"ఉద్యోగానికి వెళ్లావ్! ఆ తర్వాత కథ చెప్పమ్మా!"



"నేను చెబుతుంది కథలావుందా సిస్టర్?"

"లేదమ్మా! జీవితం! ప్రత్యేకమైన జీవితం! అనిపిస్తోంది-" అన్నది గ్రేస్ కొంచెం నొచ్చుకుంటూ.

"వినండి సిస్టర్ .... .... .... "

*　　　*　　　*

ఆమె ఉద్యోగంలో చేరింది. కొత్త ప్రపంచంలో, విశాలమైన ప్రపంచంలో అడుగు పెట్టింది. తన వంటరితనాన్ని భరించలేక అనేకమందితో పరిచయం పెంచుకుంది. మగవాళ్ళతో మాట్లాడేప్పుడు ఆమెకు ఎలాంటి సంకోచం వుండేది కాదు. ఆడవాళ్ళతో మాట్లాడినట్లే నిర్వికారంగా మాట్లాడేది. ఆమె నడకలో హుందాతనం. ముఖంలో గాంభీర్యం చూసి చాలామంది గౌరవించినట్లే కన్పించేవారు.

బయట కాలుపెట్టిన స్త్రీ ప్రతిక్షణం ఎలాంటి చిన్న చిన్న అవమానాలకూ, ఇబ్బందులకు గురి అవుతుందో తెలుసుకుంది. ఇంటినుంచి బయలుదేరిన దగ్గర్నుంచి మళ్ళీ ఇంటికి వచ్చేలోగా, బస్‌స్టాండుల్లో, బసుల్లో కూడా స్త్రీ ఎదుర్కొనే అవమానాలు రాధ అనుభవంలోకి కూడా వచ్చాయి.

ఒక రోజు రాధ బస్ ఎక్కింది. కూర్చోవడానికి సీటు లేక నిలబడివుంది. వెనకనుంచి పూర్తి శరీరం తగిలేలా ఆనుకున్న వ్యక్తిని వెనక్కు తిరిగి చూసింది. బస్ పెద్ద ఇరుకుగా లేదు. అతను ముందుకు పోవచ్చును. రష్‌గా వున్నప్పుడు జనంలో నిల్చోనడానికి రాధకు ఏమీ అనిపించదు. కాని

కావాలని తాకడం, మీద మీదకు నిల్చోవడం రాధ భరించలేదు.

"ముందుకు వెళ్ళరాదూ?" అన్నది అతి మొరటుగా విద్యాగంధం ఏమాత్రం అంటనట్లువున్న ఆ మగవాడితో.

"ఏం? మగవాడు తగిలితేనే పాతివ్రత్యం పోతుందనుకుంటే టాక్సీలో వెళ్ళకపోయావ్?" వాడు కసిగా అన్నాడు.

రాధకు వళ్లు మండిపోయింది.

దరిదాపుల్లో కూర్చున్న మగవాళ్లు వెకిలిగా నవ్వారు అతని మాటలకు.

రాధకు దుఃఖం వచ్చింది. ఆడవాళ్లు అదేమీ పట్టనట్టే కూర్చున్నారు. మరో మాట అంటే అతను ఇంకా మొరటుగా ఏమంటాడో అనే భయంతో అవమానాన్ని దిగమింగుకుంటూ నిల్చుంది.

మరో రోజు బస్‌లో నిల్చున్న రాధను కండక్టర్ భుజం తట్టి టికెట్ అడిగాడు.

"ఏయ్! భుజం తట్టి టికెట్ అడుగుతావేం" కోపంగా అన్నది రాధ.

"మరి నీ పేరు నాకు తెలియదుగా!" పొగరుగా జవాబిచ్చాడు కండక్టర్.

"టికెట్ అడగటానికి పేరు తెలియాలా?" అన్నది రాధ పక్కగా నిల్చొన్న ఒక కాలేజీ అమ్మాయి.

మగవాళ్ళంతా వెనక్కు తిరిగి ఆ వింత చూస్తున్నారు.



"పేరు తెలియకుండా ఏం పేరుతో పిలవమంటావ్?" కొంటెగా అన్నాడు కండక్టర్.

"వళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు" రాధ గట్టిగా అన్నది.

"ఏం? ఏం చేస్తావేం? అంత నామోషీ కలదానివి టాక్సీలో వెళ్ళలేకపోయావా?"

"చూడండి ఆ మగవాళ్ళంతా ఎలా పళ్ళికిలిస్తున్నారో!" అన్నది కాలేజీ అమ్మాయ్.

"పాపం! పిచ్చివాళ్లు. నిన్నూ, నన్నూ అవమానించిన ఈ కండక్టరు రేపు వాళ్ళ పెళ్ళాల్నీ, చెల్లెళ్ళనూకూడా అవమానిస్తాడనే ఆలోచన తట్టని వాళ్ళు" రాధ కసిగా అన్నది.

ఆ మాటతో మగవాళ్లు బిగుసుకుపోయి కూర్చున్నారు. కండక్టర్ గబగబా ముందుకెళ్ళిపోయాడు.

"అదేమిటమ్మాయ్! మగవాళ్ళను అంత మాటంటావ్?" చెయ్యరాని తప్పు ఏదో రాధ చేసినట్టు, వెనకసీట్లో పసివాణ్ణి ఒళ్లో కూర్చోపెట్టుకొని కూర్చున్న ఓ నడివయసు స్త్రీ అన్నది.

రాధకు ఆమెను చూస్తూంటే లాగి చెంపదెబ్బ కొట్టాలనిపించింది.

"ఏం పిన్నిగారూ! పాపం, బాబాయిగారు కూడా ఈ బస్‌లోనే వున్నారా?" వ్యంగ్యంగా అడిగింది రాధ.

కాలేజీ అమ్మాయిలు కిసుక్కున నవ్వారు.

"లేకపోతే ఏమిటమ్మా? ఆడపిల్లల్ని అవమానిస్తుంటే

పెద్దవారు మీరు ఆదుకోవాల్సింది పోయింది. సరదాచూస్తూ కూర్చున్నారు ఇంతసేపూ! ఇప్పుడేమో నీతులు చెబుతున్నారా అన్నది రాధ.

"ఆడవాళ్ళకు అంత నోరు పనికిరాదు" ఆమె పక్కనే కూర్చునివున్న ఓ బామ్మగారు అన్నది. ఆమె అత్తగారై ఉంటారు అనుకొంది రాధ.

"ఆడ.... ఆడ.... ఈ ఆడవాళ్ళే దీనికంతా కారణం" మనసులో అనుకొని "బామ్మగారూ! తాతయ్యగారు మిమ్మల్ని నోరు తెరిస్తే తన్నేవారా ?" అన్నది రాధ.

మళ్ళీ కాలేజీ అమ్మాయిలు నవ్వారు.

రాధ బస్ దిగిపోయింది. మనసంతా కసికసిగా వుంది.

బస్ దిగి చకచకా నడుస్తున్న రాధకు "అభీనజావో ఛోడ్ కర్. అభీతో కుచ్ కహా నహీం! అభీతో కుచ్ సునా నహీం!" పాట వినిపించింది. రాధ నిలబడి వెనక్కు చూసింది. పాడుతూ వెనకే నడుస్తున్న కుర్రాడు ఆగిపోయాడు. జొమ్మల ష్టు. జుట్టు మెడలమీదా, ముఖంమీదా పడుతుంది. మెళ్లో పూసలమాల. వాణ్ణిచూస్తే రాధకు నవ్వొచ్చింది.

"ఏం నిలబడిపోయావేం ! రా! ఏం చెప్పకుండానే వెళ్తున్నానని ఏడుస్తున్నావుగా చెబుతా రా!" అన్నది రాధ.

ఆ కుర్రవాడు బిత్తరపోయాడు. ఇంతవరకూ చాలామంది ఆడపిల్లల్ని ఏడిపించాడు. భయపడిన వాళ్ళనూ, సిగ్గుపడుతూ వంకర నడకలు నడిచిన వాళ్ళనూ చూశాడు. కాని



ఇలా నిలబడి దగ్గరకు పిల్చిన ఆడపిల్లలను చూడలేదు. ఆ కుర్రాడికి చెమట్లు పట్టాయ్!

"ఏం చిట్టీ అట్లా నిలబడిపోయావేం! ఇలా రా!" అన్నది రాధ బుసలుకొడ్తూ.

ఆ కుర్రాడు జవాబివ్వకుండా పక్కసందులోకి గబగబా వెళ్ళిపోయాడు. రాధకు నవ్వొచ్చింది.

ఆడపిల్లలు భయపడతారు. అందుకే మగవాళ్లు వెంటబడతారు. అల్లరి చేస్తారు. ఆడది తిరగబడిన రోజున మగవాడు ఆడదాన్ని 'అబల'గాకుండా తోటివ్యక్తిగా, మనిషిగా గుర్తిస్తాడు.

రోజూ రాధ ఎక్కే బస్‌లో మరో ఇద్దరు యువతులు ఎక్కుతారు. రాధకు వాళ్ళతో పరిచయం అయింది. ఇద్దరూ అక్కచెల్లెళ్ళు. ఇద్దరూ రాధకంటే ఎక్కువే చదివారు. పట్నంలో పెరిగారు. అక్క ఎం. ఏ. పాసయింది. చెల్లెలు ఎం. ఏ. తప్పింది.

అదే బస్‌లో నలుగురు యువకులుకూడా రోజూ వస్తుంటారు. ఏదేదో వెకిలిగా మాట్లాడుతూ వుంటారు. వాళ్ళు ఎక్కగానే ఇద్దరు అక్కచెల్లెళ్లు బిగుసుకొని కూర్చుంటారు. అందులో ఒకడికి మెడతిరగదు. పక్కకు చూడాలంటే మనిషంతా సగం పక్కకు తిరిగి చూడాలి. ఒకడు పొట్టిగా, లావుగా, అప్పుడే 'జూ'లో నుంచి తప్పించుకొని వచ్చినట్టుంటాడు. ఒకడు బక్కగా, నల్లగా, పళ్ళెత్తుగా, ఎవర్నో ఎప్పుడూ వెక్కిరిస్తున్నట్టుంటాడు. మరొకతను తెల్లగా, ఎత్తుగా అందంగా వాళ్ళమధ్య హీరోలా పోజుపెడ్తూ కూర్చుం

టాడు. వాళ్లంతా స్కూల్ ఫైనల్ పాసయి గుమాస్తా ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళే. అయినా వాళ్ళ వెకిలి మాటలకూ, చూపులకూ అంత చదువుకొన్న ఆ ఇద్దరు యువతులూ బిక్క మొహాలు వేసుకొని కూర్చుంటారు.

ఆ రోజు ఆ యువతులిద్దరూ దిగిపోగానే, అల్లరిచేసే ఆ గ్రూపుకి తెలిసిన ఒక యువకుడు బస్సెక్కి ఆ యువతులు ఖాళీ చేసిన సీట్లో కూర్చోబోయాడు.

"అరే! అక్కడ కూర్చోకు!" మెడ తిరగనివాడు గావుకేక పెట్టాడు.

కూర్చోబోయిన యువకుడు దిగ్గునలేచి నిల్చున్నాడు. వాళ్లు నలుగురూ గొల్లున నవ్వారు. బస్‌లో కూర్చున్నవాళ్ళకు అర్థంకాలేదు. తెల్లముఖాలు వేసుకొని చూశారు.

"ఇప్పుడే ట్రావెన్‌కూర్ సిస్టర్స్ దిగారు. ఆ సీట్లోనే కూర్చున్నారు. చూసి కూర్చో!" అన్నాడు పళ్ళెత్తు అతను.

ఈసారి కండక్టరుతో సహా దాదాపు అందరూ గొల్లున నవ్వారు.

రాధకు ఏదోగా అన్పించింది. అందర్నీ నిలబెట్టి నాలుగు దులపాలనిపించింది. ఏమీ చెయ్యలేక రోజూ ఎక్కే మరో యువకునివైపు చూసింది. అతను నిండుగా హుందాగా, ఆడపిల్లల్ని దొంగచూపులు చూడకుండా కూర్చుంటాడు. అతనంటే రాధకు తెలియకుండానే ప్రత్యేక భావం ఏర్పడింది. ఒకరోజు అతను బస్ ఎక్కకపోతే రాధకు ఆ బస్‌లో ఏదో వెలితి కన్పించేది.



రాధ అతనికేసి చూసింది. అతను నవ్వలేదు. ఆ మాటలన్న యువకుడిని ఏవగింపుగా ఓక్షణంచూసి, ముఖం తిప్పుకున్నాడు.

మరో పెద్దమనిషి విసుగ్గా ఏదో గొణుక్కున్నాడు.

ఎందుకు చాలామంది ఇలా ప్రవర్తిస్తారు? వీళ్ళకు ఏవేవో తీరని కోర్కెలు వుంటాయి. ఇట్లా వెకిలిగా మాట్లాడి ఏదో సంతృప్తి చెందుతారు!

ఆలోచిస్తూ రాధ తను దిగవలసిన స్టాప్ మర్చిపోయింది.

"ఏమోయ్! ఇంకా కూర్చున్నావ్ దిగకుండా? నాతో వస్తావా?" అన్నాడు మెడ తిరగనివాడు పొట్టివాడితో.

రాధ ఉలిక్కిపడింది. అది ఇన్‌డైరెక్టుగా తనను గురించి అన్న మాటేనని అర్థం చేసుకుంది. పక్క స్టాపులో దిగిపోతున్న రాధకు మళ్ళీ నవ్వులు విన్పించాయి. తనమీద ఎవడో వెకిలిజోక్ విసిరివుంటాడని అర్థం చేసుకుంది. మనసంతా చీదర చీదరగా కసికసిగా వుంది.

ఇలా రోజూ ఏదో సంఘటన, ఆడదాని ఆడతనాన్ని ఎత్తిచూపుతూ చిన్నతనం చేసే సంఘటన రాధకు ఎదురౌతూనే వుంది.

మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. రాధకు జీవితం రొటీన్‌గా అనిపిస్తోంది. భూగోళమంత వంటరితనం ఆమెలో ఏర్పడింది. ఏదో అశాంతి వెన్నాడసాగింది. ఆ అశాంతి నుంచి తనను తాను కాపాడుకోవడానికి స్నేహితుల సంఖ్య

పెంచుకుంది. అయినా ఆమె వంటరితనం నుంచి బయటపడలేకపోతుంది.

వంటరిగా కూర్చుని గంటలకొద్దీ ఆలోచించేది. అందరిలా తను బతకకూడదు. తను ఏదో చెయ్యాలి. ఏమో కావాలి. కాని ఏం చెయ్యాలి? ఏం కావాలి? తను ప్రైవేటుగా నైనా ఎం. ఏ. పాసుకావాలి. ఆ తర్వాత .... ఇంతకంటె కొంచెం పెద్ద ఉద్యోగం వస్తుంది. జీతం ఎక్కువ అవుతుంది. ఇంతకంటే కొంచెం సుఖంగా బ్రతకవచ్చు. ఆ తర్వాత? ఇదేనా తను కోరుకొనే ప్రత్యేకత? కాదు .... కాదు ....

* * *

"సిస్టర్ !"

"దాహం వేస్తుందా రాధా ?"

"అవును !" అన్నట్లు తల ఊపింది రాధ.

సిస్టర్ రాధ గొంతులో నీళ్లు పోసింది.

## 12

"రాధా !"

"ఏం సిస్టర్ ?"

"ఏమిటమ్మా అలా కప్పుకేసి కన్నార్పకుండా చూస్తున్నావ్ ?" అన్నది గ్రేస్.

"ఆ బల్లిని చూస్తున్నాను సిస్టర్. పురుగుల్ని మింగి మింగి పొట్ట బాగా ఉబ్బింది. అయినా కన్పించిన ప్రతి



పురుగు మీదకూ దూకుతుంది. ఆ పురుగును చూడండి సిస్టర్ బల్లి దగ్గరకే పోతుంది. పాపం! దాన్ని మృత్యువు ఆహ్వానిస్తోంది. అదుగో బల్లి పట్టేసింది సిస్టర్. మరి కొద్ది గంటల్లో మృత్యువు నన్నుకూడా అలాగే కబళిస్తుంది గదూ సిస్టర్? ఆ తర్వాత! కొంత కాలం .... చాలా కొద్ది కాలం మీ మనసులో. మరికొందరి మనసుల్లో మిగిలి వుంటాను. ఆ తర్వాత.... ?"

"రాధా !" గ్రేస్ కంఠం బరువుగా వుంది.

"మనసు మిఠాయా చెప్పండి సిస్టర్ !" రాధ ఆలోచనల్లో పడిపోతూ తనను తనే ప్రశ్న వేసుకున్నట్లు అన్నది.

"నాకు తెలియదమ్మా! నువ్వే చెప్పు ?"

"మనసు మిఠాయి కాదు సిస్టర్! అడిగిన వాళ్ళందరికీ పంచిపెట్టటానికి. నాలుగు రోజులు నవ్వుతూ మాట్లాడేప్పటికి సుబ్బారావు పెళ్ళి చేసుకోమన్నాడు. నేను అంగీకరించకపోతే ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. అయినా నేను లక్ష్యపెట్టలేదు. ఆరు నెలలు తిరక్కుండానే తల్లిదండ్రులు చూసిన పిల్లను చేసుకున్నాడు. మరో సుబ్బారావు ప్రేమిస్తున్నా నన్నాడు. అతను వివాహితుడు. అయినా నన్ను ప్రేమిస్తున్నాడట. ప్లెటానిక్ లౌ అట. నాలుగు దులిపేసేప్పటికి, ఆ తర్వాత నా మీద దుష్ప్రచారం ప్రారంభించాడు, మరో సుబ్బారావు జీవితమంతా బ్రహ్మచారిగానే వుంటానన్నాడు. అలాగే వుండమన్నాను. కొందరు బ్రహ్మచారులుగా వుండడం దేశానికి చాలా మంచిదన్నాను. కొద్ది రోజులు ఓపికపట్టి నేను మారతానేమోనని చూశాడు.

ఇంకొక సుబ్బారావు ప్రేమ లేఖలు రాయసాగాడు........" అంటూ ఓ క్షణం ఆగింది రాధ.

"అదేమిటి రాధా! అందరి పేర్లూ సుబ్బారావు లేనా?" ఆశ్చర్యంగా అడిగింది గ్రేస్.

రాధ నీరసంగా నవ్వింది.

"కాదు సిస్టర్. ఏ పేర్లయితేనేం? అందుకే అందర్నీ సుబ్బారావులనే చెబుతున్నాను."

"తమాషాగా మాట్లాడుతున్నావ్ రాధా!" అన్నది గ్రేస్.

రాధ మాట్లాడలేదు. పేలవంగా నవ్వింది.

"వంటరితనం వెంటాడుతున్నప్పుడు అంతమంది నీ జీవితంలోకి వచ్చారుగదా? వాళ్ళందర్నీ ఎలా తిరస్కరించావ్? అందులో ఒక్కరూ నీకు నచ్చలేదా! ఎవరూ నీకు కావాల్సిన వ్యక్తి అనిపించలేదా?" అడిగింది గ్రేస్.

"నాకు అతి సన్నిహితుడైన వ్యక్తికి దూరం అయినట్టు అన్పించేది. నా ఈ అశాంతికి కారణం ఆ వ్యక్తేననీ, నాలో ఏర్పడిన ఆ ఖాళీ అతని వల్లనే నిండుతుందనీ కూడా అన్పించేది. అప్పటి నుంచీ నాకు తెలియకుండా నేను ఆ వ్యక్తికొరకు అన్వేషించసాగాను. నా జీవితంలో ఎదురైన సుబ్బారావుల్లో కొందర్ని దూరంగా చూసి భ్రమ పడ్డాను. కాని వాళ్ళు తీరా దగ్గరకు వచ్చేసరికి "నువ్వు కాదు .... నువ్వు కాదు.... నీ కోసం కాదు నా అన్వేషణ," అంటూ అంతరాత్మ తిరగబడేది. నేను దూరంగా పారిపోయే దాన్ని" అంటూ కళ్ళు మూసుకుంది రాధ.



గ్రేస్ రాధ ముఖంలోకి చూస్తూ కూర్చుంది.

"మగవాళ్ళతో హాయిగా మాట్లాడగలను. నాకు ఎలాంటి కాంప్లెక్సూ లేదు. కాని అవతలి వ్యక్తి అవసరమైన దానికంటే నా మీద ఎక్కువ శ్రద్ధ తీసుకున్నా లేక ఆరాధిస్తున్నట్టు కన్పించినా; ప్రేమిస్తున్నట్టు వ్యక్తంచేసినా, నేను భరించలేను. నాలోనే నేను ముడుచుకుపోతాను. అటువంటి వ్యక్తి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తాను."

"నీ భావాలు చాలా చిత్రంగా వున్నాయి"-గ్రేస్ అన్నది.

"ఇవి భావాలుకావు సిస్టర్! నా స్వభావం అటువంటిది. ఎవరైనా నన్ను అమితంగా ప్రేమించడాన్ని భరించలేనేమో అనిపిస్తుంది. సోమర్ సెట్ మామ్ కూడా అతని "సమ్మింగ్ అప్"లో తన స్వభావం గురించి చెబుతూ సరిగ్గా ఇలాంటి భావాన్నే వ్యక్తం చేశాడు. ఎవరైనా తనను ప్రేమిస్తున్నారని తెలిసినప్పుడు మామ్ వాళ్ళనుంచి పారిపోయేవాడట. బహుశా దీనికి కారణం, నాలాగే మామ్‌కు కూడా చిన్నతనంలో అవసరమైన ప్రేమా, ఆదరణా ఆప్యాయతా లభించి వుండలేదేమో!" రాధ నిట్టూర్చింది.

"రాధా! నీకు ఎదురైన సుబ్బారావుల్లో కొందర్ని గురించి వినాలని వుంది-" అన్నది గ్రేస్ కుతూహలంతో.

రాధ ఓ క్షణం గ్రేస్ ముఖంలోకి చూసి వేదాంతిలా నవ్వింది.

"టయిమ్ ఎంతయింది సిస్టర్?"

"నాలుగున్నర దాటింది."

"అయితే క్లుప్తంగా చెబుతాను. కథ ముగించాకుండా వెళ్ళిపోతానేమోనని భయంగా వుంది" అన్నది రాధ.

"లేదమ్మా! నువ్వు బ్రతుకుతావు. నువ్వెందుకు అలా అనుకొంటున్నావో నాకు అర్థం కావడంలేదు."

రాధ పేలవంగా నవ్వింది. "వినండి సిస్టర్"....

.... .... .... .... ....

రాధకు జీవితం ఎదుగూ బొదుగూ లేనట్లు, గానుగెద్దు జీవితంలా అన్పించ సాగింది. రాధ పిచ్చిగా పుస్తకాలు చదివేది. ఒంటరితనంనుంచి పారిపోయే ప్రయత్నంలో స్నేహితురాండ్ర సంఖ్యను పెంచుకొంది.

తనకు సన్నిహితులుగా వుండే యువతులందరికీ ఏదో ఒక ప్రేమకథ వుంది. కొందరు సంతోషంగా తమ ప్రియుల గురించి చెబుతూ వుండేవారు. కొందరు మోసపోయి అంతులేని దుఃఖాన్ని వెలిబుచ్చేవారు. రాధకు అతి సన్నిహితురాలైన సుశీల కథ భిన్నమైంది. సుశీల ప్రేమిస్తున్న అతనికి వివాహం అయింది. ఇద్దరు పిల్లలుకూడా ఉన్నారు. సుశీల అతన్ని గాఢంగా ప్రేమిస్తుంది. ఒకరోజు దిగులుగా వున్న సుశీల దగ్గరకు రాధ వచ్చింది.

"ఏమిటి సుశీలా అంత దిగులుగా ఉన్నావేం?" అడిగింది రాధ.

"నా బ్రతుక్కి దిగులుకాక మరేమిటి?"

"అందుకే ఆ పిచ్చి వదిలెయ్ మంటున్నాను."

సుశీల అదోలా నవ్వింది. "పిచ్చి ఎక్కకుండానే



వుండాలిగాని, ఎక్కిన తర్వాత దాన్ని వదిలించుకోవడం మన చేతుల్లో వుంటుందా?" పుట్టెడు దిగులుగా అన్నది.

"బుద్ధిలేకపోతే సరి!" చనువుగా మందలించింది రాధ.

"ఎవరికి?"

"నీకూ అతనికీకూడా! పెళ్ళయినవాణ్ణి నువ్వు ప్రేమించటం ఏమిటి? పెళ్ళాం బిడ్డలున్నవాడు నిన్ను ప్రేమిస్తున్నాననటం ఏమిటి?"

"ప్రేమించటం ప్రేమించకపోవటం మన చేతుల్లో లేదు రాధా! నువ్వు అదృష్టవంతురాలివి. ఇంకా ఈ రొచ్చులో పడలేదు."

"పడలేదు. పడనుకూడా!" గర్వంగా అన్నది రాధ.

"మరీ అంత ఖచ్చితంగా చెప్పకు. నేనూ నీలా ప్రేమల గురించి ఎగతాళిచేసినదాన్నే. జీవితమార్గంలో ఎంతోమంది ఎదురుపడ్తారు. కాని అందర్నీ గమనించంకూడా, కొందర్ని ఒకసారి ముఖంలోకి చూసి తప్పుకుపోతాం. కొందర్ని చూసి "ఎక్కడో!" చూసినట్టుందే అని ఓ క్షణం ఆలోచిస్తాం. కొందరు దాటిపోయాక ఒకటి రెండుసార్లు నడుస్తూనే వెనక్కితిరిగి చూస్తాం! వాళ్ళూ వెనక్కితిరిగి చూస్తారు. కాని ఆగిపోవడం జరగదు. ఎవరిదారిన వాళ్ళం వెళ్ళిపోతాం. కాని వాళ్ళను తర్వాతకూడా కొన్ని క్షణాలు జ్ఞాపకం చేసుకుంటాం. అంతవరకే అయితే జీవితం సుఖంగానే ఉంటుంది. కాని, ఒకరోజు అనుకోకుండా ఎదురుపడిన వ్యక్తిని చూసి ఉలిక్కిపడతాం. ఎదురుగా నిలబడిపోతాం! శాశ్వతంగా నిలబడిపోవాలనే బలమైన కాంక్ష మనల్ని ముందుకు కదల

నివ్వదు. అంతే జీవితం అక్కడే ఆగిపోతుంది" దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది సుశీల.

రాధ ఆశ్చర్యంగా సుశీల మాటలు వింటూ కూర్చుంది.

"అటువంటి జీవితం నాకు అక్కర్లేదు. నా జీవితం చివరి ఊపిరివరకూ అశాంతిగా అన్వేషిస్తూనే వుండాలి. ఆగిపోయిన రోజు నేను వుండను. నేను వున్నంత కాలం ఎక్కడా ఆగను." రాధ తనకు తనే చెప్పుకుంటున్నట్టు అన్నది.

సుశీల మౌనంగా కూర్చుంది.

"సుశీలా అసలు విషయం వదిలేసి ఏదేదో మాట్లాడు తున్నాం! ఇప్పుడు ఏం చెయ్యాలని?"

"ఏం చేస్తానా? జీవితమంతా ఏడుస్తూ కూర్చుంటాను." అన్నది సుశీల బాధగా.

"అతనేమంటాడు? ఇద్దరూ ఒకర్నొకరు అంత గాఢంగా ప్రేమించుకుంటున్నారు గదా మరి ఈ దుఃఖం దేనికి?"

"ఈ దొంగ బ్రతుకు నాకిష్టంలేదు. నేను అతని మనిషిగా లోకం గుర్తించాలనే ఆర్తి నన్ను ప్రతి నిముషం దహించివేస్తోంది."

రాధ ఆలోచనలో పడింది. "నీ అభిప్రాయాన్ని అతనికి చెప్పావా?"

"లేదు. నేను అతని వాకిలి ముందుకు ఆలస్యంగా వచ్చిన అతిథిని. అప్పటికే ఆ ఇల్లు నిండుగా వుంది."



"పోనీయ్ ఆ ఇంట్లోనే ఓ మూల కొంతస్థానం ఇస్తే అందులో ఇరుక్కుని బ్రతుకుతో రాజీపడగలవా?"

"నాకు అంత అదృష్టం లేదు రాధా!"

"ఏం?"

"నేను అతని స్నేహితురాల్నని ప్రపంచానికి తెలియడమే ఇష్టం లేదు. అతని ఇంట్లో స్థానంకోసం ఆశించడం, నీటికొరకు మృగతృష్ణ వెంట పరిగెత్తడమే!"

రాధ విస్మయంగా సుశీల ముఖంలోకి చూసింది.

"ఏమిటి రాధా అలా చూస్తున్నావ్?"

"అంటే అతనికి నీతో రహస్యంగా ప్రణయం సాగించడానికి మాత్రం ఏ అభ్యంతరమూ లేదన్నమాట!" రాధ కంఠం తీవ్రంగా పలికింది.

సుశీల తలవంచుకొన్నది.

"అయినా అతను నిన్ను ప్రేమిస్తున్నాడనే నమ్ముతున్నావు గదూ?"

సుశీల మాట్లాడలేదు.

"చెప్పు సుశీలా!" రాధ మళ్ళీ అడిగింది.

"కొంతకాలం నన్ను అతను నిజంగా ప్రేమిస్తున్నాడా అనే అనుమానం బాధించేది. తర్వాత తర్వాత ఆ విషయం గురించి ఆలోచించడమే మానేశాను. అతని నిజాయితీ గురించి ఆలోచించటం మానేశాను. ఒకటిమాత్రం తెలుసుకున్నాను. నేను అతన్ని దూరం చేసుకోలేను అని."

"అంటే అతనికి ఉంపుడుగత్తెగా వుంటావా?" తీవ్రంగా పలికింది రాధ కంఠం.

సుశీల చివ్వున తలెత్తి చూసింది. ఆ కళ్ళల్లో శ్రావణ మేఘాలు కమ్ముకున్నాయ్. రాధ ముఖం మసక మసగ్గా కన్పించింది.

సుశీలను బాధపెట్టినందుకు రాధ నొచ్చుకుంది. తను ఆ మాట రాధను నొప్పించాలని అనలేదు. అలా అంటే నయినా సుశీలకు రోషం వస్తుందనుకొన్నది. సుశీల పిచ్చిది. ఆ మాటకొస్తే ఈ విషయంలో ఆడవాళ్ళంతా సెంటిమెంటల్ ఫూల్సే. అతనికి నష్టం ఏముంది ? అతని సంసారం అతనికి వుంది. బోలెడంత పలుకుబడివుంది. సంఘంలో ఒక ప్రత్యేకమైన అంతస్తువుంది. సుశీలను అతను పోషించవలసిన అవసరం లేదు. అప్పుడప్పుడు, రొటీనునుంచి విసుగు కలిగి నప్పుడు కొంత మార్పుకోసం సుసీల దగ్గరకువస్తాడు. అదీ రహస్యంగా, ఆ విషయం ఎవరికీ తెలియకూడదు. అతని రెప్యుటేషన్‌కు మచ్చ రాకూడదు. ఛ! ఎంత స్వార్థం రాధకు సుశీలమీద....ఆడవాళ్ళమీద....బోలెడంత కోపం వచ్చేసింది. మగవాళ్ళమీద....మగవాళ్ళు చేసిన శాసనాల మీద....మగవాడు ఏర్పరచిన సాంఘిక కట్టుబాట్లమీద కసి....కసి....గా వుంది.

రాధ సుశీలకుచెప్పి ఇంటికి వచ్చేసరికి రాజారావు పడక కుర్చీలో కూర్చుని వున్నాడు. రాధకు కుర్చీ నిండుగా పిటపిటలాడుతూ కూర్చునివున్న అతనిమీద అసహ్యం వేసింది. రాధను చూడగానే అతని గుండ్రటివేళ్ళు గాజు గోళీల్లా భావరహితంగావుండే అతనికళ్లు తళుక్కుమన్నాయి. ముఖం



చేటంత చేసుకొని నవ్వాడు. రాధ భ్రుకుటి ముడిచింది. అది చూసిన రాజారావు ముఖం చిన్నబోయింది.

రాజారావు పొట్టిగా లావుగా వుంటాడు. అతనిమాటల్లో. కళ్ళలో, బుర్రలో అంతా బోలుతనమే కన్పిస్తుంది. రాధకు, రాజారావు రాధ స్నేహితురాలు కల్యాణి అన్నయ్య. ఆ విధంగానే పరిచయం అయింది. రాధ కల్యాణితో వచ్చే రాజారావుతో కూడా చనువుగా వుండేది. వయసులో పెద్ద వాడే అయినా రాధకు అతనికంటే తనే చాలాపెద్దది అనే భావం కలిగేది. రాజారావు తరచు చెల్లెలు లేకుండా రాధ దగ్గరకు వస్తున్నాడు. పడక కుర్చీలో గంటలకొద్దీ కూర్చుంటాడు. ఏదేదో మాట్లాడతాడు. అతని భావాలూ, అతని ఆలోచనలూ, అతని జ్ఞానం అన్నీ కలిసి రాధ దృష్టిలో అతన్ని టీన్ ఏజ్ బాయ్‌గా నిలబెట్టాయి. అతను రాధ ముందు ముడుచుకుపోతాడు. రాధ కొంచెం నవ్వుతూ పలుకరిస్తే, చాలు అతని కళ్లూ, ముఖం వెలిగిపోతాయి. మహా ఉత్సాహంగా కబుర్లు చెప్పడం ప్రారంభిస్తాడు. ఖాళీ డబ్బాలో గులకరాళ్ళు మ్రోగినట్టు వుంటుంది రాధకు అతని కబుర్లు వింటుంటే. ఎక్కువసేపు ఆ కబుర్లను భరించలేక సీరియస్‌గా ముఖం పెట్టేస్తుంది. ఆ ముఖం చూడగానే లేచి వెళ్లిపోతాడు రాజారావు నీరసంగా.

"ఎక్కడికెళ్ళారూ?" ఏదో పలకరించాలన్నట్టు అడిగాడు రాజారావు.

"ఎక్కడికైతే మీకెందుకు?" కస్సున లేచింది రాధ.

బిక్క మొహం వేశాడు రాజారావు. ఆ ముఖం చూస్తుంటే రాధకు నవ్వు వచ్చింది, కాని నవ్వలేదు.

రాజారావు పడక కుర్చీలో కదిలాడు. కుర్చీ కిరకిర లాడింది. రాధకు వళ్ళు మండిపోయింది.

"ఆ కుర్చీలోంచి లేవండి!"

రాజారావు ముందు బిత్తరపోయి రాధ ముఖంలోకి చూశాడు. ఆ తర్వాత లేచి నిల్చున్నాడు. రాధ పడక కుర్చీని మడిచి లోపల గదిలో ఒక మూల గోడకు అనించి పెట్టింది. రాజారావు వెళ్ళిపోయి వుంటాడనుకుంది. కాని రాధ వచ్చి చూసేటప్పటికి అక్కడ వున్న గాడ్రేజ్ కుర్చీమీద కూర్చుని వున్నాడు.

"పెరగని మనిషి!" అనుకుంది రాధ. మనసులో ఏవగింపూ, జాలీ ఒకదాన్నొకటి వొలుచుకున్నాయ్.

"నాకు తల నొప్పిగా వుంది. ఇప్పుడు మీతో మాట్లాడే తీరిక నాకు లేదు రాధ విసుగ్గా అన్నది.

"మీతో ఇవాళ ఒక ముఖ్య విషయం మాట్లాడాలని వచ్చాను," నీళ్లు నములుతూ అన్నాడు, రాజారావు.

"ఏం బాబూ! పెళ్ళి చేసుకోమనీ అడుగుతావా! నన్ను చూస్తేనే నంగి నంగి మాట్లాడే నువ్వు "నిన్ను ప్రేమిస్తున్నాను రాధా!" అంటూ ప్రేమడైలాగ్ ఏడుస్తావా ఏమిటి?" రాధ అనాలనుకొన్నది. కాని అనలేక పోయింది అప్పటికే సగం నీళ్ళు కారిపోతున్న ముఖంలోకి చూస్తూ.

"ఇప్పుడు నేనేం మాట్లాడలేను. దయచేసి వెళ్ళండి," అన్నది రాధ సాధ్యమైనంత సాత్వికంగా.



"నేపొస్తాను," అంటూ రెండడుగులు వేసిన రాజారావు "రానక్కర లేదు," అన్న రాధ మాటలు విని తక్కున ఆగిపోయాడు. విస్మయంగా రాధ ముఖంలోకి చూశాడు.

"ఏం నేను చెప్పింది అర్థం కాలేదా? తెలుగే మాట్లాడాను," అన్నది రాధ కటువుగా.

"రాధా!" బాధగా అన్నాడు రాజారావు.

అతను తన పేరు ఉచ్చరించిన తీరుకు రాధ చిరాకు పడింది.

"ఏమిటా పిలుపు? మర్యాదగా పిలవండి!" అంత గట్టిగా మాట్లాడపోతే "రాధా నిన్ను ప్రేమిస్తున్నాను," అంటూ చాలా పెద్ద బరువు డైలాగే వేసేస్తాడని రాధ భయం.

రాజారావు తడబాటు చెందాడు.

"వెళ్ళండి! నాకు వంట్లో బాగా లేదు. మీతో వాగుతూ నిల్చోలేను," అంటూ రాధ విసురుగా లోపలకు వెళ్ళిపోయింది.

ఐదు నిమిషాల తర్వాత వచ్చి చూస్తే రాజారావు లేడు. రాధ హాయిగా గాలి పీల్చుకుంది గుండెల నిండుగా.

## 13

"రాధా! రాధా!" గ్రేస్ వణుకుతున్న కంఠంతో గాబరాగా పిల్చింది.

రాధ పలకలేదు.

నర్స్ నాడి పరీక్షించింది. హడావిడిగా బయటికి వెళ్ళి డాక్టర్ను వెంటబెట్టుకొని వచ్చింది.

డాక్టరు చూసి ఇంజక్షన్ ఇచ్చాడు.

"ఫర్వాలేదు. పది నిముషాల్లో తెలివి వస్తుంది" అన్నాడు.

"ఆమె బ్రతుకుతుందా డాక్టర్ ?" ఆదుర్దాగా అడిగింది నర్స్.

"చెప్పలేను. కాని ఆమె ఏదో బలవంతమైన కోర్కె వల్ల మృత్యువుతో పోరాడుతూంది-" అన్నాడు డాక్టర్ ఆలోచిస్తూ.

"అవును డాక్టర్. ఆమెకు తను చనిపోయే ముందు తన జీవితం గురించి నాకు చెప్పాలనే బలమైన కోర్కె వుంది. రాత్రంతా నాతో మాట్లాడుతూనే వుంది," అన్నది గ్రేస్.

డాక్టర్ విస్మయంగా గ్రేస్ ముఖంలోకి చూశాడు.

"ఆమెకు త్వరలోనే స్పృహ వస్తుంది. మళ్ళీ మాటల్లో పెట్టు. ఆరు దాటేంతవరకూ ఆమె మాట్లాడుతూనే వుండేలా చూడు. ఆ తర్వాత ఆమె మృత్యుముఖం నుండి బయటపడే అవకాశం వుంది-" అన్నాడు డాక్టర్ సాలోచనగా.

"నిజంగానా డాక్టర్ ? గ్రేస్ సంతోషంగా అడిగింది.

"నాకు అలాగే అన్పిస్తుంది మరి !"

డాక్టర్ క్షణం మౌనంగా నిల్చుని రాధ ముఖంలోకి చూశాడు.



"వస్తాను-" అంటూ వెళ్ళిపోయాడు డాక్టర్.

గ్రేస్ మంచం పక్కగావున్న స్టూల్ మీద కూర్చుని రాధ ముఖంలోకి ఆత్రంగా చూడసాగింది.

రాధ కళ్లు తెరిచింది.

గ్రేస్ ముఖం విప్పారింది.

"ఎలా వుందమ్మా ?"

"బాగానే వుంది. నేను నిద్రపోయానా సిస్టర్ ?" రాధ నీరసంగా అడిగింది.

"అవునమ్మా ! పదినిముషాలు మాత్రమే!"

"టైమెంత అయింది ?"

"అయిదు కావస్తుంది."

"నాకు ఒక తమాషా కలవచ్చింది."

"ఏమిటమ్మా ఆ కల ?"

"నేను ఒక నది ఒడ్డున నిలబడి వున్నాను. నాతోపాటు చాలామంది నిలబడి వున్నారు. ప్రతిఒక్కరికీ చిన్న చిన్న పడవలు ఉన్నాయ్. ఒక్కొక్కరే తమ పడవల్లో అవతలి ఒడ్డు చేరుతున్నారు. కొందరు సుడిగుండాల్లో చిక్కుకొని మునిగిపోతున్నారు. కొందరు అతిప్రయాసమీద అవతలి ఒడ్డు చేరుకుంటున్నారు. కొందరు అతి సునాయాసంగా చేరిపోతున్నారు...." రాధ ఆగి ఓ క్షణం కళ్ళు మూసుకుంది.

"మరి నువ్వో ? ఒడ్డు చేరావా ?" ఆరాటంగా అడిగింది కలల్లో నమ్మకంగల గ్రేస్.

రాధ అదోలా నవ్వింది.

"ఏమిటమ్మా అలా నవ్వుకుంటున్నావు ?"

"మీ ప్రశ్నకు నవ్వొచ్చింది సిస్టర్!"

"అంటే మధ్యలోనే మునిగిపోయావా?"

"మునిగిపోవడంకూడా సహజమేగా సిస్టర్! కాని నేను ఎప్పుడూ వాస్తవానికి దూరంగా ఆలోచించిన దాన్నే. అందుకే అందరూ వెళ్ళిపోతున్నా నేను ఒడ్డునే నిలబడిపోయాను. అందరితోపాటు నాకు వెళ్ళాలనిపించలేదు. ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. ఒడ్డున నిలబడ్డ నేను భద్రంగా వున్నాననుకున్నాను. అదే నా ప్రత్యేకత అనుకున్నాను. అలా ఎంతసేపు నిలబడిపోయానో నాకే తెలియదు. నది నీరు క్రమంగా గట్టును కొయ్యసాగింది. నా కాళ్ళకింది మట్టి కొట్టుకుపోతూంది. చుట్టూ చూశాను. ఎవరూ లేరు. ఒంటరితనం భయపెట్టింది. నా పడవకేసి చూశాను. అది ఎప్పుడో నీళ్ళలో కొట్టుకుపోయింది. నేను ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ అలాగే నిలబడిపోయాను. నన్ను తమతో రమ్మని పిల్చినవాళ్లను తల్చుకొని, వాళ్ల సలహా పాటించనందుకు బాధపడుతూ నిల్చున్నాను. నా కాళ్లకింద కంకరమాత్రం మిగిలిపోయింది. అదీ కొంతకాలానికి కొట్టుకుపోతుంది. ఒంటరిగా ఆ నదీతీరాన ఓపికలేక పడిపోయాను. నీళ్లు నా మీద మీదకు వస్తున్నాయి. అంతలో మెలకువ వచ్చింది."

గ్రేస్, రాధ చేతిని నిమురుతూ "రాధా!" అన్నది జాలిగా.

"నా అసంపూర్ణ జీవితాన్ని చూసి జాలిపడుతున్నారా సిస్టర్?"

"లేదమ్మా!"



రాధ తన ధోరణిలో చెప్పుకుపోతూంది - తనకు తనే చెప్పుకుంటున్నట్లు చిన్నగా-

"ఆమాటకొస్తే సృష్టిలో ఏవస్తువూ, ఏభావనకూడా సంపూర్ణమైనవి కావు. భూమి ఎందుకు నిరంతరం విసుగూ విరామం లేకుండా తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతూవుంది? భూదేవి గుండెల్లోని ఆ అశాంతికి కారణం ఏమిటి?"

అంటూ గ్రేస్ ముఖంలోకి చూసింది రాధ.

గ్రేస్‌కు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

"నువ్వే చెప్పమ్మా! నాకు తెలియదు," అన్నది గ్రేస్.

"భూమి సూర్యునిలోని ఒకభాగమే. సూర్యునినుంచి విడిపోయిన భూమికి సంపూర్ణత్వం లభించలేదు. మళ్లీ ఆ దినకరునిలో ఐక్యం అయితేగాని భూదేవికి సంపూర్ణత్వం లభించదు. అందుకే ఆ తపన.... ఆ అశాంతి. తను సూర్యునిలో ఐక్యం అయిన రోజు తను మిగలదు. తన వేరే అస్తిత్వం వుండదు-అనే విషయాన్ని మర్చిపోతుంది. భూమి సూర్యునిలో ఐక్యం అయిన రోజు మిగిలేది సూర్యుడు మాత్రమే. గమ్యం చేరుకోవడమే మృత్యువు. నిరంతర అన్వేషణే జీవితం. నేను నిరంతరం దేనికోసమో అన్వేషిస్తూనే జీవించాను. కలల్లో బ్రతుకుతూ, జీవితాన్ని ఒక సుందర స్వప్నంగా మలచుకోవడానికి ప్రయత్నించాను.

"కాని స్వప్నం జీవితంకాదు. కాలేదు. కలలు కనడం

తప్పుకాదు. కలల్నే వాస్తవాలుగా భ్రమపడటమే నువ్వు చేసిన తప్పు!"- అన్నది గ్రేస్.

రాధ ఆశ్చర్యంగా గ్రేస్ ముఖంలోకి చూసింది.

"మీరు చాలా బాగా మాట్లాడతారు సిస్టర్ !"

"నీ మాటలు వింటూంటే నా బుర్రకూడా పని చేస్తూంది-" నవ్వుతూ అన్నది గ్రేస్.

"నిజమే సిస్టర్. స్థూలంగా చూస్తే బిస్కట్లతో కంటే, జొన్న రొట్టెతో పొట్ట నింపుకొనేవాడే సుఖపడ గలడు."

"రాధా! ఒక సుబ్బారావును గురించి మాత్రమే చెప్పావ్ !"

రాధ విరక్తిగా నవ్వింది.

గతాన్ని నెమరు వేసుకోసాగింది.... .... .... ....

.... .... .... .... ....

రాధ ఉద్యోగంలో చేరి మూడేళ్ళయింది.

జీవితం చప్పచప్పగా, విసుగ్గా వుంది.

ఏమిటో వెలితి వెలితిగా వుంది.

అంతరాంతరాల్లో ఏదో ఖాళీ.... అది ఇంతింతై భూగోళమంతైనట్టు అన్పించసాగింది.

ఆ ఖాళీని.... ఆ వెలితిని.... పూడ్చుకొనే ప్రయత్నంలో స్నేహితురాళ్ళ సంఖ్యను పెంచుకోసాగింది. ఒంటరిగా వుండాలంటే భయం.

ప్రైవేటుగా చదివి ఇంటరు పాసయింది. బి. ఏ. కి



చదువుతూంది. ఎప్పుడూ బిజీగా వుండటానికి ప్రయత్నించసాగింది.

అయినా, గుండెల్లోని భూగోళమంత ఆ ఖాళీ-ఆ వెలితి నుండి వచ్చే హోరు నిరంతరం ఆమె చెవుల్లో "గుయ్" మంటూనే వుంది.

ఏదో అశాంతి-ఆరాటం-ఎక్కడా ఒక్క క్షణం నిలబడలేనితనం-దేన్నో పొందాలనే ఆర్తి-దేనితోనో ఆ ఖాళీని నింపితేగాని తనకు శాంతి లభించదనే భావం-అదేదో స్పష్టంగా తెలియని దానికోసం విశ్రాంతిని ఎరగని అన్వేషణ-

అది-ఆ ఖాళీ-ఎలా నిండుతుంది ?

అందుకే మానవుడు ప్రేమకోసం తపిస్తాడా ?

మానవజాతి క్రమ వికాసంతోపాటే ప్రేమ భావన కూడా వికసించిందేమో ?

మొదట గుండెల్లో చోటు చేసుకున్న మూగప్రేమ-కళ్ళలో వెలుగుగామారి—తరవాత సాక్షి రూపాన్ని ధరించి-ఈనాడు కథల్లో, కావ్యాల్లో, నటనలో, నృత్యంలో, గానంలో.... వ్యక్తం అవుతుందేమో ?

ఏమిటి ఈమధ్య తను ఇలా ఆలోచిస్తూంది ? తనకేమయింది ? తనకు తెలియకుండానే తను, ప్రేమకోసం తపిస్తూందా !

రాధ ఒంటరిగా కూర్చుని గంటలకొలదీ ఆలోచించేది.

రాధ తల్లి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూంది. రాధను వివాహం చేసుకోమని గొడవ చెయ్యసాగింది. రాధ తల్లి మాటలకు సమాధానం ఇచ్చేది కాదు. చిరునవ్వు నవ్వేది.

ఆ రోజు రాధ తల్లికి తీవ్రంగా జ్వరం వచ్చింది. కూతుర్ని దగ్గిరకు పిల్చి పక్కలో కూర్చో పెట్టుకుంది.

"నేను ఎక్కువ రోజులు బ్రతకను."

"అమ్మా!"

"పెద్దదాన్ని. రోగిష్టిని. ఎప్పుడు పోతానో తెలియదు."

"అమ్మా! అలా అనకు. నువ్వు చాలా రోజులు బ్రతకాలి" – వణికే కంఠంతో అన్నది రాధ.

రాధ తల్లి దిగులుగా నవ్వింది.

"చావు బ్రతుకులు మన చేతుల్లో వున్నయ్యా తల్లీ! నాకు ఒకటే దిగులు. నీ మెళ్లో ఆ మూడుముళ్లు పడితే ఏ చింతా లేకుండా కళ్లు మూస్తాను," రాధ చేతిని గోముగా నిమురుతూ అన్నది.

"మూడు ముళ్ళు-మూడు ముళ్ళు ...." కసిగా మనసులోనే అనుకుంది రాధ.

తల్లికి సమాధానం ఇవ్వలేదు.

"నీ ఇష్టం వచ్చిన వాణ్ణి, ఏ కులమైనా ఫర్వాలేదు-నా గొంతులో ఊపిరి వుండగానే చేసుకో తల్లీ!" అన్నది రాధ తల్లి.

"అమ్మా! ఒకమాట అడుగుతాను-నేనే కొడుకునైతే ఇలా నా పెళ్ళి గురించి దిగులుపడే దానివా!"

"మగవాడి పెళ్లి గురించి దిగులు అక్కర్లేదమ్మా. నువ్వు ఆడపిల్లవు-నా తర్వాత ఒంటరిగా ...."

"నేను ఒంటరిగా బ్రతగ్గలను. మగవాడిలా బ్రతికి



చూపించగలను. ఆడవాళ్ళే అసలు ఆడవాళ్ళను భయపెడుతూ వుంటారు. ఆడవాళ్లు - ఆడవాళ్ళకు చేస్తున్న హాని మగవాళ్ళుకూడా చెయ్యడంలేదు," ఆవేశంగా అన్నది రాధ.

"నీకు ఇంకా లోకం పోకడ తెలియదు తల్లీ! పెళ్ళికాని ఆడపిల్లను సంఘం చిన్నచూపు చూస్తుంది."

"అదేమిటో చూస్తాను. నాకు పెళ్ళికాకపోవడం అనే ప్రశ్నే లేదు. నేను పెళ్ళి చేసుకోను. పెళ్లికాని వాళ్ళ సంగతి నాకు తెలియదు. పెళ్లి చేసుకోని వాళ్ళు ధైర్యంగా మగవాడిలా బ్రతకవచ్చునని నేను లోకానికి చూపిస్తాను," అన్నది రాధ ఉద్రేకంగా.

"ఏమిటో నీ పిచ్చి! నాకు అర్థం కాదు," కళ్లుమూసుకుంది రాధ తల్లి.

ఆ జ్వరం తిరుగు ముఖం పట్టలేదు. రాధ తల్లి చనిపోయింది.

తల్లి రెక్కల్నుంచి వేరు చెయ్యబడిన పక్షి పిల్లలా విల విల లాడిపోయింది రాధ.

రాధ అత్తయ్యా, మామయ్యా వచ్చారు.

ప్రతివాళ్లూ రాధను చూసి జాలిపడసాగారు.

అంత దుఃఖంలో వుండికూడా రాధకు వారి సానుభూతి నచ్చలేదు. ఆ సానుభూతి అంతా తన ఆడతనం మీదా, అసహాయతమీదే చూపించసాగారు.

రాధ అత్తయ్య, మామయ్య ప్రయాణం అయారు. రాధకు దిగులుగా వుంది. వాళ్లు రెండు రోజులు వుంటే

బాగుణ్ణు అనుకుంది. ఆ మాటే అనేసింది. కాని వాళ్లు వీల్లేదు అన్నారు.

వెళ్తూ వెళ్తూ "ఇక్కడ ఒకదానివి వుండి ఏం చేస్తావ్! మాతో వచ్చెయ్! ఎలాగో ఆ మూడుముళ్ళూ వేయిస్తాం!" అన్నాడు రాధ మామయ్య.

అంత దిగుల్లోనూ రాధకు నవ్వొచ్చింది.

"హు! మూడు ముళ్ళు! స్త్రీ జీవిత సార్థకత ఆ మూడు ముళ్ళతోనే వుందనే నమ్మకం, సమాజంలోని నరనరంలో విషంలా పాకిపోయింది.

"ఆ బసవయ్యకు ఇంకా పెళ్ళి కాలేదు. కట్టుకుపోయినంత ఆస్థి! ఒంటరిగా రెక్కలు ముక్కలయేలా పనిచేస్తే ఏ మొస్తుంది? మహా వస్తే రెండువందలు. ఈ రోజుల్లో ఒక్క పొట్టకుకూడా చాలదు. ఎందుకు నీకీ అవస్థ?" అన్నది రాధ అత్తయ్య.

రాధ చివ్వున తలెత్తి అత్త ముఖంలోకి చూసింది. రోషంతో ముఖం కందిపోయింది.

"నా మాటవిని బసవయ్యను చేసుకో సుఖపడ్తావ్!" మళ్ళీ అన్నది రాధ అత్తయ్య.

"సుఖం! డబ్బు! బసవయ్య!"

రాధ మనసు భగ్గుమంది.

"నీ చిన్న కూతురు కూడా పెళ్లీడు వచ్చి ఇంట్లో వుందిగా? దాన్ని బసవయ్యకిచ్చి చెయ్! కట్టుకుపోయినంత ఆస్థి! పిల్ల సుఖపడుతుంది" - కసిగా అన్నది రాధ.



రాధ మాటకు రాధ అత్తా, మామలు ఓ క్షణం స్తబ్ధంగా వుండిపోయారు.

"చూశారా దాని మాటలు! ఆడపిల్లగదా! ఇంత పెద్దపట్నంలో పెళ్ళీ, పెటాకులూ లేకుండా ఎట్లా వుంటుందని అంటే.... ఎంత మాటందో!"

"నే నేమన్నాను. నీకు భద్రయ్య ఆస్థిమీద మోజు వుందని తెలిసి నీ కూతుర్నివ్వమన్నాను. పెళ్లీ పెటాకులు లేకుండా మగవాళ్లైతే వుండొచ్చునేం?" అన్నది రాధ కోపంగా.

"ఏమిటా మాటలు పెద్దా చిన్నా లేకుండా?" రాధ మామయ్య మందలించాడు.

"మీరు నా గురించి బాధపడకండి. నా బ్రతుకు నేను బ్రతగ్గలను," విసురుగా అని అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది రాధ.

రాధ అత్తయ్యా, మామయ్యా వెళ్లిపోయారు.

ఆ రెండుగదుల ఇల్లూ బావురుమంటూ పులి చచ్చిపోయిన గుహలా భయంకరంగా అన్పించసాగింది రాధకు.

రెండు రోజులు రాజేశ్వరి తోడుపడుకుంది. వెనకా ముందూ ఎవరూ అండలేని వయసు మళ్ళిన ఓ స్త్రీని రాధ ఇంట్లో వుండటానికి కుదిర్చింది రాజేశ్వరి. రాధ రాత్రిళ్ళు పడుకొని తల్లిని తల్చుకొని గంటలకొద్దీ ఏడ్చేది. కాలం గాయాన్ని మాన్పుతుంది.

హాయిగా, ఎలాంటి కాంప్లెక్సూ లేకుండా మాట్లాడే రాధ అంటే చాలామంది ఇష్టపడేవారు. ఉద్యోగం, చదువూ,

స్నేహితులూ.... ఎని వ్యాపకాలు వున్నా.... వీటి అన్నింటికీ దూరంగా వున్నట్టే అన్పించేది రాధకు.

రాధ స్నేహితురాలు- లలిత అన్నయ్య రామారావు రాధకు ప్రేమలేఖ రాశాడు. రాధ తన ప్రేమను తిరస్కరించినట్టయితే ఆజన్మ బ్రహ్మచారిగా వుంటానని బెదిరించాడు.

రాధ ఉత్తరం చదివి కసిగా చించింది.

పొట్టిగా, లావుగా, మొరటుగా వుండి గుమాస్తా ఉద్యోగం చేసే రామారావు రూపం కళ్ళముందు కదిలింది.

ఎంత ధైర్యం ? ప్రేమిస్తున్నాడట! ప్రేమ! బుద్ధిలేదు. తను ప్రేమించానంగానే ఎగిరి గంతేసినంత పనిచేస్తాననుకొని వుంటాడు పిచ్చినాయన!

రాధకు మనసంతా చేదుచేదుగా అనిపించింది

ఆడపిల్ల మనసు తెలుసుకోకుండా, ప్రేమించేస్తున్నట్టు ఉత్తరం రాసేయడమే!

ఒక ఆదివారం. రాధ బి. ఎ. పరీక్షలు దగ్గరకొస్తున్నందువల్ల సీరియస్‌గా చదువుకుంటూ కూర్చుంది. స్నేహితురాండ్రను ఎవర్నీ రావద్దని చెప్పింది.

ఎవరిదో అడుగుల చప్పుడై తలెత్తి చూసింది రాధ. ఎదురుగా జిడ్డుకారుతున్న ముఖంతో రామారావు కన్పించాడు.

రాధ ముఖం చిట్లించుకుంది.

కూర్చోమనకుండానే కూర్చున్నాడు.

ముఖం గంభీరంగా పెట్టి అతని ముఖంలోకి చూసింది.



దిగాలుపడి నీరసంగా కన్పించాడు. రాధకు ఓ క్షణం అతని మీద జాలివేసింది.

"ఏమిటలా వున్నారు ?"

"జ్వరం వచ్చింది," ఎంతో దిగులుగా వుంది అతని కంఠం.

"పాపం! ప్రేమ జ్వరమా ?" అని అడగాలనిపించింది. కాని మరో ప్రశ్న వెయ్యడం ఇష్టంలేక పుస్తకంలోకి చూడసాగింది.

"రాధా !"

చివ్వున తలెత్తి చూసింది. ఆ కంఠం.... ఆ పిలుపు.... రాధకు జుగుప్సతో వళ్ళు జలదరించింది.

"ఏం ?" కటువుగా అన్నది.

రామారావు కొంచెం జంకాడు.

"ఏమిటి ?" రెట్టించింది. "ఇవ్వాళ నీ సంగతేదో తేల్చుకుంటాను," మనసులోనే అనుకుంది.

"నా ఉత్తరం అందిందా ?"

"అందింది."

"జవాబు రాయలేదేం ?"

కోపంతో పెదవులు వణికాయి. ఏదో అనబోయి నిభాయించుకుంది.

"నిన్ను ఎంతగా...."

"అపు ! మాట్లాడకు !" దాదాపు అరిచినట్టే అన్నది రాధ.

బిత్తరపోయి చూశాడు రామారావు.

"అదికాదు రాధా...."

"ఇక మాట్లాడకు! వెళ్ళు! నువ్వంటే నాకు అసహ్యం! ఇంకెప్పుడూ మా ఇంటికి రాకు. స్నేహితురాలి అన్న కదా అని కొంచెం నవ్వుతూ మాట్లాడితే ప్రేమలేఖ రాస్తావా? నీ చదువు-సంస్కారం చూశా, నీ అందంచూశా లేక అంతస్థు చూశా? ఏం చూసి నేను నిన్ను ప్రేమిస్తా నను కున్నావ్? కనీసం ఆడవాళ్ళకు ఎదురుగా కూర్చున్నప్పుడు ఎలా కూర్చోవాలో కూడా తెలియనివాడివి...." ఆ పై మాటలు రాధ కంఠం నుంచి పెగల్లేదు.

"దయచేసి వెళ్ళిపో! మళ్ళీ కన్పించకు! మళ్ళీ ఏదో అని నన్ను అవమానించకు...."

"ప్రేమించడం అవమానించడమా?" ఎలాగో తెప్ప రిల్లి అన్నాడు రామారావు.

"అదుగో మళ్ళీ ప్రేమా .... గీమా .... అనకండి!" రాధ నిలువెల్లా వణికిపోయింది.

రామారావు తల వంచుకొని కాళ్ళు ఊపుతూ ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటా కాళ్ళు ఊపడం? ముందా కుర్చీలోనుంచి లేవండి!" గట్టిగా అరిచింది రాధ.

రామారావు చివ్వనలేచి నిల్చుని, విసవిసా బయటికి నడిచి వెళ్ళిపోయాడు.

బండ వెధవ! వళ్ళెంత బరువుగా కన్పిస్తుందో ఆ బుద్ధీ అంతే!

ఇలా రాధకు, ఒకరి మాటల్లో వెకిలితనం, మరొకరి



చూపుల్లో వెకిలితనం, ఇంకొకరి ప్రతి కదలికలోనూ వెకిలితనం.... అందరిలో ఏదో ఒక వెకిలితనం — మొరటుతనం ....మూర్ఖత్వం.... ఉలికిపాటుతనం....ఏదో ఒకటి కన్పిస్తూనే వుండేది.... ....

.... .... .... .... ....

"సిస్టర్ దాహం!"

గ్రేస్ స్పూన్‌తో గ్లూకోజ్ వాటర్ నోట్లో పోసింది.

రాధ తేలిగ్గా నీరు మింగింది.

మార్పు గమనించిన గ్రేస్ ముఖం విప్పారింది.

## 14

"రాధా!"

"ఏం సిస్టర్?"

"నీకు పరిచయం అయిన ప్రతి మగవాడిలోనూ నీకు ఏదో ఒక లోపం కన్పించేది కదూ?"

"కాదు సిస్టర్! నేను మగా-ఆడా అనే భేదం మర్చి అందరితో హాయిగా మాట్లాడే దాన్ని. కాని ఆ మగవాడు ఆరాధిస్తున్నట్టో, ప్రేమిస్తున్నట్టో కన్పించినప్పుడే అతనిలోని లోపాలు నాకు కన్పించేవి. అతనంటే అసహ్యం వేసేది. ఒకతను మాకు దూరం బంధువు, అమ్మ బ్రతికి వుండగానే ఇక్కడ ఎం. ఏ. చదివాడు. చాలా తెల్లగా చక్కగానే వుండేవాడు. నేను చాలా చనువుగా వుండేదాన్ని. నాకు ఒక సోదరుడు వున్నా అదేవిధంగా బహుశా ఇష్టపడి వుండేదాన్ని. ఒకరోజు అమ్మదగ్గిర నన్ను వివాహం చేసుకోవాలని వుందని

బయట పెట్టాడు. అంతటితో అతనంటే నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. అతన్ని తిరస్కరించినందుకు అమ్మ చాలా బాధ పడింది. అతనికి ఆ ఉద్దేశం ఉన్నదని తెలిశాక సరిగా మాట్లాడలేకపోయేదాన్ని. కసురుకునేదాన్ని."

"మరి రామారావు ఆజన్మ బ్రహ్మచారి గానే వున్నాడా ?"

"ఆరు నెలలు తిరక్కుండానే ఆఫీసులో టైపిస్టును ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కారణం తెలియదు—అతని భార్య పెళ్ళయిన రెండేళ్లకు కాల్చుకొని చచ్చిపోయింది. భార్యను మహా కాల్చుకు తినేవాడట" అన్నది రాధ.

"పాపం !" అన్నది గ్రేస్.

"అటువంటి వాళ్ళమీద నాకు జాలి కలగదు సిస్టర్! చచ్చి సాధించే దేమిటి ? బ్రతికుండే అతనికి బుద్ధిచెప్పాలి-" రాధ తీవ్రంగా అన్నది.

"ఆడది ఏం చేస్తుందమ్మా ?"

"మీరూ అలాగే అంటున్నారా సిస్టర్ ! ఆడది ఏం చెయ్యలేదనే భ్రమ కలిగించింది మగవాళ్ళే. ఆ భావం ఆడదాని నర నరంలో విషంలా పాకిపోయింది. అందువల్లనే ఆడదికూడా తనేం చెయ్యలేదనే భయంలో పడింది. కాని ఆడది తల్చుకుంటే ఏం చెయ్యలేదు ? ఎదురు తిరగాలి. రామారావు పెళ్లాం ఎదురు తిరిగి, తను ఎటూ సంపాదించుకుంటూ వుందిగా, వంటిగా బ్రతకలేదా ?" అన్నది రాధ.

"మొగుణ్ణి వొదిలేసిన ఆడదాన్ని సంఘం బ్రతకనిస్తుందా ?"



"సంఘం ! సంఘం ! భయపడేవాళ్ళనే భయపెడుతుందీ సంఘం !" రాధ ఆవేశంగా అన్నది.

"మరో సుబ్బారావు కథ చెప్పు రాధా !" అన్నది గ్రేస్ మాట మారుస్తూ.

రాధ ఓ క్షణం గ్రేస్ ముఖంలోకి చూసి చెప్పటం ప్రారంభించింది.....

.... .... .... ....

రాధ స్నేహితు లందరికీ కాకపోయినా చాలా మందికి ప్రేమ కథలు — ఉన్నాయ్.

వారి కళ్ళల్లో జాలెడన్ని కన్నీళ్లు ఉన్నాయ్.

ఊపిరి తిత్తుల్లో వేడి వేడి నిట్టూర్పు లున్నాయ్.

గుండెల్లో స్పందనలు వున్నాయ్.

వాళ్ళందర్నీ చూస్తూ, వారి గాథల్ని వింటూ తన గురించి ఆలోచించుకొనేది రాధ.

తనెందుకు సహజంగా బ్రతకలేకపోతోంది ? ఎంత ఆలోచించినా సరైన జవాబు దొరికేది కాదు.

రాఘవరావు రాధ పని చేసే స్కూల్లోనే లెక్కల మాస్టరుగా పనిచేస్తున్నాడు. వయసులో పెద్దవాడు. దాదాపు ఏభై ఏళ్ళుంటాయి. రాధను చాలా అభిమానిస్తున్నట్టు కన్పించేవాడు. కొందరు లేడీ టీచర్స్‌కు అతనిమీద ఎందుకు కోపమో అర్థం అయ్యేదికాదు రాధకు. చాలామంది అసహ్యించుకొనే అతన్ని చూసి జాలిపడేది.

అతను రాధ ఇంటికి వస్తూ పోతూ వుండేవాడు. ప్రైవేటుగా బి. ఏ. చదువుతున్న రాధకు స్టడీస్‌లో సహాయం చేసేవాడు.

రాను రాను అతని ప్రవర్తనలో ఏదో మార్పు గమనించింది రాధ. అతను రాధ మీద ఏదో అధికారంవున్నట్టు ప్రవర్తించేవాడు.

పెద్దవాడు ఆరుగురు బిడ్డల తండ్రి. పోనీయ్ పాపం! అతనికి అదో సంతృప్తి అనుకొనేది.

రాధ కోటీచర్ మీనాక్షి అందంగా వుంటుంది. చాలా చక్కగా ముస్తాబై వస్తుంది స్కూలుకు. ఆమెను గురించిన అనేక కథలు ప్రచారం వున్నాయ్. అవివాహిత. తనను ఎంతమంది ప్రేమించారో, ఎంతమంది పెళ్ళి చేసుకుంటామన్నారో, సరదాగా కథలుగా చెప్పేది. ఆమె మాటలు వింటూంటే రాధకు ఆశ్చర్యం వేసింది. తనను ఎవరైనా ప్రేమిస్తే, తనలో తను ఆ విషయాన్ని ఆలోచించుకోవడానికే రాధకు ఇష్టం వుండదు.

మీనాక్షి ఎందుకంత ఉత్సాహంగా ఆ విషయాలు చర్చిస్తుంది? తన కెందుకు ఎవరైనా ప్రేమిస్తున్నానన్నా పెళ్ళి చేసుకుంటానన్నా అవమానంగా అనిపిస్తుంది? కోపం వస్తుంది? అసహ్యం వేస్తుంది? మళ్ళీ వాళ్ళు కన్పిస్తే శరీరం జుగుప్సతో జలదరిస్తుంది.

రాఘవరావు ఒక గంట పాఠం చెప్పి, మూడుగంటలు ఎదురుగా ఈజీచైర్‌లో కూర్చునేవాడు.



రాధ పాఠం చెప్పించుకోవడం మానేసింది. అతను రావడం మానలేదు.

తను ప్రేమించలేని వ్యక్తి, తను అసహ్యించుకొనే వ్యక్తి, తనని ప్రేమిస్తూ, ఆ ప్రేమను కళ్ళల్లో, మాటల్లో, ప్రతి కదలికలో వ్యక్తం చేస్తూ, గంటలకొద్దీ ఎదురుగా కూర్చోవడమంత టీచింగ్ ప్రపంచంలో మరొకటి వుండదు అనిపించేది రాధకు - రాఘవరావు గంటల కొద్దీ కూర్చున్నప్పుడు.

ఒకరోజు —

"రాధా!"

రాఘవరావు కంఠంలో అదో లాంటి మెత్తదనం ధ్వనించింది.

రాధ విసురుగా తలెత్తి చూసింది.

"ఆ పిలుపు, అతని నోటి నుంచి....ఆ మెత్తదనం.... అతని కంఠంలో" రాధకు వంటిమీద మెత్తని పురుగేదో పాకుతున్నట్టనిపించింది.

"నీకు ప్లెటానిక్ లౌ లో నమ్మకం వుందా?" రాధ కళ్ళలోకి గుచ్చి చూస్తూ అన్నాడు రాఘవరావు.

అతని కళ్ళనిండుగా కాంక్ష - వాంఛ.... రాధ జుగుప్సతో కళ్ళు పక్కకు తిప్పుకుంది.

"ప్లెటానిక్ లౌ అట ప్లెటానిక్ లౌ. మూడు చెక్క ముఖం నువ్వూ నీకుతోడు అదొకటి. నీ వయస్సేమిటి, నా వయస్సేమిటి? ఆ ముఖం, ఆ బట్టలూ, ఆ కళ్లూ, చప్పి బుగ్గలూ.... ఛ! ఛ!" అనుకొంది రాధ కసిగా.

ప్లెటానిక్ లౌ లోనే కాదు, నాకు లౌలోనే నమ్మకం లేదు" విసురుగా అన్నది. అతని వయస్సును చూస్తూ అంత కంటె మొరటుగా అనలేక.

అతన్ని ఏదో అనరానిమాట అన్నట్టు ముఖం ముడుచుకున్నాడు. ఆ ముఖం చూస్తుంటే "ముఖం సరిగా పెట్టు," అంటూ ఆ చెంపా ఈ చెంపా వాయించాలనిపించింది రాధకు.

"ఇక ముందెప్పుడూ ప్రేమా, గీమా అంటూ నా ముందు మాట్లాడకండి. మీ ముసలి నోట్లోనుంచి ఆ మాటలు వస్తుంటే మురికికాలవ కదిలి వాసన వస్తున్నట్టు అనిపిస్తుంది" కసిగా అన్నది రాధ.

"ఛెళ్ళున" ఎవరో ముఖంమీద కొట్టినట్టు అయింది రాఘవరావు పని.

చివ్వున లేచి నిల్చున్నాడు.

"వస్తా!" అంటూ విసవిసా వెళ్ళిపోయాడు.

"ఇక చస్తే రాడు. పీడ విరగడయింది. ఆడపిల్లలు-వయసులో వున్నవాళ్లంటే ప్రతివాడికీ లోకువే. తను ప్రేమించేస్తే చాలు అనుకుంటారు! వెధవలు!" కసిగా పైకే అనేసింది.

కాని రాఘవరావు రావడం మానలేదు.

గంటలకొద్దీ కూర్చోవడం మానలేదు.

వాలుకుర్చీలో కూర్చుని రాధ ప్రతి కదలికనూ చూస్తూ కూర్చునేవాడు. రాధకు అతని ఉనికి భరించరానిదిగా తయారైంది.



ఒకరోజు రాధ స్నేహితురాలు, గుజరాతీ అమ్మాయి వచ్చింది. ఆమె టెలీఫోన్ ఎక్స్చేంజిలో పని చేస్తోంది. చాలా ఉషారుగా వుంటుంది. మధ్యలో రాఘవరావు వచ్చాడు. రాధ ముఖం చిట్లించుకుంది. కూర్చోమనకుండానే కూర్చున్నాడు, మామూలు కుర్చీలో. అప్పటికే రాధ స్నేహితురాలు పడక కుర్చీలో కూర్చుని వుంది.

స్నేహితురాలు వెళ్ళిపోతుంటే రాధ వాకిలి వరకు వెళ్ళి తిరిగొచ్చింది. అప్పటికే రాఘవరావు ఈజీ చైర్ లో కూర్చున్నాడు. రాధ వళ్లు మండిపోయింది.

"ఆవిడ ఎవరూ?"

"మీకు అనవసరం! నా స్నేహితురాళ్లలో ఎవరూ మిమ్మల్ని ప్రేమించేవాళ్లు లేరు. మీకేసికూడా చూడరు" అన్నది విసురుగా.

రాఘవరావు ముఖం నల్లగా మాడిపోయింది.

"ఆమె ఎవరైతే నాకేం! ఆ అమ్మాయిని చాలా సార్లు ఒక కుర్రాడితో తిరుగుతూ చూశాను. అంతమంచి క్యారెక్టర్ కాదనుకుంటాను. అందుకే హెచ్చరిస్తున్నాను." తీవ్రంగా వుంది అతని కంఠం.

"అయితే ఏమంటారూ? మీకు ఈర్ష్యగా వుందా?"

"నాకెందుకూ ఈర్ష్య? చెడ్డవాళ్ళతో స్నేహం చేస్తే నీకే నష్టం అని చెబుతున్నాను" అక్కసుగా అన్నాడు.

"ఓహో అలాగా! నాకూ చెడిపోవాలనేవుంది. మంచివాడెవడూ కన్పించడంలేదు," వచ్చే నవ్వును ఆపుకుంటూ వ్యంగ్యంగా అన్నది రాధ.

రాఘవరావు ముఖంలో ముడతలు కన్పించాయి. సిగరెట్ మీద సిగరెట్ తాగుతూ కూర్చున్నాడు.

"నేను బయటికి వెళ్తున్నాను. ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నది రాధ.

"ఎక్కడికి?"

"మీ కనవసరం!" విసురగా అని రాధ లోపలకు వెళ్ళిపోయింది.

బట్టలు మార్చుకొని వచ్చింది. అయినా రాఘవరావు కూర్చునే వున్నాడు. రాధ అతని వైపుకూడా చూడకుండా బయటికి వెళ్ళిపోయింది.

ఆ రోజు రాఘవరావు వచ్చేప్పటికి రవీంద్ర కూర్చుని వున్నాడు. రవీంద్ర పరిచయం రాధకి ఒక స్నేహితురాలింట్లో ఏదో ఫంక్షన్ లో అయింది.

రవీంద్ర క్రికెట్ ప్లేయర్. సంస్కారం కలవాడనిపించింది రాధకు చూడగానే. ఆ తర్వాత అనుకోకుండా బస్ స్టాండులో కలిశాడు. మరోసారి హోటల్లో కన్పించాడు. ఆ తర్వాత రాధే అతన్ని ఇంటికి రమ్మని ఆహ్వానించింది. పరిచయాన్ని పురస్కరించుకొని చనువు తీసుకొని రవీంద్రమీద రాధకు గౌరవం ఏర్పడింది.

రవీంద్ర అందమైనవాడు. ఎం. ఏ. పాసయి ఒక బ్యాంకులో మంచి ఉద్యోగంలో వున్నాడు. హాయిగా పసిపిల్లవాడిలా నవ్వుతూ మాట్లాడే రవీంద్ర ముందు రాధకు ఎలాంటి సంకోచం కలిగేది కాదు. క్రమంగా వాళ్ళు పరస్పరం ఏకవచనంలో పిల్చుకోసాగారు.



రవీంద్ర క్రికెట్ ప్లేయర్. గతవారం జరిగిన మాచ్ విశేషాలు చెబుతున్నాడు. రాధ ఆసక్తిగా వింటూవుంది.

అదే సమయంలో రాఘవరావు వచ్చాడు. రవీంద్రను చూసి ముఖం చిట్లించుకున్నాడు. ఆ విషయం రాధ గమనించి లోలోపల సంతృప్తి పడింది.

ఇద్దర్నీ ఒకరికొకర్ని పరిచయం చేసింది. రాఘవరావు రెండు కణతలూ వేళ్ళతో నొక్కుకుంటూ కూర్చున్నాడు. వస్తున్న నవ్వును రాధ పెదవుల మధ్య బంధించింది. అతనికి తను ఎవరితోనైనా మాట్లాడితే చచ్చేంత ఈర్ష్య అని ఆమెకు తెలుసు.

రాధ రవీంద్ర ఏదో చెబుతూవుంటే గలగల నవ్వసాగింది.

తను చెబుతున్న విషయంలో అంత నవ్వు వచ్చేది ఏముందో తెలియని రవీంద్ర రాధ ముఖంలోకి విస్మయంగా చూశాడు.

రాధ అలా నవ్వుతూవుంటే రాఘవరావు సహించలేకపోయాడు. దిగ్గున లేచి నిల్చున్నాడు.

"నే వస్తా!" అన్నాడు రాధను చీదరించుకుంటున్నట్టు చూస్తూ.

"మంచిది. వెళ్ళిరండి" అన్నది రాధ పెళుసుగా.

రవీంద్ర ఆశ్చర్యంగా ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు.

"అదేమిటి? మీరు ఇప్పుడేగా వచ్చారు? ఏమైనా మాట్లాడాలేమో? నేను వచ్చి చాలాసేపయింది. వెళ్తాను." అంటూ రవీంద్ర లేచి నిలబడ్డాడు.

రాఘవరావు కూర్చున్నాడు.

"నువ్వు కూర్చో రవీంద్రా! రాజేశ్వరి వస్తానంది. సినిమా ప్రోగ్రాం మర్చిపోయావా" అన్నది రాధ.

రవీంద్ర అయోమయంగా రాధ ముఖంలోకిచూశాడు.

వీపుమీద ఎవరో లాగి తన్నినట్లు చివ్వునలేచి, గబగబా బయటికి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు రాఘవరావు.

రవీంద్ర ఆశ్చర్యంగా రాఘవరావు వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు.

రాధను ఏదో అడగాలని నోరు తెరిచేలోపల "హలో!" అంటూ రాజేశ్వరి ప్రవేశించింది.

రవీంద్ర కూడా "హలో!" అంటూ చిరునవ్వుతో విష్ చేశాడు.

"ఏమిటోయ్ పాపం కుటుంబరావు అంత సీరియస్‌గా వెళ్లిపోతున్నాడు?" రాజేశ్వరి నవ్వుతూ రాధను ప్రశ్నించింది.

"కుటుంబరావా? అతని పేరు రాఘవరావు అన్నాడనుకుంటాను?" విస్మయంగా ప్రశ్నించాడు రవీంద్ర.

"మా రాజేశ్వరి అతన్ని అలాగే ముద్దుగా పిలుస్తుందిలే," అన్నది రాధ.

"అదేమిటి? ఎందుకూ?" అన్నాడు రవీంద్ర ఇనుమడించిన విస్మయంతో.

"ఆయనకు నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. నెలలో సగం రోజులు అర్ధాకలితోనే వుంటారు. అయినా



అతనికి వయసులోవున్న ఆడవాళ్ళంటే వల్లమాలిన ప్రేమ. ప్రస్తుతం మా రాధను ప్రేమిస్తున్నాడు. పెద్ద కుటుంబం కలవాడు. అందుకే కుటుంబరావంటాను," అన్నది రాజేశ్వరి.

"అందుకే కాబోలు పాపం నన్ను చూసి బాధతో మెలికలు తిరిగిపోయాడు" అన్నాడు రవీంద్ర.

"మిమ్మల్ని చూసైతే పర్వాలేదు. అతను మా రాధ ఆడవాళ్ళతో మాట్లాడుతున్నా సహించలేడు," అన్నది రాజేశ్వరి.

రవీంద్ర ఆశ్చర్యంగా రాజేశ్వరి ముఖంలోకిచూశాడు,

"ఏమిటో అతని తత్వం నాకు అర్థంకాదు. చదువుకొని ఉద్యోగాలు చేసేవాళ్ళంతా అతని దృష్టిలో చెడిపోయిన వాళ్ళకిందే లెఖ్ఖ. మళ్ళీ తన కూతుళ్ళను చదివిస్తూనే వున్నాడు. నా స్నేహితురాళ్ళను గురించి ఆరాలు తీస్తాడు. నాకు వళ్లుమండి నసాళానికి అంటే జవాబు ఇస్తాను. వట్టి పిరికిగొడ్డు. ఇట్టే బెదిరిపోతాడు. ఉడుకుబోతుతనంకూడా ఎక్కువే. పసివాడిలా ఉలుక్కుంటాడు."

"పాపం!" అన్నాడు రవీంద్ర ఆలోచిస్తూ.

"పాపం ఏమిటి? అలాంటివాళ్ళ ప్రెజెన్స ఎంత న్యూసెన్స్‌గా వుంటుందో నీకేం తెలుసు?" అన్నది రాధ.

"అటువంటి వాళ్ళను చూసి జాలిపడాలి," అన్నాడు రవీంద్ర.

"నాకూ అప్పుడప్పుడు అతనిమీద జాలివేస్తుంది. పెద్దవాణ్ని అనవసరంగా బాగా బాధపెట్టానని ఎన్నోసారు

జాలిపడ్డాను. రెండుమాటలు మామూలుగా సౌమ్యంగా మాట్లాడితే చాలు.... ఆ ముఖం ఎలా పెడ్తాడో తెలుసా!.... ఆ ముఖం — ఆ ఉషారూ — చూస్తే గాయంమీద కారం పూసినట్టు అనిపిస్తుంది."

"ఎట్లా పెడ్తాడేమిటి ముఖం ?" రవీంద్ర అడిగాడు నవ్వుతూ.

"కాస్త బాగా మాట్లాడితే ముఖం తమాషాగా పెట్టేస్తాడు. ముఖమంతా కళ్లు చేసుకొని చూస్తాడు. అప్పుడు అతను నా కళ్ళకు ఎట్లా కనిపిస్తాడో తెలుసా!"

"చెప్పందే ఎలా తెలుస్తుందీ !" అన్నది రాజేశ్వరి.

"ఒక గదిలో పాలకుండ మూతలేకుండా పెట్టి వుందనుకో. అక్కడికి ఒక పిల్లి వస్తుందనుకో. ఆ గదిలో ఎవరూ వుండరు. ఆ పిల్లి పాలకుండకు దగ్గరగా కూర్చుని, నాలుకతో మూతి తుడుచుకుంటూ పాలకుండకేసి చూసినట్టు అతను నాకేసి చూస్తాడు అన్నది రాధ.

రవీంద్ర పకపక నవ్వాడు. రాజేశ్వరి పొట్టపట్టుకొని నవ్వసాగింది. రాధకు నవ్వు రావడం లేదు.

"అతనికి అంత జెలసీ అని తెలుసుకదా ! మరి నాతో సినిమా ప్రోగ్రాం వుందని అబద్ధం ఎందుకు చెప్పావ్ ! అన్నాడు రవీంద్ర.

"నిన్ను చూశాడు. వారం రోజులు కన్పించడు. మీతో సినిమాకు వెళ్ళినట్లు తెలిస్తే కనీసం ఒక నెలరోజులైనా కన్పించడు. అందుకే అన్నాను," అన్నది రాధ.

"పాపం!" అన్నాడు రవీంద్ర.



"ఆ జాలి నామీదా లేక అతనిమీదా ?"

"నీమీద ఎందుకో ? పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం, పిల్లిమీద జాలెందుకూ !

"అంటే నేను పిల్లినా ? నేను ఎవరితోను చెలగాటం ఆడటంలేదు."

"నువ్వు కావాలని ఆడటం లేదనుకో! అతని ప్రాణానికి అట్లాగే వుండివుండాలి. ఐదింటికి ఒక స్నేహితుడ్ని కలుస్తానన్నాను. వెళ్తాను," అంటూ రవీంద్ర వెళ్ళిపోయాడు.

"ఇక చెప్పు తల్లీ నీ రహస్య ప్రణయం ఎంతవరకు వచ్చింది?" అడిగింది రాధ రాజేశ్వరిని.

రాజేశ్వరి కళ్ళు శ్రావణ మేఘాలే అయ్యాయి.

"పిరికివాళ్ళంటే నాకు అసహ్యం !" అన్నది రాధ.

"పిరికితనం కాదనుకుంటాను. అతను చాలా మంచివాడు. చాలా మంచిపేరు వుంది."

"అట్లా చెప్పు. చాలా మంచిపేరు వుందన్నమాట!" సాలోచనగా అన్నది రాధ.

రాజేశ్వరి నీళ్ళునిండిన కళ్ళతో చూడటం తప్పించి ఏమీ మాట్లాడలేదు.

"మంచివాళ్ళు రెండు రకాలు. నిజంగా మంచివాళ్లూ, మంచిపేరుగలవాళ్లూ," అన్నది రాధ.

"మంచివాళ్ళయితేనేగదా మంచిపేరు వుంటుంది!" అమాయకంగా అడిగింది రాజేశ్వరి.

రాజేశ్వరి ముఖంలోకి ఓక్షణం జాలిగా చూసింది రాధ.

"కాదు. మంచిపేరుగలవాళ్ళంతా నిజంగా మంచివాళ్లు కాదు. వాళ్ళకు మంచిపేరంటే మహా ఇష్టం. అంత ఇష్టం వారికి ప్రపంచంలో మరి దేనిమీదా ఇష్టంవుండదు. అందుకే మంచిపేరుకోసం ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో మంచిగా ప్రవర్తిస్తారు. మంచిగా అంటే ఆ మంచిపేరు చెడకుండా వుండేలా ప్రవర్తిస్తారు. కాని నిజమైన మంచివాళ్లను ప్రపంచం మంచివాళ్ళగా చాలా అలస్యంగా గుర్తిస్తుంది. ఒకోసారి ఆ గుర్తింపుకూడా రాకపోవచ్చు. మీ హీరో విషయమే చూడు. అతనికి మంచిపేరు వుంది. ఆ మంచిపేరు చెడకుండా వుండాలి. నువ్వు కావాలి అందుకే నీతో, ఎవరికీ తెలియకుండా ప్రణయం సాగించడానికి అతనికి అభ్యంతరంలేదు. నలుగురికీ తెలుస్తుందనే భయం ఏర్పడ్డ మరుక్షణంలో నీ స్నేహం వదులుకోవడానికికూడా వెనకాడడు," అన్నది రాధ.

రాజేశ్వరి ముఖం పాలిపోయింది.

"నీ స్థానంలో నేనే వుంటే ఏంచేస్తానో తెలుసా!" అంటూ రాజేశ్వరి ముఖంలోకి చూసి ఆగిపోయింది రాధ.

"సారీ! రాజేశ్వరి! నిన్ను బాధపెడుతున్నట్లున్నాను."

"ఫర్వాలేదు. చెప్పు!" రుద్ధ కంఠంతో అన్నది రాజేశ్వరి.

"ఇవాళకాదు. మరోరోజు చెబుతాను," అన్నది రాధ.

రాజేశ్వరి కళ్ళనీరు తుడుచుకుంది.

"రాధా ఒక విషయం అడుగుతాను. నిజం చెబుతావా!" అన్నది రాజేశ్వరి.



"నేను ఎప్పుడూ నిజమే చెబుతాను. ఇష్టం లేకపోతే అసలు చెప్పను. అంతేగాని అబద్ధం చెప్పను," అన్నది రాధ.

"రవీంద్ర అంటే నీకు ఇష్టంగదూ!"

"ఇష్టమే. సంస్కారం గలవాడు. తెలివైనవాడు. ఎదుటి మనిషిని అర్థం చేసుకొని ప్రవర్తిస్తాడు. పిచ్చిప్రశ్నలు వెయ్యడు. నాకు అతన్ని చూస్తుంటే చిన్నపిల్లవాడిని, నిర్మలమైన మనసుగలవాడిని చూస్తున్నట్లు అనిపిస్తుంది."

రాజేశ్వరి రాధ ముఖంలోకి విస్మయంగా చూసింది.

"అతను నీకంటే పెద్దవాడేగా!"

"అవును. అయినా అతని మాటలు వింటూంటే, అతన్ని చూస్తుంటే నాకు అతను నాకంటే చాలా చిన్నవాడు అనిపిస్తుంది. అందుకే అతనితో అంత చనువుగా వుంటాను," అన్నది రాధ.

"అంతేనా? అతనంటే నీకు ప్రత్యేకమైన ఇష్టం ఏమీలేదా?"

"అవును, అంతే!" అన్నది రాధ.

"ప్రేమలో నీకు బొత్తిగా నమ్మకం లేదా రాధా!"

"నాకు అదంటే ఏమిటో తెలియదు. 'ప్రేమ' అనే ఆ రెండక్షరాలు అంటే నాకు చచ్చేంత భయం."

"భయమా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది రాజేశ్వరి.

"అవును! భయం! మగవాడు ప్రేమిస్తాడు. కాని ఆ ప్రేమలో మునిగిపోడు. పైపైన తేలుతూ వుంటాడు. ఆడది అలా కాదు. అందులో మునిగిపోతుంది. మగవాడికి ఈదడం తెలుసు. అందుకే తేలుతూ వుంటాడు. ఈత

వచ్చినవాడు, కావాలని పడ్డా, ప్రమాదవశాత్తు పడ్డా నీళ్ళల్లో మునిగిపోడు. ఈదుకుంటూ ఒడ్డు చేర్తాడు. ఈత రానివాడు మునిగిపోతాడు. అతను ఒకసారి పడితే మునిగిపోక తప్పదు. నీ సంగతే చూడరాదూ? మీ ఇద్దర్లో మునిగిపోయేది ఎవరంటావ్? అందుకే నేను ఆ భావననుంచి తప్పించుకుంటూ వస్తున్నాను," అన్నది రాధ.

రాజేశ్వరి ఆలోచనలో పడింది.

.... .... .... .... ....

"సిస్టర్! దాహం!"

గ్రేస్ రాధకు నీరు త్రాగించింది.

## 15

"రాధా ఎలా వుందమ్మా!"

"బాగానే వుంది సిస్టర్." అంటూ కళ్లు మూసుకుంది.

"ఆ రాఘవరావు మళ్ళీ రాలేదా?"

"మొండి ఘటం అంత తేలిగ్గా వదుల్తాడా?"

"మళ్ళీ వచ్చాడా? పాపం!"

"మీకూ అతనంటేనే జాలా!"

"అలాంటివాళ్ళను చూసి జాలిపడక ఏం చేస్తాం రాధా?"

"నాకు జాలి వెయ్యదు సిస్టర్! అలాంటి వాళ్ళంటే నాకు అసహ్యం! పరమ అసహ్యం! వాళ్లేమిటో వాళ్లు తెలుసుకోకుండా ఎవర్నంటే వాళ్ళను లొంగదీసుకోవడానికి ప్రయత్నించడమేనా?"



"అందుకే అలాంటి వాళ్ళను చూసి జాలిపడాలి. సరే! ఆ తర్వాత రాఘవరావును ఎలా వదిలించుకున్నావ్?"

"వినండి........"

.... .... .... .... ....

వారం రోజులవరకు రాఘవరావు రాలేదు.

రాధ ప్రాణానికి హాయిగా వుంది.

స్కూల్లో ఎదురుపడి ముఖం తిప్పుకున్న రాఘవరావును చూసి రాధ ముసి ముసిగా నవ్వుకుంది.

పది రోజుల తర్వాత రాఘవరావు వచ్చాడు.

గుర్రపు పందాల్లో వున్నదంతా పోగొట్టుకున్న వాడిలా ఢీలా పడివున్నాడు.

అతని ముఖం చూస్తుంటే రాధకు నవ్వొచ్చింది.

పెద్దవాడని తను గౌరవించి బాగానే మాట్లాడేది. ఆ గౌరవం అతను వుంచుకోవద్దూ? "తొవ్వ్వా గివ్వ్వా" అంటూ ముఖమంతా కళ్ళు చేసుకు చూస్తాడా? తను ఎవరితో మాట్లాడినా చచ్చేంత ఈర్ష్య పడ్తాడా? ఏమిటో కొంపలు తగలబడి పోయినట్టు ఆ ముఖం పెట్టడం?

"ఒంట్లో బాగాలేదా?"

"నా ఒంట్లో బాగాలేదని ఎవరు చెప్పారూ? లోతుగా చూస్తూ అనుమానంగా ప్రశ్నించాడు రాఘవరావు.

రాధకు వళ్ళు మండిపోయింది.

అన్నిటికీ ఉలికిపాటే? అనుమానాలే!

"రవీంద్ర చెప్పాడు," కావాలనే అన్నది రాధ.

ముఖంమీద ఎవరో 'ఫెళ్ళు'న కొట్టినట్టయింది అతనికి.

"అతని కెలా తెలుసూ నా ఆరోగ్యం బాగాలేదనీ?" అనుమానంగా చూస్తూ అన్నాడు రాఘవరావు.

"అతని కెలా తెలుసో నాకేం తెలుసూ ?" అదే ధోరణిలో అన్నది రాధ.

"అతను మళ్ళీ వచ్చాడా ?" ఏవగింపుగా చూస్తూ అన్నాడు.

"ఎవరూ ?" ఎదురుప్రశ్న వేసింది.

"రవీంద్ర !" ఆ పేరు ఉచ్చరించడానికే ఇష్టంలేనట్టు అన్నాడు.

"మళ్ళీ రావడం ఏమిటి ? రోజూ వస్తూనే వుంటాడు."

రాధకేసి రాఘవరావు అసహ్యించుకుంటున్నట్టు చూశాడు.

గవదల ఎముకలు పైకి తేలాయి. ముఖం ముడతలు పడింది. ఏభైయో పడిలో వున్న రాఘవరావు అరవై ఏళ్ళ వాడిలా కన్పించాడు రాధకు.

"రవీంద్ర నీ కెలా తెలుసూ ?"

రాధకు అతన్ని మరీ ఉడికించా లనిపించింది. శాంతంగా చెప్పింది.

"ఒక రోజు నేను స్కూల్ నుంచి వస్తున్నాను. ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాను. అతను సైకిల్ మీద వస్తూ డాష్ ఇచ్చాడు. కావాలని ఇచ్చి వుండడు."

"ఈ కాలం కుర్రాళ్లు వట్టి పోకిరీ వెధవలు. వాడు కావాలనే డాష్ ఇచ్చి వుంటాడు" అన్నాడు రాఘవరావు.

రాధకు నవ్వొచ్చింది.



నవ్వకుండా చెప్పసాగింది.

"కావచ్చు. నా చేతిలో పుస్తకాలు కింద పడిపోయాయి. వంగి తీసుకుంటున్నాను. అతనూ వంగాడు. ఇద్దరి తలలూ కొట్టుకున్నాయి."

"లాగి లెంపకు కొట్టాల్సింది !" అన్నాడు అక్కసుగా.

"కొట్టాల్సిందే. కాని ఎందుకో తలెత్తి అతని ముఖంలోకి చూసి- చూస్తూనే వుండిపోయాను. అతనూ నా కళ్లలోకి అదోలా, అచ్చం సినిమాలో హీరోలా చూశాడు. మా నాలుగు కళ్లూ కలుసుకున్నాయి. చూపులు పెనవేసుకున్నాయి."

"ఇంకా నయం శరీరాలు పెనవేసుకున్నాయి కాదు-" అసహ్యించుకుంటూ అన్నాడు.

"అదీ జరిగేదేనేమో. కాని అది బజారయిపోయింది" కసిగా అన్నది రాధ.

"బజారున పోయేవాడితో పరిచయం కలగడం. దాన్ని పెంచుకోవడం అంత మంచిదికాదు," మందలిస్తున్నట్టు అన్నాడు రాఘవరావు.

"ఎవరికి మంచిదికాదు, మీకా? నాకా?" రెట్టించినట్టు అన్నది రాధ.

"నాకేమిటి మధ్యలో ! నీకే ?" అన్నాడు ఉడుక్కుంటూ.

"నా మంచి చెడ్డలు నేను నిర్ణయించుకోగలను."

"అతనికి పెళ్ళయిందా ?"

"కాలేదట. ఎలిజిబుల్ బ్యాచులరే!" అంటూ రాఘవరావు ముఖంలోకి కొంటెగా చూసింది.

"అతను చెప్పడమేనా? వాకబు చేశావా?"

"అతనే చెప్పాడు?"

"నమ్ముతున్నావా?"

"ఆ!"

"అంత త్వరగా ఈ కాలం కుర్రాళ్ళను నమ్మకూడదు. కావాలంటే నేను అతని వివరాలు తెలుసుకొని చెబుతాను."

"అక్కర్లేదు. అతను మీ గురించి ఏమన్నాడో తెలుసా?" అన్నది రాధ.

"ఏమన్నాడేమిటి?" ఒత్తిపలికాడు రాఘవరావు.

"ఆ ముసలాడు ఏమిటంత బాధ పడిపోతున్నాడు పాపం! కొంపదీసి నిన్ను ప్రేమించడంలేదు కదా?" అంటూ పకపక పగలబడి నవ్వాడు.

"స్కౌండ్రల్!"

"అతన్ని నా ముందు తిట్టకండి."

"ఏం సహించలేవా? అంతవరకూ వచ్చిందన్నమాట!"

"చాలావరకు వచ్చింది. ఎందుకైనా మంచిది మీరు రావడం మానెయ్యండి. ఈ కాలం కుర్రాళ్ళు కోపం వస్తే వళ్ళూపై తెలియదు. మీ మీద చెయ్యి చేసుకోవచ్చును" అన్నది రాధ రాఘవరావు ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

రాఘవరావు దిగ్గున లేచి నిల్చున్నాడు.

"అసలు నే నెందుకు వస్తాను? ఇంతకాలం ఏదో నువ్వు మంచిదానివి అనుకున్నాను."



"అయితే ఇప్పుడు తెలిసిందన్నమాట నేను చెడ్డదాన్నని?" రెచ్చగొడుతూన్నట్టు అన్నది.

"నీలాంటి వాళ్ళతో నాకు వాదనేమిటి?" అంటూ విసవిసా వెళ్ళిపోయాడు రాఘవరావు.

రాధ రిలీఫ్‌గా నిట్టూర్చింది.

"పీడా విరగడైంది" అనుకుంది.

ఇది జరిగిన వారం రోజులకు రాధను హెడ్ మిస్ట్రెస్ పిల్చింది.

"చూడమ్మా రాధా! వయసులో వున్న ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా వుండాలి," అన్నది హెడ్ మిస్ట్రెస్ కామేశ్వరి.

ఆ ఉపోద్ఘాతం దేన్ని గురించో తెలియని రాధ ఆమె ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

"నీ గురించి నాకు తెలుసు రాధా! మగవాళ్ళతో చనువుగా మాట్లాడకూడదు."

"మాట్లాడినంత మాత్రంచేత పాతివ్రత్యం పోతుందా మేడం? తీవ్రంగా అడిగింది రాధ.

"కాదమ్మా! వెధవ లోకం. పెళ్ళిగాని పిల్లలు మగవాళ్ళతో చనువుగా మాట్లాడితే ఎన్నో పుకార్లు లేవదీస్తారు.

"పుకార్లకు ఎందుకు భయపడాలి? మన మనసు నిర్మలంగా వున్నంతవరకూ ఎవరో ఏదో అంటారని భయపడడం పిరికితనం అవుతుంది."

"అవుననుకో! కాని ఈ ఉత్తరం చూడు!" అంటూ ఓ ఉత్తరం అందించింది కామేశ్వరి రాధకు.

రాధ ఆశ్చర్యంగా ఉత్తరం అందుకుంది.

కింద సంతకం చూసింది.

"ఆకాశరామన్న!" అని రాసి వుంది.

ఆత్రుతతో గబగబా చదవసాగింది. రాధ ముఖకవళికలు మారుతూవుంటే కామేశ్వరి చూస్తూ కూర్చుంది.

రాధ శరీరం కోపంతో దహించుకు పోతూంది. మనసు జుగుప్సతో నిండిపోయింది. పెదవులు వణుకు తున్నాయి. ముఖం జేవురించింది.

రాధ చరిత్ర మంచిది కాదనీ, చాలా చీప్ ఉమెన్ అనీ, చాలా చాలా చౌకబారు మనిషనీ, ఎందర్నో మార్చిన ఈమె ప్రస్తుతం రవీంద్ర అనే ఒక రౌడీతో ప్రేమకలాపాలు జరుపుతుందనీ, ఇంకా ఏమేమో అసభ్యంగా రాసివుంది.

ఆ ఉత్తరం ఎవరు రాసివుంటారో రాధ గ్రహించింది. నిలువెల్లా వణికిపోయింది.

రాఘవరావును హెడ్‌మిస్ట్రెస్ ముందు చెప్పు తీసుకొని బాదాలని వుంది. అతన్ని షూట్ చెయ్యాలనిపించింది. పెట్రోల్ పోసి నిప్పుపుల్ల గీచి పడెయ్యాలనిపించింది.

"కుళ్ళు వెధవ! తను ఆ స్కూల్లో వుంటే ఆడపిల్లల మీద మంచి ప్రభావం పడదట! వాళ్ళంతా చెడిపోతారట! అందుకే వెంటనే డిస్‌మిస్ చెయ్యాలట!" మనసులోనే కసిగా అనుకుంది రాధ.



"ఇవన్నీ మీరూ నమ్ముతారా మేడం?" దాదాపు ఏడుస్తున్నట్టే అడిగింది రాధ.

"లేదమ్మా! నేను నమ్మడం లేదు. అసలు ఈ ఉత్తరం నీకు చూపించాలనుకోలేదు. కాని జాగ్రత్తగా వుండమని చెప్పాలనే చూపించాను" అన్నది కామేశ్వరి.

రాధ కసిగా మునిపళ్ళతో కిందపెదవి కొరుక్కుంది.

"బయటికి వచ్చి పనిచేసే ఆడపిల్లలకు ఇలాంటి అనుభవాలు కలుగుతూనే వుంటాయి. నువ్వు మరీ అంతగా బాధపడకు. నేను ఉద్యోగంలోకి వచ్చిన కొత్తలో ఇలాగే జరిగింది. అప్పుడు నేనూ బాధపడ్డాను. క్రమంగా ఇటువంటి అవమానాలకు అలవాటుపడిపోయాను," గతాన్ని గుర్తుచేసుకుంటూ అన్నది కామేశ్వరి.

"మేడం! ఇవ్వాళ ఇక నేను పనిచెయ్యలేను. గంట మాత్రమే వుంది. సెలవిస్తే ఇంటికి వెళ్తాను."

"అలాగే వెళ్ళు! కాని మరీ అంతగా దాన్నిగురించి ఆలోచించకు," అన్నది కామేశ్వరి.

రాధ కామేశ్వరి ముఖంలోకి కృతజ్ఞతపూర్వకంగా చూసింది. ఆమె దగ్గిర శెలవు తీసుకొని వూరుబయటికి వచ్చేసింది.

ఇంటికి ఎలా చేరుకుందో రాధకే తెలియదు. వచ్చి అలసటగా మంచానికి అడ్డం పడింది. లోపల ఏదో తగలపడుతున్నట్టు బాధపడసాగింది.

ఆ ఉత్తరంలోని ప్రతివాక్యం, ఉండి ఉండీ, గుర్తొస్తున్నది.

అబ్బ! ఎంత అసభ్యంగా రాశాడు? ఆ శబ్దాలు తల్చుకుంటేనే అసహ్యం వేస్తోంది. వెధవ. ధైర్యం వుంటే పేరుపెట్టి రాయాలి. పేరులేకుండా అసభ్యకరమైన రాతలు రాసేవాళ్ళ మనసులు ఎంత భయంకరంగా వుంటాయో! తన క్యారెక్టర్ మంచిదికాదా? తను చౌకబారు మనిషా? తను ఎందర్నో మార్చిందా? ఛ! ఛ!

చేత్తో కణతలు నొక్కుకుంది. తల పగిలిపోతూంది.

ఒక మగవాడి క్యారెక్టర్ గురించి అటువంటి ఉత్తరం వస్తే ఎవరైనా ఎందుకు పట్టించుకోరు? అసలు అటువంటి ఉత్తరాలు మగవాళ్ళ గురించిరావు. ఎందుకు? వచ్చినా అది తేలిగ్గా తీసుకుంటారు కనకనే?

ఈ సంఘం— మగవాడు ఏర్పరచిన ఈ సంఘం — ఆడదాన్నిగురించి మాత్రమే నీతిసూత్రాలను వల్లించింది. ప్రచారం చేసింది. గ్రంథాలు రాసింది. అందుకే ఆడదాన్ని దెబ్బకొట్టాలంటే ఆమె శీలంమీద దెబ్బకొట్టాలి.

ఆడదాని ప్రత్యేకత ఎత్తిచూపించే ఈ సాంఘిక నియమాలు మారాలి. నమ్మకాలు మారాలి. ఈ సంఘం పునాదుల్తోసహా కదిలిపోతేగాని ఇవన్నీ జరగవు. అంతవరకూ ఆడదానికి ఈ దేశంలో నిజమైన గౌరవం వుండదు.

రాధ మనసులో కసి — రాఘవరావుమీద కసి— ఈ సంఘంమీద కసి— ఆడదిగా జన్మించినందుకు తనమీద తనకే కసి— పేరుకుపోయింది.

రాఘవరావుకు నలుగురు ఆడపిల్లలు.



అయినా ఎంత అసహ్యంగా వయసులో వున్న ఓ ఆడ పిల్లను గురించి రాయగలిగాడు?

ఛ! ఏం మనుషులు?

పిరికి వెధవ!

కుళ్ళు పీనుగ!

మనసులోని కుళ్ళునంతా ఉత్తరంలోకి కక్కేశాడు. ఆ ఉత్తరంలో కన్పించేది అతని మనసు మాత్రమే. తన క్యారెక్టర్ కాదు.

తనెందుకు బాధపడాలి? ఇటువంటి వెధవలకు తనెం దుకు భయపడాలి?

తనకు తను సర్దిచెప్పుకుంటూనే బాధపడసాగింది రాధ.

ఆరోజు రవీంద్ర చాలా ఆవేశంగా వచ్చాడు.

"ఏమిటలా వున్నావ్? ఏమయింది?" రాధ ఆత్రుతతో అడిగింది.

"రాస్కెల్! ఏదేదో వాగాడు!"

"ఎవరు? ఎవరిగురించి?"

"వాడే! ఆ రాఘవరావుగాడు. నీ గురించి చాలా అసభ్యంగా మాట్లాడాడు."

రాధ మౌనంగా రవీంద్ర ముఖంలోకి చూస్తూ వుండి పోయింది.

"బాగా తన్నేశాను. మళ్లీచస్తే నీగురించి మాట్లాడడు."

రాధ విస్మయంగా రవీంద్ర ముఖంలోకి చూసింది.

"తన్నావా? మంచిపని చెయ్యలేదేమో?"

"ఏం? అతన్ని కొడ్తే నీకు బాధగా వుందా! అతను ఎంత అసభ్యంగా మాట్లాడాడో నీకు తెలియదు."

"అతన్ని కొట్టినందుకు బాధపడటం లేదు. నీమీద పగ పడ్తాడేమోనని నా భయం! కుళ్లు వెధవ!"

"ఏడ్చాడు. వాడికి దెబ్బంటే మహాభయం! మళ్ళీ చస్తే నీ జోలికి రాడు," అన్నాడు రవీంద్ర ఆవేశంగా.

"అసలు ఇన్నింటికీ ఏమన్నాడేమిటి? ఎక్కడ కలుసుకున్నారు?"

"నేనూ, ఒక స్నేహితుడూ తాజమహల్ హోటల్‌కు వెళ్ళాం! అక్కడ రాఘవరావు మరో ఇద్దరితో కూర్చుని వున్నాడు. నేను చూసీ చూడనట్టే వుండిపోయాను. నేను వినాలని పెద్దపెద్దగా మాట్లాడుతూ నవ్వుతున్నాడని గ్రహించాను. కాని పట్టించుకోలేదు. అకస్మాత్తుగా నీ పేరు విన్పించింది. పొరపాటుగా విన్నానేమో అనుకున్నాను. మళ్ళీ పెద్దగా అన్నాడు. ఏమేమో అసహ్యంగా వాగుతున్నాడు. వాడితో వున్నవాళ్లు ఆనందిస్తూ, మధ్యమధ్యన ఘొల్లున నవ్వుతున్నారు. నేను వింటూ కూర్చోలేకపోయాను. ఒక్క ఉదుటున వాడిదగ్గరకెళ్ళి చొక్కా పట్టుకొని లేవదీసి, ఆ చెంపా, ఈ చెంపా కసిగా వాయించాను. అనుకోని ఈ సంఘటనకు, నా స్నేహితుడితోపాటు, అతనితో వున్న ఆ ఇద్దరు కూడా స్థంభించిపోయి నిల్చున్నారు. పిరికివెధవ నోరు తెరవలేదు. మళ్ళీ నీ పేరు ఎత్తితే ప్రాణంతో వదిలిపెట్టనని చెప్పాను. కిక్కురుమనకుండా వెళ్ళిపోయాడు," రవీంద్ర ఆవేశంగా చెబుతూవుంటే ఆశ్చర్యంతో విన్నది రాధ.



"ఇంతకూ అతను ఏమన్నాడో చెప్పనే లేదు."

"చాలా అసహ్యంగా మాట్లాడాడు. నేను చెప్పలేను" అన్నాడు.

రాధకు ఆ ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. ముఖం ఎర్రబడింది. అవేమాటలు అనివుంటాడా? రాధ, రవీంద్ర ముఖంలోకి చూడలేకపోయింది. తల దించుకొని ఆలోచనలో పడింది.

"ఆ వెధవ ఏదో వాగాడు. వాడి మాటలకు బాధపడనక్కర్లేదు. బజార్లో ఏనుగు వెళ్తూవుంటే వెనక నుంచి కుక్కలు మొరుగుతాయి. ఏనుగ తిరిగికూడా చూడదు," అన్నాడు రవీంద్ర.

రవీంద్ర హృదయ సంస్కారానికి రాధ ముగ్ధురాలైంది. ఆకాశరామన్న ఉత్తరం గురించి చెప్పింది.

ఆ రాత్రంతా రవీంద్ర గురించి ఆలోచిస్తూనే వుంది.

రవీంద్రకు ఎందుకు తనంటే అంత అభిమానం?

ఒకవేళ అతనుకూడా తనను ప్రేమించడం లేదు కదా! అయినా అతను వెకిలిగా మాట్లాడడు. కాంక్షతో చూడడు. అందువల్లనే అతనిముందు తన మనసు ముడుచుకుపోదు.

అందుకే అతనంటే తనకు ఇష్టం!

అప్పుడప్పుడు తను ఒంటరిగా వున్నప్పుడు, తన మనసు అశాంతితో వేగిపోతున్నప్పుడు మృదువుగా తన అంతరాంతరాలను స్పృశించే అస్తిత్వం ఇతనిదేనా?

కాదు....కాదు....అది రవీంద్ర అస్తిత్వం కాదు.

ఈమధ్య ఎందుకో రవీంద్ర దిగులుగా కన్పిస్తున్నాడు. ఎక్కువగా మాట్లాడడు. మధ్య మధ్య కళ్లు మూసుకొని ఏదో ఆలోచిస్తూ వుంటాడు. ఆ కళ్లు తెరవగానే ఎర్రగా వుంటాయి. అవి బాధవల్ల ఎర్రబడతాయో లేక.... తనకు తెలియదు. కాని మరుక్షణంలోనే అవి మామూలుగా నిర్మలంగా మారిపోతాయి.

అతని చూపుల్లో, మాటల్లో, చేష్టల్లో ఎటువంటి వికారం కన్పించదు.

కాని అతను దిగులుగా ఎందుకు వుంటున్నాడు?

నిజంగానే రవీంద్ర తనను ప్రేమిస్తున్నాడేమో! అతని బాధకు అదే కారణం ఏమో?

హే భగవాన్ నన్ను క్షమించు!

రవీంద్రను రక్షించు!

మనసులోనే ప్రార్థించింది రాధ.

.... .... .... .... ....

"సిస్టర్ దాహం వేస్తుంది."

గ్రేస్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

## 16

"ఎందుకు సిస్టర్ నవ్వుతున్నారు?"

"నీ కథ తెలిసిపోయింది రాధా?"

రాధ విస్మయంగా గ్రేస్ ముఖంలోకి చూసింది.

"నీకు తెలియకుండానే నువ్వు రవీంద్రను ప్రేమించావు.



ఏ కారణంవల్లనో అతను నీకు దూరం అయ్యాడు. అంతేనా?" అన్నది గ్రేస్ రాధ చేతిని నిమురుతూ.

రాధ నిట్టూర్చింది. విరిగిన పాలలాంటి చిరునవ్వు రాధ పెదవులమీద క్షణకాలం పాటు నిల్చింది.

"లేదు సిస్టర్! అలా జరిగివుంటే, నా కథ విషాదాంతం అయేదికాదు. దానికి ఒక ప్రత్యేకతకూడా వుండేది కాదు."

"అంటే నువ్వే రవీంద్రను తిరస్కరించావా?"

గ్రేస్ కంఠం అదోలా పలికింది.

రాధ, గ్రేస్ ముఖంలోకి లోతుగా చూస్తూ "సిస్టర్. మీకు నామీద అసహ్యం కలుగుతోందా?" అని అడిగింది.

గ్రేస్ తృళ్ళిపడింది.

"లేదమ్మా! లేదు." అన్నది మృదువుగా.

"వినండి సిస్టర్...."

.... .... .... .... ....

రాధకు అప్పుడప్పుడు "తనకు రవీంద్ర అంటే ప్రత్యేకమైన ఇష్టం వున్నదా?" అనే అనుమానం వస్తూ వుండేది.

వెంటనే మనసు ఎదురు తిరిగేది.

కాదు.... కాదు.... నువ్వు పొరబడుతున్నావ్! ఈ ఆర్తి.... ఈ అన్వేషణ.... ఈ తపన.... అతని కోసం కాదు" అంటూ అంతరాత్మ ఘోషించేది.

ఒకరోజు రవీంద్ర అతని స్నేహితునితో వచ్చాడు. రాధ బల్లముందు కూర్చుని నవల చదువుతూవుంది.

వాళ్ళను చూసి లేచి నిలబడింది.

"ఇతను నా ఫ్రెండ్ ! పేరు రాహుల్!" రవీంద్ర పరిచయం చేశాడు.

"నమస్తే!" అంటూ అతను చేతులు జోడించాడు.

"నమస్తే!" ప్రతి నమస్కారం చేస్తూ రాధ అతన్ని చూసింది.

అతని చూపులు రాధ కళ్ళలోనుంచి దూసుకుపోయి, మనసులోకి లోతుగా వెళ్ళి గాలంలా చిక్కుకున్నాయ్.

రాధ జల్లు పట్టుకుంది.

ఎప్పుడూ, ఎవరిముందూ కలగని తడబాటు ఏదో ఆమెలో కలిగింది.

"పనిమీద మీ ఇంటిముందునుంచి వెళ్తున్నాం. ఒకసారి నిన్ను చూసి వెళ్దామని వచ్చాను–" అన్నాడు రవీంద్ర.

రాధ మౌనంగా కూర్చుంది.

రాహుల్ కేసి చూడకపోయినా అతని చూపులు ఆమెను ఇబ్బంది పెడ్తూనే వున్నాయ్.

రవీంద్ర ఏదో చెబుతున్నాడు. రాధ పరధ్యాన్నంగా వుండిపోయింది.

పదినిముషాలు కూర్చుని వెళ్ళిపోయారు.

అయినా ఆ గదిలో, ఆ గాలిలో, ఆమె మనసులో రాహుల్ తాలూకు స్పర్శ ఏదో మిగిలిపోయినట్టు అనిపించసాగింది రాధకు.

అతని రూపం.... అతని చూపులు.... రాధను వెంబడిస్తూనే వున్నాయ్.

ఏమిటీ అనుభూతి ?



గమ్యాన్ని అన్వేషిస్తూ అనంతకాలంగా పయనిస్తున్న బాటసారికి అనుకోకుండా గమ్యం ఎదురైనట్టూ, అతని ప్రయాణం ఆగిపోయినట్టూ అనిపిస్తుం దేమిటి ?

ఇంతకాలం తనలో బావురుమంటూ వున్న ఆ ఖాళీ ఏదో మధురభావంతో, ఎవరిదో అస్తిత్వంతో నిండిపోయినట్టనిపిస్తుంది."

యుగాలగా తననుంచి విడిపోయిన భాగం ఏదో మళ్ళీ వచ్చి తనలో ప్రవేశించినట్టు అనిపిస్తుంది.

రాహుల్! ఎంత చక్కని పేరు !

ఆ చూపులు కాళిదాసు ఉపమాలంకారంలా హృదయాన్ని తియ్యగా కోస్తాయి.

రాధ రవీంద్ర కోసం ఎదురుచూడ సాగింది.

రాహుల్ గురించి తెలుసుకోవాలని వుంది.

ఈ దేశంలో వున్న ఇన్నికోట్ల జనాభాలో తను అన్వేషిస్తున్న వ్యక్తి అతనేనా ?

వారం రోజులవరకు రవీంద్ర రాలేదు.

ఓరోజు సంధ్యచీకట్లు పడుతుండగా రవీంద్ర వచ్చాడు. చాలా దిగులుగా కన్పించాడు. రవీంద్రను అలా చూస్తుంటే రాధకు బాధ కలిగింది.

"ఎందుకలా వున్నావ్ ?"

"ఎలా వున్నాను ?"

"దిగులుగా వున్నట్టు కన్పిస్తున్నావు!"

రవీంద్ర దిగులుగా నవ్వాడు.

"నాకు చెప్పకూడదా ?"

"ఇంతకాలం చెప్పకూడదనే అనుకున్నాను. అందుకే దిగుల్ని గుండెల్లోనే దాచుకున్నాను. కాని నా శక్తి క్షీణించింది. ఇక దాచుకోలేను" అన్నాడు.

రాధ గతుక్కుమంది.

రవీంద్రకూడా....? కాదు .... కాదు .... రవీంద్ర దిగులుకు కారణం అదికాను. కాకూడదు.

"రాధా! యివ్వాళ నీతో ఒక విషయం మాట్లాడాలి. అభ్యంతరం లేదుగా?" అన్నాడు రవీంద్ర రాధ ముఖంలో మార్పును గమనిస్తూ.

రవీంద్ర ఏం చెప్పా లనుకుంటున్నాడు? అందరిలా "రాధా! నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళిచేసుకుందామా?" అని అడుగుతాడా?

రాధకు భయంవేసింది. దిగులువేసింది. కాని కోపం రాలేదు. అసహ్యం కలగలేదు.

అదే నిజమైతే? రవీంద్రనుకూడా తను అవమానించగలదా? కాని అతని ప్రేమను స్వీకరించలేదు. అతన్నెప్పుడూ తను ఆ దృష్టితో చూడలేదు. కాని రవీంద్రను బాధపెట్టడంకూడా ఇష్టంలేదు. అయినా బాధ పెట్టక తప్పదు.

"మీ స్నేహితుడు ఏం చేస్తుంటాడు?" రాధ మాట మారుస్తూ అడిగింది.

"డాక్టర్! కె. జీ. ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు."

అతన్ని గురించిన వివరాలు ఎన్నో తెలుసుకోవాలని



వుంది. కాని రవీంద్రను, ఆ సమయంలో అడగటం భావ్యం కాదనిపించింది.

"మాట మార్చకు రాధా! ఇవ్వాళ, నిన్నొక ప్రశ్న సూటిగా అడిగి తెలుసుకోవాలని వచ్చాను. నాకు సమాధానం కావాలి-" సూటిగా అడిగాడు రవీంద్ర. అతని కంఠం దృఢంగా వుంది.

రాధ అసహాయంగా చూసింది రవీంద్ర ముఖంలోకి.

"నిన్ను ప్రేమిస్తున్నాను. వివాహం చేసుకోవా లనుకుంటున్నాను. నీకు ఇష్టం అయితేనే!" సూటిగా రాధ కళ్ళలోకి చూస్తూ అడిగాడు రవీంద్ర.

రాధకు ఓ క్షణం గదిలోని ప్రతి వస్తువూ గిర్రున తిరిగినట్టు అనిపించింది.

"అయ్యో! రవీంద్రా! నువ్వుకూడా.... అందరిలా.... కనీసం మరికొంతకాలం.... నిన్ను ప్రేమిస్తున్నాను.... అంటూ పాత రికార్డు పెట్టకుండా వుంటే....?"

రాధ మనసులో ఏదో భళ్ళున పగిలింది.

"చెప్పు రాధా! నాకు సూటిగా సమాధానం కావాలి."

రాధ పెదవులు వణికాయి. కోపంతో కాదు .... భయంతో .... బాధతో ....

"ర....వీంద్రా! నువ్వు నన్ను అర్థం చేసుకున్నా వనుకున్నాను."

"నేనూ అలాగే అనుకుంటున్నాను. అందుకే సూటిగా అడిగి తెలుసుకోవా లనుకుంటున్నాను, చెప్పు! ఏ సమాధానం అయినా పర్వాలేదు."

"రవీంద్రా ! నువ్వుకూడా "నిన్ను ప్రేమిస్తున్నాను" అనేక యుగాలుగా అరిగి తుప్పుపట్టి పోయిన రికార్డునే వేశావా?" తనకు తనే అనుకున్నట్టు అన్నది రాధ !

రవీంద్ర ఓ క్షణం రాధ ముఖంలోకి చూశాడు.

"అవును ! ఆ మాటలు అరిగిపోయిన రికార్డులోనివే. చాలా పురాతనమైనవే కావచ్చు. యుగాలుగా పూలూ వికసిస్తున్నాయ్. మారుతం ఆ సుగంధాన్ని దశదిశలా వ్యాపింప చేస్తూనే వున్నది అనాదికాలంనుంచీ! కాని ఆ పుష్పాలూ, ఆ సుగంధం, కవులకూ, కళాకారులకూ నిత్యం కొత్త ప్రేరణను ఇస్తూనే వున్నాయ్. ప్రతి పాతభాషా.... యుగాలుగా పురాతనమైన భాషా....అరిగిపోయిన శబ్దం.... కొత్తభావనను వ్యక్తం చేస్తున్నప్పుడు నూతనత్వాన్ని పొందుతున్నాయ్. 'ప్రేమ' అనే శబ్దం చాలా పురాతనమైనదే కావచ్చు. అరిగిపోయిన రికార్డే కావచ్చు. కాని ఆ శబ్దం ఉచ్చరించే ప్రతి వ్యక్తి పెదవులమీదా అది కొత్తరూపాన్ని ధరిస్తూ నూతన ఆకర్షణను కలిగిస్తుంది."

"రాధ కళ్ళు పెద్దవి చేసుకొని రవీంద్ర మాటలు వింటూ వుంది.

"సారీ ! సినిమా డైలాగ్స్ చెప్పేస్తున్నట్టున్నాను. చెప్పు రాధా ! నీ కిష్టంలేకపోతే చెప్పేయ్ ! నేను రంగారావులా, సుబ్బారావులా, రాఘవరావులా నీకు న్యూసెన్సుగా తయారుగాను ! భయపడకు !"

రాధకు దుఃఖం పెల్లుబికింది.



ఏం చెప్పాలి ! భగవాన్ ! రవీంద్రను బాధపెట్టక తప్పదా !

"ఎందుకు రాధా అంతబాధపడ్తావ్ ! నేను నిన్ను నిందించను! నేను నిన్ను ప్రేమించడం నీ తప్పుకాదు. నా తప్పు. దానికి శిక్ష అనుభవించవలసినవాణ్ణి నేను," అన్నాడు రవీంద్ర.

రాధ మనసును మొండిరంపం కోస్తునట్టు విలవిలలాడిపోయింది. సమాధానం చెప్పలేక అసహాయంగా చూస్తూ కూర్చుంది.

"నాగురించి నాకు బాధలేదు. కాని మా అమ్మ గురించే !" తనను తనే చెప్పుకుంటున్నట్టు అన్నాడు రవీంద్ర.

రాధ అర్థంకానట్టు చూసింది.

"మా అమ్మకు మేం ఇద్దరమే కొడుకులం. మా అన్నయ్య మిలటరీలో పనిచేస్తూవుండేవాడు. సైన్యంలో పనిచేసే ఒక నర్సుని ప్రేమించాడు. కాని ఆమె అతని ప్రేమను తిరస్కరించింది. ఆత్మహత్య చేసుకున్నాడు. మా అమ్మ మా అన్నయ్య శవాన్నికూడా చూడలేకపోయింది."

రాధ ఉలిక్కిపడి రవీంద్ర ముఖంలోకి చూసింది.

రవీంద్ర మాటల ఉద్దేశం ఏమిటి ! తనుకూడా తన అన్నయ్యలా....

రాధకు వెన్నెముకలో ఏదో గుచ్చుకున్నట్టు అయింది. దెబ్బతిన్న లేడిలా రవీంద్ర ముఖంలోకి చూసింది.

"నన్ను క్షమించు రవీంద్రా ! ఎలాగో అనగలిగింది.

"దట్సాల్ రైట్! గుడ్ బై!" అంటూ లేచినిల్చున్న రవీంద్ర కేసి అసహాయంగా చూసింది.

రాధకు ఏదో చెప్పాలని వుంది. ఆమె కంఠం పెగిలే లోపలే రవీంద్ర గబగబా వెళ్ళిపోయాడు.

వెనకనే పరిగెత్తి "రవీంద్రా ఒక్క క్షణం ఆగు! నాకు ఆలోచించుకోడానికి సమయం ఇవ్వు!" అంటూ అరవాలని పించింది.

కాని రాధ కాళ్లు కదల్లేదు.

నోట్లోనుంచి మాటలు బయటపడ లేదు.

రవీంద్ర వెళ్ళిపోయాడు. మళ్ళీ రాడు!

అతనూ, తనలాగే .... నో .... నో అతను పిరికివాడు కాదు .... కాని ఆత్మహత్య చేసుకొనేవాళ్లు పిరికివాళ్ళా! కాదు.... ఆత్మహత్య చేసుకోవడానికి, మొండితనం, ధైర్యం కావాలి. అవి రవీంద్రలో వున్నాయి.

ముందుకు ఆలోచించలేకపోయింది రాధ.

మంచానికి అడ్డంపడి దిండులో ముఖం దాచుకొని భోరున ఏడ్చింది రాధ.

ఆ రాత్రి అన్నం తినలేదు. నిద్రపట్టలేదు. మనసును ఏదో పట్టుకు పీడిస్తుంది.

రవీంద్ర మాటల్లో బెదిరింపు వుందా?

చస్తానని బెదిరించేవాళ్లు చావరు అంటారు.

కాని ఆ మధ్య న్యూస్ పేపర్లో ఆ అభిప్రాయం తప్పని రిసెర్చిద్వారా తేలినట్లు వ్రాయబడింది.

అంటే రవీంద్ర.... గుండెను ఎవరో పిండుతున్నారు.



ఆ బాధ భరించరానిదిగావుంది. ఆ బాధనుంచి తనను తాను రక్షించుకోవడానికి తర్కాన్ని ఆశ్రయించింది.

చస్తామన్న ప్రతివాళ్ళనూ తను పెళ్ళి ఎలా చేసుకుంటుంది! అట్లా భయపడివుంటే ఏనాడో రంగారావునే చేసుకొని ఉండాల్సింది. తన తప్పేమీ లేదు. తనెందుకు బాధపడాలి! ఆ మాటే రవీంద్రకూడా అన్నాడుగా!

ఇంతమంది తమ ప్రేమను ప్రకటించడంలో తన ప్రమేయం ఏమీ లేదా?

కొంతవరకు తన ప్రవర్తన కూడా కారణం కాదా?

కాదు.... అవును.... కాదు....

ఏమిటీ నరకం?

రవీంద్ర విషయంలో మాత్రం తన ప్రవర్తన కూడా కొంత కారణం కావచ్చు.

రవీంద్ర కళ్ళలో, మాటల్లో కాంక్ష— ఆరాధన.... అదేదోలాంటి వెగటు కలిగించే భావం.... ఏవీ కన్పించేవి కాదు. రవీంద్రకు తనమీద ప్రత్యేకమైన ఇష్టం లేదేమోనని అనుకోవడానికి మనసు ఒప్పుకొనేదికాదు. అలా అనుకుంటే ఏదో అసంతృప్తి కలిగేది.

అంతరాంతరాల్లో ఎక్కడో రవీంద్ర తనను ప్రేమించాలని వుండేది. అందువల్లనే అతనితో సర్దాగా నొప్పించకుండా మాట్లాడేది.

రవీంద్రకు తను అన్యాయం చేసింది. అతను నిజంగానే ఏ అఘాయిత్యానికైనా పాల్పడితే ఆ పాపం తనకు చుట్టుకోదా!

లేదు....తను అతనికి ఏమీ ఆశలు చూపలేదు. అసలు తన మనసులో అటువంటి భావమే లేదు.

పరిపరివిధాల రాధ మనసు మథన పడసాగింది.

వారంరోజుల వరకు రవీంద్ర రాలేదు. రాడని తెలిసినా ఎదురు చూసింది.

ఉండబట్టలేక ఒకరోజు రవీంద్ర పనిచేసే బ్యాంకుకు ఫోన్ చేసింది.

అతను నాలుగురోజుల క్రిందటే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోయినట్టు తెలిసి రాధ స్థంభించిపోయింది.

రాధ మనసు మనసులో వుండటంలేదు. ఉండి ఉండి ఏడవాలనిపిస్తుంది. అపరాధం చేసినట్టు ప్రతి నిముషం కుంగిపోతూవుంది.

ఒకరోజు ఉదయం, బ్యాంకుకు ఫోన్ చేసిన తెల్లవారి పేపరు మొదటి పేజీలోవున్న న్యూస్ చదివి నిలువెల్లా వణికిపోయింది.

ఎవరో యువకుడు, బాగా చదువుకున్నవాడిలా వున్న యువకుడు రైలు కిందపడి చనిపోయినట్టు వార్త వచ్చింది. ఆ తర్వాత పంక్తులు రాధ కళ్ళకు కన్పించలేదు. శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. అలా ఎంతసేపుకూర్చుండిపోయిందో ఆమెకే తెలియదు.

రవీంద్ర కాదు....కాకూడదు.... పదే పదే అనుకుంది.

శక్తిని కూడదీసుకొని ముందుకు చదివింది. అతని జేబులోవున్న ఉత్తరాల ద్వారా "అతని పేరు రాజారావనీ,



ఎం. ఏ. పాసయిన నిరుద్యోగి" అనీ తెలుస్తున్నట్టు రాసివుంది.

రాధ గుండెల నిండుగా గాలి పీల్చుకుంది. రిలీఫ్‌గా అనిపించింది. భయంకరమైన కలనుంచి బయట పడ్డట్టు అన్పించింది.

ఎవరో వచ్చిన అలికిడికి తలెత్తి చూసింది రాధ.

ఓ క్షణం నమ్మలేనట్టు చూస్తూ వుండిపోయింది.

మరుక్షణం దిగ్గునలేచి నిలబడింది.

గుండెలు దడదడ లాడాయి.

కాళ్ళు వణికాయి.

ఆనందం.... భయం ఏదో ఊపిరి ఆడనివ్వని అనుభవం....కొత్త అనుభవం.... రాధ తడబడింది.

జీవితంలో ఎప్పుడో ఒక్కసారి, ఒకే ఒక్కసారి మానవుడు తను నేర్చిన భాష ఒక్క క్షణకాలంపాటు మర్చిపోతాడు. లేక అతనికి నోట్లో నాలుక లేనట్టయినా అనిపిస్తుంది. వున్నా మొద్దుబారి కదలడానికి శక్తి లేనట్టున్నా అనిపిస్తుంది.

రాధ రాహుల్‌ను చూస్తూ నిలబడిపోయింది.

కూర్చోమని చెప్పాలనికూడా తట్టలేదు.

"పేపరు చేత్తో పట్టుకొని చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ఏమిటి? ఆ మొదటిపేజీ న్యూస్ గురించేనా ?"

ఆ మాటలో, ఆ కంఠంలో ఎంత స్పష్టత వుంది ?

"ఆ న్యూస్ చూస్తే రవీంద్ర గుర్తొచ్చాడా ?"

రాధ విచిత్రచూపులు చూసింది.

అతని చూపులు తళ తళలాడే చురకత్తులా కళ్ళను చీల్చుకుంటూ వెళ్లి గుండెను గాయపరుస్తాయని రాధ ప్రథమ పరిచయంలోనే తెలుసుకుంది.

కాని ఆ చూపులు బుర్రలోని ఆలోచనల్ని గాలంలా బయటికి లాక్కొస్తా యని ఇప్పుడే తెలుసుకుంది.

"కూర్చోండి ?"

నిల్చునే శక్తి లేని దానిలా రాధ కుర్చీలో కూలబడింది.

"నా ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు," కూర్చుంటూ అన్నాడు రాహుల్.

రాధకు ఏం సమాధానం ఇవ్వాలో తెలియలేదు. రవీంద్ర రూపం కళ్ళకు కట్టినట్టయింది. కళ్లు చెమ్మగిల్లాయి.

"రవీంద్ర ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు," అతను అన్నతీరు "దానికి కారణం నువ్వే!" అన్నట్టు ఉంది.

రాధ మౌనంగా వుండిపోయింది.

"ఇవ్వాళో రేపో ఈ ఊరు వదిలి వెళ్తాడు. ఎక్కడికి వెళ్తాడో అతనికే తెలియదు. బ్రిలియంట్ బాయ్! చేతులారా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నాడు," రాహుల్ కంఠం గంభీరంగా వుంది.

కంఠం ఎంత బాగుందో ?

ఫుల్ వాయిస్ అంటే ఇలాగే వుంటుందేమో? రూపానికి తగిన కంఠం.

కొందరి కంఠాలు వింటూంటే, ఆ కంఠాలు ఆ శరీరాలకు సంబంధించినవి కావనిపిస్తాయి.



"అతను అలా ఎందుకు చేస్తున్నాడో మీకు తెలుసు?"

రాధ ఆలోచనలనుంచి త్రుళ్లిపడింది.

అతను రవీంద్ర గురించి మాట్లాడుతూవుంటే తను అతని కంఠం గురించి ఆలోచిస్తూవుంది. రాధ లోలోపల సిగ్గుపడింది.

"అయినా మరొకరి కంఠం నుంచి ఆ నిజం వింటే ఎలా వుంటుందో ఒక్కసారి చవిచూడండి. అతను మీవల్లనే అదే-మీరే అతని భవిష్యత్తు నాశనం కావడానికి కారకులు," అన్నాడు రాహుల్.

అతని కంఠం—తీవ్రంగా వుంది.

రాధ చివ్వున తలెత్తి అతని ముఖంలోకి చూసింది.

"అటువంటి వాళ్ళంటే నాకు సానుభూతిలేదు," అంతకంటే తీవ్రంగా అన్నది రాధ.

రాహుల్ రాధ కళ్ళలోకి లోతుగా చూశాడు. అదోలా నవ్వాడు. ఆ నవ్వులో వ్యంగ్యం.... కాదు అంతకంటే మనసు గుచ్చేది ఏదో వుంది.

రాధ కళ్ళు మరలుచ్చుకుంది.

"అతను వాళ్లసే.... అంటే నేను ముందు ఏవేవో ఆశలు చూపించి మోసం చేశానని అతను చెప్పాడా లేక మీరు అనుకుంటున్నారా ?" రాహుల్ ముఖంలో చూడకుండానే తీవ్రంగా అడిగింది రాధ.

"అతను అలా చెప్పడు. నేనూ అలా అనుకోవడం లేదు. కాని అతను మిమ్మల్ని ప్రేమించాడు. ఎన్నో కలలు కన్నాడు. ఆశలు పెంచుకున్నాడు...."

"బాగుంది మీరు చెప్పేది! ఆడది కొంచెం చనువుగా మాట్లాడినంతమాత్రాన ఏదేదో ఊహించుకుంటూ మగ వాడు ప్రపంచం నుంచి పారిపోతే అది ఆమె తప్పా! ఆడ దాని మనసు మిఠాయి కాదు! అడిగిన వాళ్ళందరికీ పంచి పెట్టటానికి!" కోపంగా అన్నది రాధ.

రాహుల్ ఓ క్షణం మౌనంగా చూశాడు.

రాధ ఇబ్బందిగా కుర్చీలో కదిలింది.

"మనసు మిఠాయి కాదు. కాని కొందరు ఆడవాళ్లు, మగవాళ్ళకు, మనసు మిఠాయి అనే భ్రమను కలిగిస్తారు. చెయ్యి చాపితే అందుతుందనే భ్రమ కలిగిస్తారు. ఆశపడి ఎవడైనా చెయ్యిచాపితే ఆ చేతిని కసిగా కాటేస్తారు," అన్నాడు రాహుల్ రాధ ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

రాధ మనసు భగ్గుమంది. కాని ఏం సమాధానం ఇవ్వాలో వెంటనే తోచలేదు.

రాహుల్ మళ్లీ అన్నాడు—

"మీలాంటివారికి అహం ఎక్కువ. తమకేం కావాలో తమకే తెలియదు. దూరంగా ఒక వస్తువును చూసి అదే తమకు కావాల్సిందని భ్రమ పడ్తారు. తమకు తెలియకుండానే దాన్ని దగ్గరకు రప్పించుకొనే ప్రయత్నం చేస్తారు. తీరా అది అందుబాటులోకి వస్తే చులకనగా చూసి కళ్లు తిప్పుకుంటారు. ఈసడిస్తారు. అసహ్యించుకుంటారు. అది తమ ప్రత్యేకతగా భావించి గర్విస్తారు. అహంకారం పెంచుకుంటారు. ప్రతి ఇసుక దిబ్బ దూరంనుంచి చూసినప్పుడు మనోహర దృశ్యం గానే కన్పిస్తుంది."



రాధ లోలోపలే ఉడికిపోతూంది.

అవమానంతో మనసు దహించుకుపోతూంది.

అయినా అతన్ని నాలుగుదులిపి వెళ్ళిపొమ్మని చెప్పా లనిపించడంలేదు.

ఎందుకు? తనకేమైంది? ఎలా ఇంత అవమానాన్ని భరిస్తోంది?

తను ఓడిపోతుందా?

"ఇన్నిటికీ మీరనేదేమిటి?" కంఠం పెగల్చుకొని ఆ మాటలు అతికష్టంమీద బయటపడ్డాయి.

"నేనేమీ అనడంలేదు. మరొక్కసారి రవీంద్రగురించి ఆలోచించమంటున్నాను."

ఏమిటి ఇంత ధైర్యం!

ఆ కంఠంలో ప్రార్థనలేదు. అధికారపువాసన వుంది.

అసలు తనెవరు తనను ఆజ్ఞాపించడానికి?

"ఆలోచించవలసిన అవసరం నాకు లేదు." అనేసింది రాధ.

రవీంద్ర గురించి అంత కఠినంగా అన్నందుకు మనసు మథనపడసాగింది.

"అని పైకి అంటున్నారు. కాని మీరు రవీంద్ర గురించి ఆలోచిస్తూనే వున్నారు," అన్నాడు రాహుల్.

ఏమిటి ఈ మనిషి? ఎదుటి మనిషి మనసును తెంచిన పుస్తకంలా చదివేసే ఇతనితో వాదించడం ఎలా?

"సారీ! మీరు చాలా అతిగా మాట్లాడుతున్నారు!" విసురుగా అన్నది రాధ.

"అతిగా మాట్లాడటం నా స్వభావం కాదు. అదేమిటో మిమ్మల్ని చూస్తుంటే ఎక్కువ మాటలు వచ్చేస్తున్నాయి. దానికి కారణం ఆలోచించాల్సిందే!"

రాధకు ఏదోగా అన్పించింది. అంటే? అంటే?

రాధ గుండె దడదడ లాడింది. చిత్రమైన అనుభూతి ఏదో మనసును చుట్టేసింది.

రాధ అతని ముఖంలోకి చూడాలని వుంది. కాని చూడ లేకపోతుంది.

ఏమిటి తనలో ఈ బలహీనత? - ఏనాడూ .... ఏ మగవాడి ముందూ.... అనుభవించని ఇంత సంకోచం .... ఇతని ముందు తను ఓడిపోతుందా?

చేతి గోళ్ళకు వేసుకున్న రంగు చూస్తూ కూర్చుంది.

అతను వెళ్ళిపోతే బాగుణ్ణు అనిపించింది.

మరి కొంచెంసేపు కూర్చుంటే బాగుణ్ణు అనికూడా అనిపించింది వెంటనే.

అనుకోకుండా, రాధ చేతిగోళ్ళను కొరకసాగింది.

"రంగు వేసుకున్న గోళ్ళను కొరుకుతున్నారు. ఆడ వాళ్ళు గోళ్ళు ఎందుకు, ఎప్పుడు కొరుకుతారో తెలుసా?" తమాషాగా పలికింది అతని కంఠం.

రాధకు దొంగతనం చేస్తూ పట్టుపడినట్టయింది.

ఎవరూ చూడడం లేదనుకొని మరొకరి ఉత్తరం



చదువుతూవుంటే, ఆ ఉత్తరం తాలూకు మనిషి కంటపడినట్లు బిడియపడిపోయింది.

ఇంత త్వరగా అతను తనలో చోటుచేసుకుంటున్న బలహీనతను కనిపెట్టాడా!

రాధకు ఈసారి నిజంగానే అతను వెళ్ళిపోతే మంచిది అనిపించింది.

"వస్తాను!" ఆమె భావాన్ని గ్రహించినట్టు వెంటనే లేచి నిల్చున్నాడు రాహుల్.

రాధ తలెత్తింది. అతని వీపుమాత్రం కన్పించింది.

వెళ్ళిపోయాడు!

అతను వెళ్ళిపోయినవైపే చూస్తూ కూర్చుండి పోయింది.

అతను వెళ్తూ వెళ్తూ తనకు అతిప్రియమైన వస్తువును దేన్నో తీసుకొని వెళ్ళిపోయినట్లనిపించింది.

వెళ్ళిపోయాడు.

మళ్ళీ రాడేమో?

మళ్ళీ ఎందుకొస్తాడు?

అసలు ఎందుకు రావాలి?

అతను వస్తే తనకేం? రాకపోతే తనకేం?

రావాలి! అతను మళ్ళీ రావాలి!

వస్తాడు! తప్పక వస్తాడు!

ఛ! ఏమిటి తను ఇలా ఆలోచిస్తోంది? అతనెవరూ తనెవరూ? అతను వస్తే తనకేం? రాకపోతే తనకేం? మళ్ళీ మళ్ళీ అనుకుంది.

అతను రాకపోతే తనకేంలేదా? మరి అయితే ఈ దిగులుకు కారణం ఏమిటి?

అతను కనుమరుగు కాగానే తన గుండెకు ఇంత దిగులు చుట్టేసిందేం?

తను ఓడిపోయిందా? తను ఒక మగవాడి ముందు ఓడిపోవడమా?

లేదు.... లేదు.... తను ఓడిపోలేదు. నూటికి తొంభై మంది ఆడవాళ్లలోవుండే బలహీనత తనలో వుండకూడదు. తను ప్రత్యేకం .... తను యూనిక్ .... యూనిక్‌గానే వుండిపోతుంది.

ఓడిపోయినరోజు తను వుండదు.

తను వున్నంతకాలం తనకు ఓటమిలేదు.

జీవితపోరాటంలో ఓటమిలోకూడా ఓ ఆనందం వుంది. అనిర్వచనీయమైన తీయని బాధ వుంది. తను ఆ విషయం మొదటిసారిగా గుర్తించింది.

తనకు అతిప్రియమైన వ్యక్తిముందు ఓడిపోవడంలోనే మనిషికి ఆనందం లభిస్తుంది.

తనకు రాహుల్ అతి ప్రియమైనవాడా?

ఏమిటి తనకు మతిగాని పోలేదుగదా!

తనకు పరిచయమైన ప్రతి మగవాడిలో తనకు ఏదో రకమైన బోలుతనం కన్పించింది.

కాని రాహుల్ ముందు కూర్చున్నంతసేపూ తనకు తనే బోలుగా కన్పించసాగింది. అతని ముందు తను ముడుచుకుపోతూంది. తనలోని అహం కరిగిపోతూంది. కాని మన



సులో ఖాళీ.... తనను భయపెట్టే ఆ ఖాళీ.... తనను శాంతంగా క్షణంసేపు నిలవనివ్వని ఆ ఖాళీ.... అతని సమక్షంలో నిండిపోయినట్టు అన్పిస్తోంది. ఇంతకాలంగా తనను లీలగా స్పృశిస్తున్న అస్తిత్వం ఇతనిదేనా?

"అవును!" మనసు పలికింది.

దేనినో పొందాలనే అశాంతితో నిరంతరం అన్వేషిస్తూ క్షణం విశ్రాంతి ఎరగని తన మనసుకు గమ్యం చేరినట్టు సంతృప్తిగా వుంది.

అతను మళ్లీ రాకపోతే? ఎందుకొస్తాడు! స్నేహితుణ్ని గురించి అడగటానికి వచ్చాడు. తనమీద అతనికి ఇంట రెస్టేమిటి!

వస్తాడు! వచ్చితీరతాడని తన అంతరాత్మ చెబుతూ వుంది. తనచెయ్యి చూసిన ప్రతివాళ్ళూ తనకు ఆత్మబలం ఎక్కువనీ, కావాలన్నది, సాధించగలవనీ చెబుతారు. తను ఆత్మబలంతో అతన్ని రప్పించుకోగలదు.

రాడు!

వస్తాడు!

హే భగవాన్! నాకు ఆత్మబలాన్ని ప్రసాదించు.

రాధ ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారుఝామున ఎవరో వీపు తట్టినట్టు ఉలిక్కిపడి లేచింది.

మెలుకువ రాగానే రాధ కళ్ళలో కదిలింది రాహుల్ రూపం! మేధలో మెదిలింది అతని ఆలోచనే.

తనను గురించి విమల అన్న మాటలు రాధకు గుర్తొచ్చాయి.

"మరీ అంత గర్వంగా ప్రవర్తించకు. నీలాంటివాళ్లు ప్రేమలో పడ్డారంటే మళ్ళీ లేవరు," అన్నది విమల.

తను రాహుల్‌ను ప్రేమిస్తుందా ?

ఛ! తనేమిటి? ప్రేమించడమేమిటి ?

సినిమాల్లోలాగా, కథల్లోలాగా కన్పించగానే ప్రేమించెయ్యడమేమిటి ? పిచ్చి కాకపోతే !

అసలు "ప్రేమ" అనే ఆ రెండక్షరాలంటేనే తనకు గిట్టదు.

తెల్లవారి స్కూల్లో, పాఠాలు చెప్తున్నా, తోటివారితో మాట్లాడుతున్నా రాధ అన్యమనస్కంగానే వుంది.

బస్ స్టాండులో నిల్చుంది రాధ. బస్ ఎంతకూ రావడంలేదు. చాలా అలసిపోయినట్టు అనిపిస్తూంది.

బుర్ర ఆలోచనలతో చెదలపుట్టలా వుంది.

చిరాగ్గా వుంది.

ఎంత ప్రయత్నించినా రాహుల్ గురించి ఆలోచించకుండా వుండలేకపోతూంది. మనసు మాట వినడంలేదు.

మనసే మనిషి చెప్పిన మాటవింటే లోకంలో ఇన్ని గాథలూ, ఇన్ని కన్నీళ్లూ వుండవు.

రాహుల్ మళ్ళీ వస్తాడా ?

తమాషా ఆలోచన వచ్చింది రాధకు. తనకు కావాల్సిన బస్ పదినిముషాల్లో వస్తే రాహుల్ మళ్ళీ వస్తాడు అనుకుంది.



బస్ కోసం ఆత్రంగా చూస్తూంది. మాటి మాటికి గడియారం చూసుకుంటూ వుంది. గడియారం ముల్లు చాలా వేగంగా పరిగెత్తుతున్నట్టు అన్పించసాగింది.

ఐదు నిముషాలు అయింది. మరో అయిదు నిముషాలు మాత్రమే వుంది. రాధ బస్ వచ్చే దిక్కుకు చూస్తూ నిలబడింది.

దూరంగా బస్ కన్పించింది. రాధకు సంతోషం కలిగింది. రాహుల్ వస్తాడు! వస్తాడు! తప్పక వస్తాడు! పదే పదే అనుకుంది.

అల్లంత దూరం నుంచి బస్ నంబరు కన్పించి రాధ నీళ్ళు కారిపోయింది. అది తనకు కావాల్సిన బస్ కాదు.

గడియారం కేసి చూసుకుంది. ఇంకా నాలుగు నిముషాల సమయం మాత్రం వుంది.

ఈ నాలుగు నిముషాల్లో ఏ బస్ వచ్చినా రాహుల్ వస్తాడు అనుకుంది.

ఆరాటంతో చూడసాగింది. నాలుగు నిముషాలు అయిపోయింది. మరో పది నిముషాలు కూడా అయింది. దూరంగా బస్ కన్పించింది. అది రాధకు కావాల్సిన బస్సే.

ఆ వచ్చే బస్ ఓ పదినిముషాల ముందువచ్చి వుండకూడదూ ? యాంత్రికంగా బస్ ఎక్కి కూర్చుంది.

రాహుల్ మళ్ళీ రాడా ?

బస్ దిగేప్పటికి రోజూ ఎదురుగావచ్చి, పైసా కోసం చెయ్యిచాపే ఆ ముసలి బిచ్చగాడు ఇవ్వాళకూడా కన్పిస్తే రాహుల్ తప్పక వస్తాడు.

రాధ బస్ దిగింది. ఎదురుగా బిచ్చగాడు కన్పించలేదు. ఆదుర్దాగా నిల్చుని బస్‌స్టాండ్ అంతా కలియ చూసింది. ఆ బిచ్చగాడూ ఎక్కడా కన్పించలేదు.

వెధవకు ఇవ్వాళేమయింది? రోజూ ఇక్కడే చచ్చేవాడుగా? నిజంగానే ఎక్కడైనా చచ్చాడేమో? చావకపోయినా రేపటి నుంచి వాడికి ఒక్క పైసా కూడా ఇవ్వకూడదు. వాడు చచ్చి గీ పెట్టినా ఇవ్వదుగాక ఇవ్వదు!

బిచ్చగాడు లేడు!

అయితే రాహుల్ రాడా?

బిచ్చగాడూ-రాహుల్! రాహుల్-బిచ్చగాడూ!

ఛ! రాహుల్ బిచ్చగాడేమిటి? తనకు మతిపోతుంది. తనకు పిచ్చి పట్టింది. లేకపోతే ఏమిటి ఈ ఆలోచనలు!

విసుగ్గా, ఉసిగా ఇంటికేసి నడకసాగించింది.

భోజనముచేసి పుస్తకం పట్టుకు కూర్చుంది. మనసు పుస్తకం మీద లగ్నం కావడం లేదు.

గోడకేసి చూస్తూ కూర్చుంది. బల్బ వెలుగుతోంది. బల్బ పైగా గోడమీద బల్లి రెక్కలపురుగు కోసం చిన్నగా దానికేసి కదులుతూంది.

"ఆ బల్లికి ఆ పురుగు చిక్కితే రాహుల్ వస్తాడు!" అనుకుంది.

బల్లి కేసి రెప్పవాల్చకుండా ఆదుర్దాగా చూస్తూంది. ఆ పురుగు ఆ బల్లికి చిక్కాలి. ఎగిరిపోకూడదు.

బల్లి ఆగిపోయిందేం? ముందుకు కదలదేం?

అదో కదుల్తుంది! ఫోజు మార్చి కదులుతూ వుంది.



మళ్ళీ ఆగిందేం? బల్లిమీద కోపం వచ్చింది. మళ్ళీ కదుల్తోంది. ఆ పురుగు ఆ బల్లికి చిక్కి తీరుతుంది.

రాధ మనసులోనే భగవంతుణ్ణి ప్రార్థించింది.

"స్వామీ! వెంకటేశ్వరస్వామీ! నువ్వు వున్నావా లేవా అనే మీమాంస నన్ను వదలడం లేదు. ఈనాడు నీ మహత్తు చూపించు! అప్పుడు నిన్ను నమ్ముతాను. నీ కొండకు వస్తాను. నువ్వు నిజంగావుంటే ఆ బల్లికి ఆ పురుగు చిక్కుతుంది. నీ మహాత్యం చూపించి ఆ బల్లి ఎగిరిపోకుండా చూడు! ఎందరెందరికో నిమహత్తు చూపించి వాళ్ళ కోరికలు తీరుస్తున్నావట. ఎందర్నో ఎం. ఎల్. ఏ. లను చేస్తున్నావు. కొందర్ని మంత్రులనుకూడా చేస్తున్నావ్. అందుకే వాళ్లు పదవులు రాగానే నీ దర్శనం కోసం వస్తున్నారు.

నాది చాలా చిన్న కోర్కె. ఇది తీర్చి నీ మహత్తు చూపించు. ఆ బల్లి నోట్లో ఆ పురుగు చిక్కేలా చూడు. అప్పుడే! భగవాన్ నీ ఉనికిని నమ్ముతాను."

బల్లి పురుగు మీదకు దూకింది.

పురుగు ఎగిరిపోయింది.

రాధకు ప్రాణాలెగిరిపోయినట్టయింది. రాధ మనసులో మినుకు మినుకు మంటున్న ఆశాజ్యోతి ఆరిపోయింది.

కోపం వచ్చింది. తనమీద తనకు కోపం వచ్చింది. ఆ బల్లిమీద కోపం వచ్చింది. బల్లి నోట్లో పడకుండా ఎగిరి పోయిన పురుగుమీద కోపం వచ్చింది. ఆ బల్లిని ఆ గోడ

మీదనుంచి— ఆమాటకొస్తే ఇంట్లోనుంచే వెళ్ళగొట్టాలని పించింది.

అంటే.... అంటే రాహుల్ ఇక రాడు! తనకు మళ్ళీ కన్పించడు! ఏం కన్పించకపోతే? రాకపోతేనే మంచిది. అసలు తనకు అతను రావాలని లేనేలేదు.

మళ్ళీ బల్లి కేసి చూసింది. మళ్లీ పురుగు బల్లికి దగ్గర్లోనే వాలివుంది.

"చివరిసారి.... ఆఖరుసారి.... మళ్ళీ మళ్ళీ అడగను. ఈ సారి స్వామీ! నీ మహాత్తు చూపించు. ఈసారి బల్లికి దొరక్కుండా పురుగు ఎగిరిపోతే రాహుల్ వస్తాడు!"

బల్లి ముందుకు కదిలింది. పురుగు అలాగే వుంది. పిచ్చముండ ఎగిరిపోదేం!

"అది నీకు దొరక్కేం!" పైకే అనేసింది. బల్లిని ఉద్దేశించి రాధ.

బల్లి పురుగు మీదకు దూకింది. మరుక్షణంలో పురుగు బల్లి నోట్లోనుంచి సగం మాత్రమే కన్పించింది.

రాధ మనసు చివుక్కుమంది.

బల్లి మీద కోపం వచ్చింది. పురుగును తల్చుకుని జాలి పడింది. బల్లి పురుగును పూర్తిగా మింగేసింది. తన మీద తనకే జాలి కలిగింది.

రాహుల్ రాడా! ఎందుకు రాడూ! వస్తాడు! తప్పక వస్తాడు!

రాధ అదురుతున్న కణతలు నొక్కుకుంది.

.... .... .... .... ....



"సిస్టర్ దాహం!"

సిస్టర్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

## 17

"సిస్టర్!"

"ఏం రాధా? ఏం కావాలి?"

"చలేస్తుంది సిస్టర్!"

"అరే దుప్పటి తొలగిపోయింది. చూడనేలేదు."

నర్స్ లేచి రాధ మీద దుప్పటి కప్పింది.

"ఆఁ ఆ తర్వాత ఏం జరిగింది? రాహుల్ వచ్చాడా" ఆదుర్దాగా అడిగింది సిస్టర్.

రాధ పేలవంగా నవ్వింది.

.... .... .... .... ....

పది రోజులు గడిచిపోయాయి. రాధ ఆలోచనల ఉధృతం తగ్గింది. అయినా అతన్ని గురించి అప్పుడప్పుడు ఆలోచిస్తూనే వుంది.

ఏ కొంచెం శబ్దమయినా అతనే వస్తున్నాడని ఎదురు చూస్తుంది. అతను రాడు.! ఎవరో వస్తారు. రాధకు నిరాశతోపాటు ఆ వచ్చినవారి మీద విసుగు కలుగుతుంది. ఎప్పుడు వెళ్తారా అన్నట్టు మాట్లాడుతుంది.

ఆ రోజు ఆదివారం! ఆ రోజంతా రాహుల్ కొరకు ప్రతి నిముషం ఎదురు చూసింది.

ఎవరో వస్తున్న అలికిడి అయింది. రాధ ఆత్రంగా వాకిలికేసి చూసింది,

రాజేశ్వరి ప్రవేశించింది. రాధ మనసు చిన్నబోయింది.

"ఏమిటోయ్! అలా వున్నావేం?"

"ఎలా వున్నానూ?" నవ్వుతూ అడిగింది.

"చాలా దిగులుగా కన్పిస్తున్నావ్! నీ నవ్వులో కూడా బోలెడంత దిగులు కన్పిస్తూంది" అన్నది రాజేశ్వరి.

అబ్బే! ఏం లేదు. నాకు దిగులేమిటి? అమ్మ జ్ఞాపకం వచ్చింది! కొంచెం మనసు అదోలా వుంది," అనేసి, అబద్ధం ఆడినందుకు తల్లికి లోలోపలే క్షమాపణ చెప్పుకుంది.

"మీ హీరో ఎలా వున్నాడు?" మాట మార్చే ఉద్దేశంలో రాధ రాజేశ్వరిని అడిగింది.

రాజేశ్వరి జవాబివ్వలేదు. తల దించుకుంది.

"ప్రేమ లేని వివాహం— వివాహం లేని ప్రేమ— మొదటిది వ్యక్తిని బాధిస్తూంది, రెండోది సంఘాన్ని బాధిస్తుంది" అన్నది రాధ.

రాజేశ్వరి రాధ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

"సంఘం బాధపడినా పర్వాలేదు. వ్యక్తుల సుఖమే ముఖ్యం! సమాజానికి భయపడి వ్యక్తి తన సుఖాన్ని వదులుకోవడం తెలివితక్కువే అవుతుంది" అన్నది రాధ.

రాజేశ్వరి ఆశ్చర్యంగా రాధ ముఖంలోకి చూసింది.

"ఏమిటలా చూస్తావ్? ఆ మాటలు నా స్వంతం కావులే. బుచ్చిబాబు అన్నాడు," అన్నది రాధ చిరునవ్వుతో.

రాజేశ్వరికి రాధలో ఏదో మార్పు వచ్చినట్టు అనిపించింది.

"మనిషి వంటరిగా బతకడానికి భయపడి సంఘంగా



మారాడు. చివరకు ఆ సంఘం మనిషిని భయపెట్టసాగింది. సంఘానికి భయపడి మనిషి ఆత్మవంచన చేసుకుంటున్నాడు. మీరిద్దరు కూడా అదే పని చేస్తున్నారు," అన్నది రాధ ఆవేశంగా.

"మా పరిస్థితి నీకు అర్థం కాదు. ఏం చెయ్యమంటావ్!"

"నాకు మీ పరిస్థితి అర్థం అయింది. అందుకే చెబుతున్నాను సంఘానికి భయపడి ఆత్మవంచన చేసుకుంటున్నారని. నీకు ఇష్టమయిన వ్యక్తితో, నువ్వు ప్రేమించిన వ్యక్తితో, నలుగురిముందూ ధైర్యంగా తలెత్తుకొని తిరగడానికి ఎందుకు భయపడాలి?"

రాజేశ్వరి విస్మయంగా రాధ ముఖంలోకి చూసింది. "రాధేనా ఈ మాటలు అంటుంది!" అనే అనుమానం కలిగింది.

ఒకనాడు "ఉంపెడు గత్తెగా వుంటావా?" అసహ్యకరమైన పదార్థం నిండివున్న కుండను తనముందు భళ్లున పగవేసినట్టు అన్నది రాధ.

ఇవ్వాలేమిటి ఇలా మాట్లాడుతోంది!

"నా మాటలు నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయా రాజూ!"

రాధ వాక్యం పూర్తి అయీ కాకుండానే రాహుల్ వచ్చి నిల్చున్నాడు.

శ్రుతిచేసి పెట్టిన వీణమీద చెయ్యిపడినట్టు రాధ శరీరంలో మధురకంపనతో స్పందించింది.

రాధ తడబడింది. ఆనందం, గాబరా, ఆశ్చర్యం, ముఖంలో ముప్పిరిగొన్నాయి.

రాధ కళ్ళూ, ముఖం, వింతకాంతితో వెలిగిపోవడాన్ని రాజేశ్వరి గమనించింది. ఏదో అర్థం అయినట్టు ముసి ముసిగా నవ్వుకుంది.

"సారీ! డిస్టర్బ్ చేశానా ?" అన్నాడు రాహుల్.

"అబ్బె! లేదు. కూర్చోండి! ఈమె నా స్నేహితురాలు. రాజేశ్వరి.... వారు...." తడబడుతూనే అన్నది రాధ.

"నా పేరు రాహుల్! కె. జీ. ఆసుపత్రిలో డాక్టర్ని!" రాధ మాటకు మధ్యలో అందుకొని అన్నాడు.

ఐదు నిముషాలు కూర్చుని పని వుందంటూ రాజేశ్వరి వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ రాధ ముఖంలోకి అర్థయుక్తంగా చూసింది.

"నేను మళ్ళీ రాననుకున్నారు గదూ ?" నవ్వుతూ ప్రశ్నించాడు రాహుల్.

అతని ప్రశ్న రాధను తికమక పెట్టింది.

అదే ప్రశ్న మరెవరన్నా వేసివుంటే "ఫెడీల్న" ముఖంమీద కొట్టినట్టు సమాధానం ఇచ్చి వుండేది. అతనికి ఏం సమాధానం ఇవ్వాలో తోచలేదు.

"కూర్చోండి! కాఫీ తెస్తాను!" అంటూ అతని సమాధానం వినకుండానే లోపలకు వెళ్ళి పోయి గుండెలు నిండుగా గాలి పీల్చుకుంది.

ముసలమ్మకు కాఫీ పెట్టమని చెప్పి తను అద్దం ముందు కెళ్ళి నిలబడింది.



ముఖం జిడ్డు కారుతున్నట్టు అన్పించి తడి టవల్‌లో ముఖం తుడుచుకుంది. ముఖానికి లాక్టోకేలమిన్ రాసుకొని పౌడర్ అద్దుకుంది. తిలకంతో దోసగింజ బొట్టు పెట్టుకుంది. ముంగురులు సవరించుకుంది. కట్టుకున్న చీర కేసి చూసుకుంది. చీర మార్చుకోవాలనిపించింది. కాని చీర మార్చుకుంటే అతను గమనిస్తాడేమోనని సంకోచించింది.

కాఫీ కప్పు రాహుల్‌కు అందిస్తున్న చెయ్యి కొంచెంగా వణికింది.

తన కప్పుతో ఎదురు కుర్చీలో కూర్చుంది.

"ఏమండీ ? బయటికి వెళ్ళబోతున్నారా ?" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు రాహుల్.

"లేదు! ఏం ? ఎందుకలా అడిగారు ?" అతని కేసి చూడకుండానే అడిగింది రాధ.

"పౌడరు రాసుకొని, తల దువ్వుకొస్తేనూ ?.... బయటికి వెళ్తారేమో అనుకున్నాను," కంఠంలో కొంటెతనం విన్పించింది.

రాధ చివ్వున తలెత్తి చూసింది. అతని చూపుల్లో కొంటెతనం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

రోషంతో రాధ మనసు భగ్గుమంది.

"నా కోసమేనా ఈ అలంకరణ ?" అన్న భావం అతని మాటల్లో, చూపుల్లో స్ఫురించి రాధ అవమానంతో దహించుకు పోసాగింది.

ఏదో అనాలనుకుంది. ముఖం వాచేలా చివాట్లు వెయ్యాలనిపించింది.

కాని ఏమంటూంది? అతను అన్న మాటల్లో నిజం లేదూ? తను నిజంగా అతనికోసమేగా పౌడర్ వేసుకుంది! తల దువ్వుకుంది! ఇంతకు ముందు ఏ మగవాడి కోసమైనా తను ఈ పని చేసిందా? తన రూపం వాళ్ళకు ఎలా కన్పిస్తుందోనని ఆలోచించిందా?

"పౌడరు బొట్టు మీకు బాగుంటుందనుకున్నట్టున్నారు. చుక్క బొట్టే బాగుంది."

రాధ ముఖం జేవురించింది.

సిగ్గూ, రోషం; మనసులో పెనవేసుకు పోతున్నాయ్.

"కోపం వచ్చిందా? కోపంగావుంటే మీరు అందంగా కన్పిస్తారు!" అన్నాడు రాహుల్ సిగరెట్ పొగవదులుతూ.

ఏమిటి ఇతని ధైర్యం? తన గురించి ఏమనుకుంటు న్నాడు? రాధకు గట్టిగా జవాబివ్వాలని వుంది. కాని సమాధానం దొరకడంలేదు.

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

రాహుల్ సిగరెట్ తాగుతూ, సుడులు తిరుగుతూ పై పైకి పోతున్న పొగలోకి చూస్తూ కూర్చున్నాడు.

రాధ రాహుల్ ముఖంలోకి చూస్తూ కూర్చుంది. ఇంకా ఇంకా చూడాలని వుంది. కొంతసేపు అతను అలాగే పొగను చూస్తూ కూర్చుంటే బాగుండును అనిపించింది.

రాహుల్ కళ్లు తిప్పాడు. రాధ గబుక్కున కళ్ళు వాల్చుకుంది.

"ఇతనికి పెళ్ళయిందేమో?" అనుమానం వచ్చింది రాధకు.



ఒకవేళ పెళ్ళయినవాడైతే? రాధ అంతరాంతరాల్లో ఏదో గుచ్చుకున్నట్టు అయింది.

"మీకు పిల్లలు వున్నారా?" అడిగింది రాధ మాట మార్చే ఉద్దేశ్యంతో అడిగినట్టు.

రాహుల్ ఓ క్షణం రాధ ముఖంలోకి పరిశీలనగా చూశాడు. పెదవులమీద చిరునవ్వు కదిలింది.

"ఒక్కడే! వాడి వయసు ఆరు నెలలు!" అన్నాడు సిగరెట్ యాష్ ట్రే మీద నొక్కి, ట్రేలో పడేస్తూ.

రాధ మనసు చివుక్కు మన్నది.

ముఖంలో బాధ కన్పించకుండా వుండేందుకు ప్రయత్నించింది.

"మీ అబ్బాయి పేరేమిటి?" తెచ్చి పెట్టుకున్న చిరునవ్వుతో అడిగింది రాధ.

కాని తన చిరునవ్వు తనకే బోలుగా ఏడవలేక నవ్వినట్టు అన్పించింది.

"ఇంకా పెట్టలేదు. మీరు చెప్పండి ఓ మంచి పేరు!" అన్నాడు రాహుల్.

రాధ గుండెలో సన్నగా బాధ........

"మీ పేరు చాలా బాగుంది. మీ అబ్బాయికి అంతకంటే మంచిపేరు పెట్టండి," ఏదో అనాలి గనక అన్నది.

"నా పేరు మీకు అంత బాగుందా? అదోలా కంఠం పలికింది.

రాధ ఇబ్బందిలో పడింది.

"నాకు పెళ్ళయిందో లేదో తెలుసుకోవాలని వుంటే సూటిగానే అడగొచ్చుగా? పిల్లలెంతమంది అని ఎందుకు అడగాలి?"

రాధకు తలకొట్టేసినట్టు అనిపించింది. ఒక్క క్షణం దొంగతనం చేస్తూ పట్టుబడినట్టు తెల్లముఖం వేసింది.

"మీకు పెళ్ళయితే నాకేం? కాకపోతే నాకేం? పిల్లలు ఎంతమంది అని ఏదో మర్యాదకు అడిగాను" అన్నది రాధ ఉక్రోషంతో.

రాహుల్ పకపక నవ్వాడు.

"ఉన్నమాటంటే అంత ఉలుకెందుకండీ? నాకు ఇంకా పెళ్ళి కాలేదు. ఎలిజిబుల్ బ్యాచులర్నే!" అన్నాడు రాధ ముఖంలోకి లోతుగా చూస్తూ.

రాధకు అక్కడ్నుంచి పారిపోవాలనివుంది.

అంత చొచ్చుకుపోయే మనిషితో ఎట్లా మాట్లాడాలో రాధకు అర్థం కావటంలేదు.

ముఖం కందగడ్డలా చేసుకొని, మౌనంగా కూర్చుంది. కుర్చీలో ఇబ్బందిగా కదలింది.

"మిమ్మల్ని చూస్తుంటే చాలాకాలం క్రితం చదివిన ఇంగ్లీషు నవల్లోని నాయిక గుర్తొస్తుంది," అన్నాడు రాహుల్ మరో సిగరెట్ ముట్టించుకుంటూ.

రాధ ఆశ్చర్యంగా రాహుల్ ముఖంలోకి చూసింది.

తనను చూస్తే నవలలో నాయిక గుర్తొస్తుందా! తమాషా సామ్యం! ఎందరో తనను పొగిడారు కాని ఇలా ఎవరూ అనలేదు. రాహుల్ అందరిలా మాట్లాడడు! చాలా



లోతైన మనిషి! తెలివైనవాడు! ఎదటి వాళ్ళను ఇట్టే పట్టెయ్యగలడు. కాని తను మాత్రం అందదు. అందుకే అతనంటే తనకు ఇష్టం.

"ఆ పాత్ర గురించి వినాలనిలేదా?" సిగరెట్ పొగ ఊది అడిగాడు.

"లేదు!" అన్నది వినాలని వున్నప్పటికీ!

"అబద్ధం! మీకు వినాలని వుంది. అయినా మీరు ఆ విషయాన్ని ఒప్పుకోరు. అచ్చం ఆ నవలలోని నాయికలాగే!"

ఏమి టీ మనిషి! తనను పూర్తిగా చదివేస్తున్నాడు!

"ఆ నవలలోని నాయిక చుట్టూ చాలామంది మగవాళ్ళు తిరుగుతారు. ఎందుకో తెలుసా?"

"చెప్పండి!" అన్నది రాధ.

"ఆమె పెద్దగా అందమైంది కాదు."

తను అందంగా లేదని ఎత్తి చూపిస్తున్నాడా! నిజమే! తను ఎప్పుడూ తను అందమైందని అనుకోలేదే?

"కాని ఆమె వ్యక్తిత్వంలో ఓ విలక్షణత వుంది," ఆగాడు రాహుల్.

తనను గురించి తనూ అలాగే అనుకుంటూ వుంటుంది.

"నేను ఈ మట్టికి సంబంధించినదాన్ని కాను అనే భావాన్ని వ్యక్తంచేసే ఆమె చూపులూ, ఈ ప్రపంచంతో నాకేమిటి సంబంధం అన్నట్టు నిర్లక్ష్యాన్ని వ్యక్తం చేసే ఆ నడకా, సృష్టి క్రమాన్నే ఎదిరించగలననే, ఆమె మాటల్లోని అహం, అన్నీ కలిసి ఆమె వ్యక్తిత్వానికి ఓ విశిష్టతను

తెచ్చిపెట్టాయి అంటాడు ఆ నవలా రచయిత !" రాహుల్ కంఠం మంద్రస్థాయిలో గంభీరంగా వుంది.

అంటే ? అంటే ? రాహుల్‌కు తన వ్యక్తిత్వంలో ఏదో విశిష్టత కన్పించిందన్న మాటేగా ? రాధకు సంతోషం కలిగింది. గర్వంగా కూడా అన్పించింది.

"తనలో ఒక ప్రత్యేకత వుందని భ్రమపడే ఆమె ఒక రోజు అకస్మాత్తుగా తనూ మామూలు ఆడదాన్నేనని తెలుసుకుంది. కాని ఆ విషయాన్ని మరుగుపరచడానికి తనతో తనే పోరాటం సాగించింది."

రాధ చివ్వున తలెత్తి చూసింది.

రాహుల్ ఆమెనే పరీక్షగా గమనిస్తున్నాడు.

అంటే ? అంటే ? తనలో బలహీనత ఏర్పడిందనికూడా అతను గ్రహించాడా ?

రాధకు అక్కడినుంచి పారిపోవాలనిపించింది. రాహుల్ మీద కోపం కూడా వచ్చింది.

"ఈ కథ చెప్పడంలో మీ ఉద్దేశం ఏమిటి ?"

కోపంగా ప్రశ్నించింది రాధ.

"ఉద్దేశం ఏమిటోకూడా నేను చెప్పాలా ? మీరంత తెలివితక్కువ వారేం కాదు. రాత్రికి బాగా ఆలోచించుకోండి. మీకే తెలుస్తుంది" అన్నాడు రాహుల్.

రాధ మనసు గాయపడింది. అవమానపడింది.

"వస్తాను !" అంటూ దిగ్గున లేచి నిల్చున్నాడు రాహుల్.

రాధ కూడా లేచి నిల్చుంది.



"అభీ న జావో ఛోడ్ కర్ – అభీతో కుచ్ కహా నహీం – అభీతో కుచ్ సునా నహీం !" పాట గట్టిగా విన్పించింది, పక్క పోర్షన్‌వారి రేడియో నుంచి.

వెంటనే రాధకు నవీన్ వ్రాసిన 'అంపశయ్య' నవల గుర్తొచ్చింది.

ఆ రచయిత ఈ పాటను ఎంత బాగా ఉపయోగించుకున్నాడో ! ఎంత వాస్తవంగా మానసిక ఘర్షణను చిత్రించాడు ! తనకు ఇప్పుడు సరిగా, ఆ నవల్లోని హీరో ఒక అమ్మాయి గురించి అన్న మాటల్నే అనాలనిపిస్తూంది.

"ఆ పాట బాగుంది కదూ!"

తృళ్ళిపడి రాహుల్ ముఖంలోకి చూసింది.

కళ్ళు చిన్నవి చేసి, క్రింది పెదవిని మునిపంటితో నొక్కుతూ, తమాషాగా చిరునవ్వు నవ్వుతున్నాడు.

రాధ అహాన్ని అతని చిరునవ్వు మరోసారి గాయపర్చింది. దెబ్బమీద దెబ్బ.... మనసు బాధతో మెలి తిరుగుతోంది. కాని అతన్ని ఏమీ అనలేకపోతుంది. అసహాయత వల్ల కళ్ళలో నీరు తిరిగింది. అది రాహుల్‌కు కన్పించకుండా జాగ్రత్త పడింది.

"వస్తాను!" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

మళ్ళీ అదేపాట విన్పిస్తోంది.

అతను అంత బాధ కలిగించేలా మాట్లాడుతున్నా అతను వెళ్ళిపోగానే ఎందుకు తనకీ ఆ వేదన ? అతను మరికొంతసేపు కూర్చోవాలని ఎందుకు అన్పిస్తోంది ?

అతను వెళ్ళిపోయాడు. ఏమీ చెప్పకుండానే వెళ్ళి

పోయాడు. తను ఏమీ వినకుండానే అతను వెళ్ళిపోయాడు. అతనుకు తనకు ఏదో చెప్పాలనీ, తనకు వినాలనీ వుంది.

తను ఓడిపోయింది. పూర్తిగా ఓడిపోయింది.

పదిరోజులు గడిచిపోయాయి. రాధ అశాంతితో వేగిపోతూంది.

పెన్ చేతిలో వుంటే అనుకోకుండానే దొరికిన ప్రతి కాగితం ముక్క మీదా "రాహుల్! రాహుల్!" అంటూ రాస్తూవుంది. కాగితం దొరక్కపోతే అరచేతిలో రాసి రాసి చెరుపుతూంది.

ఏమిటి తనకీ పిచ్చి!

అతను తనను అవమానిస్తున్నాడు. గాయపరుస్తున్నాడు. అయినా తను అతని కోసం ఎదురు చూస్తూవుంది.

ఎంత థాట్‌ఫుల్ ఫేస్? ఆ కళ్ళలో కాంతిరేఖలు కదిలిపోతూవుంటాయి. ఆ చూపులు సూదుల్లా గుచ్చుకుంటాయి. అతని వ్యక్తిత్వం చురకత్తిలా ఎదుటివాళ్ళను తోస్తుంది. ఎక్కడా బోలుతనం కన్పించదు. అతని మాటల్లో, ప్రతి కదలికలో, అంతా నిండుతనమే!

మరో పదిహేనురోజులు రాధ రాహుల్ కొరకు ఎదురు చూసింది. అతను రాలేదు.

ఉండి ఉండి మనసు శ్రావణమేఘంలా అయిపోతుంది. గట్టిగా ఏడవాలనిపిస్తుంది. ఏడుపుకూడా రావడంలేదు.

అతను రాడు! ఎందుకొస్తాడు? రెండుసార్లు వచ్చాడు! అదీ తనను గాయపర్చడానికే వచ్చాడు. తన స్నేహితుడికి



జరిగిన అన్యాయానికి కసితీర్చుకోవడానికి వచ్చాడు. అంతే! అంతే!

అతను డాక్టర్! శ్రీమంతుడు! ఇంతకాలం ఎవర్నీ ప్రేమించకుండా వున్నాడా! తనపిచ్చికాకపోతే .... తనలో ఏముందని అతను తనను ప్రేమిస్తాడు? తను అందని ద్రాక్షపళ్ళకొరకు చేతులు చాస్తూవుంది.

తను పెద్ద సౌందర్యవతికాదు. ఆమాట ఇన్‌డైరెక్టుగా అతనే అన్నాడుగా? కాని....తనలో ఏదో ప్రత్యేకత వుందని కూడా అన్నాడుగా! మళ్లీ అతనే తనూ ఒకరోజు మామూలు ఆడదిగా మారిపోతుందనికూడా అన్నాడుగా?

అతన్నిగురించి ఆలోచించడం, మనసు పాడుచేసుకోవడం అనవసరం! తను అతన్ని మర్చిపోవాలి!

కాని మర్చిపోవడానికి చేసే ప్రయత్నంలో వున్నది జ్ఞాపకం చేసుకోవడమేగా?

"ఏమిటి చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు! నా గురించేనా?"

రాధ చివ్వున లేచి నిల్చుంది.

రాహుల్! రాహుల్! వచ్చాడు. ఎంత పొడవుగా, ఎంత ఠీవిగా వున్నాడు? తనని గురించే ఆలోచిస్తున్నానని కూడా అంటున్నాడు.

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

రాధకు సిగ్గుసిగ్గుగ వుంది. తను మొదటిసారిగా మొగవాడిముందు సిగ్గుపడుతోంది.

"మీకూ సిగ్గుపడడం వచ్చునన్నమాట !" కొంటెగా చూస్తూ అన్నాడు రాహుల్.

రాధకు కోపం వచ్చింది. దుఃఖం వచ్చింది. ఏ భావం ముఖంలో కన్పించనీయకుండా జాగ్రత్తగా పడ్డాననుకుంది.

"నేనేం సిగ్గుపడటంలేదు," అన్నది రాధ అతికష్టం మీద.

"రక్షించారు. మీ ముఖంచూసి సిగ్గుపడుతున్నారేమో అనుకున్నాను. సిగ్గు మానసిక బలహీనతకు బాహ్య అభివ్యక్తి !"

"నాలో బలహీనత ఏమీలేదు." రోషంగా అన్నది రాధ.

"అయితే సంతోషమే !"

"మధ్య మీ కెందుకు ?"

"నాకెందు కేమిటి ? నా ముందు సిగ్గుపడితే ఆ బలహీనతకు కారణం నేనే అవుతానుగా ? అందుకే భయపడ్డాను.

రాధ మనసులో లోతుగా ఏదో కలుక్కుమంది.

అంటే తన బలహీనతకు కారణం తను కాకూడదని అతని కోరికా ? అయితే ఎందుకు వస్తున్నట్టు ?

"గెట్ అవుట్ !" అని అరవాలనిపించింది.

కాని.... ఏదో బలహీనత గొంతు నొక్కేసింది.

రాధ కళ్ళలో నీరు తిరుగుతుంది. మాట్లాడితే దుఃఖం ఉబికివస్తుందేమోనని భయపడింది.

వస్తాననికూడా చెప్పకుండా లేచి వెళ్ళిపోయాడు రాహుల్.



రాధ గదిలోకి పరిగెత్తి మంచానికి అడ్డంపడి భోరున ఏడ్చింది.

ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. బాగా చీకటిపడిన తర్వాత ముసలమ్మ అన్నం తినమని లేపితే నిద్ర లేచింది.

ఆ రాత్రి రాధ అన్నం తినలేదు.

మనసు కొంచెం తేలికగానే వుంది.

తను ఎందుకు అంతగా ఏడ్చింది ? అతను తనను అలా అవమానపరిచి గాయపర్చినందుకేనా ?

అదిమాత్రమే కారణం కాదనిపించింది.

మరెందుకు ? అతను చెప్పకుండా వెళ్ళిపోయినందుకా? అరగంటకూడా కూర్చోకుండా వెళ్ళిపోయినందుకా ? లేక మళ్ళీ రాడేమోననే బాధవల్లనా ? ఎందుకు తనలో దుఃఖం ఉప్పెనలా పెల్లుబికింది ?

మరో పదిరోజులవరకూ రాహుల్ రాలేదు. రాధ చాలా తీవ్రమైన మానసిక సంఘర్షణతో సతమతమైపోతూంది.

రాహుల్ అంటే కోపంకూడా రాసాగింది.

అసలు అతను ఎందుకు వస్తున్నట్టు ? తనమీద కొంచెంకూడా గౌరవంలేదు. ప్రేమ అంతకన్నా లేదు. కేవలం తనను ఏడిపించటానికే వస్తున్నాడు. స్నేహితునికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవడానికి వస్తున్నాడు.

మళ్ళీవస్తే "ఇకనుంచి మా ఇంటికి రావద్దు!" అని చెప్పేయడానికి నిశ్చయించుకుంది రాధ ఒకరోజు నిద్ర

లేస్తానే, కాని ఆ నిశ్చయం మరుసటిరోజుకే సడలిపోయింది. అతనికోసం వెయ్యి కళ్లతో ఎదురుచూడసాగింది.

ఒక ఆదివారం మధ్యాహ్నం రాహుల్ వచ్చాడు. రాధ మనసు ఆరోజు అతను తప్పక వస్తాడని చెప్పింది. తనకు ఇష్టమైన ఆకుపచ్చరంగు జార్జెట్ సిల్కు చీర కట్టుకొని రాహుల్ కొరకు ఎదురు చూడసాగింది.

"ఈ చీరలో మీరు చాలా బాగున్నారనుకుంటున్నారు గదూ!" మొదటి ప్రశ్నే రాధ మనసును చిన్న పరచింది.

ఏదో అనాలనుకుంది.

కాని తను నిజంగా అలా అనుకోనేకదూ ఆ చీర కట్టుకుంది!

"బాధ కలిగించానా!" అతని కంఠంలో వెటకారం లేదు. జాలివుంది.

రాధ వెటకారాన్నయినా భరించగలదు. కాని జాలిని భరించలేదు. అతను తనను చూసి జాలి పడుతున్నాడా! ఎందుకు! ఏం తను అంత దీనస్థితిలో వుందా!

రాధ అహంమీద గట్టిదెబ్బే తగిలింది.

"ఈ రంగు నాకు ఇష్టం! అందుకే కట్టుకున్నాను. వేరొకరికోసం కట్టుకోలేదు," రోషంగా అన్నది రాధ.

"గుడ్! మీకు నామీద కోపం కూడా వస్తుందన్నమాట!"

అతను తన బలహీనతను ఎత్తి చూపించినట్టు అనిపించింది రాధకు.



కోపం వచ్చింది. కాని ఏమీ అనలేకపోయింది.

"మీరు మీ మనసు చాలా గట్టిది అనుకుంటారు. కాని చాలా మెత్తని మనసు మీది" అన్నాడు.

రాధ జవాబివ్వలేదు. అతని మాటలలోని అంతరార్థం అర్థం కాలేదు. ఆలోచిస్తూ కూర్చుంది.

రాహుల్ పది నిముషాలు మాత్రమే కూర్చుని వెళ్ళిపోయాడు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు!" అని అడగాలనిపించింది.

కాని ఆ కోర్కెను బలంగా అణచుకుంది. నీ రాకపోకలతో నాకేమిటి కావాలి అన్నట్టు నిర్లక్ష్యంగా వుండిపోయింది.

అతను వెళ్ళగానే దుఃఖం కట్టలు తెంచుకుంది.

ఎందుకు అతను తనను ఇలా సాధిస్తున్నాడు! ఇలా బాధ పెడుతున్నాడు!

తను ఓడిపోయింది. చిత్తుగా ఓడిపోయింది.

సృష్టి క్రమాన్నే జయించగలననే తనలోని గర్వం అణగిపోయింది.

తన అహం కరిగిపోయింది.

తన స్వప్నం తొణికిపోయింది.

తనూ మామూలు జీవితం.... అదే.... అమ్మా అమ్మమ్మల జీవితం....కోసం అర్రులు చాస్తూవుంది. తపిస్తూవుంది.

పాపం! తనను ప్రేమించిన వాళ్ళంతా తనకోసం ఇంత బాధా పడివుంటారు. వాళ్ళ బాధ చూస్తుంటే తనకు అసహ్యం వేసేది. రవీంద్ర తన కోసం ఎంత తపించాడో!

ఎంత బాధ పడ్డాడో! ఉద్యోగం కూడా వదిలి వెళ్ళి పోయాడంటే జీవితం మీద విరక్తి చెంది వెళ్ళిపోయాడు. రవీంద్ర పడిన బాధ, పడుతున్న నరకయాతన, ఈరోజు తనకు అర్థం అవుతుంది. రవీంద్ర ఎక్కడ వున్నాడో! ఏమైపోయాడో!

ఆ రాత్రంతా రవీంద్ర గురించి ఆలోచిస్తూ కన్నీరు కార్చింది రాధ.

రాహుల్ అప్పుడప్పుడు వస్తూనే వున్నాడు. తనమాటలతో రాధ మనసును గాయపరుస్తూనే వున్నాడు.

అయినా రాధ ప్రతిరోజూ అతని కోసం ఎదురు చూస్తూనే వుంది.

అతను ఎందుకు వస్తున్నాడో రాధకు ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు.

అతనికి తనంటే ఇష్టమో కాదో కూడా తెలుసుకోలేకపోతూవుంది. రాత్రింబవళ్లు అతని మాటల్ని మననం చేసుకుంటూ మధనపడ్తూనే వుంది.

సంవత్సరం గడిచిపోయింది. అయినా ఇద్దరి మధ్యా దూరం తరగలేదు.

రాధ అతనిముందు మునుపటి అంతగా తడబాటు చెందటంలేదు.

ఒకరోజు రాహుల్ సిగరెట్ పెట్టెతీస్తూవుంటే చిన్న ఫొటో ఒకటి కిందపడింది.

రాధ వంగి ఆ ఫొటో తీసుకుంది. అది ఒక అందమైన అమ్మాయి ఫొటో!



రాహుల్ జేబులో ఈ ఫొటో! అతని ప్రియురాలి ఫొటో కాదుకదా?

రాధ మనసు చివుక్కుమంది.

ఫొటోలోకి చూస్తూ ఆలోచించసాగింది.

"ఏమిటి అంత శ్రద్ధగా చూస్తున్నారు? ఆ అమ్మాయి అంత బాగుందా?" నవ్వుతూ అడిగాడు రాహుల్.

"బాగానే వుంది!" నిర్లిప్తంగా అనడానికి ప్రయత్నించింది. కాని ఆ కంఠంలో పలికిన అపశృతి రాధ చెవులకు కూడా తెలిసింది.

"ఏమిటంత నీరసంగా అంటున్నారు? ఈర్ష్యగావుందా?" రాధ కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు రాహుల్.

రాధ తలెత్తి చూసింది. కోపంతో పెదవులు వణికాయి.

"నాకెందుకు ఈర్ష్య?" అన్నది విసురుగా.

"మీకుకాక మరెవరికి ఈర్ష్య వుంటుంది, నా జేబులో అందమైన అమ్మాయి ఫొటోను చూస్తే! ఏదీ! నా కళ్ళలోకి చూసి చెప్పండి ఆ మాట!" అన్నాడు రెచ్చగొడ్తున్నట్టు రాహుల్.

మొదటిసారిగా రాహుల్ అంటే అసహ్యం వేసింది రాధకు.

"మీరు అనవసరంగా ఏ దేదో ఊహించుకుంటున్నారు. మీ గరల్ ఫ్రెండ్ ను గురించి ఈర్ష్య పడాల్సిన కర్మ నాకేంలేదు" అన్నది కోపంగా.

కాని ఆ మాటలు అంటున్నప్పుడు రాధ రాహుల్ ముఖంలోకి చూడలేదు. పక్కకు చూస్తూ అన్నది.

"గరల్ ఫ్రెండ్ కాదు. నా కాబోయే భార్య."

రాధ హృదయానికి "నా భార్య!" అన్న శబ్దం కంకరరాయిలా తగిలి విలవిల లాడిపోయింది.

ఆ బాధ ముఖంలో కన్పించకుండా దాచే ప్రయత్నంలో "అలాగా! పెళ్లెప్పుడూ?" అని అడిగింది తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో.

రాధకు తన నవ్వు తనకే ఎబ్బెట్టుగా తోచింది.

"నా పెళ్ళికి వస్తారా?"

"పిలిస్తే ఎందుకు రానూ?" కంఠంలో ఏదో అడ్డుపడుతూవుంటే బలవంతంగా అన్నది రాధ.

"నిజంగా? ఏదీ నా ముఖంలోకి చూసి చెప్పండి!" అన్నాడు రాహుల్.

ఏమిటి ఇతని ధోరణి? ఎంత అహంకారం? ఎంత గర్వం? రోషం, దుఃఖం కంఠంలో నేను ముందు అంటే నేను ముందు అంటూ పోటీపడ్డాయి.

"ఏమిటి మీ ఉద్దేశం?" తీవ్రంగా అడిగింది.

"ఉద్దేశానికేముంది? మీ వెలా తెలా పోతున్న ముఖం, బోలు నవ్వూ చూసి ఏదో అనుకున్నాను. మీరు నా పెళ్ళికి రాలేరేమో అనుకున్నాను. బాధపెడ్తే క్షమించండి!" అన్నాడు.

మొదటిసారిగా "క్షమించండి!" అన్నాడు రాహుల్.

అలా అనకుండా వుంటేనే బాగుండేది అనుకుంది రాధ.



రాధ మౌనంగా కూర్చుంది.

"వెళ్ళొస్తాను," అంటూ వెళ్ళిపోయాడు రాహుల్.

నిజంగా ఆ ఫోటో అతనికాబోయే భార్యదేనా? ఆ ఫోటో తను కావాలనే కింద పడేశాడా? కేవలం తనను పరీక్షించడానికే ఎవరిదో ఫోటో జేబులో పెట్టుకొని వచ్చాడా?

తనను బాగా అర్థం చేసుకున్నాడు. తనెంత జాగ్రత్తగా వున్నా తన బలహీనతను అతను అర్థం చేసుకున్నాడు. మళ్ళీ పరీక్షించే అవసరం ఏమొచ్చింది?

అది అతని కాబోయే భార్య ఫోటోయే ఐ వుండొచ్చును! మరి తన దగ్గరకు ఎందుకు వస్తున్నాడు? తనలో ఆశలు ఎందుకు రేకెత్తిస్తున్నాడు?

తనను ఎందుకిలా ఆడిస్తున్నాడు? దానివల్ల అతనికి లభించేదేమిటి? ఇదొక కాలక్షేపమా?

తను పేకముక్కలతో మేడకట్టుకొని అందులో కాపరం చెయ్యాలని ప్రయత్నిస్తుందా?

అతను పేక ముక్కల్ని తన ముందుకు విసిరాడు.

తను పసిపిల్లలాగ ఆ పేక ముక్కల్తో ఇల్లు కట్టడానికి ప్రయత్నిస్తూంది. అది మధ్య మధ్య పడిపోతూవుంది. తను మళ్ళీ కడుతూవుంది. పడిపోతూవుంది. పూర్తి కావడంలేదు. అది చూస్తూ అతను సరదాగా, వ్యంగ్యంగా నవ్వుకుంటున్నాడు.

రాధ గుండెల్ని ఎవరో పిండుతున్నట్టు అనిపించింది.

మనసును ఎవరో మొండికత్తితో కోస్తున్నారు. అది తెగటం లేదు. నలుగుతూ వుంది.

.... .... .... .... ....

"సిస్టర్ దాహం!"

నర్స్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

.... .... .... .... ....

## 18

"రాధా! ఎలా వుందమ్మా!" రాధ ముంగుర్లు సవరిస్తూ నర్స్ అడిగింది.

"బాగానే వుంది సిస్టర్. మనసు మరీ తేలిగ్గా వుంది. ఇంతకాలం నుంచి మనసులో గడ్డగా పేరుకొన్న ఆ వేదన కరిగిపోతున్నట్లు అన్పిస్తోంది. ముసురుపట్టిన ఆకాశంలా వున్న మనసుకు సూర్యరశ్మి సోకినట్టూ, మబ్బులు విచ్చిపోతునట్టూ వుంది అన్నది రాధ.

గ్రేస్ రాధ ముఖంలోకి పరిశీలగా చూసింది.

ముఖం తేటగా కన్పించింది. డాక్టర్ అన్న మాటలు గుర్తొచ్చి సంతోషం కలిగింది.

"ఐదున్నర దాటుతోంది. రాధమీద మృత్యువు కప్పిన ఒక్కొక్క పొర విడిపోతూవుంది," అనుకొంది గ్రేస్.

"రాహుల్ చివరకు మోసంచేశాడా రాధా!"

రాధ పేలవంగా నవ్వింది.

"రాహుల్ చాలా తెలివైనవాడు. మోసం చేశాడని



చెప్పడానికి వీలులేకుండా ప్రవర్తించాడు. విని మీరే తేల్చుకోండి సిస్టర్.........

.... .... .... .... ....

మరో ఆరునెలలు గడిచాయి.

పరిచయం అయి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్న ఇద్దర్లో ఏ ఒక్కరూ ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేదు.

ఒంటరిగా కూర్చొని రాహుల్‌తో పరిచయం అయిన మొదటిరోజునుండి అతను మాట్లాడిన మాటల్ని జ్ఞాపకం చేసుకునేది. అతను తన మాటల్లో ఎప్పుడైనా తనను ప్రేమిస్తున్నట్టు బయటపడ్డాడా లేదా అని ఆలోచించసాగింది.

ఎంత ఆలోచించినా, పట్టుకొని ముందుకు వెళ్ళడానికి కొస దొరకలేదు.

ఆరోజు రాధ మనసు మరీ చికాకుగా వుంది.

భోరున ఏడవాలని వుంది.

గుండెలు పగిలేలాగ కాదు. గుండెలు విచ్చేలా ఏడవాలని వుంది.

ఆ ఏడుపుకూడా రావడంలేదు.

రాహుల్ తన వాకిట్లోకి వచ్చాడు.

అతన్ని చూడగానే ఇంతకాలంగా తను పారేసుకున్నదేన్నో తెచ్చాడనీ, అది ఇవ్వడానికే వచ్చాడనీ అనిపించింది.

వచ్చినవాడు తలుపుమీద చెయ్యివేసి "తట్టి పిలవాలా వద్దా!" అన్న సంకోచంలో పడ్డట్టు నిలబడిపోయాడు.

తను లోపల, గడియమీద చెయ్యివేసి "పిల్చినప్పుడే తీస్తాను!" అన్నట్టు నిలబడిపోయింది.

పిలవకుండా తియ్యాలంటే అహం అడ్డు వచ్చింది.

పిలుపుకోసం ఎదురు చూసి చూసి అలసిపోయింది. విసిగిపోయింది.

తలుపు తెరవాలని వుంది. తన ఓటమిని ఒప్పుకోవాలని వుంది.

కాని తీరా తెరిచాక అతను నిర్లక్ష్యంగా నవ్వి, గిర్రున వెనక్కు తిరిగిపోతే?

తన స్వభావాన్ని అర్థం చేసుకున్నాడు. తనను తెరిచిన పుస్తకంలా చదివేస్తున్నాడు. అయినా ఎందుకు పిలవడం లేదు. అతను ఎక్కడా అందడం లేదు. అతని అభిప్రాయం ఏమిటో తెలియటం లేదు.

అతను తనను ప్రేమించడం ఏమిటి? తన అహంకారంమీద దెబ్బకొట్టి రవీంద్రకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవడానికి చూస్తున్నాడు.

నిజంగా అతను తనను ప్రేమిస్తూవుంటే ఇంతకాలం ఇంత నిర్లిప్తంగా వుండగలడా? తన ప్రేమను వెలిబుచ్చకుండ దాచుకోగలడా?

అతను ప్రేమిస్తున్నట్టు బయటపడలేదు కనకనే తను అతన్ని ప్రేమిస్తుందేమో? అతనూ అందరి మగవాళ్ళలా పరిచయం అయినా కాకముందే "నిన్ను ప్రేమిస్తున్నాను రాధా!" అంటే తను అతనినుంచి దూరంగా పారిపోయేది కాదా?



ఈమధ్య రాహుల్ కొంచెం గంభీరంగా కన్పిస్తున్నాడు. తక్కువ మాట్లాడుతున్నాడు. ఒకోరోజు ఒకటి రెండు మాటలకంటే మాట్లాడటమే లేదు.

రాహుల్ వచ్చాడు.

రాధ విరక్తిగా నిర్లక్ష్యంగా వుండిపోయింది.

"ఇవ్వాళ మిమ్మల్ని ఒకచోటుకు తీసుకెళ్ళా లనుకుంటున్నాను వస్తారా?" మృదువుగా అడిగాడు.

రాధ అతని మాటల్ని నమ్మలేనట్టు చూసింది.

"వస్తాను! నువ్వు రమ్మంటే ఎక్కడికైనా .... నడి సముద్రంలోకయినా వస్తాను. సప్తసముద్రాలు దాటి కాకులు దూరని కారడవికి .... చీమలు దూరని చిట్టడవికి.... కూడా వస్తాను," అని మనసులోనే అనుకుంది.

వెంటనే "వస్తాను" అంటే ఆ మాటకోసమే ఇంత కాలం ముఖం వాచి కూర్చున్నట్టు అతను భావిస్తాడేమోఅనే సంకోచం కలిగింది.

"ఎక్కడికి?" ఏమాత్రం కుతూహలంచూపించకుండా నిర్లక్ష్యంగా అడిగింది.

రాహుల్ ఓ క్షణం రాధ కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూశాడు.

"డ్రామాకు కాంప్లిమెంట్సు వచ్చాయి. నా ఫ్రెండ్ ఒకామె ఆ నాటకంలో యాక్ట్ చేస్తూవుంది. అదే! ఆరోజు ఫొటో చూశారుగా? ఆమే!" అన్నాడు రాహుల్.

"ఆ ఫొటో మీ భార్యది అన్నారుగా?" విస్మయంగా అడిగింది.

రాహుల్ పక పక నవ్వాడు.

రాధ అర్థం కానట్టు చూసింది.

"మీకు బొత్తిగా బుర్రలేదు," అన్నాడు నవ్వుతూ.

ఆ మాట అన్నందుకు రాధకు కోపం రాలేదు.

అంత చనువుగా "బుర్రలేదు" అనగానే హృదయం స్పందించింది. తమాషా అనుభూతి కలిగింది.

"మీకు బుర్రలేదు ఏమిటి? మీకు బుర్రలేదు" అన కూడదూ అని మనసులోనే అనుకుంది.

"బుర్రలేదు .... బుర్రలేదు ...." మరోసారి అంటే బాగుణ్ణు అనిపించింది.

ఇద్దరిమధ్యా వున్న దూరం ఒక్కసారిగా తరిగిపోయి నట్టనిపించింది.

"సారీ! తొందరపడి బుర్రలేదు అన్నాను" అన్నాడు రాహుల్ నొచ్చుకుంటూ.

"లేదు.... లేదు.... నేను బాధపడటంలేదు. మరోసారి అనండి .... కాదు లక్షసార్లు అనండి....!" అనాలనుకుంది!

"ఏం నాటకం!" మాట మారుస్తూ అడిగింది.

"అపోహ!" అన్నాడు రాహుల్.

"రాధ ఆలోచనలో పడింది.

"వస్తారా? మీకు ఇష్టం లేకపోతే బలవంతం ఏమీ లేదు," అన్నాడు రాహుల్.

అలా అనకపోతే తప్పక రావాలి అనకూడదూ?

"నాటకానికా? ఎవరైనా చూస్తే? ఏమనుకుంటారు?" తీరా అనేసి ఎందుకు అన్నానా అని బాధ పడింది రాధ.



"ఏమనుకుంటారా? తెలియనివాళ్లు భార్యా భర్తలు అనుకుంటారు. తెలిసినవాళ్ళు ప్రేమించుకుంటున్నారేమో అనుకుంటారు. అమ్మాయిలైతే ఆమెలో ఏముందని అతను ప్రేమిస్తున్నాడని ఈర్ష్య పడ్తారు."

రాధకు మొదటి రెండు వాక్యాలు విని సిగ్గువేసింది. చివరివాక్యం విని కోపం వచ్చింది. అభిమానం దెబ్బతిన్నట్టు రోష పడింది.

అతనిమీద చిరాకు వేసింది.

"పొరపాటయింది. మిమ్మల్ని నా వెంట తిప్పుకోవడం అంత మంచిపనికాదు. ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వగల స్థితిలో వున్నప్పుడే మనం తిరగాలి. డ్రామాకు టైం అయింది. నేను వెళ్తాను," అన్నాడు రాహుల్.

వెళ్తూ వెళ్తూ అతను అన్న మాటలు రాధ చెవుల్లో గింగురు మంటున్నాయి.

అంటే .... అతను తమ గురించి కాబోయే భార్యా భర్తలం అని గానీ, ప్రేమికులం అని గానీ చెప్పే స్థితిలో లేడన్నమాట!

తను ఈ రెండింటిలో ఏ ఒకటీ కాదనేగా అతని మాటల్లోని అర్థం?

మరి తన ఇంటికి ఎందుకు వస్తున్నట్టు! తనలో ఆశలు ఎందుకు రేకెత్తిస్తున్నట్టు?

రాధకు భోరున ఏడవాలని వుంది. తను దురదృష్ట వంతురాలు. మనసారా ఏడవడంకూడా తనకు చేతకాదు.

అసలు తనకే బుద్ధిలేదు.

నిజంగానే బుర్ర లేదు.

అతను పిలవగానే బెట్టు చెయ్యకుండా "వస్తాను!" అంటే అంతలోనే తనకు పోయిందేమిటి?

మాటవరసకు అన్నదే కాని తనకు రావాలని వుందని అతను గ్రహించలేక పోయాడా? గ్రహించినవాడు మరో సారి పిలిస్తే ఏం పోయింది?

కేవలం తనను పరీక్షించడానికే అలా పిల్చి వుంటాడు. తీరా వస్తానంటే ఏమనేవాడో! తను వస్తానన్న తర్వాత అతను తీసుకెళ్ళకపోతే తనకు ఎంత అవమానం! మళ్ళీ అతని ముఖం చూడగలిగేదా?

నెలరోజులు గడిచాయి. అతను రాలేదు. తను డ్రామాకు రానందుకు అతనికి కోపం వచ్చిందేమోనని భయపడసాగింది రాధ.

ఏదో పోగొట్టుకున్నట్టు దిగులు. మనశ్శాంతి లేదు. స్నేహితులతో మాట్లాడాలని వుండదు. పిల్లలకు పాఠాలు చెప్పాలని అనిపించదు.

అకస్మాత్తుగా నిద్ర మెలుకువ వస్తోంది. ఎవరో తన లోని కొంత భాగాన్ని కోసి బలవంతంగా తీసుకెళ్తున్నట్టు అన్పించి ఉలిక్కిపడి నిద్ర లేస్తుంది. ఎవరో రంపంతో కోస్తున్నట్టు గుండెలో బాధ.

ఎంత బింకంగా వుండటానికి ప్రయత్నిస్తున్నా రాధ స్నేహితురాండ్రు "ఏం రాధా? ఈ మధ్య దిగులుగా కన్పిస్తున్నావేం? ఏమయింది?" అని అడుగుతున్నారు.

ఒకరోజు బస్‌లో రాధ పక్కన కూర్చున్న వయసు



మళ్ళిన స్త్రీ "ఏం పాపా? ఎందుకు దిగులుగా వున్నావ్?" అని అడిగింది.

రాధ బిత్తరపోయింది, జవాబుకు బదులు చిరునవ్వు నవ్వింది.

తను అంత దిగులుగా కన్పిస్తోందా? కొత్త వాళ్ళకు కూడా తన దిగులు తెలిసిపోతుందా?

అంత ఆప్యాయంగా "ఏమ్మా దిగులుగా వున్నావ్?" అని అడిగే ఆప్తులు ఎవరూ లేరు. రాధ ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంది.

రాధ పనిచేసే స్కూల్లో సుజాత అనే ఒక అమ్మాయి కొత్తగా టీచర్‌గా చేరింది. శ్రీమంతుల బిడ్డ. అందంగా వుంటుంది. ఆమె నెలజీతం ఆమె కట్టే ఒక్క చీర ఖరీదు చెయ్యదు.

"ఉద్యోగాలు దొరక్క జనం ఆత్మహత్యలు చేసుకొనే ఈ రోజుల్లో ఇటువంటి వాళ్ళకు ఉద్యోగం ఇచ్చే వాళ్ళకు బుద్ధిలేదు," సుజాతను చూసినప్పుడల్లా రాధ అనుకొనేది.

సుజాత కాలక్షేపానికి ఉద్యోగం చేస్తున్నాననీ, పెళ్ళి అయేంతవరకూ సరదాకోసం చేస్తున్నాననీ చెబుతూవుంటే రాధకు వళ్లు మండిపోయేది.

సుజాత గర్వంగా వుండేది. తోటి టీచర్స్‌తో కలిసేది కాదు. రాధతో మాత్రం చనువుగా వుండేది.

"రాధా! ఇవ్వాళ సాయంత్రం మా ఇంటికి రావాలి!" ఒకరోజు సుజాత రాధతో అన్నది.

"ఇవ్వాళ కాదు. మరోసారి వస్తాలే!" అన్నది రాధ మర్యాదకోసం అన్నట్టు.

"ఇవ్వాళే రావాలి!"

"ఏమిటి విశేషం?"

"ఇవ్వాళ నా పుట్టిన రోజు!"

రాధ విస్మయంగా సుజాత ముఖంలోకి చూసింది. సినిమాల్లో పెద్దవాళ్లు "బర్త్ డే!" చేసుకోవడం చూసింది రాధ. కాని నిజంగానే శ్రీమంతుల ఇళ్ళల్లో పెద్దవాళ్లుకూడా పుట్టినరోజు పండుగ చేసుకుంటారని రాధకు ఆ రోజే తెలిసింది.

రాధ దగ్గర "వస్తాను!" అన్న ప్రామిస్ తీసుకుని గాని సుజాత వదల్లేదు.

తన పుట్టిన రోజు తనకు జ్ఞాపకమే వుండదు.

ఆ సాయంత్రం రాధ తనకున్న వాటిలో మంచి చీర కట్టుకొని బయలుదేరింది.

తీరా వెళ్ళాక "ఎందుకు వచ్చానురా భగవంతుడా!" అనుకుంది.

సుజాత శ్రీమంతుల బిడ్డ అని తెలుసు. కాని అంత ఐశ్వర్యవంతులని రాధకు తెలియదు.

ఆ ఇల్లూ, ఆ అలంకరణా, ఆ వాతావరణం.... అక్కడ చేరిన జనం.... అన్నీ తనకు సంబంధించినవి కావనీ, తను తనకు కాని ఏదో ప్రపంచంలో అడుగు పెట్టాననీ అనుకుంది. ఆ వాతావరణంలో, ఆ జనం మధ్య తనకుతనే ఎబ్బెట్టుగా, కొత్తచీరమీద వేసిన మాసికలా కన్పించసాగింది.

సుజాత స్నేహితులంతా రాధను అదోలా చూశారు.



సుజాత రాధను తన ఫ్రెండ్స్‌కు పరిచయం చేసింది. మర్యాదకు ప్రతి నమస్కారాలు చేసి ముఖాలు తిప్పుకున్నారు. రాధ తనలోకి తనే కుంచించుకు పోసాగింది.

రాధ ఓరగా వున్న ఒక కుర్చీలో ముడుచుకుపోతూ కూర్చుంది.

కొత్తగా వచ్చే వాళ్ళకు సుజాత పరిచయాలు చేస్తూంది.... "మిసెస్ సో అండ్ సో.... మిస్ సో అండ్ సో...." అంటూ.

రాధ నిట్టూర్చింది.

తను అందులో ఏ ఒక్కటీ కాదు. ఒక మామూలు పంతులమ్మ. తను అక్కడికి వచ్చి వుండాల్సింది కాదు.

"విద్యుద్దీపాల మధ్య ఆముదం దీపంలా వున్నాను" అనుకుంది రాధ.

ఆ నగలూ, ఆ చీరెలూ, ఆ ఫ్యాషన్లూ, ఆ కులుకులూ, ఆ నవ్వులూ.... రాధ బెంగగా చూస్తూ కూర్చుంది.

అక్కడ ఆమెకు ఊపిరి సలపడంలేదు. ఎప్పుడు బయట పడదామా అని వుంది.

యువతులూ, యువకులూ, గ్రూపులు గ్రూపులుగా చేరి జోక్స్ కట్ చేసుకుంటూ పెద్దగా నవ్వుతున్నారు.

అలా చూస్తున్న రాధకు, కొందరు యువతులు కోడి పెట్టల్లా, కొందరు బాతుల్లా, మరికొందరు ఆడ నెమళ్ళలా కన్పించసాగారు. వాళ్ళ పోలికల్ని చూస్తూ కూర్చుంది.

యువకులు కొందరు కోడిపుంజుల్లా, కొందరు ఖజానా బాతుల్లా కన్పించారు.

"మగ నెమలి ఒకటీ లేదు" అనుకుంది.

"సుజీ ! ఇంకా ఏమిటి ఆలస్యం ?" ఒక కోడిపెట్ట 'కిక్కీక్కీ' అన్నది.

"మొద్దు మొఖమా ! ఆ మాత్రం తెలియదూ? వాళ్ళ హీరో ఇంకా రాలేదుగా ?" ఒక బాతు "క్లిక్ క్లిక్" మంటూ మెడ పొడవుగా చాపింది.

"పోండి !" సిగ్గుపడుతూ అన్నది సుజాత.

"మీ హీరో రాకపోతే మమ్మల్ని పొమ్మంటావేం ! అన్నాడు ఖజానా బాతులావున్న ఓ యువకుడు మెడముందుకు చాస్తూ.

"అడుగో వస్తున్నాడు !" అన్నది ఓ ఆడనెమలి.

సుజాత ముఖంలోకి ఒక్కసారిగా వెలుగు వచ్చింది.

రాధ కళ్ళు కుతూహలంగా ఆ వస్తున్న వ్యక్తి కేసి తిరిగాయి.

రాధ స్థాణువులా బిగుసుకుపోయింది ఆ వస్తున్న వ్యక్తిని చూసి.

"హల్లో! రాహుల్ ! ఏమిటి ఇంత ఆలస్యం ?"

యువతులందరూ రాహుల్ చుట్టూ చేరి ప్రశ్నలవర్షం కురిపించసాగారు.

రాహుల్ నవ్వుతూ ఉత్సాహంగా అందరితో మాట్లాడుతున్నాడు.

కొందరు యువకులు రాహుల్ కేసి ఈర్ష్యగా



చూస్తున్నారు. రాహుల్ రాకతో ఆ వాతావరణంలో ఏదో కొత్త ఉత్సాహం....జీవం.... వచ్చినట్టు అన్పిస్తుంది.

రాధకు రాహుల్ పురివిప్పిన నెమలిలా కన్పించాడు.

రాహుల్ తనను చూడలేదు. చూడకుండా వుండాలి. కాదు. చూడాలి. తనను చూడగానే రాహుల్ ముందు ఆశ్చర్యపోతాడు. తర్వాత తన దగ్గరకు వచ్చి కూర్చుంటాడు. అప్పుడు చూడాలి ఆ కోడిపెట్టలూ, బాతులూ, నెమళ్ళూ ఎలా ముగాలు పెడ్తారో !

తనను చూసి, ఇంతసేపూ నిర్లక్ష్యం చేసిన వాళ్ళందరూ ఈర్ష్యతో వేగిపోవాలి !

సరదాగా మాట్లాడుతున్న రాహుల్ కళ్లు రాధమీద నిల్చాయి.

అకస్మాత్తుగా అతని ముఖంలో నవ్వు ఆగిపోయింది.

"ఆ శాస్త్రీని రాహుల్‌కు పరిచయం చెయ్యవోయ్!" అన్నది ఒక బాతు చిన్నగా.

రాధకు ఆ మాటలు విన్పించాయి. మనసు చివుక్కుమంది.

రాహుల్ తనను చూడగానే తన దగ్గరకు వస్తాడనుకున్న రాధకు నిరాశే కలిగింది.

రాహుల్ రెండడుగులు ముందుకు వేశాడు.

రాధ వెర్రిదానిలా చూస్తూ కూర్చొంది.

ఆమెకు అక్కడినుంచి పారిపోవాలని వుంది.

"రాధ ! మా కో టీచర్!" అంటూ పరిచయం చేసింది సుజాత,

రాహుల్ తెలియనట్టే మర్యాదగా నమస్కరించాడు. రాధకూడా శక్తినికూడదీసుకుంటూ నమస్కరించింది.

రాహుల్ ఓక్షణం రాధ ముఖంలోకి చూశాడు.

గిర్రున తిరిగి చుట్టూ చేరినవాళ్ళతో కబుర్లు చెబుతూ నవ్వుతున్నాడు.

రాధ గుండెను ఎవరో పిండుతున్నట్టు విలవిలలాడిపోయింది.

రాహుల్ ఆ సీతాకోక చిలుకల మధ్య తనను గుర్తించడం అవమానంగా భావించాడా? ఎలా నటించాడు? తనను ఎరగనట్టే నమస్కారం చేశాడు!

సుజాత రాహుల్‌కు కాబోయే భార్యా!

అందరూ కబుర్లలో, నవ్వుల్లో మునిగిపోయి వున్నారు. అందరూ "బర్త్‌డే కేక్" చుట్టూ చేరగానే రాధ చిన్నగా లేచి పరుగులాంటి నడకతో బయటికి వచ్చింది. రోడ్డుమీదకు వచ్చి గుండెల నిండుగా గాలి పీల్చుకుంది.

బస్ స్టాండ్‌లో నిలబడింది రాధ.

సుజాత రాహుల్‌కు కాబోయే భార్యా? ఇంతకాలం తనతో సర్దాగా ఆడుకున్నాడన్నమాట!

ఒక్కసారికూడా తనకేసి చూడలేదు. ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తించాడు!

మళ్ళీ వస్తాడా తన ఇంటికి? ఏ ముఖం పెట్టుకొని వస్తాడు? అంత వచ్చినా తను "గెట్ అవుట్" అంటుంది. అతనితో తనకేమిటి?

తనంటే అతనికి ఎంత తేలిక భావం వుంది!



తనంటే కొంచెంకూడా అభిమానం, గౌరవంలేని వ్యక్తి ముందా తను ఓడిపోయింది? తన బలహీనతను బయటపెట్టుకుంది? నోటితో చెప్పకపోతేనేం? తన బలహీనతను అతను గుర్తించాడని తనకూ తెలుసు!

తన అహం ఏమయింది? తనకు గర్వభంగం అయింది.

ఛ! తను జీవితంలో ఇంత అవమానాన్ని ఎదుర్కోవాల్సివుంటుందని ఊహించలేకపోయింది.

అతన్ని చూసిన మొదటిరోజు తను జీవితంలో పోగొట్టుకున్న దేదో అతను తెచ్చాడనుకుంది. కాని తనకు వున్న వ్యక్తిత్వాన్నికూడా తీసుకెళ్ళడానికే వచ్చాడని గుర్తించలేకపోయింది.

ఇప్పుడు తనకు మిగిలింది ఏమీలేదు! ఏమీలేదు!

తను జీవించడం అనవసరం! తన అహమే తనను దగా చేసింది. తన గర్వమే తనను వంచించింది.

విమానంలాంటి పెద్దకారు వచ్చి రాధ ముందు ఆగింది. ఆలోచనలనుంచి పూర్తిగా బయటపడకుండానే యాంత్రికంగా కారుకేసి చూసింది రాధ.

స్టీరింగ్ దగ్గిర కూర్చున్న రాహుల్ దిగి రాధ దగ్గిరకు వస్తూవుంటే రాధ చూస్తూవుండిపోయింది.

"రండి! డ్రాప్ చేస్తాను!" అన్నాడు రాహుల్.

రాధ మనసంతా చేదుచేదుగా వుంది. విరక్తి ఆమెను చుట్టేసింది.

"అక్కర్లేదు. బస్‌లో వెళ్ళగలను!" సౌమ్యంగా అనాలనుకుంటూనే తీవ్రంగా అన్నది రాధ.

"చాలా పొద్దుపోయింది. రండి! మీకోసమే ఒక స్నేహితుడి కారు తీసుకొని వచ్చాను. ఫంక్షన్ మధ్యలో లేచివచ్చాను. పదండి!"

ఆ కంఠంలోని ఆర్ద్రతకూ, ఆదరణకూ రాధ విస్మయం చెందింది.

రాహుల్ ముఖంలోకి చూసింది. ఆ ముఖంలో ఆత్మీయతాభావం గోచరించింది.

"బస్ వస్తోంది. త్వరగా వస్తారా! లేక ఎత్తుకెళ్ళి కూర్చోబెట్టమన్నారా!" అన్నాడు రాహుల్.

రాధ గుండె వేగం హెచ్చింది. అన్నంతపనీ చేస్తాడనిపించి గబగబా వెళ్ళి కారు ఎక్కింది.

రాహుల్ పక్కన కార్లో కూర్చున్న రాధ మనసు తియ్య తియ్యగా అనిపించింది.

ఆ క్షణాలు శాశ్వితంగా నిలిచిపోవాలని కోరుకుంది.

తను ఈ క్షణాలకోసమే జీవితం అంతా ఎదురు చూసినట్టూ, ఈ క్షణాల్లోనే జీవించడం అంటే ఏమిటో తెలుసుకున్నట్టూ అనిపించింది రాధకు.

జీవితంలో మనిషి నిజంగా బతికే క్షణాలు చాలా కొద్దిగానే వుంటాయి. అవి ఎప్పుడోగాని రావు. కొందరి జీవితాల్లోకి అటువంటి క్షణాలు రానే రావు.

"నేను ఈమధ్య ఊళ్ళో లేను" అన్నాడు రాహుల్.

అందుకే ఇంతకాలంగా రాలేదు. రాహుల్ తనను ప్రేమిస్తున్నాడు. తనకోసం, ఫంక్షన్ మధ్యలో లేచి వచ్చేశాడు. కారు తీసుకొచ్చాడు. తను వంటరిగా పొద్దుపోయి



బస్‌లో వెళ్ళడం అతనికి ఇష్టం లేదు! కాని.... కాని.... రాహుల్ ఫంక్షన్‌లో తనతో ఎందుకు మాట్లాడలేదు? గుర్తించనట్టే ఎందుకు నటించాడు?

రాధ సుందర స్వప్నం తొణికిపోయింది.

వాస్తవం ఎదురుగా నిల్చుని వెక్కిరించింది.

రాహుల్ సుజాత కాబోయే భర్త.... తన కాబోయే భార్యముందు మాట్లాడటానికి భయపడ్డాడా!

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

రాధ సమాధానం ఇవ్వలేదు.

రాహుల్ చాలా తెలివైనవాడు. ఫంక్షన్ మధ్యలో ఎందుకు వచ్చావని అడగలేదు. అతను అలాంటి ప్రశ్నలు వెయ్యడు. అతను వచ్చేప్పటికి ఎవరితోనైనా మాట్లాడుతూ కూర్చున్నా.... ఆ తర్వాత వాళ్ళెవరని అడగడు. అందుకే అతనంటే తనకు మరీ ఇష్టం!

అతనికి తనంటే చిన్నచూపు లేదు. ఆ ఫంక్షన్‌లో తన మనస్సు గాయపడిందని తెలుసుకున్నాడు. అందుకే ఇంత మృదువుగా ప్రవర్తిస్తున్నాడు. ఎంత చనువుగా మాట్లాడుతున్నాడు?

కాని.... ఇతను.... సుజాత కాబోయే భర్త! తనకు ఏమీకాడు!

మరి ఈ అభిమానానికి అర్థం?

ఆమె బుర్రలో ఎన్నో ప్రశ్నలు.... ఒక ప్రశ్నకు సమాధానం దొరక్కముందే మరో ప్రశ్న.... ఆ ప్రశ్న నుంచి

మరో ప్రశ్న.... మరో ప్రశ్న.... ఆర్తినుండి ఆవేదన.... ఆవేదన నుండి ప్రశ్న.... ఆ ప్రశ్ననుంచి మరో ప్రశ్న....

కారు ఆగింది. రాధ ఈ లోకంలో లేదు.

"ఏమిటి దిగరా? రాత్రంతా కార్లోనే వుండిపోవాలని వుందా?"

రాధ చివ్వున తలెత్తి చూసింది.

అదే కంఠం, అదే కొంటె చూపు.... తనకు తెలిసిన రాహుల్ రూపం....

"థాంక్యూ!" అంటూ కారు దిగింది రాధ.

"గుడ్ నైట్!" అన్నాడు రాహుల్.

"గుడ్ నైట్!" అంటూ గబగబా లోపలకు వెళ్ళిపోయింది రాధ.

బట్టలుకూడా మార్చుకోకుండా మంచానికి అడ్డంపడి మనసారా మొదటిసారిగా ఏడ్చింది.

తను ఎందుకు ఏడ్చింది? ఒకవైపు రాహుల్ అంత అభిమానంతో తనకొరకు కారుతీసుకొని ఫంక్షన్ మధ్యలో లేచివచ్చినందుకు సంతోషంగా వుంది. మరోవైపు రాహుల్ సుజాతకు కాబోయే భర్త- తనకు ఏమీకాడు....అనే బాధ-

ఆ మధ్య రాహుల్ ప్రవర్తనలో చాలా మార్పు కన్పించసాగింది రాధకు.

విసుగ్గా వుంటున్నాడు. మాటకు ముందు విసుక్కుంటున్నాడు. ఒకోసారి రాధ మనసు మరీ చివుక్కుమనేలా ప్రవర్తిస్తున్నాడు. అతనిలో ఆ మార్పుకు కారణం ఎంత ఆలోచించినా రాధకు బోధ పడటంలేదు.



వారానికో పది రోజులకో వస్తాడు.

పది నిముషాలు కూర్చుంటాడు.

ముళ్ళమీద కూర్చుంటున్నట్టూ, తను ఏడ్చి పోతుందని జాలితో వస్తున్నట్టూ ప్రవర్తిస్తాడు.

రాధలో సహనం నశించింది.

ఆ రోజు రాధ మనసంతా మరీ బరువుగా వుంది.

ఏమిటి తనకీ శిక్ష?

నిజంగానే అతను తనను శిక్షిస్తున్నాడు.

తనేం పాపం చేసింది? చెయ్యలేదా?

తను రవీంద్రకు అన్యాయం చెయ్యలేదూ?

రంగారావునూ, రామారావునూ అసహ్యించుకోలేదూ? అలా చెయ్యడం తనతప్పా? తను వాళ్ళకు ఆశలు చూపించిందా?

మరి రాహుల్ మాత్రం ఆశలు చూపించాడా? వాగ్దానాలు చేశాడా? నోటితో చెప్పలేదు. తెలివైనవాడు. తనలో ఎన్నో ఆశల్ని రేకెత్తించాడు. మగవాడు! తన ఇష్టంతోనే ఇంటికి వచ్చాడా? తను రమ్మంటే వచ్చాడా?

రవీంద్రను తను రమ్మనలేదు. రంగారావు దగ్గరకూ, రామారావు దగ్గరకూ తను వెళ్ళలేదు. వాళ్ళే కల్పించుకొని వచ్చి స్నేహం పెంచుకున్నారు. ఆశలు పెంచుకున్నారు. ఏమేమో ఊహించుకున్నారు. అందుకు తను బాధ్యురాలు కాదు.

కాని రాహుల్ వచ్చాడు. రాహుల్ అంటే తనకు

ఇష్టం అని అతనికి తెలుసు. తెలిసీ తనలో ఆశల్ని రేకెత్తించాడు. మళ్ళీ మళ్ళీ వచ్చాడు. రావాలని కోరుకుందేగాని రమ్మని పిలవలేదుగా ! అతను ఎందుకు తన జీవితంతో ఆడుకుంటున్నాడు ?

రాధ మనసు పచ్చి పుండులావుంది. దెబ్బ తగిలిన కన్నులా వుంది. దెబ్బ తగిలిన కన్నుకు చల్లగాలి కూడా బాధనే కలిగిస్తుంది. ఆ గాయం మీద మరో దెబ్బపడితే సహించే శక్తిలేదు రాధకు.

రాధ కళ్ళవెంట నీరు కారిపోతూవుంది.

ఒక్కసారిగా లైట్లు ఆరిపోయాయి.

రాధ తడుముకుంటూ వెళ్ళి అగ్గిపెట్టె, కాండిలూ తెచ్చి వెలిగించింది.

ఉన్నట్టుండి రెండు చేతులతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

రాహుల్ ఎప్పుడొచ్చాడో రాధ గమనించలేదు.

"ఎందుకు ఏడుస్తున్నారు?" అడిగాడు.

ఆ కంఠం విని రాధ తృళ్ళిపడింది. తలెత్తి చూసింది.

రాహుల్ నిల్చొని వున్నాడు.

అదే కొంటెచూపు....అదే నవ్వు.... గుండెల్ని గాయపర్చే చూపు.... నాకు దొరక్క ఎక్కడికి పోతావులే అని ప్రశ్నిస్తున్నట్టున్న నవ్వు....

రాధకు తల నేలకు కొట్టుకోవాలనిపించింది. చచ్చిపోవాలనిపించింది.

అయిపోయింది. అంతా అయిపోయింది. ఇప్పుడు తను



రాధ కాదు, మామూలు ఆడది. ఇంతకాలం రాహుల్ ముందు ఏది జరగకూడదని తనలోని ప్రతి అణువుతో పోరాడుతూవుందో అదే జరిగిపోయింది.

తను ఏడవడం అతను చూశాడు. అతని దృష్టిలో ఈ నాటినుంచి తను మరీ తేలికైపోతుంది !

"మీకు ఏంకావాలో మీకే తెలియదు. ఒకసారి సైక్ యాట్రిస్ట్‌ను చూడకూడదు," గంభీరంగా వుంది రాహుల్ కంఠం.

పుండుమీద కారం జల్లాడు. అగ్నిలో ఆజ్యం పోశాడు.

రాధ నిలువెల్లా వణికిపోయింది.

ప్రథమ పరిచయంలోనే హృదయాన్ని గాయపరిచాడు. ప్రతిసారీ ఆ గాయాన్ని రేపుతూనే వున్నాడు.

ఈరోజు తను చేసిన ఆ గాయాన్నే చూసి ఎగతాళి చేస్తున్నాడు.

ఇన్‌సల్ట్ టూ ది ఇన్ జురీ !

గాయాన్ని....తను చేసిన గాయాన్ని చూపించి అవమానిస్తున్నాడు.

ఛీ ! ఇతను మనిషేనా !

రాధ గుండెల్లో అడవి తగలబడుతూంది.

"మీరూ నూటికి తొంభయ్ మంది ఆడవాళ్ళలాగే ఏడుస్తారన్నమాట ?"

"షటప్ !" గట్టిగా అరిచింది రాధ.

రాహుల్ ఓక్షణం బిత్తరపోయి చూశాడు. అంతలో తమాయించుకొని చిరునవ్వు నవ్వాడు.

రాహుల్ కూడా కోపం తెచ్చుకుంటే రాధ కోపం తగ్గేది. అతని నవ్వు రాధను మరీ పిచ్చిదాన్ని చేసింది. నిలువెల్లా వణికిపోసాగింది.

"ఏమిటి మీ అభిప్రాయం ?"

"ఏముందీ! అందరి ఆడవాళ్ళలా మీలోనూ బలహీనత ప్రవేశించిందా అని అడుగుతున్నాను," అన్నాడు రాహుల్ ఏమాత్రం ఉద్రేకపడకుండా.

"మిస్టర్! మీరు చాలా తెలివైనవారు కావచ్చును! కాని అప్పుడప్పుడు మీ తెలివితేటలు హద్దులు దాటుతుంటాయని తెలుసుకోవడం మంచిది," అన్నది రాధ బొంగురుపోయిన కంఠంతో.

రాహుల్ కొంచెం జంకినట్టు కన్పించాడు. రాధ ముఖంలోకి చూస్తూ నిల్చున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఒక విషయం మాత్రం గుర్తుంచుకోండి. నా కేదుపుకూ మీకూ ఎలాంటి సంబంధమూ లేదు. అనవసరంగా ఏదేదో ఊహించుకుంటున్నట్టున్నారు పాపం !" మళ్ళీ రాధే అన్నది కసిగా.

"ముందు అనుకోలేదు. కాని ఇప్పుడు మాత్రం అదే అనుకుంటున్నాను" ధృఢంగా అన్నాడు రాహుల్.

"మీరు భ్రమ పడుతున్నారు. మీరు ఊహించేది నిజం కాదు. నేను మీకోసం బాధపడుతున్నాననుకోవడం మీ భ్రమ మాత్రమే !"

"అలాగా ?" అంటూ రాధ కళ్ళలోకి గుచ్చి చూశాడు.



రాధకు రాహుల్ మీద కసి, కోపం, అసహ్యం కలిగాయి.

"అవును!" అన్నది రోషంగా.

"స్వప్నం వాస్తవం కాదని నాకు తెలుసు. భ్రమను నిజం అనుకొనేటంత తెలివితక్కువ వాణ్ణి కాదు. నేను ఊహించింది నిజం అని నాకు తెలుసు. మీరు ఆత్మవంచన చేసుకుంటున్నారని కూడా నాకు తెలుసు. చిన్నతనంలో జరిగిన కొన్ని సంఘటనలు మీ పసిమనసును గాయపర్చి వుంటాయి. అందువల్లనే ఆత్మహీనతా భావం మీలో ప్రవేశించింది. దాన్ని దాచుకొనే ప్రయత్నంలో అహాన్ని పెంచుకున్నారు. వాస్తవం అంటే మీకు భయం. అందుకే సైకియాట్రిస్ట్‌ను చూడమన్నాను," అన్నాడు రాహుల్ గంభీరంగా.

రాధకు అతని మాటలు ఒక్కొక్కటే కంకరరాళ్లలా మనసుకు తగిలాయి.

"అబద్ధం! మీరు ఊహిస్తున్నది అబద్ధం! నాకేం కాంప్లెక్సూ లేవు. మీరంటే నాకు అసహ్యం! పరమ అసహ్యం!" పిచ్చిదానిలా గబగబా అనేసింది.

రాహుల్ పకపక నవ్వాడు.

రాధ ముఖం అగ్నిహోత్రంలా భగ్గుమంది. పెదవులు వణుకుతున్నాయ్. కళ్ళు నిప్పుకణాల్లా మండుతున్నాయ్.

"అంటే.... నేనంటే మీకు చాలా ఇష్టం అన్నమాట! ఆమాట మీరు చెప్పలేక మధన పడుతున్నారు. బాధపడుతున్నారు. మరొకరు చెబితే సహించలేరు. ఒక వ్యక్తిమీద

చాలా ఇష్టం వుండీ, ఆ ఇష్టాన్ని వ్యక్తపరచలేని పరిస్థితులు ఏర్పడితే అతనిమీద అసహ్యం కలుగుతుంది. దాన్ని పూర్తిగా అసహ్యం అనడానికికూడా వీల్లేదు."

"ఆపండి!" గట్టిగా అరిచింది రాధ.

రాహుల్ రాధ ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

"మిస్టర్ మీరు హద్దులు దాటుతున్నారు. మీరంటే నాకు ఇష్టంలేదు. మీకు కాలక్షేపం కలిగించే ఆటబొమ్మను కాను. ఇకనుంచి మా ఇంటికి రాకండి! మర్యాదగా చెప్తున్నాను," అన్నది రాధ పిచ్చికోపంతో ఊగిపోతూ.

రాహుల్ ముఖం వెలాతెలా పోయింది. స్థాణువులా ఓ క్షణం నిలబడిపోయాడు.

"మీరు చాలా కోపంలో వున్నారు. మీరేం చెబుతున్నారో మీకే తెలియడంలేదు. రేపు వస్తాను...."

"రావద్దని చెప్తున్నాను!" చాలా తీవ్రంగా వుంది రాధ కంఠం.

రాహుల్ ఓక్షణం ఆలోచనలో పడ్డాడు. కళ్ళలో లీలలా బాధ కన్పించింది.

"వెళ్తాను! కాని ఒకటి ఆలోచించండి.... మీకేం కావాలో మీరు బాగా ఆలోచించండి."

"ఆలోచించడాని కేమీలేదు. బాగా ఆలోచించే చెబుతున్నాను."

"వెళ్తాను! వెళ్ళేముందు ఒక విషయం చెప్పదల్చుకున్నాను. మిమ్మల్ని నేనెప్పుడూ చిన్న చూపు చూడలేదు. మిమ్మల్ని ఆటబొమ్మగా అనుకొంటూ మీతో ఆడుకోలేదు,



నేను ఆడుకోవాలేగాని మీకంటే అందమైన ఆటబొమ్మలు నాకు చాలా దొరుకుతాయ్! రెండు సంవత్సరాలు ఓపిగ్గా మా ఇంటిచుట్టూ తిరిగాను. ఎందుకో నేను చెప్పను! మీరే ఆలోచించుకోండి!" అన్నాడు రాహుల్.

రాధకు కోపంలో అతను ఏం మాట్లాడినా భరించరానిదిగానే అన్పించింది. ఆలోచించే శక్తి నశించింది.

"మిమ్మల్ని మీరు అర్థంచేసుకున్న రోజు.... మీకేం కావాలో మీరు తెలుసుకున్న రోజు.... నేను రావడం అవసరం అనుకుంటే అనవసరంగా అభిమానపడకండి! కబురు పంపించండి. వస్తాను!" చిన్నగా అన్నాడు రాహుల్.

ఎంత గర్వం! ఎంత అహంకారం! రాధకు వళ్ళు మండిపోతూవుంది.

"మీకు కబురుచేసే అవసరం నాకు వస్తుందని నేను అనుకోవడంలేదు," ఖచ్చితంగా, కసిగా అన్నది రాధ.

"అవసరం అనుకుంటే మాత్రం అభిమానపడకండి. నేనేమీ అనుకోను. వెంటనే వస్తాను."

"దయచేసి ఇక మాట్లాడకండి!"

"ఆల్ రైట్! గుడ్ బై!"

రాహుల్ గిరున వెనక్కి తిరిగాడు.

చివరి మాటలు అంటున్నప్పుడు రాహుల్ కంఠంలోని కంపన రాధ గమనించకపోలేదు.

"రాహుల్! వెళ్ళిపోకు! నాకేంకావాలో నాకు తెలుసు. బాగా తెలుసు. అది చెప్పడానికి అభిమానపడను. నాకు నువ్వు కావాలి ...నువ్వే కావాలి రాహుల్! నేను

ఓడిపోయాను. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నన్ను వివాహం చేసుకోకపోయినా నేను భరించగలను. కాని నువ్వు అప్పుడప్పుడు నా కళ్ళకు కన్పించు! ఈ జన్మకు అంతే చాలు! నిన్ను చూడకుండా, నీతో మాట్లాడకుండా జీవించలేను! రాహుల్! వెళ్ళకు! ఆగు!"

అరవాలనుకుంది.

అరిచాననుకుంది.

రాహుల్ వెనకే పరిగెత్తుకెళ్ళి చెయ్యి పట్టుకోవాలనిపించింది.

పరిగెత్తాననుకుంది.

తను నిల్చున్న చోటునే ఉండిపోయానని తెలుసుకుంది.

కిటికీ దగ్గిరకు పరిగెత్తింది.

రాహుల్ రోడ్డుమీద అల్లంతదూరంలో బరువుగా, చిన్నగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

వెళ్ళిపోయాడు! వెళ్ళిపోయాడు!

ఇక రాడు!

మళ్ళీ తన కళ్ళకు కన్పించడు!

రాధ స్థాణువులా నిలబడిపోయింది.

ఒకపక్క స్టూలుమీద కొవ్వొత్తి కాలుతూవుంది.

మరోపక్క నిల్చుని రాధ నిలువునా కాలుతూ వుంది.

కొవ్వొత్తి కరిగి కారిపోతూవుంది.

రాధ కరుగుతూ వుంది.



రాధలోని అహం కరిగి కన్నీరుగా మారి చెంపల మీదగ కారుతూ వుంది.

ఒక గదిలో రెండు అగ్నిశిఖలు జ్వలిస్తున్నాయి.

.... .... .... .... ....

"సిస్టర్! నాలుక పిడచ కట్టుకుపోతుంది!"

నర్స్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

.... .... .... ....

## 19

గ్రేస్ చేతి గడియారంకేసి చూసుకుంది.

రాధ ముఖంలోకి చూసింది.

రాధ కళ్లు మూసుకొని పడుకొనివుంది.

చెంపలు కన్నీటితో తడిచివున్నాయ్.

గ్రేస్ రాధ చెంపలు తుడిచింది.

డాక్టర్ వచ్చి రాధను చూశాడు. నాడి చూశాడు. సంతోషంతో అతని ముఖం వికసించింది.

"ఎలా వుంది డాక్టర్!" నర్స్ ఆదుర్దాగా ప్రశ్నించింది.

"ఆమె బతికింది సిస్టర్! ఆమె మృత్యువుతో పోరాడింది. బతికి బయటపడింది!"

"నిజంగానా డాక్టర్?" నర్స్ ఉత్సాహంగా అడిగింది.

"ఇక భయం లేదు. ఆమెను విశ్రాంతి తీసుకోనివ్వు!" అంటూ డాక్టరు వెళ్ళిపోయాడు.

రాధ కళ్ళు తెరిచింది. గ్రేస్ ముఖంలోకి చూసింది. రాధ నవ్వింది. విరక్తిగా నవ్వింది. విషాదంగా నవ్వింది !

"రాధా !" సంతోషంతో ఉక్కిరిబిక్కి రవుతూ గ్రేస్ రాధ చేతిని తన చేతులోకి తీసుకుంది.

"సిస్టర్! డాక్టరు చెప్పింది నిజమేనా ?" రాధ కంఠం నిర్లిప్తంగా వుంది.

"నిజమేనమ్మా ! ఇక భయం లేదు !"

రాధ నీరసంగా నవ్వింది.

"నన్ను బ్రతికించి చివరకు నా కథ ట్రాజడీ చేశారా సిస్టర్! నా కథ సుఖాంతం కావాలనుకున్నాను. చివరకు విషాదాంతమే అయింది," విచారంగా, చిన్నగా తనకు తనే చెప్పుకుంటున్నట్టు అన్నది రాధ.

"అదేమిటమ్మా బ్రతకడం ట్రాజడీయా ?" విస్మయంగా అడిగింది గ్రేస్.

"అవును ! సిస్టర్ ! కొన్ని కథలకు చచ్చిపోవడమే సుఖాంతం ! బ్రతకడమే దుఃఖాంతం !"

"నీ కథ దుఃఖాంతం కాదమ్మా! సుఖాంతమే అవు



తుంది. రాహుల్ చాలా మంచివాడు. సున్నితమైన మనసు గలవాడు" అన్నది గ్రేస్.

"రాహుల్ మీకు తెలుసా సిస్టర్ ?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది రాధ.

"తెలుసమ్మా ! పోయిన సంవత్సరం నేను కె. జీ. ఆసుపత్రిలోనే పనిచేశాను. ఎవర్నీ అనవసరంగానొప్పించడు!"

"మరి...." ఏదో అడగబోయి ఆగిపోయింది రాధ.

"అడుగు....ఆగిపోయావేం ? నిన్ను అంతగా ఎందుకు బాధ పెట్టాడనేగా నీ సందేహం ?"

రాధ మౌనంగా వుండిపోయింది.

"రాహుల్ నిన్ను ప్రేమిస్తున్నాడమ్మా !"

"లేదు సిస్టర్ ! కేవలం నాతో ఆడుకున్నాడు. అంతే !"

"లేదమ్మా! రాహుల్ డాక్టర్! పైగా సైకాలజీలో స్పెషలైజ్ చేశాడు. ఫారెన్ కూడా వెళ్ళి వచ్చాడు. నీ గురించి కొంతవరకు రవీంద్రద్వారా వినివుంటాడు. నీతో కొన్ని మాటలు మాట్లాడగానే నీ సైకాలజీ అర్థం చేసుకొని వుంటాడు. అందరి మగవాళ్ళలా అతనూ "రాధా నిన్ను ప్రేమిస్తున్నాను," అంటూ డైలాగ్ చెప్పేస్తే నువ్వు భరించేదానివా ? అతని నుంచి దూరంగా పారిపోయేదానివి. చిన్నప్పటి సంఘటనలు.... ముఖ్యంగా ఆ పంతులూ.... "ఆడది

ఆడది" అంటూ ఆడదాన్ని కించపరిచే ఆచారాలూ.... నీతో ఆడుకొన్న మగపిల్లలూ.... రంగారావూ.... వీళ్ళందరూ నీ మనసును నొప్పించారు. గాయపర్చారు. సబ్ కాంషస్‌గా నీలో అవి పని చేస్తున్నాయి. ఓ వింత మనస్తత్వాన్ని అల వరుచుకున్నావ్.... రాహుల్ నిన్ను అర్థం చేసుకున్నాడు."

"మరి నన్ను అలా అవమానించేవాడేం ?"

"అది అవమానించడం కాదమ్మా! నీ చేతనే.... నిన్ను రెచ్చగొట్టి.... ఆకర్షించి.... ప్రేమిస్తున్నానని చెప్పించడానికి ప్రయత్నించాడు ! అతని ప్రయత్నంలో కొంతవరకే కృతకృత్యుడైనాడు."

"నేను అతన్ని ప్రేమిస్తున్నట్టు తెలుసుకున్నాడుగా? అప్పుడైనా అతను మనసువిప్పి మాట్లాడవచ్చునుగా?"

"తెలుసుకున్నాడు. కాని ఆమాట నీచేతనే చెప్పించాలని అతని పట్టుదల !"

"అవును! ఆ మాట నాచేత చెప్పించి, నన్ను తిరస్కరించి, రవీంద్రకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. లేకపోతే అతను నన్ను ప్రేమించడమేమిటి ? సుజాతను ప్రేమించి పెళ్ళిచేసుకోబోతున్నాడుగా ?" అన్నది రాధ.

"నువ్వు పొరపడుతున్నావు రాధా! రాహుల్ చుట్టూ ఎంతోమంది ఆడపిల్లలు చేరేవాళ్లు. కాని ఒక్కరూ రాహుల్ని ఆకర్షించలేకపోయేవాళ్లు. సుజాతకూడా రాహుల్



అంటే పడి చచ్చిపోయేది. ఆమె నాకు బాగా తెలుసు. రాహుల్ చేసుకోనంటే పోయిన ఆదివారం రోజునే సుజాత పెళ్ళి మరొకరితో జరిగింది" అన్నది గ్రేస్.

"నిజమా సిస్టర్!" రాధ ఆలోచిస్తూ అడిగింది.

"రాహుల్‌కు కబురు చెయ్యమంటావా రాధా !" గ్రేస్ అడిగింది.

రాధ తృళ్ళి పడింది.

"ఆ పని మాత్రం చెయ్యకండి సిస్టర్! రాహుల్ చెప్పినట్టు ముందు నేను బాగా ఆలోచించి నాకేం కావాలో తెలుసుకుంటాను. అది తెలుసుకున్న తర్వాత ఏంచెయ్యాలో ఆలోచిస్తాను" అన్నది రాధ.

"ఏమిటోనమ్మా నీ మనస్తత్వం! నువ్వు మనసు విప్పి చెప్పవు. అవతలివాళ్ళు చెబితే భరించలేవు."

"అదే నా ప్రత్యేకత సిస్టర్!" గర్వంతో రాధ కళ్లు మిలమిల లాడాయి.

"జీవితం స్వప్నం కాదమ్మా! వాస్తవంలో బ్రతకడం నేర్చుకో!"

రాధ పేలవంగా నవ్వింది.

ఆవలిస్తూ "నిద్ర ముంచుకొస్తూంది సిస్టర్!" అన్నది రాధ.

"హాయిగా నిద్రపో రాధా! నా డ్యూటీ అ
పోయింది. మళ్ళీ సాయంకాలం వస్తాను."

గ్రేస్ పక్క సర్దింది. రాధ కప్పుకొన్న దుప్పటి సరి
చేసింది.

రాధ ముఖంలోకి చూసింది.

రాధ హాయిగా నిద్రపోతుంది.

"తొణికిన స్వప్నం!" చిన్నగా పైకే అన్నది గ్రేస్
రాధ ముఖంలోకి చూస్తూ.